# శ్రీనివాస విలాస



డా॥ ఆకెళ్ళ విభీష

# శ్రీనివాస విలాసం

( తాళ్ళపాక కవుల సంస్కృత కీర్తనలు - అర్థ తాత్పర్యాలు )



డా॥ ఆకెళ్ళ విభీషణశర్మ

ఎం.ఏ., పిహెచ్.డి.

# Srinivasa Vilasam

**By**

**Dr. Akella Vibhishana Sarma, M.A., Ph.D.**

First Edition - 2008

Copies : 1000

Copy Right Reserved

Price : 250

For Copies :
**Smt. Akella Lalitha,** B.A, BCA
18-3-30, Khadi Colony,
K.T. Road, Tirupati
Phone : 0877-2234482

Printed at :

# తమసోమా జ్యోతిర్గమయ



కలియుగ ప్రత్యక్షదైవమైన శ్రీ వేంకటేశ్వరస్వామివారి అనన్యభక్తులు -
తిరుమల తిరుపతి దేవస్థాన పాలకమండలి అధ్యక్షులు
ఆధ్యాత్మిక తేజఃపుంజం

**శ్రీ భూమన కరుణాకరరెడ్డి గారు**

వారి ధర్మపత్ని

**శ్రీమతి రేవతిగారు**

ఆదర్శ దంపతులు.

ఈ **శ్రీనివాస విలాసం** రచనకు స్ఫూర్తిదాతలు.

మనస్సులో సదా సాదరంగా సంభావిస్తూ నా కృతజ్ఞతాంజలులు సమర్పిస్తున్నాను.



## AUTHOR

| | |
|---|---|
| **ıme** | : ***Dr. A.V.S.S. VIBHISHANA SARMA*** |
| **ıthers Name** | : *(Late) Akella Achanna Sastry, Head, Dept. of Telugu, S.V.O. College, T.T.D., Tirupati* |
| **rth** | : *11-7-1968* |
| **nployment** | : *Tirumala Tirupati Devasthanams, Tirupati* |
| **łucation** | : *Sahitya Acharya, Siksha Sastri, Veda Vachaspati, Vidyavaridhi, P.G. Diploma in Public Relations, Diploma in Temple Culture* |
| **terary Activities** | : *Participation in National Seminars organised by Dept. of Culture, Dept. of Tourism, Govt. of A.P., T.T. Devasthanams, Academy of Fine Arts, S.V. University, Tirupati S.P. Mahila Viswavidyalayam, Tirupati, Kakatiya University, Warangal Telugu University, Bommur and Usmania University, Hyderabad* |
| **ıblications** | : *Published Several religious and literary articles in Sapthagiri (TTD) Moosi, Vedantabheri, Gurupriya, Darshanam, Rushi Peetam etc. Published Veda Sakha Books (5 members), Stotra Literature on Srivenkateswara In Sanskrit Literature (Ph.D. Publication) Vahana Seva Books 1. Sri TT Tirumala, 2. Kapileswara Swamy Temple* |
| **media** | : *Live religious Commentator for various channels like Doordarshan, Internet and MAA TV, E TV, N TV, SVBC and Bakthi TV (Nithyotsavam) for Brahmotsavams, Kalyanotsvams, Musical Concerts etc. Several Radio Talks concerning the Hindu Philosophy and Indian Culture.* |
| **ɔbbies** | : *Service Activities, Writing Devotional Songs, Presenting Poetry in Kavi Sammelanams organised by Adhikara Bhasha Sangham, Dept. of Culture etc. Participating Telugu Literary Playlets like Bhuvana Vijayam, Indra Sabha e throughout A.P.* |
| **ɔroad Visit** | : *Singapore, Malaysia, Kuwait and Dubai* |



**పి.వి.ఆర్.కె. ప్రసాద్,** ఐ.ఏ.ఎస్(రి.)
సలహాదారు

తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి
ఫోన్ : 040-23225255

# ముందుమాట

అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు, కలియుగ ప్రత్యక్షదైవం, శ్రీ వేంకటేశ్వరస్వామి. శ్రీ వైకుంఠ విరక్తుడై భక్తజనులను ఉద్ధరించడానికి స్వామి పుష్కరిణీ తీరంలో కొలువైన దయాంతరంగుడు. ఆ శ్రీనివాసుడు వెలసిన ఏడుకొండలు ఏడుస్వరాలుగా భావించే భాగవతులు, స్వామిని నోరారా గానం చేస్తున్నారు. నారద, తుంబురాది ఋషిపుంగవులు, ఎందరో గంధర్వులు - శ్రీవారి అపారమహిమను కీర్తించి తరించినట్లు పురాణాలు తెలియజేస్తున్నాయి.

కలియుగనాథుని - కరుణాతత్త్వాన్ని భక్త్యతిశయంతో ఆళ్వారులు ద్రవిడభాషలో పాశురాలుగా మలిచి సన్నుతించారు. దాసభక్తులైన పురందర దాసులు, కనకదాసులు, విజయదాసులు, విఠలదాసులు ఇత్యాదులు కన్నడంలో, సంస్కృతంలో కీర్తించారు. తేట తెలుగులో మొట్టమొదటగా తాళ్ళపాక వంశీయులు సంకీర్తనలు రచించిగానం చేశారు.

తాళ్ళపాక వంశీయులు దాదాపు రెండు శతాబ్దాలు అవిచ్ఛిన్నంగా శ్రీనివాస సారస్వతాన్ని వెలార్చారు. ఇది విశ్వసారస్వతంలోనే ఒక అపూర్వమైన అంశం. ఈ తెలుగు సంకీర్తనలలో శ్రీనివాసుని విలాసాన్ని జనసామాన్యానికి అందుబాటులోకి తెచ్చిన తాళ్ళపాక అన్నమాచార్యుడు నందకాంశసంభూతుడు. పదకవితకు ఆద్యుడు, ఆరాధ్యుడు, అనవద్యుడైన అన్నమయ్య - శ్రీ వేంకటేశ్వరస్వామి దివ్యలీలలను శృంగార, ఆధ్యాత్మ, యోగ కీర్తనలుగా అందజేశాడు. అన్నమయ్య 32 వేల కీర్తనలు వ్రాసినా, అన్నీ లభించడంలేదు. లభిస్తున్న దశసహస్రాధిక కీర్తనలలో ప్రాయికంగా 90 కీర్తనలు సంస్కృత కీర్తనలుగా చెలామణీ అవుతున్నాయి.

అన్నమయ్య అన్ని కీర్తనలు "వేంకటేశ్వర" ముద్రతో రచించినా, ఇందులో విష్ణు నామావళి కీర్తనలు, దివ్యాయుధకీర్తనలు, వివిధ అవతార కీర్తనలు, ఆధ్యాత్మిక కీర్తనలు ఇలా ప్రత్యేకంగా వర్గీకరించవచ్చు. అయితే ఉద్యానవనంలో అన్నీ పుష్పాలే అయినా వేటి సౌగంధ్యం వాటిదే, అన్నట్లు ప్రతికీర్తనలోను విలక్షణమైన భావాలనే అన్నమయ్య ప్రోదు చేశాడు.

త్రేతాయుగంలో రఘు కులస్వామిని కీర్తించిన వాల్మీకిలా, ద్వాపరంలో వాసుదేవుని సన్నుతించిన వేదవ్యాసునిలా, కలియుగంలో వేంకటేశ్వరుని అన్నమయ్య అనన్య భక్తితో కీర్తించాడు. భక్తి, ప్రపత్తి, శరణాగతి వంటి భావాలకు అక్షరాకృతి కల్పించి ద్రావిడాగమ సార్వభౌముడయ్యాడు.

అన్నమాచార్యుల సంస్కృత సంకీర్తనలు రాశిలో తక్కువైనా వాశిలో అమూల్య మైనవి. అనర్ఘరత్నాల్లా సంకీర్తన వాఙ్మయంలో శోభిల్లుతున్నాయి. వీటిని గాయకలోకం పెద్దగా పట్టించుకోకపోవడం ఆశ్చర్యమనిపించకపోయినా, సంస్కృత పండితులు దృష్టి సారించక పోవడం దురదృష్టకరం. సంస్కృతంలో రెండు మూడు గ్రంథాలు పరిశోధనకు పరిమితమైనవి వెలువడ్డాయి. శ్రీమాన్ యన్.సి.వి. నరసింహాచార్యులు, వ్రాసిన "గీతికా నక్షత్రమాలిక" - ఆంగ్లభాషలో పరిజ్ఞానం కలవారికి సంతోషాన్ని కలిగించిన ప్రక్రియ.

ఈ నేపథ్యంలో డా॥ ఆకెళ్ళ విభీషణ శర్మ "శ్రీనివాస విలాసం" అన్నపేరుతో ఈ సంస్కృత సంకీర్తనల అన్నింటికీ ప్రతిపదార్థ తాత్పర్యాలతో పాటుగా కొన్ని విశేషాంశాలను ప్రస్తావించడం రమణీయంగా ఉన్నది. వీరు రచించిన వేదవాఙ్మయ పరిచయ పుస్తకాలు తి.తి.దే. ద్వారా ప్రచురింప బడ్డాయి, విశేషంగా ఆదరించబడ్డాయి. గతంలో ఈ రచయిత చేసిన 'శ్రీ వేంకటేశ్వర స్వామి సంస్కృత స్తోత్రవాఙ్మయం" పై పరిశోధనా గ్రంధానికి కూడా ముందు మాట వ్రాసే అదృష్టం నాకు కలిగింది. ఆ సంస్కృత గ్రంథంలో కూడా అన్నమయ్య సంస్కృత కీర్తనలోని కవితాసౌందర్యాన్ని, వైదికాంశాలను కూలంకషంగా ప్రస్తావించాడు. అయితే ఈ పుస్తకంలో ప్రతిపదార్థ తాత్పర్యాలను సరళంగా రచించడం అభినందనీయం. ఈ గ్రంథంలోని "రాధామాధవరతి చరితం", "అహోసురత విహారోయం" వంటి కీర్తనలు జయదేవాదుల సంస్కృత కీర్తనలకన్న అకృతక మాధురాన్ని కలిగిఉన్నాయంటే అతిశయోక్తి కాదు. వీటికి రచయిత చక్కని వైదుష్యంతో అర్థతాత్పర్యాలను సమకూర్చాడు.

ఈ గ్రంథం పండితలోకానికన్నా ఎక్కువగా గాయకులకు, స్వరకర్తలకు అర్థావగాహనలో ఉపయోగపడుతుందని విశ్వసిస్తున్నాను. ఇటు కర్ణాటక, అటు హిందుస్థానీ బాణీల్లో ఈ సంస్కృతకీర్తనలు బాగా ప్రచారంలోకి వస్తే అన్నమాచార్యుల భావనాసంపద మరింతగా ఆంధ్రేతరులకు కూడా అనుభవంలోకి వస్తుంది. వాఙ్మయ పరిష్కర్తలు సమన్వయం కుదరవన్న "కిం న జానేహం" హాసమీచీన ముపహాసంతే వంటి కీర్తనలకు కూడా చక్కటి సమన్వయాన్నిస్తూ ప్రతిపదార్థ రచన చేయడం ప్రశంసనీయం. డా॥ ఆకెళ్ళ విభీషణశర్మ ఇటువంటి రచనలు మరిన్ని చేసి, శ్రీ వేంకటేశ్వరస్వామి అనుగ్రహానికి పాత్రుడవ్వాలని ఆకాంక్షిస్తున్నాను.

**పి.వి.ఆర్.కె. ప్రసాద్**



**భూమన కరుణాకరరెడ్డి**
అధ్యక్షులు, పాలక మండలి

**తిరుమల తిరుపతి దేవస్థానములు**
**తిరుపతి**
**ఫోన్ : 0877-2239428**

# హృదయ పారిజాతాలు

సంగీతంతో భగవంతుని కీర్తించడం సంప్రదాయంగా సాగుతున్నది. సంగీతం ఈ లోకంలో పాదులూదడానికి మూలం సామవేదం. నారదుడు, తుంబురుడు ఇత్యాదులు సరస్వతీఅనుగ్రహంతో శ్రీనివాసుని మహిమను కీర్తించిన జ్ఞానయోగులు. ఈ యుగంలో కీర్తనాభక్తి - శ్రీవారిని చేరడానికి సులభమార్గం. అందుకే అఖండ భారతావనిలోని, అన్నిభాషలలో సంకీర్తనలను భగవద్భక్తి పరాయణులు గానంచేస్తున్నారు.

ఆళ్వారులు, మీరా, సూరదాసు, చైతన్యమహాప్రభువు, జయదేవుడు, తులసీదాసు, కన్నడదాసభక్తులు, లీలాశుకుడు, శ్యామాశాస్త్రి, త్యాగరాజు, రామదాసు, క్షేత్రయ్య, సారంగపాణి, నారాయణతీర్థులు, నారాయణ గురు - ఇలా ఎందరెందరో భగవంతుని గానంచేసి ధన్యులయ్యారు.

వీరందరిలో విలక్షణంగా తాళ్ళపాక కవులు - శ్రీ వేంకటేశ్వస్వామిని సేవించి, కీర్తించి చరిత్ర సృష్టించారు. ఒక కవి కుటుంబం, ఒక దైవాన్ని ఆశ్రయించి వందల సంవత్సరాలు సారస్వతకైంకర్యం చేయడం, విశ్వసాహిత్యంలోనే అపూర్వ అంశం. అన్నమయ్యతో ఆరంభమయిన శ్రీనివాస సేవను - పెదతిరుమలయ్య, చినతిరుమలయ్య, చినన్న, తిమ్మక్క మొదలైన తాళ్ళపాక వంశీయులు కొనసాగించారు. ఈనాటికీ తాళ్ళపాక వంశీయులే సుప్రభాతం, కల్యాణోత్సవం వంటి శ్రీవారిసేవలలో కైంకర్యపరులుగా నిలిచి, ఆలయమర్యాదలు పొందుతున్నారు. ఇది శ్రీవేంకటేశ్వరస్వామివారి ప్రత్యక్ష మహిమకు చక్కని ఉదాహరణ.

తాళ్ళపాక కవులకు మూలమైన అన్నమయ్య కవిత్వశక్తి, అలమేలు మంగా శ్రీవేంకటేశ్వరుల అనుగ్రహంతో సిద్ధించిన వరం. అన్నమయ్య వ్రాసిన సంస్కృత కీర్తనలు కొన్ని - 'మాధవాకేశవా', 'నారాయణతే', 'డోలాయాంచల' వంటివి ప్రసిద్ధంగా ఉన్నాయి. ఇంకా ఎన్నోకీర్తనలు ప్రసిద్ధిలోకి రావాల్సి ఉన్నాయి. ఇందుకు ఆ కీర్తనల ప్రతిపదార్థాలు తెలిస్తే, సంకీర్తనల పట్ల ఆదరం సమాజంలో మరింతగా ఏర్పడుతుంది.

ఈ నేపథ్యంలో డా॥ విభీషణశర్మ, తి.తి.దే. ఉద్యోగి, ప్రతిపదార్థ రచనకు శ్రీకారం చుట్టడం ముదావహం. మహాభక్తి పారవశ్యంతో శ్రీవారికి అన్నమయ్య సమర్పించిన - హృదయ పారిజాతాలు' ఈ సంస్కృత సంకీర్తనలు. వాటి అర్థాలను సరళంగా వివరించడంలో వ్యాఖ్యాత కృషి అభినందనీయమైనది. ఈ ప్రయత్నాన్ని పండితులు, శ్రీవారి భక్తులు తప్పక సహృదయంతో స్వీకరిస్తారని విశ్వసిస్తున్నాను.

ప్రత్యేకించి నా కార్యశీలతను తనకు అభిప్రేరణగా డా॥ విభీషణ శర్మ పేర్కొంటున్నాడు. ఇది స్వామి సంకల్పంగా భావిస్తున్నాను. భవిష్యత్తులో మరిన్ని ప్రయోజనకరమైన, రచనలు చేయాలని ఆశిస్తూ.....

సదా శ్రీవారిసేవలో-

**( భూమన కరుణాకరరెడ్డి )**



**కె.వి. రమణాచారి,** ఐ.ఏ.ఎస్.
కార్యనిర్వహణాధికారి,

**తిరుమల తిరుపతి దేవస్థానములు**
**తిరుపతి**

# శుభాశంసనం

శ్రీ వేంకటేశ్వర స్వామివారి పదసన్నిధి, కలియుగంలో సమస్త జీవరాశులకు అంతిమ గమ్యం. ఆ దేవతాసార్వభౌముడు - శ్రీవైకుంఠ విరక్తుడై ఏడుకొండలపై, స్వామి పుష్కరిణీ తీరంలో కొలువైఉన్నాడు.

కనకరత్న కవాటకాంతులతో, ఘనమైన దీపసంఘాలతో, అనుపమ మణిమయ కిరీటాలతో, విరాజిల్లుతున్న శ్రీవారి దివ్యమంగళ స్వరూపాన్ని చూసి పరవశించనివారుండరు. అలంకారప్రియుడైన స్వామిని నవరత్నాది దివ్యహారాలతో, పీతాంబరాలతో, అందమైన కటివరదహస్తాలతో - దివ్య శోభనమూర్తిగా సందర్శించి కీర్తిస్తున్నారు.

శ్రీనివాసునిచూసి పులకించిన ఎందరో భక్తావతంసులు కీర్తనలతో, పద్యాలతో, పాశురాలతో, ప్రవచనాలతో, భజనలతో సన్నుతించి చరితార్థులవుతున్నారు. కానీ ఆరుశతాబ్దాలకు పూర్వం, అపూర్వమైన సారస్వతసమారాధన చేసిన శ్రీమాన్ తాళ్ళపాక అన్నమాచార్యులు నందకాంశ సంభూతుడు.

నవవిధ భక్తి సంప్రదాయాలలో అద్వితీయమైన కీర్తనను, పదకవితాసుధగా మలచి, జనసామాన్యాన్ని శ్రీనివాస భక్తిచైతన్యదీక్షతో ఉర్రూతలూగించిన మహాజ్ఞాని. రాశిలో, వాసిలో ఘనమైనవి అన్నమయ్య రచనలు. అన్నమయ్య 32 వేల పాటలు రచించినా లభిస్తున్న వాటిలో 90 పైగా సంస్కృతకీర్తనలుగా అందుబాటులోకి వచ్చాయి. తెలుగుపాటలలో భాషాపరంగా ఎలా విలక్షణతను ప్రదర్శించాడో, సంస్కృతంలోను అంతే వింతగా కవిత్వాన్ని సాగించాడు. అపాణినీయాలను చూసిన పండితులు, ఇది అన్నమయ్య సంస్కృతమని పెదవి విరిచారు.

కానీ ఇవి మహా భావుకతకు పెట్టనికోటలు, భక్తి చైతన్యానికి శిలాక్షరాలు, సంగీతాభినయాలకు నిలువటద్దాలు. శృంగారం, భక్తి, మధురభక్తి, ఆధ్యాత్మికత, నీతి, వైరాగ్యం, సంగీతాభినయాలుకు కాణాచిగా ఉన్న ఈ సంస్కృత కీర్తనలను తెలుగుచేశాడు డా॥ ఆకెళ్ళ విభీషణశర్మ. ఇది కన్నెబీడులో వ్యవసాయం. కనుక ఆహ్వానించదగిన అవసరం ఉన్నది.

'రాధామాధవరతిచరితం'లోని - శృంగార భావుకత,

'హా! సమీచీన ముపహసంతే' లోని - వ్యంగ్య వర్ణన,

'పృథుల హేమకౌపీనధర'లోని - చమత్కార చిత్రణ,

'తత్తాతిగిడి ధింధి'లోని - అభినయ ప్రదర్శనరచన,

అతిశోభితేయంరాధా లోని - శైలీవిన్యాసం,

'యోగి భోగి నటనంకుమ'లోని - 'అపురూప భావ ప్రకటనలు'

సామాన్య జనులకు అర్థమయ్యేట్లుగా వివరించడంలో శ్రీ విభీషణశర్మ యథాశక్తి ప్రయత్నించాడని చెప్పడానికి సంతోషిస్తున్నాను. ఈ ప్రతిపదార్థ వివరణ పుస్తకం సాహితీ లోకానికి ఉపకరించగలదని, అన్నమయ్యా తత్త్వ జిజ్ఞాసువులకు మార్గదర్శకం కాగలదని విశ్వసిస్తున్నాను. అర్థం తెలుసుకొని పాడే గాయకులు అరుదవుతున్న రోజులలో, అన్నమయ్య సంస్కృత కీర్తనల అర్థవిశేషాలు - ఆణిముత్యాలవుతున్నాయి. భవిష్యత్తులో మరిన్ని ప్రయోజనకరమైన రచనలను చేసేందుకు, శ్రీనివాసస్వామివారు చిరంజీవి శ్రీ విభీషణశర్మను అనుగ్రహించాలని, ఆశీరభినందలందిస్తూ -

సదా శ్రీవారిసేవలో

**( కె.వి. రమణాచారి, ఐ.ఏ.ఎస్.)**



**జి. శివరామమూర్తిగారు**
ఖాదీకాలనీ, తిరుపతి
సెల్లు : 9849491223

# శుభాభినందన

తిరుపతికి నాకూ ఉన్న అనుబంధం నాలుగు దశాబ్దాలపై మాటే. గాంధేయవాదిగా, విద్యా, సామాజిక, రాజకీయవాదిగా ఈ పుణ్యక్షేత్రంలో ఎందరితోనో పరిచయాలున్నాయి. అయితే కవి, పండిత, గాయకులతో నాకున్న సాన్నిహిత్యం వెలకట్టలేనిది. సాహితీ, సంగీత ప్రియుడిగా ప్రత్యేకించి మేము నివాసముండే ఖాదీకాలనీలో - వినాయకచవితికి, సంక్రాంతికి, ఇతర పర్వదినాలలో ఎన్నో కార్యక్రమాలకు ప్రోత్సాహాన్నిచ్చాను, ఇస్తున్నాను. ఎందరో కళాకారులు, కవులు, సాహితీ పండితులు నా ప్రయత్నాలను ఆదరిస్తున్నారు. కృతజ్ఞతాభినందనలు తెలియజేస్తున్నారు.

నాకు ఎందరితో ఎంతగా అనుబంధమున్న, మా కాలనీలో నివసించిన శ్రీ ఆకెళ్ళ అచ్చన్నశాస్త్రిగారితో ఉన్న ఆత్మీయత ప్రత్యేకమైనది. వారికి నామాటే వేదం. నన్ను ఎంతగా ఆదరించి, గౌరవించేవారో మాటలతో చెప్పలేను. వారు భౌతికంగా లేకపోయినా, వారిపిల్లలలో ఆ లక్షణాలున్నాయి. విశేషించి చిరంజీవి విభీషణశర్మ సాహిత్యంలో చక్కని కృషిచేస్తున్నాడు.

ఇక అన్నమయ్య సాహిత్యం పట్ల నాకు ఎంతో ప్రపత్తి ఉన్నది. మా ఇంటికీ తరుచూ శ్రీ బాలకృష్ణప్రసాద్, శ్రీదేవి, ద్వారం లక్ష్మి, రంగనాథ్ వంటి గాయకులు వచ్చి పాటలు వినిపిస్తుంటారు. మా కోడళ్ళు, మనవరాళ్ళు అందరూ అన్నమయ్య గీతాలాపనలతో పరిచయం ఉన్నవారే.

ఈ నేపథ్యంలో చి॥ విభీషణశర్మ అన్నమయ్య సంస్కృత సంకీర్తనలకు ప్రతిపదార్థ తాత్పర్యాలను సమకూర్చడం నాకు ఎంతో ఆనందాన్ని కలిగించింది. అన్నమయ్య కీర్తనలకు ఈరోజు అర్థవివరణలను ప్రచురణలుగా, తెస్తే ముఖ్యం యువతరం ఎంతో లబ్దిపొందుతారు. భక్తి కేవలం వృద్ధులకు సంబంధించిన అంశల కాదు. ప్రహ్లాదుడు, శుకుడు, ఆదిశంకరులు, అన్నమయ్య, వివేకానందుడు ఇత్యాదులు చిన్నవయస్సులోనే భక్తిపారవశ్యంతో ఆదర్శవంతులయ్యారు.

నేను మనస్ఫూర్తిగా ఆబాలగోపాలనికి ఉపకరించే శ్రీ విభీషణశర్మ కృషిని అభినందిస్తూ మరిన్ని రచనలచేసి అభ్యుదయాన్ని పొందాలని ఆశీర్వదిస్తున్నను.

**(జి. శివరామమూర్తిగారు)**



గరిమెళ్ళ బాలకృష్ణ ప్రసాద్
విశ్రాంత గాత్ర విద్వాంసులు
అన్నమాచార్య ప్రాజక్టు

తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి
ఇల్లు : 0877-2255136
సెల్లు : 9866253475

# అవలోకనం

తెలుగు సాహితీ రంగంలో పదకవితకు పట్టాభిషేకం చేసిన నందకాంశ సంభూతుడు అన్నమాచార్యుడు. సకలదేవతాస్వరూపుడైన శ్రీ వేంకటేశ్వరస్వామిపై 32,000 కీర్తనలు రచించిన కారణజన్ముడు. ఈనాడు తెలుగులోని అన్నమయ్య సంకీర్తన సుధామాధుర్యం అందుబాటులోకి వచ్చింది. కానీ సంస్కృత సంకీర్తనలు సామాన్య జనసముదాయానికి దూరంగానే ఉన్నాయి. పండితలోకంలో వీటిపైన చిన్నచూపు పడటానికి, ఎన్నో అపాణినీయపద ప్రయోగాలుండమే ప్రధాన కారణం.

తెలుగు కీర్తనలు వెలుగులోకి వచ్చేముందు కూడా ఈ పరిస్థితి నెలకొని ఉండేది. పద్యకవి పరమ పూజనీయుడు, పద్యం కన్న పదకవిత హృద్యతను కలిగి ఉండదని భావించారు. కానీ పద్యం కవితకుపరమావధిగా సంభావించిన పండిత పరిషత్తులే, క్రమంగా అన్నమయ్య పదాలకు తలవంచాయి.

ఇందుకు వేలకొలది అన్నమయ్య పదాలలోని శృంగార భక్తి, మధురభక్తి, ఆధ్యాత్మికత, నీతి వైరాగ్యాదులు - వీటన్నింటికీ మించిన సామాన్య జనావళికి అద్దం పట్టిన పదకవితా కామనీయకత కారణమయ్యింది. అంతేకాక అన్ని కీర్తనలలో వెల్లువలా ముంచెత్తిన శ్రీ వేంకటేశ్వర స్వామివారి అమలిన తత్త్వచింతన మూలమయ్యింది. ఇలా తెలుగులోని అన్నమయ్య సాహిత్యం ప్రచుర ప్రచారానికి తేవడానికి కేవలం అన్నమాచార్య ప్రాజక్టు కృషిమాత్రమే కాదు. ఇందుకు తోడైన విశ్వవిద్యాలయాల, కళాశాలల, స్వచ్ఛంద కళాసంస్థల, ప్రసారమాధ్యమాల పాత్రకూడా అభినందనీయమైనది. విశేషించి ఎందరో విద్వాంసులు అన్నమయ్య పదాలలోని వైవిధ్యాలను, పరిశోధనాత్మక రచనలద్వారా ప్రచారంలోకి తెచ్చారు. ఇక అన్నమయ్య సంస్కృత కీర్తనలు లభించినవి. తక్కువే. కానీ అవి తెలుగు కీర్తనలకు ఏమాత్రం తీసిపోనివి. పైగా తెలుగు కీర్తనలలో ఎలా స్వేచ్ఛారీతిలో ప్రయోగాలు చేశాడో, అలా సంస్కృతంలో కూడా విలక్షణతను ప్రదర్శించాడు.

ఇక అన్నమయ్య సంస్కృతకీర్తనలు ఆడియోల రూపంలోకూడా ప్రచారంలోకి పెద్దఎత్తున రాలేదు. ఇందుకు అనేకకారణాలు. వాటిలో ఈ సంస్కృతకీర్తనలపట్ల తాత్పర్యసమన్వయ దృష్టి కొరవడటం ఒక ముఖ్యకారణం, ఈ నా అభిప్రాయం డా॥ శర్మ వ్యాఖ్యానం చూశాకా మరింత స్పష్టమయ్యింది. లేకపోతే

'హా! సమీచనముపహసంతే' అన్న అధిక్షేపణ కీర్తననుగాని, 'పృథులహేమకౌపీనధర', అని వామనుడిలో బ్రాహ్మణ భోజన ప్రీతిని చూపిన చమత్కారకీర్తననుగాని, స్వరపరచకుండా విడిచిపెడతారా!

ఇక ఉత్సాహంతో ఉర్రూతలూగించే "యోగిభోగినటనంకురు", "తత్తాతగిడి" వంటి కీర్తనల తాత్పర్యం తెలుసుకుంటేనే రససిద్ధి, సంగీతశుద్ధి కలుగుతాయి. శ్రీ విభీషణశర్మతో నాకు చిరకాల పరిచయం ఉన్నది. అసంఖ్యాక టీవీ కార్యక్రమాలలో ప్రత్యక్షవ్యాఖ్యాతగా పాలుపంచుకొన్నాడు. అయితే భద్రాచలం రాములవారికల్యాణమైనా, తిరుమలస్వామి బ్రహ్మోత్సవాలైన, ఏ ధార్మిక ప్రసంగమైనా ప్రధానంగా అన్నమయ్య సారస్వతాన్ని ప్రస్తావించడం నాకు సంతోషాన్ని కలిగిస్తున్నది.

తిరుపతి, చెన్నై, పాండిచ్చేరి మొదలైన చోట్ల గతంలో నా సంగీత కచేరీలకు చక్కని వ్యాఖ్యానాన్ని చేశాడు. నేను స్వరపరచిన కీర్తనలతో వెలువడిన 'అన్నమయ్య సంకీర్తన మహతి' పుస్తకంలో అర్థతాత్పర్య రచనలో సహకరించిన తీరు అభినందనీయమైనది. తి.తి.దే. ద్వారా వెలువడిన "నృసింహ సంకీర్తనామృతం' వంటి ఆడియోలకు మధురమైన ముందుమాటలను అందించాడు. ఈ విషయాలు గుర్తుచేసుకొంటే మామధ్య అన్నమయ్య సారస్వతమే అనుసంధానమవుతున్నది. ప్రస్తుతం "శ్రీనివాసవిలాసమన్న" పేరుతో రచించిన ఈఅన్నమయ్యకీర్తనల వ్యవసాయం సాంద్రమైనది, ప్రయోజనకరమైనది. ఈ కృషి ఇక్కడతో ఆగకుండా భవిష్యత్తులో మరిన్ని అన్నమయ్య సంకీర్తనలకు వ్యాఖ్యాన రచన చేయాలని, ఇందుకు శ్రీనివాసస్వామి అనుగ్రహం సిద్ధించాలని మనస్ఫూర్తిగా చిరంజీవి విభీషణశర్మను ఆశీర్వదిస్తున్నారు.

**జి. బాలకృష్ణ ప్రసాద్**

**జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు**
కవి, సినీ దర్శకుడు
సెల్లు : 9848568822

# విభీషణ విభూషణం

అక్షరపదకవితావతారమూర్తి శ్రీఅన్నమాచార్యుల వారి వేలసంకీర్తనల్లో సంస్కృత సంకీర్తనలు కూడా వున్నాయి. ఇటువంటి సంస్కృత కీర్తనలు ప్రస్తుతం తొంభై రెండు వరకు లభ్యమౌతున్నాయి.

వీటిలో

"నమోనారాయణాయ"

"నారాయణతే నమో నమో"

"నారాయణాయ సగుణబ్రహ్మణే"

"హరి రసమ విహరి సతు సరసోయం మమ"

"వందే వాసుదేవం"

"బృందారకాధీశం - వందితపదాబ్జం"

"మాధవా, కేశవా మధుసూదనా" మొదలైన సంస్కృత కీర్తనలు సుప్రసిద్ధ గాయనీ గాయకుల కంఠస్వరాల నుండి తెలుగునాట వాడవాడలా మారుమ్రోగి ప్రాచుర్యం పొందాయి. ఎనభైకిపైగా సంస్కృత కీర్తనలు, ఎక్కువమందికి తెలియకుండా వుండిపోయాయి. పరిశోధకుల గ్రంథాలలో కొన్నిమాత్రం పదిలంగావున్నా - సాహితీ ప్రియులకు, భక్తులకు వీటిగురించి ఏమాత్రం తెలియదు.

ఇప్పుడు సంస్కృతాంధ్ర పండితులు, కవులు, విమర్శకులు శ్రీ ఆకెళ్ళ విభీషణశర్మ గారు అన్నమాచార్యుల వారి 90 సంస్కృత సంకీర్తనలను సామాన్యులకు కూడా అర్థమయ్యేలా అందించాలని, అర్థవంతంగా చేసిన రచన ఈ శ్రీనివాస విలాసం. శ్రీ వైష్ణవ వైఖానస, స్మార్త, మధ్వ సంప్రదాయ విశేషాలను అన్నమయ్య సంకీర్తనల్లో మిత్రులు విభీషణశర్మగారు విశ్లేషించి, ఆయా సంప్రదాయ సిద్ధాంతాలను ప్రతిపాదించే శ్లోకాలతో వివరించి, అన్నమాచార్యుల వారి భావాలకు, ఆ సంప్రదాయ సిద్ధాంత భావాలకు, చక్కని సమన్వయాన్ని ఏర్పరిచారు. ఈయన చేసిన విశ్లేషణలు అర్థవంతంగాను, ఔచిత్యవంతంగాను, రసవత్తరంగాను మనసుకు హత్తుకుంటాయి. ఈ సంస్కృత సంకీర్తనలకు ప్రతిపదానికీ అర్థం, విశేషార్థం వివరిస్తూ చక్కని తాత్పర్యాన్నికూడా అందించారు. ఈ రచన కొత్తగా అన్నమయ్య సంస్కృత సంకీర్తనలు చూసే వారికీ, వాటికి భాణీలు సమకూర్చేవారికి ఎంతగానో ఉపకరిస్తుంది. ఈ రచనలో ప్రతి వివరణకీ తగిన ప్రమాణాలు కూడా చూపించారు. ఉదాహరణకి సుప్రసిద్ధ సంగీత విద్వాంసురాలు, శ్రీనివాసగాయని ఎం.ఎస్. సుబ్బలక్ష్మిగారు

పాడి, బాగా ప్రాచుర్యంలోకి తెచ్చిన "డోలాయాంచల డోలాయం" కీర్తనలో "గోసమానే" అనే అన్నమయ్య ప్రయోగానికి, గోవిందుడే గోవుతోసమానం అనే అర్థం చెప్పాలి ఎలా?

అన్నమయ్య వాఙ్మయ పరిష్కర్తలు - "ఈ పాటలోని 'గోసమాణే' అను పదము ఘోషమణే' అనుటకు బదులుగా పడినదా! అనిపించుచున్నది. ఇది ఇంకను విచార్యము" - అని అభిప్రాయాన్ని వెలిబుచ్చారు (చూడుము - పుట-49 - సంపుటం - 2 - తి.తే.దే. ప్రచురణ) కానీ-

దీనికి విభీషణశర్మగారు ఆగమగ్రంథమైన కులార్ణవ తంత్రంలోని-

"గవాం సర్వాంగజం క్షీరం, స్రవేత్ స్తనముఖాత్ యథా ।

తథా సర్వగతో దేవః, ప్రతమాధిషు రాజతే ॥" అనే శ్లోకాన్ని ఉదహరిస్తూ రసాద్భుతమైన సమన్వయంచేశారు. ఆ శ్లోకం అర్థం ఏమిటంటే-

"గోవు శరీరంలో అంతటా, క్షీరధాతువులున్నప్పటికీ, పొదుగు నుండే క్షీరధార స్రవంచినట్లుగానే, సర్వవ్యాపకుడైన శ్రీమహావిష్ణువు - ఈ తిరుమల అర్చామూర్తి నుండే వ్యక్తమై తన మహిమలను చాటుతున్నాడు. కనకనే "గోసమానే" అని అన్నమయ్య సంబోధించాడని సమన్వయిస్తూ, చక్కని విశ్లేషణతో విభీషణ శర్మగారు వివరించారు. ఇటువంటి వివరణలు, విశ్లేషణలు ఈ రచనలో ఇంకా ఎన్నో వున్నాయి. సహృదయ సాహితీవేత్తలు, సాహితీప్రియులు, గాయనీ గాయకులు అందరూ చదివి ఆనందిస్తారని, వారికి ఈ రచన ఎంతగానో ఉపకరిస్తుందని భావిస్తున్నాను. మిత్రులు శ్రీ విభీషణ శర్మగారి పాండితికి, సత్కృషికి ఇది ఒక సత్కీర్తి విభూషణం కాగలదని విశ్వసిస్తున్నాను.

**( జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు )**

# కృతజ్ఞతలు

నా కోరికను మన్నించి ఈ పుస్తకానికి 'ముందుమాట'ను ప్రసాదించిన మనీషి, మనస్వి - శ్రీమాన్ పి.వి.ఆర్.కె. ప్రసాద్ గారు, తి.తి.దే. అన్నమాచార్య ప్రాజక్టు పెట్టినా, తాళ్ళపాక గ్రామాన్ని దత్తత తీసుకున్నా, రికార్డింగులతో అన్నమయ్య కీర్తనల ప్రచారాలకు శ్రీకారంచుట్టినా, వెనుబలం వారే. నేను వారి ఆశీరభినందనలు శ్రీవారి సందేశంగా భావిస్తాను, వారికి నా హృదయపూర్వక ధన్యవాదాలు.

నేను తి.తి.దే. అధ్యక్షుల వారి పేషీలో చేరాక, అన్నమయ్య సంకీర్తనలపట్ల శ్రీభూమన కరుణాకర రెడ్డిగారి కున్న అమలిన పారవశ్యం నాకూ కొంత సోకింది. పైగా వారు అన్నమయ్య 600వ అన్నమయ్య జయంతి ఉత్సవాలకు సంవత్సరం ముందే శ్రీకారం చుట్టారు. అన్నమయ్య సంవత్సరంగా ప్రకటించారు. ఆంధ్రావనిలోని గ్రామగ్రామాల్లో దేశంలోని అన్ని ప్రధానఆధ్యాత్మికవేదికలపైన మాత్రమే, అన్నమయ్య సారస్వతయజ్ఞాన్ని పరిమితంచెయ్యలేదు. ఖండ ఖండాంతరాలలో అన్నమయ్య జయంతి ఉత్సవాలను, అక్కడ తెలుగు సంఘాల వారి సహకారంతో జరిపించారు. వారితోపాటు కువైటు, సింగపూరు, మలేషియా, దుబాయి వంటి దేశాలకు నన్నుకూడా తీసుకువెళ్ళారు. అక్కడ నాకు లభించిన ఆదరానికీ, సత్కారాలకీ మూలకారణం - వారికి నాపట్ల ఉన్న అవ్యాజమైన ప్రేమ ఒక్కటే. ప్రస్తుతం ఈ 'శ్రీనివాస విలాసం' పుస్తకంలో మంచి అభిప్రాయాన్ని కూడా ఇచ్చారు. వారికి సదా కృతజ్ఞతాబద్ధుణ్ని.

మేధానిధి, పండితమౌళి, సాహిత్యసాంస్కృతిక విశారదులు, శ్రీమాన్ కె.వి. రమణాచారి, ఐ.ఏ.ఎస్., వారిచ్చిన అభిప్రాయం వల్ల నా పుస్తకానికి విలువ పెరిగిందని భావిస్తూ వారికి నా కృతజ్ఞతాభివందనాలు.

సమ్మాన్యులు, కళాసాహిత్య పోషకులు, నాకు పెద్ద దిక్కైన శ్రీ గంద్రకోట శివరామమూర్తి అభినందనలకు నా సాదర కృతజ్ఞతాంజలులు.

ప్రఖ్యాత కవి, సినీ దర్శకులు, పేరడీ కవితలకు క్రొత్త భాష్యాన్నిచ్చిన శ్రీ జొన్నవిత్తుల రామ లింగేశ్వరరావుగారి ప్రశంసాపూర్వక అభిప్రాయానికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు.

'సంకీర్తన మహతి' - శ్రీ గరిమెళ్ళ బాలకృష్ణప్రసాద్‌గారు అన్నమయ్య పాటలు పాడే అపర నారదుడు. వారికి నాపట్ల ఉన్న అనురాగం వెలలేనిది. నా రచన పట్ల మంచి అభిప్రాయాన్నిచ్చిన మధురగాయక శిరోమణికి కృతజ్ఞతామందారాలు.

ముచ్చటగా నా పుస్తకానికి బొమ్మలు వేసిచ్చిన "కూచి" గారు గొప్ప సహృదయులు. నంది అవార్డు నుండి తానా పురస్కారం వరకు - ఎన్నో గౌరవాలు పొందిన ప్రఖ్యాత చిత్రకారులు. నా మనః పూర్వక కృతజ్ఞతాంజలులు.

ప్రఖ్యాత చిత్రకారులు 'శ్రీ బాపు' గారికి సవినయ ధన్యవాద పూర్వక కృతజ్ఞతాంజలులు.

శ్రీ హరిప్రసాద్ - కువైట్, శ్రీ వలివేటి వెంకట సూర్యనారాయణ మూర్తి - దుబాయి గారికి నా హృదయపూర్వక ధన్యవాదాలు. ఈ రచనకు నన్ను ప్రోత్సహించిన వారికందరికీ నా హార్దిక కృతజ్ఞతలు.

విభీషణ శర్మ

# ప్రతిభానందకం

కలియుగ ప్రత్యక్షదైవం శ్రీవేంకటేశ్వరుడు. ఆ శ్రీనివాసుని విలాసాలను, సమస్త కల్యాణగుణాలను కీర్తించిన నందక మహాఖడ్గాంశ సంభూతుడు తాళ్ళపాక అన్నమాచార్యుడు. నందకం సమస్త అజ్ఞాన దురితాలను ఛేదించే విజ్ఞాన దీపాంకురంగా శ్రీకృష్ణదేవరాయలు అభివర్ణించారు.

ప్రతతోద్వాధర భాగపీత యుగళీ
భాస్వత్త్సరుస్తంభ స
స్థితిఁ దీండ్రించెడు జాళవా
మొసలివా జీప్తార్చిగాల గజ్జల
స్విత ధూమసిత రోఖపై యలుగుగా
విజ్ఞాన దీపాంకురా
కృతి నందంబకు నందకంబు ఘలతా
శ్రేణిచ్ఛిదం జేయుతన్

(ఆముక్తమాల్యద 1-6)

సంసారాంధకారంలో కొట్టుమిట్టాడుతున్న మానవాళికి దీపశిఖలు, అన్నమయ్య సంకీర్తనలు. సప్తాచలాధీశ్వరుడైన శ్రీనివాస పరబ్రహ్మ తత్త్వాన్ని తెలియజేసే విజ్ఞాన సత్పథంలోని సోపానాలు.

'ఆడిన మాటెల్ల నమృతకావ్యముగ'

పాడిన పాటెల్ల పరమగానముగ" - జన సామాన్యంలోకి చొచ్చుకువెళ్ళి పండిత పామర జన శిరోధార్యమై నిలిచిన కవితా సౌగంధ్యం అన్నమయ్యది. "మధురం మధుపీయూషం, తస్మాత్కవేర్వచః, అమృతంకన్నా కవివాక్కులు మధురాతి మధురంగా ఉంటాయి. ఇందుకు మూలకారణం కవికి ఉండే విలక్షణమైన ప్రతిభ. అయితే సృష్టిని సమస్త ప్రాణకోటిలో అంతర్లీనంగా ఉండే ప్రతిభ కేవలం 'జన్మాంతరాభ్యాసం' వల్లనే లభిస్తుంది. ఇది మన ఆర్షభావన.

స్వరవృత్తిం వికురుతే, మధౌ పుంస్కోకిలస్యకః ।
జంత్వాదయః కులాయాది కరణే కేన శిక్షితాః

వసంత ఋతువులో కోయిలకు పూర్వపు కంఠస్వరంమారి, పంచమ స్వరం లభిస్తుంది. సాలెపురుగుకు గూడు కట్టుకొనేందుకు ఎవరూ శిక్షణ ఇవ్వడం లేదు. ఇలా క్రిమికీటకాదులకు, ఇతర తిర్యగ్జంతువులకూ లభించే ప్రతిభ కూడా భగవదనుగ్రహమే. ప్రకృతిలోని సమస్త ప్రాణికోటిలో మానవజన్మ సర్వోత్కృష్టమైనది.

ఆత్మలో పరమాత్మదర్శనం చేసుకోవడం దేవతలకు కూడా అలభ్యమైనది. "యథాదర్శే తథాత్మని" (కఠోపనిషత్) మానవులకు మాత్రమే అద్దంలో ప్రతిబింబంలా పరమాత్మ దర్శనం లభిస్తుంది అది ముత్యపు చిప్పలలో పడ్డ స్వాతికార్తె. తొలకరి తొలి చినుకులా (ప్రజ్ఞామూర్తులైన) మహాకవుల అంతరంగంలోని వారి సాహిత్యంలోకి ప్రసరిస్తుంది.

"రసానుగుణ శబ్దార్థ చిన్తాస్తి మిత చేత సః ।
క్షణం స్వరూప స్పర్శోత్థా ప్రజ్ఞైవన ప్రతిభాకవేః ॥

మహాకవి రసానికి అనుగుణమైన శబ్దార్థాలను గూర్చి ఆలోచిస్తూ, చిత్తాన్ని స్థిరంగా నిలిపినప్పుడు ఒక్కక్షణం పాటు ఆత్మచైతన్య స్పర్శ కలుగుతుంది.

సాహి చక్షుర్భగవతః, తృతీయమితి గీయతే ।
యేన సాక్షాత్కరోత్యేష, భావాం స్త్రైకాల్యవర్తినః ॥

అదే 'ప్రజ్ఞ' దానినే భగవంతుని మూడవ నేత్రం అంటారు. అప్పుడా కవి మూడు లోకాలలోనూ ఉన్న పదార్థాలనూ చూడగలుగుతాడు. తద్వారా భగవంతుని యందు అనన్యమైన భక్తి ప్రపత్తులు అలవడుతాయి. అటువంటి భాగవతతోత్తములకు ఐహిక ప్రపంచం అసారంగా అంటే ఇంద్రజాలంలా కనిపించి అత్యల్ప వయస్సులోనే వైరాగ్యం సిద్ధిస్తుంది.

"ఆకటివేళల అలపైన వేళల
తేకువ హరినామమే మఱి దిక్కు లేదు"

అన్న సత్యాన్ని గ్రహించిన మహాజ్ఞాని అన్నమయ్య-

"ఎన్నటి చుట్టంబు లిటువంటివారు
ఎన్నటి బంధుండ నేను వారలకు"

అని బాల్యంలోనే బంధువుల పట్లకాక, లోకబాంధవుడైన పద్మావతీ జాని పట్ల అత్యంత భక్తిని అనురాగాన్ని పెంపొందించుకొన్న అలఘుమనస్వి, అత్యలఘు యశస్వి అన్నమయ్య.

తుంబుర - నారదాది భక్త పుంగవులచే కీర్తింపబడిన నిగమనిగమాంత వర్ణిత మనోహరరూపుడైన జగత్ప్రభవు అన్నమయ్య కీర్తనలకు రసజ్ఞుడయ్యాడు. అన్నమయ్య "శృంగారమంజరి" అద్వితీయమైన శ్రీవేంకటేశ్వరుని వైభవానికి సుమధుర భాష్యం. అన్నమయ్య రచించిన వేంకటేశ్వరశతకాది 12 శతకాలు, శ్రీనివాసుని సాయుజ్యానికి సహకరించే ద్వాదశ సోపానాలు. స్వయంగా ఈ సంసార దుఃఖ సాగరాన్ని భక్తి అనే నౌక సహకారంతో దాటి, ఎందరికో ప్రపథ ప్రదర్శకుడైన, అనన్య 'ప్రతిభా' సంపన్నుడు ఈ అన్నమయ్య.

భర్తృహరి వాక్యపదీయంలోని 'వాక్యకాండ'లో నిమిత్త భేదంచేత ప్రతిభను ఆరువిధాలుగా వివరించాడు.

"స్వభావచరణాభ్యాస యోగా దృష్టోపపాదితామ్ ।
విశిష్టోపహితాం చేతి ప్రతిభాం షడ్విధాం విదుః ॥"

స్వభావ, చరణ, అభ్యాస, యోగ, అదృష్ట, విశిష్టోపహితములు, స్వభావము చేతను, సదాచారము చేతను, నిత్యాభ్యాసము చేతను, యోగబలముచేతను అదృష్టముచేతను, అభివ్యక్తమగునదియు - 'విశిష్టోపహితాంచ' సిద్ధినొందిన మహాపురుషులచే సంక్రమింపచేయబడినదియు, ఇతి = అని, ప్రతిభా = ప్రతిభను, షడ్విధాం = ఆరువిధములుగ, విదుః ఉదాహరింతురు.

## స్వభావసిద్ధముగా ఆవిర్భవించిన ప్రతిభ :

శ్రీనివాసుని పట్ల తైలధారలా అవిచ్ఛిన్నంగా ప్రవహించే ప్రేమభావనే భక్తి. ఆ భక్తి సాగరంలో ఓలలాడిన భాగవతోత్తముడు అన్నమాచార్యుడు. నదులు సముద్రంవైపు ప్రవహించునట్లు, పుష్పములు సుగంధములు వెదజల్లునట్లు అన్నమయ్య చిత్త భ్రమరం - వేంకటేశ్వరుని వైభవమకరందాన్ని ఆస్వాదిస్తూ పరమాత్మలో నిలీనమైనది. వేంకటనగాన్ని కైవల్యపదంగా, వేంకటేశనామం చెడనీక బ్రతికించే సిద్ధమంత్రంగా ప్రపంచీకరించాడు. అందుకే ఆ రససిద్ధుడైన పదకవితా పితామహుడికి "శ్రీవేంకటేశ్వరుని సేవా నిరతిలేని జీవనభ్రాంతి పడుసిరులు" - సిరులు కావనే స్వభావం అలవడింది. ఎలమితో తిరువేంకటనాథుని కొలచి ధన్యుడయ్యాడు. ఇది అన్నమయ్య స్వభావ ప్రతిభకు తార్కాణం.

## సదాచారము నిమిత్తముగనావిర్భవించు ప్రతిభ :

ఆచారః ప్రభవోధర్మః ధర్మస్యప్రభురచ్యుతః । నందవరీకర వైదిక బ్రాహ్మణ వంశంలో జన్మించిన ఋగ్వేదస్వాధ్యాయి, ఆశ్వలాయన సూత్రుడు, శ్రీతాళ్ళపాక అన్నమాచార్యుడు. అచ్యుతుడైన శ్రీవేంకటేశ్వరుని సర్వధర్మములకు మూలభూతుడుగా భావించి అతనినే నిరంతరం ధ్యానించడం అతని సదాచారం. ఘన విష్ణువు ద్వారా పంచసంస్కారాలతో శ్రీవైష్ణవమత ఆచారదీక్షను పొందిన జ్ఞానయోగి. ఈ విషయాలను స్వయంగా ఇలా తెలియజేశారు. (జ్ఞానయజ్ఞమీగతి గురూపదేశం ద్వారా శ్రీనివాస భక్తిమార్గజ్ఞాన సదాచార సంపన్నమైనది. వాల్యూం 2-కీ. 148)

యది భతి ముకుందే భక్తిరానంద సాంద్రా ।
విలుఠతి చరణాబ్జే మోక్ష సామ్రాజ్యలక్ష్మీః ॥

అన్నమయ్యకు మోక్షం పట్ల దృష్టిలేదు. అహేతుకంగా నారద, శాండిల్య మహర్షుల్లా శ్రీవేంకటరమణుని కీర్తించడంలోనే ఆనందాన్ని అనుభవించాడు. మదిలోచింతలువదలవని పాపపుణ్యాలుభారమైనవని భావించి

వాటినుండి రక్షింపమని అంతర్యామి శరణుకోరాడు. అతని దీర్ఘశరణాగతే అతని సదాచార ప్రతిభకు నికషోపలం అంతర్యామి అలిసితిసొలసితి అన్న కీర్తన ప్రసిద్ధమైనది.

## అభ్యాసం వల్ల సిద్ధించు ప్రతిభ

మోక్షప్రాప్తికి కర్మ - భక్తి - ధ్యాన - జ్ఞానాది యోగములకు అభ్యాసము మూలభూతమైనది. అందుకే గీతాచార్యుడు - "అభ్యాసేనతు కౌన్తేయ వైరాగ్యేణచ గృహ్యతే" - మనో నిగ్రహానికి అభ్యాస, వైరాగ్యము లత్యావశ్యకములని పేర్కొన్నాడు. అంతేకాక పతంజలి మహర్షికూడా 'అభ్యాస వైరాగ్యాభ్యాం తన్నిరోధః' అని ఆధ్యాత్మ రంగమున అభ్యాసయోగం యొక్క ఉన్నతస్థానాన్ని తెలియజేశాడు.

"అభ్యాసయోగయుక్తేన, చేతసా నాన్యగామినా ।

పరమం పురుషం దివ్యం యాతి పార్థానుచిన్తయన్ ॥

ఓ అర్జునా! అభ్యాసం అనే యోగంతో కూడినది. ఇతర విషయాలపైకి పోనది అయిన మనస్సుచేత, అప్రాకృతుడైన (లేక స్వయం ప్రకాశ స్వరూపుడైన) సర్వోత్తముడగు పరమపురుషుని మరల మరల స్మరిస్తూ, మనిషి పరమాత్మని పొందుతున్నడని గీతాచార్యుడు స్పష్టంగా తెలియజేశాడు.

శరణాగత ధర్మరహస్యాన్ని ప్రపత్తిమార్గ వైభవాన్ని జీర్ణించుకొన్న 'అన్నమయ్య' ద్వాదశ శతకాలతో, 32 వేల సంకీర్తనలతో అనునిత్యం స్వామిని సంస్మరించాడు. అన్నమయ్యకు స్వామి వైభవాన్ని మననం చెయ్యడం, వెన్నతోపెట్టిన విద్య. అందుకే "వెన్నతో నాకు కలిగె వెంకటేశు మంత్రము" అని అతిశయంగా పేర్కొన్నాడు.

"తనరగ కపిలుడై దత్తాత్రేయుడై

ఘనమైన మహిమ శ్రీ వేంకటరాయుడై

వొనరగ సంసార యోగము కృపసేయు

అనిమిష గతుల అభ్యాసయోగి" -

అనికపిల దత్తాత్రేయాదుల మనోనిష్ఠమైన యోగమతాల జ్ఞానం అన్నమయ్యకు ఉన్న అభ్యాస బలం.

## యోగము వల్ల సిద్ధించిన ప్రతిభ

సమత్వబుద్ధియే యోగము - దీనిని గీతాచార్యుడు ఇలా తెలియజేశాడు.

"యోగస్థః కురుకర్మాణి సఙ్గం త్యక్త్వా ధనంజయ ।

సిధ్యసిద్ధ్యోః సమోభూత్వా, సమత్వం ఉచ్యతే ॥

ఓ! అర్జునా! నీవు యోగనిష్ఠ యందుండి, సంగమును త్యజించి, కార్యము ఫలించినను, ఫలించకపోయినను సమానముగ ఉన్నవాడవై కర్మలను చేయుము. అట్టి సమత్వమే యోగమనబడును.

అన్నమయ్య శ్రీవేంకటేశ్వరునికి ఆజన్మభక్తుడు. విశిష్టాద్వైత భక్తి మార్గాన్ని ఆశ్రయించాడు. యోగమార్గాలన్నీ భక్తికి ఆలంబనమని భావించాడు.

శ్రీపతి నీవు సిద్ధించుట సిద్ధులన్నియు
పైపై నీ శరణమే పరమ పదంబు ......
సావధానమె లోచూపు సర్వధా నిన్నుజూచుట
తావులనే అనిమిషత్వము చేరుట
శ్రీవేంకటేశ్వర! ఓ సేవకుడై చేరుట
వేలు వేలు తత్త్వజ్ఞాన విధులు నిలుచుట.... అన్నాడు.

భక్తి అనే వెలుగుబాటులో ప్రయత్నిస్తే ఎవరు యోగవిద్య ద్వారా సాధ్యుడో బోధపడుతుంది.

అన్నిచేతలును బ్రహ్మార్పణ విధిజేయ
మన్నించు బుద్ధులను మరుగజెప్పి
ఉన్నత పదమున కొనరగఁగరుణించ
పన్నగ శయనుడే బ్రహ్మయోగి

మరి ఆ బ్రహ్మయోగిని చేరే ధన్యుడైన యోగి ఎవరి?-

"విగిడి శ్రీవేంకటపతి నిజదాసుడై భక్తి
దగిలి నిలుపువాడే ధన్యుడైన యోగి"

నిజదాసుడై, ధన్యుడైన అన్నమయ్య ఆ శ్రీవేంకటనాయకుని పాదమే "పరమ యోగులకు పరిపరి విధముల పరమొసంగుతున్న"దనే విజ్ఞాన ప్రతిభను యోగమార్గం వల్ల అలవరచుకొన్నాడు.

## అదృష్టంచేత ఆవిర్భవించు ప్రతిభ :

పూర్వజన్మ పుణ్యపరిపాకవశం వల్ల లభించేఫలం అదృష్టం. అన్నమయ్యకు "అదృష్టం" ప్రతిభవల్లనే బాల్యంలోనే భగవంతుని దర్శనప్రాప్తి సిద్ధించింది. చిన్ననాటనే కలలో శేషాద్రి శిఖరం, గోపుర ప్రభలు, శంఖ చక్రాదులు, స్వామివారి అభయ హస్తాన్ని వీక్షించాడు. స్వప్న ప్రేరితుడైన బాల అన్నమయ్య స్వామిని సందర్శించ డానికి తిరుమలకు బయలుదేరాడు.

"ఈ లీల నెనిమిది యేడుల పిన్న
బాలుడయ్యును నిష్ఠబూని యతడు....

మోకాళ్ళ ముడుపు నొద్దకు వెళ్ళేసరికి అలసి సొమ్మసిల్లాడు. అప్పుడు అలమేలు మంగమ్మ ప్రత్యక్షమై అతని అలుపు తీర్చి అదృశ్యమయ్యింది. ఆమె యిచ్చిన ప్రసాదం స్వీకరించి అలమేలుమంగపై ఆశువుగా "అలమేలుమంగా శతకం" చెప్పాడు.

తిరుమల చేరుకొన్న అన్నమయ్యకు ద్వారబంధం మూయడం వల్ల దర్శనభాగ్యం లభించలేదు. సాత్త్వికావేశంతో వేంకటపతిపై శతకం చెప్పగా (వేంకటశతకం) ద్వారబంధాలు తెరుచుకొని స్వామి మూలవిరాట్ దర్శనప్రాప్తి, అన్నమయ్యకు లభించినది.

ఇక అన్నమయ్య అదృష్టానికి పరాకాష్ఠగా, అతడి 16వ ఏట తిరువేంగళ నాథుని దివ్య సాక్షాత్కారం అతని దివ్యచర్మ చక్షువులకు లభించింది.

అన్నమయ్య నందకాంశ సంభూతుడు, అందువల్లనే అపారకరుణా సముద్రులైన పద్మావతీ శ్రీనివాసుల భవ్యదర్శన సౌభాగ్యఫలం లభించింది. ఇది కేవలం అతని అదృష్టప్రతిభ వల్లనే సిద్ధించినది.

**విశిష్టోపహితమైన ప్రతిభ :**

తపోయోగాది సిద్ధి సంపన్నులకు విశిష్ట వ్యక్తులచే సంక్రమింపజేయబడిన ప్రతిభ విశిష్టోపహిత ప్రతిభ. శ్రీవేంకటేశ్వరుడు అన్నమయ్య భక్తికి లోలుడు. అందుకే హరి భక్తుడైన విష్ణువుని కలలో కనిపించి తనకు అన్నమయ్యపై ఉన్న అనురాగాన్ని అన్నమయ్య భక్తిని తెలియజేశాడు. ఘనవిష్ణువు పంచసంస్కారాలు ఇచ్చి వైష్ణవ కూటమిలోకి అన్నమయ్యను తీసుకువచ్చాడు. పలుకుతేనెలతల్లి పద్మావతీ అమ్మవారిచేతి ప్రసాదం, గురువు ఘనవిష్ణువు ఇచ్చిన వైష్ణవ దీక్ష, అహోబలక్షేత్రంలో - విశిష్టాద్వైతఅభ్యాసం ఇవన్నీ అన్నమయ్యకు విశిష్టోపహితమైన ప్రతిభను అనుగ్రహించాయి.

విశ్వసాహిత్యంలోనే ఇలా ఆరు రకాల ప్రతిభలతో అలరారిన కవి మరొక్కడు లేడు. జయదేవాదులు అన్నమయ్యకు సాహిత్య స్ఫూర్తినిచ్చిన పూర్వకవులు. అన్నమయ్య ప్రతిభ పరిపూర్ణమైనది. చిరస్మరణీయమైనది. అన్నమయ్య సంస్కృత సంకీర్తనలను వాటిలో మణిప్రవాళ రీతిలో ప్రయోగించబడ్డ తెలుగు పదాలను మనసారా ఆస్వాదిద్దాం....

# శ్రీ తాళ్లపాక పదకవుల సంస్కృత సంకీర్తనలు

## - అకారాది సూచిక -


| | సంకీర్తన | సంపుటం సంఖ్య | సంకీర్తన సంఖ్య |
|---|---|---|---|
| 1. | అంజలిరంజలిరయం తే | 5 | 289 |
| 2. | అంబుజాక్ష నమో ప్రహ్లాదవరద | 18 | 300 |
| 3. | అతిశోభితేయం రాధా | 6 | 48 |
| 4. | అస్మదాదీనం అన్యేషాం | 1 | 357 |
| 5. | అహో సాధు తవాగమనం | 6 | 24 |
| 6. | అహో సురతవిహారోయం | 5 | 78 |
| 7. | ఆదిదేవ పరమాతుమా | 1 | 289 |
| 8. | ఆదిపురుషా అఖిలాంతరంగా | 4 | 37(అనుబంధం) |
| 9. | ఆనందనిలయ ప్రహ్లాదవరదా | 3 | 502 |
| 10. | ఆయమేవ అయమేవ ఆదిపురుష | 4 | 313 |
| 11. | ఏవం దర్శయసి హితమతిరివ | 5 | 167 |
| 12. | ఏవం శ్రుతిమత మిదమేవ | 1 | 4 |
| 13. | కందర్పజనక గరుడగమన | 4 | 5 (అనుబంధం) |
| 14. | కరుణానిధిం గధాధరం | 1 | 342 |
| 15. | కరేణ కిం మాం గృహీతుం తే | 6 | 171 |
| 16. | కిం కరిష్యామి కిం కరోమి బహాళ | 1 | 265 |
| 17. | కింనజానే హం కేశవాత్పరమహో | 2 | 83 |
| 18. | కేవల కృష్ణావతార కేశవా | 4 | 391 |
| 19. | గరుడ గమన గరుడధ్వజ | 2 | 391 |
| 20. | గోవిందాశ్రిత గోకులబృందా | 15 | 260 |
| 21. | జడమతిరహం కర్మజంతు | 1 | 481 |
| 22. | జయ జయ నృసింహ సర్వేశ | 2 | 289 |
| 23. | జానామ్యహంతే సరసలీలాం | 5 | 135 |
| 24. | డోలాయాం చల డోలాయాం హరే | 2 | 374 |
| 25. | తత్తా తిగిడి దింధి తక దింధిం | 6 | 46 |
| 26. | తథా కురుష్వ ముదా మామద్యేవ | 4 | 424 |
| 27. | తవ మాం ద్రష్టుం దయాస్తివా | 5 | 114 |
| 28. | తేశరణ మహం తే శరణ మహం | 2 | 404 |

# 1) శ్రీరాగం

అంజలిరంజలి రయం తే
కిం జనయసి మమ ఖేదం వచనైః ॥ పల్లవి ॥

మాం కిం భజసే మయా కింతే
త్వం కోవా మే తవ కాహం
కిం కార్యమితో గేహే మమ తే
శంకాం వినా కిం సమాగతోసి ॥ అంజలి ॥

నను వినయోక్తేర్న యోగ్యాహం
పునః పునస్త్వం పూజ్యోసి
దినదిన కలహవిధినా తే కిం
మనసిజజనక రమారమణ ॥ అంజలి ॥

దైవం బలవత్తరం భువనే
నైవ రోచతే నర్మ మయి
ఏవమేవ భవదిష్టం కురుకురు
శ్రీవేంకటాద్రి శ్రీనివాస! ॥ అంజలి ॥

(సం.-2-కీ.-358)

**అర్థము:** తే= నీకు, అయం = ఇదిగో! అంజలి అంజలిః = నమస్కారము, నమస్కారము, వచనైః = మాటలతో, మమ = నాకు, ఖేదం = దుఃఖాన్ని, కింజనయసి = ఎందుకుకలిగిస్తున్నావు?

మాం కిం భజసే = నన్నెందుకు సేవిస్తున్నావు, త్వం కోవామే = నీవు నాకెవ్వరవు, తవకాహం = నీకు నేనెవ్వతెను, మమగేహే = నా యింటిలో, తే = నీకు, కింకార్యం = ఏమి పని, ఇతః = ఇక్కడికి! శంకాం వినా= సందేహం లేకుండా, కిం సమాగతోసి = ఎందుకు వచ్చావు.

వినయోక్తేః = వినయపు మాటకు, అహం = నేను, నయోగ్యానను = తగనిదాననుకాదా!, త్వం = నీవు, పునఃపునః = మాటిమాటికీ, పూజ్యోసి = గౌరవనీయుడవు, మనసిజ జనక = మన్మథ జనకుడా, రమారమణ = లక్ష్మీపతీ!, దినదినకలహవిధినా = ప్రతిరోజూ తగువులతో, తే = నీకు, కిం = ఏమి ప్రయోజనము.

భువనే = ఈ ప్రపంచంలో, దైవం = దైవము, బలవత్తరం = బలీయమైనది కానీ, మయి = నా విషయములో, నర్మ = శృంగార వాక్యము, నైవరోచతే = రుచింపనే రుచింపదు. ఏవ మేవ = ఇదేవిధముగా, భవదిష్టం = నీయిష్టమును, కురు కురు = చేయుము! చేయుము! శ్రీవేంకట శ్రీనివాసా = శ్రీవేంకటాచల శ్రీనివాసా!

**తాత్పర్యం** : ఇదిగో! స్వామీ! నీకు నమస్కారము. మాటలతో నాకేల వేదనను కలిగిస్తున్నావు.

నన్ను ఎందుకు వెంటాడుతున్నావు? నీవు నాకెవ్వరవు? నేను నీకెవ్వతెను! నాయింట నీకేమి పని? జంకూ గొంకూ లేకుండా ఎందుకు వస్తున్నావు. కొంటెమాటలతో కాక మధురమైన మాటలను పలుకు. అప్పుడు నిన్ను నిత్యం పూజిస్తాను. మన్మథజనకుడా! లక్ష్మీనాథుడా! ప్రతిరోజూ నాతో తగవులాడవద్దు.

దైవము బలీయమైనది. ఇకమీదట నాతో తుంటరి మాటలు మాటాడవద్దు. నాకు అవి ప్రియముకావు. శ్రీవేంకటాద్రిపై నెలకొన్న శ్రీనివాసా! నాకు దుఃఖాన్ని కలిగించవద్దు.

**విశేషాంశములు** : యతిప్రాసలతో రచించబడిన ఈ కీర్తనలో ఖండితనాయక - శఠుడైన నాయకుడితో (గూఢవిప్రియకృచ్ఛఠః - ప్రతాపరుద్రీయము) రోషంతో సంభాషిస్తున్నది. నన్నెందుకు సేవిస్తున్నావు, నేను నీకు ఏం అవుతాను, నాకు నువ్వెవరు, వంటి పదాలను గుప్పిస్తున్నది. ఇది 'కిలికించితమన్న' శృంగారఅవస్థ (రోష, అశ్రు, హర్ష, భీత్యాది భావాల సంకరమైన స్థితి కిలికించితమని ప్రతాపరుద్రీయంలోని రసప్రకరణం తెలుపుతున్నది).

## 2. సాళంగనాట

అంబుజాక్ష నమో ప్రహ్లాద వరద పీ
తాంబరధర ప్రహ్లాద వరద ॥ పల్లవి ॥

హరివేషావతార ప్రహ్లాదవరద
హర విరించినుత ప్రహ్లాదవరద
అరిదానవాంతక ప్రహ్లాదవరద
పరమపురుష నమో ప్రహ్లాదవరద ॥ అంబు ॥

అమితగుణాకర ప్రహ్లాదవరద
అమరవందిత ప్రహ్లాదవరద
అమృతమయరూప ప్రహ్లాదవరద
ప్రమదాంక నమో ప్రహ్లాదవరద ॥ అంబు ॥

అహిరాజశయన ప్రహ్లాదవరద
అహోబలేశ ప్రహ్లాదవరద
సహజ శ్రీ వేంకటాచలనివాస నిత్య
బహురవితేజ నమో ప్రహ్లాదవరద ॥ అంబు ॥

సంపుటం-18-కీ-300

**అర్థము** : అంబుజాక్ష = కమలముల వంటి కన్నులు కలవాడా!, ప్రహ్లాదవరద = ప్రహ్లాదునికి ప్రసన్నుడైన వాడా!, పీతాంబరధర = పీతవస్త్రములను ధరించిన వాడా! ప్రహ్లాదవరద = ప్రహ్లాదునికి ప్రసన్నుడా! నమో = నమస్కారము.

హరివేషావతార = సింహవేషాన్ని దాల్చినవాడా! హరవిరించినుత = శివబ్రహ్మాదు లచే నమస్కరించబడువాడా!, అరిదానవాంతక = శత్రువులైన హిరణ్య కశిపాది రాక్షసులను సంహరించినవాడా, పరమపురుష = సర్వోత్తముడా! నమో = నమస్కారము.

అమిత గుణాకర = లెక్కలేనన్ని గుణములకు నిలయమైన వాడా! అమర వందిత దేవతలచేత నమస్కరించబడినవాడా!, అమృతమయ రూప = శాశ్వతమైన స్వరూపము కలవాడా!, ప్రమదాంక = సంతోషమే చిహ్నముగా కలవాడా! నమో = నమస్కారము.

అహిరాజశయన = శేషుని పాన్పుగా కలవాడా! అహోబలేశ = అహోబలక్షేత్ర నాయకుడా!, సహజ శ్రీవేంకటాచల నివాస = సహజమైన శ్రీ వేంకట పర్వతంపైన నివాస మున్నవాడా, సత్య = సత్యస్వరూపుడా!, బహురవితేజ = అనేక సూర్యుల తేజస్సును కలవాడా! నమో = నమస్కారము.

**తాత్పర్యం** : అహోబల నృసింహస్వామి వర్ణన, ఈ సంకీర్తనలో రమణీయంగా కనబడుతున్నది. కమలములవంటి కన్నులతో, పీతాంబరాలను ధరించినవాడై, ప్రహ్లాదునికి రక్షకుడైన నృసింహస్వామికి నమస్కారము. స్వేచ్ఛగా నరసింహవేషాన్ని ధరించి, శివబ్రహ్మాదులచే నమస్కరించబడుతూ, దేవతా శత్రువులైన హిరణ్యాకశిపాదిరాక్షసులను సంహరించిన, సర్వోత్తముడైన నృసింహస్వామికి నమస్కారము.

అనేక కల్యాణగుణాలు కలిగినవాడై, దేవతాకోటిచే నమస్కరించబడుతూ, శాశ్వతమైన స్వరూపంకలవాడై, ఆనందమే తన విలాసంగా కలిగిన శ్రీనృసింహస్వామికి నమస్కారము. శేషుని పాన్పుగా కలిగిన అహోబిల క్షేత్రం నాయకుడు, సహజమైన శ్రీ వేంకటాచలంలో నివాసమున్న సత్యస్వరూపుడైన, కోటిసూర్యతేజోవిరాజితాడు - శ్రీ నృసింహస్వామికి నమస్కారము.

## 3. శ్రీరాగం

అతిశోభితేయం రాధా
నతతవిలాసవశా రాధా ॥ పల్లవి ॥

దర్పకబలబోధా రాధా
తర్పణగంధవిధా రాధా
దర్పయుతక్రోధారాధా
దర్పకరసవేధా రాధా ॥అతి॥

తారితావరోధా రాధా
తారుణ్యోద్బోధా రాధా
ధారితానురోధా రాధా
దారితాపరాధా రాధా ॥అతి॥

తరుణీ మరుగాథా రాధా
ధరసమకుచబాధా రాధా
తరణసదనుబోధా రాధా
ధరణిదుస్సాధా రాధా ॥అతి॥

తనుభవగురుగాథా రాధా
స్తనకృతగిరిరోధా రాధా
తనువరవచనసుధారాధా
ధ్వనిజితపికమేధా రాధా ॥అతి॥

తరుణసఖీసవిధా రాధా
దరశశిరుచిసౌధా రాధా
తరళితతటిద్విధా రాధా
దరహసనవరోధా రాధా ॥అతి॥

ధనగర్వనిషేధా రాధా
స్తవతత్పర విబుధా రాధా
ద్రవధునీకృతసుధా రాధా
దవమదనవ్యాధా రాధా ॥అతి॥

తరుణత్వ పురోధా రాధా
తరుణస్మరయోధా రాధా
తరుపశుమణిగుణధారక బహుల వి
తరణపరా బహుధా రాధా ॥అతి॥

ద్వైవికసుఖోపధా రాధా
ద్రావకనిజాభిధా రాధా
శ్రీవేంకటగిరిదేవకృపాము
ద్రావైభవనాథా రాధా ॥అతి॥

సంపు-6-48కీ

అతిశోభితేయం రాధా = ఎంతో కాంతిని కలిగినది ఈ రాధ. నతత విలాసవశా రాధా = నమ్రత కలిగిన విలాసంతో విరాజిల్లుతున్నది రాధ. దర్పకబల బోధారాధా = దర్పము ఎక్కువగా కలిగినది రాధ, తర్పణగంధవిధారాధా = శ్రీకృష్ణునికి తృప్తి కలిగించుటకై గంధాన్ని పూసుకొన్నది రాధ, దర్పయుతక్రోధా రాధా= గర్వముతో కూడిన ప్రణయకోపాన్ని కలిగినది రాధ, దర్పకరసవేధారాధా= శృంగార రసమునకు బ్రహ్మవంటిది రాధ, తారుణ్యోద్బోధారాధా = యౌవనాన్ని మేల్కొల్పునదిరాధ, ధారితానురోధారాధా = అనునయములను

పట్టించుకొననిది రాధ, దారితాపరాధా రాధా = అపరాధములను పోగొట్టునది రాధ, తరుణీమరుగాథా రాధా = యువతులకు విరహాగ్నితో కూడిన మరుభూమి కథ వంటిది రాధ, ధరసమకుచబాధా రాధా = సుందరమైన పాలిండ్లచేత వేదననొందుతున్నది రాధ, తరణ సదను బోధారాధా = జయించుటచేత పొందదగినది రాధ, ధరణి దుస్సాధా రాధా = భూలోకంలో అసాధ్యమైనది రాధ, తనుభవగురుగాధా రాధా = శరీరము నుండి పుట్టిన గొప్పదైనగాధకలది రాధ, తనువరవచనసుధా రాధా = మృదు మధురమైన వాగమృతం కలది రాధ, ధ్వనిజితపికమేధారాధా = మధుర కంఠస్వరముచేత కోకిలకి నేర్పరి తనాన్ని చూపునదిరాధ, తరుణ సఖీసవిధా రాధా= యువతులైన చెలికత్తెలతో కూడినదానా! రాధా, దరశశిరుచి సౌధారాధా = అందమైన చంద్రికలకు సౌధమువంటిదానా రాధా! తరలితతటి ద్విధారాధా = చంచలమైన మెరుపుతీగ వంటిదానారాధా, దరహాసనవరోధారాధా = అందమైన నవ్వుచేత అవరోధముల తొలగించుదానా రాధా, ధవగర్వనిషేధా రాధా = పతియైన కృష్ణుని గర్వాన్ని పోగొట్టు నేర్పుకలదానా! రాధా, స్తవతత్పరవిబుధారాధా= దేవతలచే స్తుతించబడుతున్న రాధా, ద్రవధునీకృతసుధారాధా = అమృతాన్ని వర్షించుదానా! రాధా, దవమదన వ్యాధారాధా = దావాగ్ని అనే మన్మథబాధను తొలగించుదానా! రాధ! తరుణత్వ పురోధారాధా = యౌవనానికి మార్గమును చూపుదానా! రాధా, తరుణస్మరయోధా రాధా = యౌవనంతో పరాక్రమించుదానా రాధా, తరుపశుమణి గుణ ధారక బహుళ వితరణపరా బహుధారాధా = కల్పవృక్షం - కామధేవును - చింతామణి వంటి గుణములు కలిగినదై సమస్తమును ఇచ్చుదానా! ఓ రాధా!, దైవిక సుఖోపధా రాధా = దైవికమైన సుఖానికి నిలయమైనాదానా రాధ, ద్రావకనిజాభిధారాధా = తన నామస్మరణతోనే మార్దవాన్నిచ్చునది రాధ, శ్రీ వేంకటగిరి దేవకృపా ముద్రాదైభవనాథా రాధా = వేంకటగిరి దేవుని కృపచేతను సంతోషమును, వైభవమును పొందుదానా - రక్షనిచ్చుస్వభావముకల రాధకు నమస్కారము.

**తాత్పర్యం** : రాధయొక్క స్వరూప స్వభావాదులను లోకోత్తరంగా ఈ సంకీర్తనలో పేర్కొంటున్నాడు. రాధా దేవి ఎంతో కాంతిని కలిగినది. నమ్రతకల విలాసంతో కూడినది, దర్పము కలిగినది, శ్రీకృష్ణునికి తృప్తి కలిగించుటకు గంధాన్ని పూసుకొన్నది, గర్వముతో కూడిన ప్రణయకోపాన్ని కలిగినది. శృంగార రసానికి బ్రహ్మవంటిది, యవ్వనాన్ని మేల్కొల్పునది. అనునయములను కోపగించిన వేళ పట్టించుకొననిది. అపరాధములను పోగొట్టునది, యువతులకు విరహాగ్నితో కూడిన మరుభూమి కథవంటిది, సుందరమైన పాలిండ్లచేత వేదన పొందుతున్నది, జయించుట చేత పొందదగినది, భూలోకంలో అసాధ్యమైనది. శరీరమునుండి పుట్టిన గొప్పదయిన గాధగలది రాధ, మృదుమధురమైన వాగమృతం కలిగినది రాధ, మధుర కంఠధ్వనిచేత కోకిలకు నేర్పరితనాన్ని చూపునది, యువతులైన చెలికత్తెలతో కూడినది. అందమైన చంద్రికలకు సౌధము వంటిది, చెంచలమైన మెరుపుతీగ వంటిది, అందమైన నవ్వుచేత అవరోధములను తొలగించునది, తన పతియైన కృష్ణుని గర్వాన్ని పోగొట్టు నేర్పుకలది. దేవతలచేత స్తుతింపబడుతున్నది. అమృతాన్ని వర్షించునది, దావాగ్ని అనే మన్మథబాధను తొలగించునది, యవ్వవనానికి మార్గాన్ని చూపునది, యవ్వనంతో పరాక్రమించునది, కల్పవృక్షం - కామధేనువు - చింతామణి వంటి గుణములు కలిగినదై సమస్తాన్ని ఆశ్రితులకు ఇచ్చునది, సుఖానికి నిలయమైనది, తన నామస్మరణతోనే మార్దవాన్ని ఇచ్చునది - ఆ రాధ వేంకటగిరి దేవుని కృపచేత సంతోషమును, వైభవాన్ని పొంది భక్తులను రక్షించు స్వభావం కలది.

**విశేషాంశము** : ఎనిమిది చరణాలు - యతిప్రాసలోగల నున్న ఈ కీర్తనలో ప్రాదాంతంలో "రాధ" అనే విశేష్యము చేర్చుట గమనార్హము : జయదేవాది పూర్వకవుల ప్రభావంచే రచింపబడిన ఈ కీర్తనలో శ్రీకృష్ణపరమాత్మ హృదయేశ్వరి, శృంగార రసాధిదేవత "రాధ" గుణగణాలు హృదయంగమంగా వర్ణించబడ్డాయి.

## 4) పాడి

అస్మదాదీనాం అన్యేషాం
తస్మిన్ తస్మిన్ తత్ర చ పునశ్చ ॥పల్లవి॥

సతతాధ్యయన నిష్ఠాపరాణాం దృఢ-
వ్రతినాం యతీనాం వనవాసినాం
గతిరిహ స్మర్తుం కా జగత్యాం పర
స్థితిరియం కా విష్ణుసేవా పునశ్చ ॥అస్మ॥

మోహినా మత్యంత ముష్కరాణాం గుణ-
గ్రాహిణాం భువనైక కఠినానాం
దేహసంక్షాళనవైదేశికానాం సదా
శ్రీహరిస్మరణ విశేషః పునశ్చ ॥అస్మ॥

కింకుర్వాణ దుఃఖిత జీవినాం
పంకిల మనోభయ భ్రాంతానాం
శంకానివృత్తిః స్వరసా కా శ్రీ
వేంకటాచలపతేర్వినుతిః పునశ్చ ॥అస్మ॥ (సం.1-కీ-357)

**అర్థం** : అస్మదాదీనాం = మాకు, మాకు సంబంధించిన వారికి, అన్యేషాం = ఇతరులకు, తస్మిన్ తస్మిన్ = ఆయా విషయములందు, తత్ర చ = అక్కడను, పునశ్చ = మఱియును, సతతాధ్యయన నిష్ఠానాం = ఎల్లప్పుడూ వేదాధ్యయన నిష్ఠగలవారికి, దృఢవ్రతినాం = దృఢవ్రతముగలవారికి, యతీనాం = సన్యాసులకు, వనవాసినాం = వానప్రస్థులకు, స్మర్తుం = స్మరించుటకు, కా = ఏది, మార్గము. ఇహజగత్యాం = ఈ జగతియందు, పరస్థితిః = ఉత్తమస్థితి, కా= ఏది? పునశ్చ= మరియు, విష్ణుసేవా = విష్ణుసేవ మాత్రమే.

మోహినాం = మోహింపబడిన వారికి, అత్యంత ముష్కరాణాం = మహా దుష్టులకు, గుణగ్రాహిణాం = గుణగ్రహణ లక్షణముగలవారికి, భువనైక కఠినానాం = లోకములోకెల్ల కఠిన స్వభావులైనవారికి, దేహసంక్షాళన = స్నానవిషయమునందు, వైదేశికానాం = ఆచారహీనులకు, కాగతిః = ఏది గతి? సదా = ఎల్లవేళలయందు, పునః = మఱలమఱల, శ్రీహరిస్మరణవిశేషః = శ్రీవారి యొక్క సంస్మరణ విశేషము.

కింకుర్వాణ = ఒరులను నిరంతరము సేవించుచున్న, దుఃఖిత జీవినాం= దుఃఖజీవనులైనవారికి, పంకిల = మాలిన్యముతో నిండిన, మనః = మనస్సు నందలి, భయ = భయములతో, భ్రాంతానాం =

మనస్సు చెదిరినవారికి, సరసా = సరసమైన, శంకానివృత్తిః = సంశయనివృత్తి, కా = ఏది, శ్రీవేంకటాచలపతేః = శ్రీవేంకటగిరి నాథునికి, వినుతిః = వినుతించుట, పునశ్చ = మఱలమఱల చేయదగినది.

**తాత్పర్యము :** సతతాధ్యయన పరాయణులకు, ధృఢవ్రతులకు, యతులకు వానప్రస్థులకు, స్మరింపదగినది యేది? వారికి ఈ లోకములో ఉత్తమగతియేది? విష్ణుసేవ ఒక్కటే! మోహితులకు, మహాదుష్టులకు, గుణగ్రహణశీలురకు లోకములోకెల్ల కఠినస్వభావముగలవారికి, స్నానజపాది సదాచారము లేనివారికి ఈ లోకములో గతియేది? శ్రీహరిస్మరణ విశేషము ఒక్కటే. దాస్యపు బ్రతుకుతో దుఃఖజీవనులైనవారికి, మాలిన్యముతో నిండిన మనస్సునందలి - నానావిధ భయములతో విభ్రాంతులైనవారికి, సరసమైన సంశయనివృత్తికి మార్గమేది?, కేవలం శ్రీవేంకటాచలపతిని వినుతించుటయే.

**విశేషాంశం :** ఈ కీర్తనలోని భావాన్ని వేంకటచలమాహాత్మ్యంలోని ఈ క్రింది శ్లోకము గుర్తుచేయుచున్నది.

స్మరణాత్సర్వ పాపఘ్నం. స్తవనాదిష్టవర్షిణమ్ ।
దర్శనాన్ముక్తిదం చేశం, శ్రీనివాసం భజేనిశమ్ ॥

## 5. ముఖారి

అహో సాధు తవాగమనం
బహుళవైభవైః ప్రతివచనైః కిమ్ ॥ పల్లవి ॥

తతోపసర మిథ్యాశఠవచనై
రితస్తవైః మమ హితం కిమ్
బత మమ దేహత్రాణ స్తథాపి
గత ఏవై తత్ కరణమిహ కిమ్ ॥ అహో ॥

సంవృతి చేలం జహి చపలత్వం
సంవాదేమే సతతం కిమ్
త్వం వా మమ చిత్తం సాంత్వయసి
కిం వా కురు మమఖేలనమిహ కిమ్ ॥ అహో ॥

అతి బిభేమి భవదాచరణాదిహ
చతుర వేంకటాచలరమణ
సతీం మా మనుసరసి కిమర్థం
రతిరాజవిభవ రచనమిదం కిమ్! ॥అహో॥ (సంపు-6-24-కీ.)

ఇక్కడ ఖండితనాయిక - 'కలహాంతరిత' పలికిన పలుకులు ఇవి: తవాగమనం = నీరాక, అహోసాధు= ఎంతో బాగున్నది, బహుళవైభవైః ఎక్కువ వైభవం గల, ప్రతివచనై = మారుమాటలతో, కిం = ఏమిప్రయోజనం.

తతః = అందువల్ల, అపసర = తప్పుకో, మిథ్యాశరవచనైః, ఇతస్తవైః = డాబుసరి మాటలతో, మమ = నాకు, కింహితం = ఏమి ప్రయోజనము, బత = అయ్యో!, తథాపి= అయినప్పటికి, దేహాత్ = శరీరమునుండి, ప్రాణ = ప్రాణము, గత ఏవ = పోయినది, ఏతత్ కారణం కిం = దీనికారణం ఏమి!

హేచపల = హే చపలబుద్ధి కలవాడా! సంవృతి చేలం = నాపైట చెరగును, త్వం = నీవు, జహి = విడువుము, మే = నాయొక్క, త్వం = నీవు, మమ = నాయొక్క, చిత్తం = మనస్సును, స్వాంతయసి = శమింపజేస్తున్నావు, కింవాకురు = ఏదైన చేసుకో, ఇహ = ఇక్కడ, మమ = నాకోసం, ఖేలనం = ఈ ఆటలు, కిం = ఎందుకు?

చతుర = నేర్పు కలవాడా! వేంకట రమణ = శ్రీ వేంకటపతీ! భవదాచరణాత్ = నిన్ను ఆరాధించుట వలన, ఇహ = ఇక్కడ, కిం = ఏ ఫలమున్నది, కిమర్థం = ఎందువల్ల, సతీం = పతివ్రతయైన, మాం = నన్ను అనుసరసి = అనుసరిస్తున్నావు, రతిరాజజనక = శృంగార శేఖర, ఇదం = ఈ రచనం = దొంగనాటకం, కిం = ఏమి?

**తాత్పర్యం** : రాకరాక వచ్చావు నీవు. చాలాసంతోషం. స్వామీ! నీ మోహపు, మోసపు మాటలు చాలించు. నా మార్గాన్ని వదలు, నా మాటలకు నీవు ప్రతిస్పందించవద్దు. నీవు నాతో వాదించవద్దు. నాపైట చెరగును వదులు. నీవు నాచిత్తానికి ఆనందాన్నిచ్చువాడవుకావు. ఓ! రతిరాజ జనక, నీవు దొంగనాటకములను మానుము - అని ఖండితనాయిక శ్రీవేంకటనాయకుడికి మనవి చేసుకొంటున్నది.

## 6) శంకరాభరణం

అహో సురతవిహారోయం
సహజ పరాజయ శంకానాస్తి ॥పల్లవి॥

1. యమునాకూలే సుమలతాగృహే
విమలసైకత వివిధస్థలే
రమణీరమణౌ రమతస్తయోః
ప్రమదస్య పరాత్పరం నాస్తి ॥ అహో ॥

2. రజనీక్వావా? ప్రాతఃకింవా?
త్యజనం భజనం తత్కింవా?
విజయః కోవాపజయః కోవా
భుజపరిరంభః, స్ఫుటంనాస్తి . ॥ అహో ॥

3. చీనాంశుక రంజిత మేఖలావి
తానే జఘనం తరతి సతి
మానవికలనే మానినీమణే
హీనాధిక పరిహృతిర్నాస్తి ॥ అహో ॥

4. కింవా మిళనం కింవా మిళనం
త్వం వాహంవా తన్నాస్తి
సంవాదోవా సరసః కోవా
కింవా వాచ్యాక్రియా నాస్తి ॥ అహో ॥

5. ఆదిదేవ పీతాంశుక బద్ధా
స్వేద సురభి కాశ్మీరజలం
సాదురూహ్యా లజ్జావివశతయా
ఖేదేన వచః కించిన్నాస్తి ॥ అహో ॥

6. వరకుచాగ్ర సంవ్యానం కరేణ
హరోపరం పరిహరతి సతి
సరసలోచనం చల వివశతయా
తరుణ్యాం చైతన్యం నాస్తి ॥ అహో ॥

7. సురతాంతశ్రమ సుఖం కింవా
వరలజ్జా సావా కావా
పరవశతనువైభవం కింవా
నిరతాం తయోర్నికృతిర్నాస్తి ॥అహో॥

8. పరిమళ భరిత ప్రచుర సుశీతల
వరమృదువాయౌ వాతి సతి
తిరువేంకటగిరిదేవ రాధయో
స్సరస రతి సుఖశ్రాంతిర్నాస్తి ॥అహో॥

(సం.-5-కీ.-78)

**అర్థం** :-అహో = ఆశ్చర్యము, అయం = ఈ, సురతవిహారః = శృంగారవ్యాహ్యాళి, (తిరువేంకటగిరిదేవ రాధయోః), సహజ = సహజమైన, పరాజయ = ఓటమి వలన, శంకా = సందేహము, నాస్తి = లేదు.

యమునాకూలే = యమున ఒడ్డునందు, సుమలతాగృహే = పూలతోనిండిన తీగపొదరింటిలో, విమల = స్వచ్ఛమైన, సైకత = ఇసుకతిన్నెలందు, వివిధ = అనేకవిధములయిన, స్థలే = స్థలమునందు, రమణీరమణౌ = ప్రేయసీప్రియులైన రాధామాధవులు, విహరతః = విహరించుచున్నారు, తయోః= వారియొక్క, ప్రమదాత్ = ఆనందము కంటే, పరాత్పరం = వేఱొక దివ్యానంద స్థితి, నాస్తి = లేదు.

కా వారజనీ = ఏది రాత్రియో, కింవాప్రాతః = ఏది ఉదయకాలమో, తత్ = అది, త్యజనం వా = విడిచియుండుట, భజనం వా = కలసియుండుట, కిం వా = ఏదో, కోవా విజయః = ఏది విజయమో, కోవా

పరాజయః = ఏది ఓటమియో, స్ఫుటం = విస్పష్టముగా, నాస్తి = లేదు, భుజపరిరంభః = బాహువులతో చేసుకొను ఆలింగనము, స్ఫుటంనాస్తి = అస్పష్టముగా ఉన్నది.

చీనాంశుకరం జిత = పట్టువస్త్రము మీద మెలసిన, మేఖలావితాసే = మొలనూలి పేటలమొత్తము, జఘనే = మొలనుండి, తరతిసతి = జాఱుతుండగా, మానవికలనే = గర్వాన్ని దూరం చేసుకొంటూ, హీనాధిక పరిహృతిః = సద్దుకొనుట, మానినీ మణేః = నారీ రత్నానికి, నాస్తి = లేదు.

కిం వా మిళనం = అది కలయుటయో, అమిళనం కింవా = కలయకుండుటయో, త్వం వా = నీవనికాని, అహం వా = 'నేను' అనికాని, తత్ = ఆ స్పృహకాని, సంవాదోవా = మాట్లాడుకోవడంకానీ, సరసః కోవా = ఏవిధమైన సరసముకాని, కింవా వాచ్యా = వివరించగల, క్రియా = చేష్ట, నాస్తి = లేదు.

ఆదిదేవ = ఆదిదేవుడైన శ్రీనివాసునియొక్క, పీతాంశుక = పట్టుబట్టలు, స్వేదసురభి = చెమటచేత పరిమళించుచున్న, కాశ్మీరజలం = కుంకుమ జలాన్ని, సా = ఆరాధ, లజ్జావివశతయా = సిగ్గుముంచెత్తగా, ఖేదేన = అలిసిపోవడం చేత, కించవచః = ఏమాటకూడా, నాస్తి = లేదు.

వరకుచాగ్రసంవ్యానం = పాల్లిండ్లపైని పయిటను, హరౌ = శ్రీవారు, కరేణ = తనచేతితో, పరిహరతిసతి = తొలగిస్తుండగా, సరస = సరసములైన, విలోచనాంచల = కడకన్నులయందలి, వివశతయా = పారవశ్యంచేత, తరుణ్యాం= రాధయందు, చైతన్యం = స్పృహ, నాస్తి = లేదు.

సురతాంత శ్రమసుఖం కింవా = రతికేళిలో పొందిన సుఖంవల్ల అలసిన తీరా! వరలజ్జా = మేలిసిగ్గుగల, సావా = ఆరాధనా కాదా!, పరవశ తనువైభవం కింవా = సొమ్మసిల్లిన తీరా! కరా! నిరతాం = ఎల్లవేళలా, తయోః = వారికి, నికృతిం = వచించుకొనుట, నాస్తి = లేదు.

పరిమళభరిత = సువాసనలతోకూడిన, ప్రచుర = విస్తారమైన, సుశీతల= మిక్కిలి చల్లనైన, వరమృదువాయౌ = పిల్లగాలులు, వాతిసతి = వీచుచుండగా, తిరువేంకటగిరి దేవరాధయోః = రాధాశ్రీవేంకటేశ్వరులకు, సరసరతిసుఖ = సరసమైన రతిసుఖమువల్ల, శ్రాంతిః = శ్రమ, నాస్తి = లేదు.

**తాత్పర్యము :** ఈ సంభోగ శృంగార సంకీర్తన రాధా - తిరువేంకటగిరినాథుల రతిక్రీడను అభివర్ణిస్తున్నది. ఈ క్రీడలో గెలుపు ఓటముల ప్రసక్తిలేదు. యమునాతీరంలో చక్కని పూలపొదరిళ్లలో, ఇసుక తిన్నెలపై శృంగార కేళిలో ఉన్న వారిరువురిలోనున్నది దివ్యానందమే. తమ బాహువులతో ఒకొరినొకరు కౌగలించుకొన్నారు. వారిరువురికి ఇదిరాత్రి, ఇది ఉదయం, ఎవరిది విజయం, ఎవరిది పరాజయం, అన్న స్పష్టతలేదు. నాయికా నాయకులు మొలనుండి పట్టుబట్టలు చెమటతో తడిసిజరుతున్నా, సద్దుకోవాలన్న ఆలోచనలో లేరు. వారు ఒకొరినొకరు పిలుచుకొంటున్నారో, పలకరిస్తున్నారో చెప్పలేని స్థితిఅది. శ్రీవారు రాధ పయ్యెదపై నుండి పయిటను తొలగిస్తున్నా సిగ్గుతో నిండిన రాధ కడకన్నులలోని చైతన్యము జడమైపోయింది. రతిక్రీడాంతంలో రాధ సొమ్మసిల్లినదో లేక అధికముగా పారవశ్యాన్ని పొంది అచేతనమైనదో, అసలు ఆమె రాధో లేక ఆ సిగ్గులమొగ్గ వేరొక ముగ్ధనాయికో స్పష్టంకావడంలేదు. ఇలా అస్పష్టంగా గోచరిస్తున్న ఆ రాధ, తిరువేంకటనాథుల రతిశ్రమను తొలగిస్తూ, పిల్లతెమ్మెరలు వీస్తున్నాయి.

## 7. దేవగాంధారి

ఆదిదేవ పరమాతుమా
వేదవేదాంత వేద్య నమో నమో ॥పల్లవి॥

పరాత్పరా భక్త భవభంజనా
చరాచరలోకజనక నమో నమో ॥ఆది॥

గదాధరా! వేంకటగిరి నిలయా
సదానంద ప్రసన్న నమో నమో ॥ఆది॥

సంపుటం-1-కీ-289

**అర్థం :** ఆదిదేవ = చిరంతనదైవమా!, పరమాతుమా = పరబ్రహ్మమా!, వేద వేదాంత వేద్య = వేదములద్వారా, ఉపనిషత్తుల ద్వారా తెలియబడుతున్న వాడా!, నమో నమః = నమస్కారము, పరాత్పర = సర్వోత్తముడా!, భక్తభవ భంజనా = భక్తజనుల సంసార దుఃఖాలను తొలగించువాడా!, చరాచరలోకజనక = స్థావర జంగమాత్మకమైన లోకాన్ని సృష్టించిన వాడా!, నమో నమః = నమస్కారము, గదాధర = కౌమోదకమనే గదను ధరించినవాడా! వేంకటగిరినిలయ= వేంకటమనే కొండపై నివాసమున్నవాడా! సదానంద = ఎల్లప్పుడు ఆనందముగా నుండువాడా! ప్రసన్న = ప్రపన్న జనులపట్ల ప్రసన్నముగా నుండువాడా!, నమో నమః = నమస్కారము.

**తాత్పర్యం :** ఆది దైవమా! పరబ్రహ్మ స్వరూపమా, వేదములచేత ఉపనిషత్తులచేత తెలియబడుతున్న స్వామీ! నమస్కారము. సర్వోత్తముడా! భక్తజనుల సంసార దుఃఖాలను తొలగించు వాడవు, ఈ స్థావర జంగమాత్మకమైన లోకాన్ని పుట్టించిన వాడవు, నీకునమస్కారము, కౌమోదకమనే గొప్పగదను ధరించేవాడా! వేంకటాచలంపై నిత్యం నివసించే సదానంద స్వరూపుడా! ప్రసన్నమైనవాడా! నమస్కారము.

## 8. నాటరాగం

ఆదిపురుషా! అఖిలాంతరంగా!
భూదేవతారమణ! భోగీంద్రశయన! ॥పల్లవి॥

భవపాథోనిధి బాడబానల!
భవజీమూత ప్రభంజనా!
భవ పర్వత ప్రళయ భయదనిర్ఘాత! దు
ర్భవ కాలకూటభవ! బహువిశ్వరూప! ॥ఆది॥

భవఘోర తిమిర దుర్భవకాలమార్తండ!
భవ భద్ర మాతంగ పంచానన!

భవ కమలభవ మాధవరూప! శేషాద్రి!

భవన! వేంకటనాథ! భవరోగవైద్య! ॥ఆది॥

సంపు-4-కీ-37

**అర్థము** :- ఆదిపురుషా = ఆదిపురుషుడా!, అఖిలాంతరంగా = అఖిల జీవుల అంతరంగములోనుండువాడా! భూదేవతారమణ = భూదేవికి రమణుడా!, భోగీంద్రశయన = ఆదిశేషునిపై శయనించువాడా!,

భవపాథోనిధి బాడబానల = సంసారమనే సముద్రమును హరించే బడబానలమా! భవజీమూతప్రభంజన = సంసారమనే మహామేఘమును తరిమికొట్టే ఝుంఝా మారుతమా!, భవ పర్వత = సంసారమనే పర్వతానికి, ప్రళయభయద, నిర్ఘాత = ప్రళయభయంకరమైన వజ్రపాతము, దుర్భవకాలకూట భవ = దుర్భరమైన కాలకూటాన్ని లయంచేసేవాడా! బహు విశ్వరూప = అనేక విశ్వరూపములలో శోభిల్లుతున్నవాడా!

భవ = సంసారమనే, ఘోరతిమిర = భయంకరమైన చీకటిని నాశనము చేయు, దుర్భవ = భరించలేని, కాల = ప్రళయకాలమునందలి, మార్తాండ = సూర్యుడా!, భవ = సంసారమనెడి, భద్రమాతంగ = భద్రజాతి ఏనుగునకు! పంచానన = సింహమా!, భవ = శివుని యొక్క, కమలభవ = బ్రహ్మయొక్క, మాధవ = విష్ణువు యొక్క రూపములు కలవాడా!, శేషాద్రిభవన = శేషాద్రిని నివాసముగా కలవాడా! వేంకటనాథ = శ్రీవేంకటేశ్వరా! భవరోగవైద్య = సంసారరోగమునకు వైద్యుడా! నమస్కారము.

**తాత్పర్యము:** ఆదిపురుషుడా! అఖిలజీవాంతరంగములలో నివసించువాడా! భూదేవికి ప్రియమైనవాడా! ఆదిశేషునిపై శయనించువాడా!

సంసార సముద్రమును దహించుబడబానలమా! భవమేఘ ప్రభంజనమా! సంసార పర్వత ప్రళయానికి వజ్రాయుధమా! సంసారకాలకూటాన్ని నిగ్రహించే పరమశివా! బహువిశ్వరూపా! ఆదిపురుషా! నమస్కారము.

సంసారమనే చీకటికి - ప్రళయకాలసూర్యుడా! సంసారమనే ఏనుగును మట్టుబెట్టే సింహమా! మాధవస్వరూపా! శేషాద్రియే నివాసంగా కలవాడా! శ్రీవేంకటేశ్వరా! భవరోగవైద్యుడా! -నమస్కారము.

## 9. బౌళిరాగం

ఆనందనిలయ! ప్రహ్లాదవరద!

భానుశశినేత్ర! జయప్రహ్లాదవరద! ॥ పల్లవి ॥

పరమపురుష! నిత్య! ప్రహ్లాదవరదా!

హరి యచ్యుతానంత! ప్రహ్లాదవరదా!

పరిపూర్ణ! గోవింద! ప్రహ్లాదవరదా!

భరితకల్యాణగుణ! ప్రహ్లాదవరదా! ॥ ఆనంద ॥

భవరోగసంహరణ! ప్రహ్లాదవరదా!

అవిరళ! కేశవ! ప్రహ్లాదవరదా!

పవమాననుతకీర్తి! ప్రహ్లాదవరదా!
భవపితామహవంద్య! ప్రహ్లాదవరదా! ॥ ఆనంద ॥

బలయుక్త నరసింహ ప్రహ్లాదవరదా
లలిత శ్రీవేంకటాద్రి ప్రహ్లాదవరదా
ఫలితకరుణారస ప్రహ్లాదవరదా
బలివంశకారణ ప్రహ్లాదవరదా! ॥ ఆనంద ॥ (సం-3-కీ.502)

**అర్థము :-** ఆనందనిలయ = ఆనందమునకు నివాసమైనవాడా! (లేక) ఆనంద విమానము నివాసముగా కలవాడా!, భానుశశినేత్ర = సూర్య చంద్రులు కన్నులుగా గలవాడా!, ప్రహ్లాదవరదా = ప్రహ్లాదుని అనుగ్రహించినవాడా!, జయ = జయమగు గాక!

పరమపురుష = పరమ పురుషుడా, నిత్య = శాశ్వతుడా, హరి = మహావిష్ణువా!, అచ్యుత = నాశరహితుడా, అనంత = అనంతుడా, పరిపూర్ణ = పరిపూర్ణమైనవాడా!, గోవింద = గోవిందుడా, భరితకల్యాణగుణ = కల్యాణ గుణములతో విరాజిల్లెడివాడా! ప్రహ్లాదవరదా = ప్రహ్లాదుని యందు అనురక్తి కలవాడా!

భవరోగ సంహరణ = సంసారమనెడి రోగమును తొలగించువాడా!, అవిరళ = ఘనమైనవాడా, కేశవ= కేశవస్వామీ!, పవమాననుతకీర్తి = వాయువు చేత స్తుతింపబడిన కీర్తిగలవాడా, భవ = శివునకు, పితామహ = బ్రహ్మకు, వంద్య = నమస్కరింపదగినవాడా!

బలయుక్త = శక్తివంతుడా!, లలిత = మనోహరమైన, శ్రీవేంకటాద్రి = వేంకటాచలము కలవాడా, ఫలితకరుణారస = పరిపూర్ణ కరుణారూపుడా, బలివంశకారణా = బలి యొక్క వంశమునకు కీర్తికారకుడా! (బలిచక్రవర్తి ప్రహ్లాదునికి మనుమడు) - నమస్కారము.

**తాత్పర్యము :-** ఆనందమునకు నిలయమైనవాడా! ప్రహ్లాదుని ఆదరించి రక్షించినవాడా! సూర్యచంద్రులను నేత్రములుగా కలిగినవాడా! వర్థిల్లుము. పరమపురుషుడా, శాశ్వతుడా, హరి, అచ్యుత, అనంత, పరిపూర్ణ, గోవింద, కల్యాణ గుణములతో నిండినవాడా, ప్రహ్లాదునకు వరదుడా, భవరోగసంహరణుడా, ధృఢమైనవాడ! కేశవా, వాయుదేవునిచే కీర్తింపబడినవాడా, బ్రహ్మరుద్రాదులకు పూజ్యమైనవాడా, బలయుక్తుడా, సుందరమైన శ్రీవేంకటాచలము నివాసముగా గలవాడా!, సంపూర్ణమైన కరుణారసము గలవాడా, బలివంశమునకు కీర్తికారకుడా నీకు నమస్కారము.

**విశేషాంశము:-** ఈ కీర్తనలో "పవమాననుత!" అన్న అన్నమయ్య ప్రయోగం అతివిశిష్టమైనది. వేంకటాచలమాహాత్మ్యం (బ్రహ్మాండపురాణంలోని తృతీయ ధ్యాయం) లోని సన్నివేశం స్మరణీయమైనది.

ప్రధానాజ్జత్వ మాకాంక్షన్ । తపస్తేపే నగోత్తమ ।
దివ్యవర్ష సహస్రాన్తే । సహస్రభుజకన్దరః ॥
ఆవిరాసీత్తదాతస్మై । నీలామ్బుద సమప్రభః ।
వరం ప్రాదాత్ ప్రధానాజ్ఞం । భవే తి పురుషోత్తమః ॥

వాయుదేవుడు దివ్యమైన వేయి సంవత్సరాలు - లోకంలో ప్రధాన అంగంగా ఉండాలని కోరుతూ, వేంకటాచలంపై తపస్సు చేశాడు. నీలమేఘంలాంటి శ్రీనివాసస్వామి ప్రత్యక్షమై "ప్రధానాంగమై ఉండమ"ని వరాన్ని ప్రసాదించాడు. ఇంతటి పరిపూర్ణమైన ఫలాన్ని పొందిన వాయువుచే శ్రీనివాసస్వామి కీర్తించ బడినాడు.

## 10) సాళంగనాట

అయమేవ అయమేవ ఆదిపురుషః
జయకరం తమహం శరణం భజామి ॥పల్లవి॥

అయమేవఖలుపురా అవనిధరస్తు సోఽ
ప్యయమేవ వటదళాగ్రాధి శయనః
అయమేవ దశవిధైరవతార రూపైశ్చ
నయమార్గ భువిరక్షణం కరోతి ॥అయ॥

అయమేవ సతతం శ్రియః పతిర్దేవేషు
అయమేవ దుష్ట దైత్యాంతకస్తు
అయమేవ సకల భక్తాంతరేష్వాక్రమ్య
ప్రియభక్తపోషణం పిత్రువత్తనోతి ॥అయ॥

అయమేవ శ్రీవేంకటాద్రౌ విరాజతే
అయమేవ వరదోపియాచకానాం
అయమేవ వేదవేదాం తైశ్చ సూచితో
అయమేవ వైకుంఠాధీశ్వరస్తు ॥అయ॥

(సం.-4-కీ.313)

**అర్థం** :- అయమేవ = ఈతడే, అయమేవ = ఈతడే, ఆదిపురుషః = ఆదిపురుషుడు, తం = అతనిని, అహం = నేను, శరణం = శరణుపొంది, భజామి= సేవించుచున్నాను.

పురా = పూర్వము, అవని ధరః = భూమిని ధరించినవాడు, అయమేవ ఖలు = ఈతడొక్కడే కదా! వటదళాగ్రాధిశయనః = మఱ్ఱియాకు మీద శయనించిన, సోపితు = ఆతడు కూడ, అయమేవ = ఈతడే, దశవిధైరవతార రూపైః = దశావతారాల రూపములతో, భువి = భూమియందు, నయమార్గరక్షణం చ = ధర్మమార్గ రక్షణమునుకూడ, కరోతి = చేయుచున్నాడు.

దేవేషు = దేవతలలో, సతతం = శాశ్వతముగా, శ్రియఃపతిః = లక్ష్మీ నాథుడై, అయమేవ = ఈతడే, దుష్టదైత్యాంతకస్తు = దుష్టులయిన రాక్షసులను చంపిన వాడు, అయమేవ = ఈతడే, అయమేవ = ఈతడే, సకలభూత = సకల ప్రాణుల యొక్క, అంతరేషు = అంతరంగములలో, ఆక్రమ్య = ఆక్రమించుకొని, పిత్రువత్ = తండ్రిలా, ప్రియభక్తపోషణం = ప్రియభక్తుల యొక్క పోషణమును, తనోతి = నిర్వహించును.

అయమేవ = ఈతడే, శ్రీవేంకటాద్రౌ = శ్రీవేంకటాద్రిపై, విరాజతే = కొలువై ఉన్నాడు, అయమేవ= ఈతడే, యాచకానాం అపి = అర్థిజనములకు కూడా, వరదః = వరములనిచ్చుచున్నవాడు, అయమేవ = ఈతడే, వేదవేదాంతైశ్చ = వేదములచే ఉపనిషత్తులందు, సూచితః = సూచింపబడినాడు, వైకుంఠాధీశ్వరస్తు= శ్రీవైకుంఠపదాధీశ్వరుకూడా, అయమేవ = ఈతడే,

**తాత్పర్యం** : ఈతడే ఆదిపురుషుడు! జయశీలుడైన శ్రీనివాసుని ఆశ్రయించి, నేను సేవిస్తాను.

పూర్వము తన కోరపై భూదేవిని ధరించిన వాడీతడే! సృష్ట్యాదిలో మఱ్ఱియాకు మీద శయనించినవాడు కూడా ఈతడే! పదివిధములయిన అవతార రూపములతో భూమిపై ధర్మమార్గరక్షణము చేస్తున్నది కూడ ఈతడే.

సకలదేవతలలో లక్ష్మీపతియైనవాడీతడే, దుష్ట రాక్షసులను సంహరించువా డీతడే, ఈతడే సకలభూతముల అంతరంగములను ఆక్రమించికొని ప్రియ భక్తులను తండ్రివలె పోషించుచున్నాడు.

వేంకటాద్రిపై కొలువై ఉన్నాడు. ఆశ్రితులకు సకల సంపదలనూ ప్రసాదించువాడీతడే. సకల వేదాంతములలో సూచింపబడిన వాడీతడే. శ్రీవైకుంఠ పదమునకు అధీశ్వరుడీతడే.

## 11. ధన్నాసి

ఏవం దర్శయసి హితమతిరివ
కేవలం తే ప్రియసఖీవా తులసీ ॥పల్లవి॥

ఘటిత మృగమద మృత్తికా స్థాపకం
పటు శరీరే తే ప్రబలయతి
కుటిలతద్ఘనభారకుచ విలగ్నం వా
పిటర స్థలే మృత్ప్రీతా తులసీ ॥ ఏవం ॥

లలిత నవ ఘర్మలీలా విలసనో -
జ్జ్వలనం తవ తనుం వంచయతి
జల విమలకేలీవశా సతతం
ఆలీక ఘర్మాంచిత విహారా తులసీ ॥ ఏవం ॥

సరస నఖచంద్రలేశాస్తే సదా
పరమ లావణ్యం పాలయతి
తిరువేంకటేశ తత్కరుణా గుణా వా
వరరూప నవచంద్రవదనా తులసీ ॥ ఏవం ॥

(సంపు-5-కీర్తన-167)

హితమతిరివ = నాకు హితాన్ని చేకూర్చేవాడిలా, ఏవం దర్శయసి = ఇలా చూపిస్తున్నావు, తే = నీకు, తులసీ =శంఖచూడుని పత్నియైన తులసియే (తులసి మొక్క), ప్రియసఖీవా = ప్రియురాలిగా ఉన్నది. అందుకే-

కుటిలతద్ఘనభారకుచవిలగ్నంవా = అందమైన, పెద్దవైన పాలిండ్ల యందు లగ్నమగునట్లు, పిటరస్థలే = తవ్వుకోల (చిన్నరూపంలో ఉండే గునపం) యందు, మృత్ప్రీలా = మట్టిని ఇష్టంగా కలది తులసి, ఘటిక మృగ మృత్తికాస్థాపకం = కూర్చబడిన కస్తూరి అనే మృత్తికనే, తిలకంగా ధరించిన, తే = నీయొక్క, పటుశరీరే = అందమైన శరీరమందు, ప్రబలయతి = ఎక్కువగా కనిపిస్తున్నది.

జలవిమలకేళీవశ = స్వచ్ఛమైన జలమందు క్రీడలలో పరవశించిన, ఆలీక ఘర్మాంచితవిహార = తుమ్మెదల యొక్క స్వేదజలమందు విహరించిన, తులసీ = తులసి, తవ = నీయొక్క, తనుం = శరీరాన్ని, లలితనవఘర్మలీలా విలసనోజ్వలం = సుందరమైన ఆలింగనం చేత వచ్చిన స్వేద బిందువులచేత బాగుగా ప్రకాశిస్తున్నట్లుగా, వంచయంతి = మోసగిస్తున్నది.

తిరువేంకటేశ = వేంకటాచలపతీ!, కరుణాగుణావా = కరుణాది గుణములు కలవాడా! నవరూప చంద్రవదన = చక్కని రూపము గల చంద్రుని వంటి మోముగల, తత్ = ఆ, తులసి = తులసి, సరసనఖచంద్రలేశాః = రసభరితమైన నఖక్షతాలుకల, తే = నీయొక్క, లావణ్యం = సౌందర్యాన్ని, పరమ= గొప్పగా, పాలయతి = పాలించుచున్నది.

**తాత్పర్యము :** శ్రీవారి ప్రేయసి తులసీదేవియొక్క వైభవాన్ని ఆవిష్కరిస్తున్న కీర్తన ఇది.

నాకు హితాన్ని చేకూర్చేవాడిలా కనిపించినా, నీకు తులసీదేవియే ప్రియురాలిగా ఉన్నది. అందమైన, ఎత్తైన పయ్యెదల యందు లగ్నమైనట్లు, తవ్వుకోల (చిన్నరూపంలో ఉండే గునపం) పై మట్టిని ఇష్టంగా కలది తులసి. ఆమెలా నీవుకూడా కస్తూరి అనే మృత్తికనే తిలకంగా ధరిస్తున్నావు. నీ అందమైన శరీరంపై కూడా ఆ కస్తూరి విరాజిల్లుతున్నది. స్వచ్ఛమైన జలక్రీడలలో పరవశించిన తుమ్మెదల స్వేదజలంలో విహరించినది తులసి. ఆ తులసి నీ శరీరంపై ఆలింగనం చేత కలిగే స్వేదబిందువులను ప్రకాశిస్తున్నట్లుగా మోసగించి, ఆలింగనం చేసుకొంటున్నది. (స్వామికి చెమటవల్ల ఇబ్బంది కలుగకూడదని తులసిని వేస్తారన్న సంప్రదాయాన్ని గుర్తుచేసుకోవాలి. - "తమిరేగ గోపికలు తామరల వేసేరు చెమటార మంచి తులసిని వేసేరు, అమర శ్రీవేంకటేశ అలమేలుమంగ నీకు, మమతల పన్నీటితో చేమంతులవేసేరు" - అన్నమయ్య) ఓ! వేంకటపతీ! కరుణాది గుణములను కలవాడా! చంద్రునివంటి మోముకల అందమైన స్వామీ! ఆ తులసి రసభరితమైన నఖక్షతాలు కనబడకుండా చేసి నీ సౌందర్యాన్ని చక్కగా పాలిస్తున్నది.

**విశేషాంశం :** జలంధరుడనే రాక్షసుడి భార్య తులసి. ఆమె మహాపతివ్రత. అందువల్ల ఆరాక్షసుడు దేవతలకు కొఱుకుడు పడలేదు. శ్రీహరి జలంధరుడి రూపం దాల్చి, ఆమె పాతివ్రత్యాన్ని లోకహితంకోసం కొల్లగొట్టాడు. ఈకథ దేవీభాగవతంలోది. కొన్ని పురాణాలలో ఆ రాక్షసుడిపేరు శంఖచూడుడని ఉన్నది. వృక్షరూపంలో వున్న తులసి స్త్రీలచేత ఎల్లప్పుడూ పూజింపబడుతుంది. ద్వాపర యుగంలో కొందరు గోపికలు తులసిని విష్ణువిరహిణిగా దర్శించి, తమ విహరవేదనను ఆమెతో పంచుకున్నారు. ఈ కీర్తనలో అలమేలుమంగమ్మ

శ్రీవారిని అధిక్షేపిస్తున్నది. తొలి చరణంలో మట్టితో ఉన్న తులసిరూపం కస్తూరితో వున్నట్లుగా తలపిస్తుంది. అందువల్ల శ్రీహరి ఆలింగనంతో తులసిపై వున్న మట్టి - కస్తూరి అన్నభ్రాంతి కలిగిస్తుంది. రెండవ చరణంలో అభిషేకంలో చల్లే నీరు, తులసిపై స్వేదబిందువులుగా భాసిల్లుతున్నాయి. పూజకోసం తులసీదళాలు కోయడం వల్ల తులసికి అందం వస్తుంది. పైగా తులసికూడా బాగా పెరుగుతుంది. రతిక్రీడలో అలసిన బాలవనితలా చాలాఅందంగా ఉంటుదన్న కవి సమయాన్ని గుర్తుకు తెచ్చాడు.

## 12) సామంతం

ఏవం శ్రుతిమత మిదమేవ త
ద్భావయితు మతఃపరం నాస్తి ॥పల్లవి॥

అతుల జన్మభోగాసక్తానాం
హితవైభవసుఖ మిదమేవ
సతతం శ్రీహరిసంకీర్తనం త
ద్వ్యతిరిక్తసుఖం వక్తుం నాస్తి ॥ఏవం॥

బహుళ మరణ పరిభవ చిత్తానా
మిహపరసాధన మిదమేవ
అహిశయన మనోహరసేవా త
ద్విహరణం వినా విధిరపినాస్తి ॥ఏవం॥

సంసారదురితజాడ్యపరాణాం
హింసావిరహిత మిదమేవ
కంసాంతక వేంకటగిరిపతేః ప్ర
శంసైవ పశ్చాదిహనాస్తి ॥ఏవం॥

(సం.-1-కీ-4)

**అర్థము:-** ఏవం = ఈ రీతిగా, తత్ ప్రసిద్ధమైన, శ్రుతిమతం = వేదమతం, ఇదమేవ = ఇదియే, భావయితుం= భావించుటకు, అతఃపరం = శ్రేష్ఠమైనది, నాస్తి = లేదు.

అతుల = సాటిలేని, జన్మభోగ = జన్మభోగములందు, ఆసక్తానాం = ఇష్టముకలవారికి, హితవైభవసుఖం= హితము, వైభవము, సుఖము, ఇవే అని, సతతం = ఎల్లప్పుడు, ఇదమేవ = ఇదియే, శ్రీహరి = శ్రీహరియొక్క, సంకీర్తనం = సంకీర్తనము, తద్వ్యతిరిక్తసుఖం = దానికంటే మించిన సుఖము, వక్తుం = చెప్పుటకు, నాస్తి = లేదు.

బహుళ = అనేకసార్లు, మరణపరిభవ = మరణమనే అవమానమును పొందిన, చిత్తానాం = చిత్తముకలవారికి, ఇహపర = ఐహికాముష్మిక ఫలములకు, సాధనం = సాధనము, ఇదమేవ = ఇదియేను,

అహిశయన = శేషశయునునియొక్క, మనోహర = మనస్సును ఆకట్టుకొనే, సేవా = సేవను, తత్ = ఆ సేవలోనే, విహరణం వినా = మనస్సు విచారించుటకంటే, విధిరపి = కర్తవ్యము కూడ, నాస్తి = లేదు.

సంసారదురిత = సంసార పాపం వల్ల ఏర్పడిన, జాడ్య = జడత్వములో, పరాణాం = మునిగితేలుతున్న వారికి, హింసావిరహితం = హింసలేనిది, ఇద మేవ = ఇది ఒక్కటే, కంసాంతక = కంసాంతకుడైన, వేంకటగిరిపతేః = శ్రీవేంకటగిరినాథుని యొక్క, ప్రశంసైవ = సంకీర్తనయే, ఇహ = ఈ లోకమునందు, పశ్చాత్ = వెనుక (మరొకలోకము), నాస్తి = లేదు.

**తాత్పర్యము :** ఈ కీర్తనలో అన్నమయ్య శ్రీవారిని సంకీర్తనచేత, సేవచేత, స్తోత్రం చేత సేవించడమే వేదం చెప్పిన మాట అని, ఈ దుఃఖమయ సంసారాన్ని దాటడానికి ఉత్తమ మార్గమని ప్రబోధిస్తున్నాడు.

శ్రేష్ఠమైన వేదమతం - అనేక పుట్టుకలు కలిగిన మానవులకు శేషశయనుడైన శ్రీవారి సంకీర్తనమే. నిజమైన మేలుగూర్చు ఐశ్వర్య సుఖాన్నిస్తుంది. సుఖాలయందు ఆసక్తికలవారికి సంకీర్తనామార్గము ఒక్కటే ఆశ్రయించతగినది.

మరణమనే మహాదుఃఖం కలవారికి ఈ సంసార పాపాలలో మునిగి తేలేవారికి కంసారిని సంకీర్తన చేయడమే ఉత్తమైన మార్గం. దానికన్న మరొక మేలైనత్రోవ లేదు.

**విశేషాంశం :** "సంకీర్తన" వైశిష్ట్యాన్ని, రమణీయంగా చాటిచెప్పిన అన్నమయ్య ఇది వేదవిహితమార్గమని సుస్పష్టంగా ఈ కీర్తనలో ప్రతిపాదించిన తీరు ఘనమైనది. ఉదా : విష్ణోర్నుకం వీర్యాణి ప్రోవాచమ్ - ఋగ్వేదం (1-514-1) (శ్రీహరి పరాక్రమ గాథలు కీర్తించ తలచాను.)

## 13. బౌళిరాగం

కందర్ప జనక! గరుడగమన!
నందగోపాత్మజ! నమో నమో! ॥పల్లవి॥

వారధిశయన! వామన! శ్రీధర!
నారసింహ! కృష్ణ! నమో నమో!
నీరజనాభ! నిగమగోచర!
నారాయణ! హరి! నమో నమో! ॥కందర్ప॥

పరమపురుష! భవవిమోచన!
వరద! వసుధావధూవర!
కరుణాకాంతా! కాళిందీ రమణ!
నరసఖ! శౌరీ! నమో నమో! ॥కందర్ప॥

దానవదమన! దామోదర! శశి
భాను నయన! బలభద్రానుజ!

దీనరక్షక! శ్రీ తిరువేంకటేశ!

నానాగుణమయ! నమో నమో!! ॥కందర్ప॥

(సం.4-కీ.-5-అనుబంధం)

**అర్థము:** కందర్పజనక = మన్మథుని కన్నతండ్రీ!, గరుడగమన = గరుడవాహనా!, నందగోపాత్మజ = నందగోపుని కుమారుడా!, నమో నమః = నమస్కారము.

వారధిశయన = సముద్రమునందు శయనించినవాడా!, వామన = వామన అవతారమెత్తినవాడా!, శ్రీధర = శ్రీదేవిని ధరించినవాడా!, నారసింహ = నరసింహుడా!, కృష్ణ = (1) కృష్ణుడనే పేరుగలవాడు, నల్లనివాడు, (2)కృషిశబ్దానికి భూమి అని అర్థము, 'ణ' వర్ణానికి ఆనందమని అర్థము. కనుక భూమియందు అవతరించి లీలారసము చేత ఆనందించువాడని (భూలోకాన్ని ఆనందింప జేయు వాడని, అర్థము), నమో నమః = నమస్కారము, నీరజనాభా = పద్మము నాభియందు గలవాడా!, నిగమగోచర = వేదములయందు గోచరించువాడా!, నారాయణః = సర్వాత్మకుడు!, హరిః = స్మరించినవారి పాపాలను హరించువాడా!, నమో నమః = నమస్కారము.

పరమపురుష = పరమపురుషుడా!, భవవిమోచన = సంసారమును విడిపించువాడా!, వరద = వరములనుఇచ్చువాడా!, వసుధావధూవర = భూకాంతకు వరుడా!, కరుణాకాంత = కరుణయే కాంతగాక కలవాడా!, కాళిందీరమణ = కాళింది నదిని ఆనందింపజేయువాడా!, నరసఖ = అర్జునునకు ప్రాణసఖుడా!, శౌరీ = శూరుడంటే వసుదేవుడు. అతనికి పుత్రుడు శ్రీకృష్ణుడు. (శు = గతౌ) లేదా భక్తులను పొందువాడు అని అర్థం!, నమో నమః= నమస్కారము!

దానవ దమన = దానవులను సంహరించువాడా!, దామోదర = కవ్వపుత్రాడు ఉదరమునందుగలవాడా! (యశోదక్రవ్వపుత్రాటితో ఱోటికి వేసి పొట్టను కట్టినది) శశిభానునయన = సూర్యచంద్రులు కన్నులుగా కలవాడా!, బలభద్రానుజ = బలరాముని తమ్ముడా!, దీనరక్షక = దీనజనులను రక్షించువాడా!, శ్రీతిరువేంకటేశ = శ్రీతిరు వేంకటేశ్వరా!, నానాగుణమయ = నానాగుణమయమైన స్వరూపముగలవాడా!, నమో నమః = నమస్కారము! నమస్కారము!

**తాత్పర్యము** :- మన్మథుని కన్నతండ్రీ! గరుడవాహనుడా! నందగోపునికుమారుడా! నమస్కారము. సముద్రమందు శయనించినవాడా! వామనా! శ్రీధరుడా! నారసింహుడా! శ్రీకృష్ణా! నమస్కారము! పద్మనాభుడా! నిగమగోచరుడా! నారాయణుడా! శ్రీహరీ! నమస్కారము. పరమపురుషుడా! సంసారవిమోచనుడా! వరదుడా! భూదేవీనాథుడా! శ్రీకృష్ణా! కరుణాకాంతుడా! కాళిందీరమణా! నరసఖుడా! శ్రీకృష్ణా నమస్కారము! రాక్షస సంహారం చేసేవాడా! దామోదరుడా! సూర్యచంద్రులు కన్నులుగా గలవాడా! బలరాముని తమ్ముడా! దీనజనరక్షకుడా! శ్రీతిరువేంకటాధీశ! అనేక కల్యాణగుణమయుడా! నమస్కారము!

## 14) కన్నడగౌళ

కరుణానిధిం గదాధరం!
శరణాగతవత్సలం భజే! ॥పల్లవి॥

శుకవరదం కౌస్తుభాభరణం
అకారణ ప్రియ మనేకదం
సకల రక్షకం జయాధికం సే
వకపాలకమేవం భజే

ఉరగశయనం మహోజ్జ్వలం తం ॥ కరుణా ॥
గరుడారూఢం కమనీయం
పరమపదేశం పరమంభవ్యం
హరిం దనుజభయదం భజే ॥ కరుణా ॥

లంకాహరణం లక్ష్మీరమణం
పంకజ సంభవ భవప్రియం
వేంకటేశం వేదనిలయం శు
భాంకం లోకమయం భజే ॥ కరుణా ॥

(సం-1-కీ.342)

**అర్థము:-** కరుణానిధిం = కరుణకు గనివంటివాడు, శరణాగతవత్సలం = ఆశ్రయించినవారిపట్ల దయగలవాడు, గదాధరం = గదాధరుని, భజే = సేవించెదను.

శుకవరదం = శ్రీశుకయోగిని కటాక్షించినవాడు, కౌస్తుభాభరణం = కౌస్తుభమణి ఆభరణముగాకలవాడును, అకారణప్రియం = కారణము లేకనే ప్రీతికలవాడు, అనేకదం = అనేక ఫలములను ఇచ్చువాడును, సకలరక్షకం = అన్నిలోకాలకు సంరక్షకుడు, జయాధికం = జయాధికుడు, సేవకపాలకం = తన సేవకులను పాలించువాడు, ఏవం = ఈరీతిగా, భజే = ఆ స్వామిని సేవింతును.

ఉరగశయనం = శేషశయనుడును, మహోజ్జ్వలం = మిక్కిలి కాంతులవాడు, గరుడారూఢం = గరుత్మంతుని అధిరోహించినవాడు, కమనీయం = సుందరుడును, పరమపదేశం = పరమపదనాథుడు, దనుజ భయదం = రాక్షసులకు భయంకరుడు, తం హరిం = ఆ శ్రీహరిని, భజే = సేవింతును.

లంకాహరణం = లంకను హరించినవాడు, లక్ష్మీరమణం = లక్ష్మీదేవికి రమణుడు, పంకజసంభవ = బ్రహ్మకు, భవ = శివునకు, ప్రియం = ఇష్టుడు, వేదనిలయం = వేద నిలయుడును, శుభాంకం = శుభప్రదమైన నిజచిహ్నములు గలవాడు, లోకమయం = లోకమయుడు అయిన, వేంకటేశం = వేంకటేశ్వరుని, భజే = సేవింతును.

**తాత్పర్యము** : కరుణకు గనివంటివాడు, శరణాగత వత్సలుడైన, గదాధరుని సేవింతును.

శ్రీశుకయోగిని అనుగ్రహించినవాడు, కౌస్తుభమణి ఆభరణముగా గలవాడును, అహేతుకంగా ప్రేమించువాడు, అనేక ఫలములను ఇచ్చువాడును, సమస్తానికి సంరక్షకుడును, జయాధికుడును, నిజసేవకులను పాలించువాడైన స్వామిని సేవిస్తాను.

శేషశయనుడు, మహోజ్జ్వలుడు, గరుడారూఢుడు, సుందరుడు, పరమపద నాధుడు, పరముడు, శుభప్రదుడు, రాక్షసభయంకరుడు అయిన ఆ శ్రీహరిని సేవిస్తాను.

లంకను హరించినవాడు, లక్ష్మీరమణుడు, బ్రహ్మకు, శంకరునికి ప్రియుడు, వేదమయుడు, శుభప్రదములయిన నిజచిహ్నములుగలవాడు, లోకమయుడు అయిన శ్రీవేంకటేశ్వరుని సేవిస్తాను.

## 15. ఆహిరి

కరేణ కిం మాం గృహీతుం తే
హరే ఫణిశయ్యా సంభోగ ॥పల్లవి॥

జలే తవ సంచరణ మిహాధః
స్థలే భవనం తవ సంతతం
బలే రూప ప్రకటన మతులా
చలే స్థానం చల చల రమణా ॥ కరే ॥

పదే భువన ప్రామాణ్యం తవ
హ్రదే ప్రచురవిహరణ మిదం
ముదేమునీనాం మోహనం తనుం
మదే తవ నర్మ చ మాం విస్పృజ ॥ కరే ॥

స్మరే విజయ స్తవ విమలతురగ
పురే రతిసంకుల రచన
పురే తవ విస్ఫురణం వేంకట
గిరేఃపతే తే ఖేలాఘటిత ॥ కరే ॥

సంపుటం-6-171

చలరమణ= సంసారలోని అందరినీ ఆనందింపజేయువాడా!, హరే = ఓ! శ్రీహరీ!, ఫణి శయ్యా సంభోగ = శేషశాయీ!, తే = నీ యొక్క, కరేణ =చేతితో, మాం = నన్ను, గృహీతం = పట్టకొనుటకై, కిం = వచ్చావుకదా!

ఇహ = ఇక్కడ, జలే = నీటిలో, తవ = నీయొక్క, సంచరణం = చరించుట, సంతతం = ఎల్లప్పుడూ, తవ = నీయొక్క, అధః స్థలే = లోపల, భవనం = నివాసము, బలే = శౌర్యములో, రూపప్రకటనం

= నీలీలను చూపించుట, అతుల = పోలికలేనిది, చలే = చలనంకలిగించే వాటిలో, స్థానం = స్థానాన్ని, చల చల = తెలియజేయి.

పదే = నీ మూడడుగుల లోనే, భువన ప్రామాణ్యం = ముల్లోకాలను కొలచడం కనిపిస్తున్నది, తవ = నీయొక్క, హ్రదే = రాజుల నెత్తురు మడుగులో, ఇదం = ఈ ప్రచుర విహరణం వీరోచితంగా విహరించుట కనిపిస్తున్నది, మునీనాం ముదే = మునుల యొక్క సంతోషం కోసం, మోహనం = చక్కని రూపంగల, తనుం = శరీరాన్ని ధరించావు, తవ = నీయొక్క, మదే = మధుసేవనం చేత వచ్చిన మిదమందు, నర్మచ = సుఖాన్ని సంపాదించుటకోసం, మాం = నన్ను, విస్రుజ = విడిచిపెట్టు, తవ = నీయొక్క, స్మరే = త్రిపుర యువతులతో విహరించుట అనే కామలీలలందు, విజయ = విజయము ఉన్నది, విమల తురగ ఖురే = కల్కిరూపంలో విహరిస్తున్న నీయొక్క వామనమైన గుర్రపు డెక్కల యందు, రతిసంకుల రచనపురే = భక్తి భావాన్ని అంకురింప జేసేటువంటి నీలీలా నగరంలో, తవ = నీయొక్క, విస్ఫురణం = అవతారస్ఫూర్తి గోచరిస్తున్నది, హే వేంకటగిరిపతే = ఓ వేంకటాచలపతీ, తే = నీయొక్క, క్రీడా = లీల, ఘటిత = చేయబడినది.

**తాత్పర్యం** : ఓ! శ్రీనివాసా! శేషశాయీ! సృష్టిలోని అందరినీ ఆనందింప చేయువాడా! నన్ను పట్టుకోవడానికే వచ్చావుకదా!

ఇక్కడ నీటిలోపలే నీవు చరించుట ఎల్లప్పుడూ నీ నివాసం చేసుకొనుట, శౌర్యంతీ నీలీలను చూపించడం. పోలికలేనిది. వాటిలో చలనం కలిగించే స్థానాన్ని వివరించు. నీవు మూడడుగులతోనే ముల్లోకాలను కొలిచావు. రాజుల నెత్తురు మడుగులో వీరోచితంగా విహరించావు. మునుల సంతోషానికై చక్కనిరూపంగల శరీరాన్ని దాల్చావు. మధుసేవనంతో మదాన్ని కలిగి, సుఖానికై నన్ను పట్టుకోక విడిచిపెట్టు. నీకు యువతులతో విహారమనే విజయలీలలో ప్రావీణ్యం ఉన్నది. నీవాహనమైన గుర్రపుడెక్కలలో భక్తి భావాన్ని అంకురింపజేసే శక్తి ఉన్నది. నీలాలా నగరం అవతారస్ఫూర్తి ఉన్నది. ఓ వేంకటాచలపతీ నీ లీలలు మనోహరమైనవి.

**విశేషాంశం** : విషమపద యతిప్రాసలతో ఉన్న ఈ కీర్తనలో దశావతారాలను చాలా నిగూఢమైన ప్రతిభతో వర్ణించడం గమనార్హం. మొదటి చరణంలో జలసంచరణం - మత్స్యావతారాన్ని, లోపలే నీ నివాసమనుటలో - కూర్మావతారాన్ని, భూమి ఉద్ధరణను పేర్కొనడంతో - వరాహావతారాన్ని, శౌర్యంతో కూడిన సాటిలేని రూపప్రకటన చెప్పడంతో -శ్రీ నృసింహావతారాన్ని, మూడడుగులతోనే ముల్లోకాలు కొలిచావనడంతో - వామనావతారాన్ని, మడుగులో వీరోచిత సింహమనడంతో - పరశురామావతారాన్ని, మునులకు సంతోషాన్ని కలిగించాడనడంతో - రామావతారాన్ని, మధుసేవనంతో వచ్చిన మదసుఖాన్ని ప్రస్తావించడంతో - బలరామావతారాన్ని, త్రిపుర యువతులతో విహరించుటనే కామలీల లందు విజయము చెప్పి - బుద్ధావతారాన్ని, విమలమైన గుర్రపుడెక్కలందు భక్తిభావపు అంకురాలను చెప్పడంతో - కల్కిఅవతారాన్ని, పేర్కొనడం జరిగింది.

ఇక్కడ దశావతారాలలో శ్రీకృష్ణుని ప్రస్తావన లేదు. జయదేవునిలా అన్నమయ్య కూడా శ్రీకృష్ణునిది పరిపూర్ణావతారమని విశ్వసించినట్లు స్పష్టమవు తున్నది.

## 16) శుద్ధవసంతరాగం

కిం కరిష్యామి కిం కరోమి బహుళ
శంకా సమాధాన జాడ్యం వహామి ॥పల్లవి॥

నారాయణం జగన్నాథం త్రిలోకైక
పారాయణం భక్తపావనం
దూరీకరోమ్యహం దురితదూరేణ సం
సారసాగర మగ్న చంచలత్వేన ॥కింకరిష్యామి॥

తిరువేంకటాచలాధీశ్వరం కరిరాజ
వరదం శరణాగత వత్సలం
పరమపురుషం కృపాభరణం న భజామి
మరణ భయదేహాభిమానం వహామి ॥కింకరిష్యామి॥

(సం-1-265 కీర్తన)

**అర్థము :** కింకరిష్యామి = ఏమి చెయ్యగలను? కింకరోమి = ఏమి చేయుదును? బహుళ = అనేకములైన, శంకా = సంశయములకు, అసమాధాన = సమాధానము కుదరనందు వలన కలిగిన, జాడ్యం = జడత్వమును, వహామి = పొందుతున్నాను.

దురితదూరేణ = పాపములచేతగలిగిన దూరముచేత, సంసారసాగర = సంసారసముద్రమునందు, మగ్న = మునిగియున్న, చంచలత్వేన = చాంచల్యము చేత, భక్తపావనం = భక్తులను పవిత్రీకరించునట్టివాడును, త్రిలోక = మూడు లోకములకు, ఏకపారాయణం = ఒకే తీరమునందున్నవానిని, జగన్నాథం = సమస్త జగన్నాథుడైన, నారాయణం = శ్రీనివాసుని, నభజామి = సేవించుట లేదు. దూరీకరోమి = దూరస్థితునిగా చేసుకొంటున్నాను.

కరిరాజవరదం = గజేంద్రునికాపాడినవాడును, శరణాగతవత్సలం = శరణాగతులపట్ల వాత్సల్యముగలవాడు, కృపాభరణం = కృపం ఆభరణముగా గలవాడును, పరమపురుషం = పరమపురుషుడు తిరువేంకటాచలాధీశ్వరం = శ్రీవేంకటా చలాధీశ్వరుడైన స్వామిని, నభజామి = సేవించుట లేదు, మరణభయ దేహాభిమానం = మరణభయ కళంకితమైన దేహమునందు అభిమానమును, వహామి = వహించుచున్నాను.

**తాత్పర్యము :** ఏమి చేయగలను? ఏమి చేయుదును? అసంఖ్యాకమైన సందేహాలకు సమాధానము కుదరనందువలన గలిగిన జడత్వమును మోయు చున్నాను. నేనేమి చేయగలను? ఏమి చేయుదును? పాపములచేత ఏర్పడిన దూరముచేత, సంసారంలో నిమగ్నమవడం వల్ల కలిగిన మనశ్చాంచల్యము చేత శ్రీమన్నారాయణుని దూరము చేసుకొంటున్నాను. మూడు లోకములకు ఏకశరణ్యుడు, భక్తపావనుడైన సకల జగన్నాథుని సేవించుట లేదు. నేనేమి చెయ్య గలను? ఏమి చేయుదును? కరిరాజవరదుడు,

శరణాగతవత్సలుడు, కృపాభరణుడు, పరమ పురుషుడైన శ్రీవేంకటాచలాధీశ్వరుని సేవించుట లేదు, మరణంతో మట్టిపాలయ్యే, యీ దేహముపై అభిమానము కలిగి ఉన్నాను.

## 17. ముఖారి రాగం

కిన్నజానేఽహం కేశవాత్పర మహో!
సన్నుతిం కరోమి మహీభరణాయ తస్మై ॥పల్లవి॥

వేదాంత వేద్యాయ విశ్వరూపాయ నమో
ఆదిమధ్యాంత రహితాధికాయ
భేదాయ పునరప్యభేదాయ నమో నమో
నాద ప్రియాయ మమనాథాయ తస్మై ॥కిన్న॥

పరమ పురుషాయ భవబంధహరణాయ నమో
నిరుపమానందాయ నిత్యాయ
దురితదూరాయ కలిదోష విధ్వస్తాయ
హరయేచ్యుతాయ మమ ఆత్మనే తస్మై ॥కిన్న॥

కాలాత్మకాయ నిజకరుణాకరాయ నమో
శ్రీలలామా కుచాశ్రిత గుణాయ
హేలాంక! శ్రీవేంకటేశాయ నమో నమో
పాలితాఖిల మమాభరణాయ తస్మై ॥కిన్న॥

(సంపుటం-2-కీ-83)

**అర్థము** : కేశవాత్పరమహో = కేశవుని కంటే పరమైనదానిని, కింనజానేహం = ఏమియు కూడా నేనెఱుగను, తస్మై = అట్టి, పాలిత = పాలింపబడిన, అఖిల = సమస్తమైన, మహీభరణాయ = భూమిని భరించువాని కొఱకు, నమః = నమస్కారము, సన్నుతింకరోమి = ప్రార్థన జేయుచున్నాను.

వేదాంత వేద్యాయ = వేదాంతముల (ఉపనిషత్తులు) చేత తెలియదగినవాని కొఱకు, విశ్వరూపాయ= విశ్వమే తన రూపముగా గలవాని కొఱకు, నమోనమః = నమస్కారములర్పిస్తున్నాను, ఆదిమధ్యాంతరహిత= ఆదిమధ్యాంతములు లేని, అధికాయ = గొప్పవాడి కొఱకు, భేదాయ = భేదస్వరూపుని కొఱకు, పునరపి = మఱలమఱియును, అభేదాయ = అభేదస్వరూపుని కొఱకు, నమో నమః = నమస్కారము, నాదప్రియాయ= నాదప్రియుడైన, మమనాథాయ తస్మై = నానాథుని కొఱకు నమస్కారము.

పరమపురుషాయ = పరమ పురుషుని కొఱకు, భవబంధహరణాయ = సంసారబంధములను తొలగించునట్టి వాని కొఱకు, నమః = నమస్కారము, దురిత దూరాయ = పాపములను పోగొట్టు, కలిదోష విధ్వస్తాయ = కలిదోష హరణుడునూ అయిన, హరయేచ్యుతాయ = నాశములేని శ్రీహరి కొఱకు, మమ ఆత్మనే తస్మై = నా ఆత్మస్థానీయు డైన స్వామి కొఱకై, నమః = నమస్కరిస్తున్నాను.

కాలాత్మకాయ = కాలస్వరూపునికొఱకు, నమః = నమస్కారము, నిజకరుణాకరాయ = నిజ = నిజస్వరూపమైన, కరుణ = దయకు, ఆకరాయ = గనియైనవాని కొఱకు, నమః = నమస్కారము. శ్రీలలామా= శ్రీ అనెడి వనితాలలామ యొక్క, కుచాశ్రిత = పాలిండ్లను ఆశ్రయించుటయే, గుణాయ = నిజగుణముగాకలవాని కొఱకు, హేలాంక = విలాసములే చిహ్నములుగాకల, శ్రీవేంకటేశాయ = శ్రీవేంకటేశ్వరుని కొఱకు, నమః = నమస్కరిస్తున్నాను. పాలితాఖిల = పాలింపబడిన అఖిలము కలిగినట్టియును, మమ = నాకు, ఆభరణాయ = అన్నివిధములా రక్షించువాడగు, తస్మై = ఆ వేంకటేశునకు, నమః = నమస్కారము.

(కింనజానే - "కిమపినజానే" అని 'అపి'శబ్దమున స్వీకరించిన, చక్కని అర్థబోధ ఏర్పడును).

**తాత్పర్యము:** వేదాంతముల చేత తెలియదగిన పరబ్రహ్మ స్వరూపము కొఱకు, విశ్వమే తన రూపముగా గల వాని కొఱకు, ఆదిమధ్యాంతములులేని అధికుని కొఱకు, భేద స్వరూపుడు మఱియు అభేద స్వరూపుని కొఱకు, నాదప్రియుడైన నా నాథుని కొఱకు నా నమస్కారము. పరమ పురుషుడు, సంసారబంధములను తొలగించునట్టివాడు, సమస్తపాపములను పోగొట్టే కలిదోషహరణుడు, అచ్యుతుడు నా ఆత్మస్థానీయుడైన హరి కొఱకై నమస్కరిస్తున్నాను. కాలస్వరూపునకు, నిజమైన కరుణకు నిధానమైనవానికొఱకు నమస్కారము. శ్రీదేవి యొక్క పాలిండ్లపై తన దృష్టి కలిగిన స్వభావముగాను, విలాసములే చిహ్నములుగాను కలిగిఉన్న వేంకటేశ్వరునకు నమస్కారము. సమస్త భూమిని వహిస్తున్న కేశవునిచే స్తోత్రముచేయుచున్నాను. కేశవుని కంటే పరమైన దానిని ఏమియు ఎఱుగను.

## 18. రామక్రియ

కేవల కృష్ణావతార కేశవా
దేవదేవ లోకనాథ దివ్యదేహ కేశవా ॥పల్లవి॥

కిరణార్కకోటితేజ కేశవా
హరి లక్ష్మీనాయక యాదికేశవ
గిరిరాజసుతానుత కేశవ నమో
శరధిగంభీరశాయి జయజయ కేశవా ॥కేవల॥

కేకిపింఛావతంస! కేశవ!
శ్రీకర! గుణాభిరామ! చెన్నకేశవ!
కేకి వాహనవరద! కేశవా!
పాకశాసనవంద్య భళిభళికేశవా! ॥కేవల॥

కింకరబ్రహ్మాదిగణ కేశవ నా -
మాంకిత శ్రీవేంకటాద్రి కేశవ

కుంకుమాంకవక్ష వెలిగోట కేశవ సర్వ-

శంకాహరణ నమో జగదేక కేశవా! ॥కేవల॥

4-సంపుటం-కీ-391

కేవల = నిర్వికార స్వరూపుడా!, కృష్ణావతార! = శ్రీకృష్ణుడిగా అవతరించినవాడా!, కేశవా! = కేశవుడా!, దేవదేవ = దేవతా శ్రేష్ఠుడా!, లోకనాథ = లోకమున నాథుడైనవాడా!, దివ్య దేహ = దివ్యమైన శరీరము కలవాడా! కేశవా = కేశవ స్వరూపుడా! (నమస్కారము)

కిరణార్క కోటి తేజ = కోటి సూర్యకిరణముల తేజాన్ని కలవాడా!, కేశవా!= కేశవ స్వరూపుడా!, హరి = శ్రీహరీ!, లక్ష్మీనాయక! = లక్ష్మీదేవికి భర్తయైనవాడా!, ఆదికేశవా= ఆదినారాయణుడా!, నమో = నమస్కారము, శరధి గంభీర శాయి = సముద్రంపై గంభీరుడవై శయనించువాడా! కేశవా = కేశవుడా!, జయ జయ = జయము, జయము.

కేకి పింఛావతంస = నెమిలి పింఛాన్ని ధరించినవాడా!, కేశవ = కేశవుడా!, శ్రీకర= లక్ష్మీ యుతుడా!, గుణాభిరామ = ఉత్తమగుణ శాలీ!, చెన్నకేశవ = చెన్నకేశవుడా!, కేకివాహన వరద = నెమలివాహనంగా చేసుకొన్న కుమారస్వామికి ప్రసన్నుడైనవాడా!, కేశవ=కేశవుడా! పాకశాసనవంద్య = బ్రహ్మచేత నమస్కరించ బడినవాడా!, కేశవ = కేశవ స్వామి, భళి భళి = జయము జయము.

కింకర బ్రహ్మాదిగణ = బ్రహ్మాదిగణాలను సేవకులుగా కలవాడా! కేశవ = కేశవుడా! నామాంకిత శ్రీవేంకటాద్రి కేశవ = ప్రసిద్ధమైన వేంకటాచలంపై శోభిల్లుతున్న కేశవుడా!, కుంకుమాంకిత వక్ష = కుంకుమాంకితమైన వక్షః స్థలంకలవాడా! వెలిగోట కేశవ = వెలిగోట కేశవుడా! సర్వశంకాహరణ కేశవ = అన్నిశంకలను తొలగించు కేశవ!, జగదేక కేశవ = జగదేక, వీరుడవైన కేశవుడా! (నమస్కారము).

**తాత్పర్యము:** నిర్వికార స్వరూపుడా! కృష్ణావతారుడా! కేశవస్వామీ! దేవతాశ్రేష్ఠుడవు, లోకమునకు నీవే నాథుడవు. దివ్యమైన శరీరము కలవాడవు, నీకు నమస్కారము. కోటి సూర్యకిరణముల తేజాన్ని కలవాడవు, లక్ష్మీదేవికి భర్తయైన వాడవు, ఆదినారాయణడవు, సముద్రముపై గంభీరముగా శయినించువాడవు, కేశవా! నీకు జయమగుగాక! నెమలిపింఛాన్ని ధరించినవాడవు, ఉత్తమగుణశాలివి. నెమలి వాహనంగా చేసుకొన్న కుమారస్వామికి ప్రసన్నుడవైన కేశవా! బ్రహ్మచేత నమస్కరించబడుస్వామీ! జయము. బ్రహ్మాదులను సేవకులుగా కలిగిన కేశవా! ప్రసిద్ధమైన వేంకటాచలంపై శోభిల్లుతున్నావు. కుంకుమాంకిత వక్షఃస్థలుడా! వెలిగోట కేశవా! అన్నిశంకలను తొలగించు కేశవా! జగదేకవీరా! నమస్కారము.

## 19. భౌళి

గరుడగమన గరుడధ్వజ

నరహరి నమోనమోనమో ॥పల్లవి॥

కమలాపతి కమలనాభా

కమలజజన్మ కారణక

కమలనయన కమలాప్తకుల
నమో నమో హరి నమో నమో ॥గరు॥

జలధిబంధన జలధిశయన
జలనిధిమధ్య జంతుకలిత!
జలధిజామాత! జలధిగంభీర
హలధర నమో హరి నమో ॥గరు॥

ఘనదివ్యరూప ఘనమహిమాంక
ఘనఘనా ఘనకాయవర్ణ
అనఘ శ్రీవేంకటాధిపతేహం
అనుపమ నమో హరి నమో ॥గురు॥

సంపుటం-2-కీ-391

**అర్థం :** గరుడగమన = గరుడని వాహనముగా కలవాడా!, గరుడధ్వజ = గరుడుని ధ్వజముగా కలవాడా!, నరహరి = నరసింహస్వామీ!, నమో నమః = నమస్కారము, కమలాపతి = లక్ష్మీనాథా!, కమలనాభా = పద్మనాభుడా!, కమలజ జన్మకారణక = బ్రహ్మదేవుని జన్మకు కారణమైనవాడా, కమలనయన = కమలముల వంటి కన్నులు కలవాడా!, కమలాప్తకుల = శ్రీరామభద్రుడై సూర్యకులములో ప్రభవించినవాడా!, నమో నమో = నమస్కారము, హరి = మహావిష్ణు స్వరూపమా! నమో నమః = నమస్కారము, జలధి బంధన = శ్రీరాముడివై సేతువు నిర్మింపజేసినవాడా!, జలధిశయన = సముద్రముపై శయనిస్తున్నవాడా!, జలనిధిమధ్య జంతు కలిత = జలనిధి మధ్యన శేషునితో కూడిన వాడా!, జలధి జామాత = సముద్రునికి అల్లుడైనవాడా!, జలధి గంభీర = సముద్ర గంభీరుడా!, హలధర = నాగలిని ఆయుధంగా ధరించిన బలరాముడా!, నమో హరి నమో = నమస్కారము విష్ణుస్వరూపుడా! నమస్కారము.

ఘన దివ్యరూప = గొప్ప దివ్య స్వరూపము కలవాడా!, ఘన మహిమాంక= గొప్పవైన మహిమలే చిహ్నముగా కలవాడా! ఘన ఘనా ఘన కామవర్ణ = వర్షాకాల సాంద్ర మేఘము వంటి శరీరము యొక్క కాంతికలవాడా!, అనఘ = సుందరమైన వాడా!, శ్రీ వేంకటాధిప = శ్రీ వేంకటగిరిపై నున్నవాడా!, అనుపమహరీ = సాటిలేని వాడా! మహావిష్ణుమూర్తీ! తే = నీకు, అహం = నేను, నమో నమః = నమస్కారమాచరిస్తున్నాను.

**భావం :** గరుడుని వాహనంగా, ధ్వజంగాకల నరసింహమూర్తీ! నమస్కారము. లక్ష్మీనాథుడా! పద్మమును బొడ్డుగా కలవాడా! నాభికమలంలో బ్రహ్మకు జన్మనిచ్చినవాడా! కమలమువంటి కన్నులవాడా! సూర్యకులంలో ప్రభవించిన శ్రీరామమూర్తీ నమస్కారము మహావిష్ణు స్వరూపుడా! నమస్కారము. శ్రీరాముడివై సముద్రముపై సేతువుని నిర్మించినవాడా! సముద్రముపై శయనించువాడా! సముద్రగర్భంలో శేషునిపై శయనిస్తున్నవాడా! బలరాముడై నాగలిని ఆయుధంగా ధరించినవాడా! మహావిష్ణుమూర్తీ! నమస్కారము. గొప్ప దివ్యస్వరూపము కలవాడా! గొప్పదైన మహిమనే చిహ్నముగా కలవాడా! వర్షాకాల సాంద్ర మేఘము వంటి శరీరము యొక్క

నమస్కరిస్తున్నాను.

## 20) లలిత

గోవిందాశ్రిత గోకుల బృందా !
పావన ! జయ జయ ! పరమానందా ॥ ॥ గోవింద ॥

జగదభిరామా ! సహస్రనామా
సుగుణధామ ! సంస్తుతనామా
గగనశ్యామా ! ఘనరిపుభీమా ।
అగణితరఘువంశాంబుధి సోమా ॥ ॥ గోవింద ॥

జననుత చరణా శరణ్య శరణా !
దనుజ హరణా। లలిత స్ఫురణా
అనఘా చరణా యత భూభరణా !
దినకరసన్నిభ దివ్యాభరణా ! ॥ గోవింద ॥

గరుడతురంగా కారోత్తుంగా
శరధిభంగ ! ఫణిశయనంగా
కరుణాపాంగా ! కమలాసంగా
వర శ్రీ వేంకట గిరిపతిరంగా ॥ ॥ గోవింద ॥

(సం.15-కీ.260)

**అర్థం** : గోవిందా = గోవిందుడా!, శ్రితగోకులబృందా = ఆశ్రయించిన గోకుల బృందములు గలవాడా!, పావన = లోకపావనుడా!, పరమానందా = పరమానంద స్వరూపమా!, జయ జయ = సర్వోత్కర్షతో వర్థిల్లుము.

జగదభిరామా = లోకాభిరామా, సహస్రనామా = వేయినామములు కలవాడా, సుగుణధామ = సుగుణమునకు నిలయమా, సంస్తుతనామా = సంస్తుతింపబడిన నామములు కలవాడా!, గగనశ్యామా = ఆకాశమువలె నీలవర్ణము కలవాడా!, ఘనరిపుభీమా = శత్రువులకు భయంకరుడా, అగణిత = లెక్కింపశక్యము కానివాడా!, రఘువంశాబుధిసోమా = రఘువంశమనే సముద్రమునకు చంద్రుడా!

జననుత చరణా = లోకముచే పొగడబడుతున్న చరణములు కలవాడా! శరణ్య = రక్షకులైన దిక్పాలకులకు, శరణ = రక్షణమైనవాడా, దనుజహరణ = రాక్షస సంహరణా!, లలితస్ఫురణా = లలితమైన ప్రకాశము కలవాడా!, అనఘ = పాపవిరహితమయిన, ఆచరణా = నడవడి కలవాడా!, ఆయత = విశాలమైన!, భూ = భూమిని, భరణా = భరించినవాడా, దినకరసన్నిభ = సూర్యతేజముకల, దివ్యాభరణా = దివ్యములైన ఆభరణములు కలవాడా!

గరుడతురంగా = గరుడుడు వాహనముగా కలవాడా! ఆకారోత్తుంగా = ఉన్నతమైన ఆకారముకల వాడా! శరధిభంగ =సేతుబంధనము చేత సముద్రమును భంగ పరచినవాడా! ఫణిశయన = శేషుని యందు శయనించిన, అంగ = శరీరము కలవాడా!, కరుణా పాంగా = కరుణతో నిండిన కడకన్నులు కలవాడా!, కమలాసంగా = లక్ష్మీదేవితో కూడినవాడా! వర = శ్రేష్టమయిన, శ్రీవేంకటగిరి = శ్రీవేంకటగిరిరాజమే, రంగా = రంగస్థలముగా కలవాఁడా!,

**తాత్పర్యము** : గోవిందుడా, ఆశ్రయించిన గోకుల సమూహము కలవాడా, పవిత్రమైన పరమానంద స్వరూపమా! వర్ధిల్లుము.

లోకాభిరామా! వేనామాలావాడా! మంచి గుణాలకు మూలమైన వాడా! సంస్తుతింప బడిన నామములు కలవాడా! గగనము వలె నీలవర్ణము కలవాడా!, శత్రువులకు భయంకరుడా!, అగణితుడా! రఘువంశమనే సముద్రమునకు చంద్రుడా!

లోకపూజితములయిన పాదములు కలిగినవాడా!, రాక్షసశిక్షకుడా! లలితమైన తేజస్సుకలవాడా! పాపరహితమైన నడవడి కలవాడా!, విశాలమైన భూమిని భరించినవాడా!, సూర్యతేజముకల దివ్యాభరణములు కలవాడా!

గరుడుని వాహనముగా కలవాడా! ఉన్నతమైన ఆకారము కలవాడా!, సముద్రమును భంగపరచినవాడా! శేషునియందు శయనించినవాడా, కరుణతో నిండిన కన్నులు కలవాడా!, లక్ష్మీదేవితో సాంగత్యము కలవాడా! శ్రేష్ఠమయిన శ్రీవేంకటగిరిని రంగస్థలముగా కలవాడా! సర్వోత్కర్షతో వర్ధిల్లుము.

## 21. శ్రీరాగం

జడమతిరహం కర్మజంతురేకోఽహం
జడధినిలయాయ నమో సారసాక్షాయ ॥పల్లవి॥

పరమపురుషాయ నిజభక్తజనసులభాయ
దురితదూరాయ సింధురహితాయ
నరకాంతకాయ శ్రీనారాయణాయ తే
మురహరాయ నమో నమో నమో ॥జడ॥

నగ సముద్ధరణాయ నందగోపసుతాయ
జగదంతరాత్మాయ సగుణాయ
మృగనరాంగాయ నిర్మితభవాండాయ ప-
న్న గరాజశయనాయ నమో నమో ॥జడ॥

దేవదేవేశాయ దివ్యచరితాయ బహు -
భావనాతీతాయ పరమాయ

శ్రీవేంకటేశాయ జితదైత్య నికరాయ
భూవల్లభాయ నమో పూర్ణకామాయ ॥జడ॥

(సంపుటం-1-కీ.481)

అహం = నేను, జడమతిః = మందమతిని, అహం ఏకః కర్మజంతుః = నేనొక కర్మఫలం వల్ల పశురూపాన్ని ధరించినటువంటి వాడిని, జడధినిలయ = పాలసముద్రములో నివసించువానికి, సారసాక్షాయ = ఆనందమును కలిగించు కన్నులు గలవానికి, నమః = నమస్కారము.

నగసముద్ధరణాయ = గోవర్ధనగిరి నెత్తిన, నందగోపసుతాయ = నందగోపుని కొడుకైన, జగదంతరాత్మాయ = జగత్తుకు అంతరాత్మగా ఉన్న, (ఆత్మనే అని ఉండాలి, కానీ ఆత్మాయ అన్నది వైదిక ప్రయోగము). సగుణాయ = ఐశ్వర్యాది గుణములు కలిగిన, మృగనరాంగాయ = నృసింహరూపుడవైన, నిర్మిత భవాండాయ = కూర్చబడిన సంసార సృష్టి కలిగిన, పన్నగరాజ శయనాయ = శేష శయనుడైన స్వామికి, నమో నమః = మనోవాక్కులతో నమస్కారము.

దేవ! దేవేశ = (ఈశ్వరుడవైన) దేవతులకు రక్షకుడా!, దివ్యచరితాయ = గొప్ప చరిత్రను కల, బహుభావనాతీత = గొప్పగా ధ్యానము చేయుట చేత అతిక్రమించినవాడా!, పరమాయ = పరమాత్ముడా, జితదైత్యనికరాయ = రాక్షస సముదాయమును సంహరించిన వాడా! భూవల్ల భాయ = భూదేవికి పతియైన, పూర్ణకామాయ = కోరికలకు అతీతమైనవాడా! శ్రీ వేంకటేశాయ = శ్రీ వేంకటపతికి, నమః = మనస్సు చేతనమస్కారము.

**విశేషాంశం** : నమః = శబ్దం యొక్క ప్రయోగం ఈ కీర్తనలో గమనార్హం - త్రికరణాలు రెండయ్యాయి. తరువాత ఒక్కటయ్యాయి.

## 22. సాళంగనాట

జయజయ నృసింహ! సర్వేశ !
భయహర! వీర! ప్రహ్లాదవరద! ॥పల్లవి॥

మిహిర శశినయన! మృగనరవేష!
బహిరంతఃస్థల పరిపూర్ణ!
అహినాయక సింహాసనరాజిత
బహుళ గుణగణ ప్రహ్లాదవరద ॥జయ॥

చటుల పరాక్రమ! సమఘనవిరహిత!
నిటలనేత్ర! మౌని ప్రణుత!
కుటిలదైత్యతతి కుక్షివిదారణ!
పటువజ్రనఖ! ప్రహ్లాద! వరద! ॥జయ॥



శ్రీవనితాసంశ్రిత వామాంక!
భావజ కోటి ప్రతిమాన!
శ్రీవేంకటగిరి శిఖరనివాస!
పావనచరిత ప్రహ్లాదవరద! ॥జయ॥

(సం.-2-కీ.289)

**అర్థము :** నృసింహ = శ్రీనరసింహరూపా!, సర్వేశ! = సర్వేశ్వరా! భయహర! = భయములను తొలగించువాడా!, వీర = వీరుడా!, ప్రహ్లాదవరద = ప్రహ్లాదునకు ప్రసన్నుడివై వరములనిచ్చినవాడా! జయ జయ = సర్వోత్కర్షతో వర్ధిల్లుము.

మిహిర = సూర్యుడు, శశి = చంద్రుడు, నయన = కన్నులుగాకలవాడా!, మృగనరవేష! = సింహముఖ మనుష్యాకారము కలవాడా!, బహిరంతఃస్థల పరిపూర్ణ = వెలుపలలోపలనిండియున్నవాడా!, అహినాయక = శేషుని, సింహాసన = సింహపీఠముచేసుకొని, రాజిత = ప్రకాశించునట్టివాడా!, బహుళ = అనేకములైన, గుణగణ = గుణసమూహములనుకలవాడా!, ప్రహ్లాదవరద = ప్రహ్లాదునకు వరములిచ్చినవాడా!

చటుల = తీవ్రమైన, పరాక్రమ= పరాక్రమశక్తిగలవాడా!, సమఘనవిరహిత= నీతో సమానులుగాని అధికులుగానిలేనివాడా!, నిటలనేత్ర = ఫాలభాగమునందు కన్ను కలవాడా!, మౌనిప్రణుత = మునులచేత స్తుతింపబడినవాడా!, కుటిల = కుటిల స్వభావముగల, దైత్యతతి = రాక్షసుల సమూహము, కుక్షి = ఉదరములను, విదారణ = చీల్చినవాడా!, పటు = సమర్థములైన, వజ్రనఖ = వజ్రాయుధముల వంటి గోళ్ళుగలవాడా!, ప్రహ్లాదవరద = ప్రహ్లాదునకు ప్రసన్నుడా!, జయ జయ = జయము.

శ్రీవనితా = లక్ష్మీదేవిచేత, సంశ్రిత = ఆసీనమై శోభిల్లుతున్న, వామాంక = ఎడమతొడ కలవాడా!, భావజకోటి = కోటిమంది మన్మథులకు, ప్రతిమాన = దీటైనవాడా! శ్రీవేంకటగిరి = శ్రీవేంకటాద్రి యొక్క, శిఖరనివాస = నివాసస్థలముగా కలవాడా!, ప్రహ్లాదవరద = ప్రహ్లాదునకు వరదుడా!, పావన చరిత = లోకపావనమైన చరిత్రము కలవాడా, జయ జయ = జయము.

**తాత్పర్యము:-** నృసింహ స్వరూపమును ధరించిన సర్వేశ్వరుడా! భక్తుల భయములను హరించువాడా! జగదేకవీరుడా! ప్రహ్లాదునికి వరములనిచ్చినవాడా! సర్వోన్నతుడివై ప్రకాశింపుము. సూర్యచంద్రులు కన్నులుగా కలవాడా! మృగనరవేషమును ధరించినవాడా! సమస్త విశ్వమునందు నిండియున్నవాడా! శేషసింహాసనాసీనుడా! అగణితగుణములు గలవాడా! ప్రహ్లాదవరదుడా! జయము. తీవ్రమైన పరాక్రమముకలవాడా! నీతో సమానులుగాని నీకంటే అధికులుగాని లేనివాడా! ఫాలనేత్రుడా! మునిజనులచేత స్తుతింపబడినవాడా! కుటిల స్వభావముకల రాక్షసుల పొట్టలను జీల్చువాడా! వజ్రాయుధములవంటి గోళ్ళుగలవాడా! ప్రహ్లాదవరదుడా! సర్వోత్కర్షతో వర్ధిల్లుము. ఎడమతొడపై నధిరోహించిన లక్ష్మీదేవి కలవాడా! కోటి మన్మథ ప్రతిమానుడా! శ్రీవేంకటాద్రి శిఖర నిలయుడా! భువన పాలన చరిత్రుడా! ప్రహ్లాద వరదుడా! సమున్నతంగా వర్ధిల్లుము.

## 23) ముఖారి

జానామ్యహం తే సరసలీలాం
నానావిధ కపటనాటక సఖత్వమ్ । ॥పల్లవి॥

కిం కరోమి త్వాం కితవ పరకాంతా న
ఖాంకుర ప్రకటన మతీవ కురుషే
శంకాం విసృజ్య మమ సంవ్యాన కర్షణం
కింకారణమిదం తే ఖేలన మిదానీం ॥జానా॥

కిం భాషయసి మాం కృతకమానసతయా
డాంభికతయా విట విడంబయసి కిం
గాంభీర్య మావహసి కాతరత్వేన తవ
సంభోగ చాతుర్య సాదరతయా కిం ॥జానా॥

కిమితి మామనునయసి కృపణవేంకటశైల
రమణ భవదభిమతసురతమనుభవ
ప్రమదేన మత్ప్రియం ప్రచురయసి మానహర
మమతయా మదననిర్మాతా న కిం త్వం ॥జానా॥ సంపుటం-5-కీ-13

**అర్థం** : అహం = నేను, తే = నీ యొక్క, సరసలీలాం = అనురాగసహితమైన లీలను, నానావిధ = అనేక విధములైన, కపటనాటకసఖత్వం = కపటనాటక ప్రీతిని, జానామి = ఎఱుగుదును.

కితవ = మోసకాడా! త్వాం = నిన్ను, కింకరోమి = ఏమి చేయుదును. పరకాంతా = పరకాంతచే చేయబడిన, నఖాంకుర = గోరు గిచ్చుడును, ప్రకటనం= ప్రదర్శనమును, అతీవ = ఎక్కువగా, కురుషే = చేయుచున్నావు, శంకాం విసృజ్య = విశృంఖలముగా, మమ = నా యొక్క, సంవ్యాన = పయట చెఱగు, కర్షణం = లాగుట, ఇదం = ఈ, తే = నీ యొక్క, ఖేలనం = ఆట, ఇదానీం = ఇప్పుడు, కింకారణం = ఏమి కారణము?

కపటమానసతయా = కపటం కల నీయొక్క మనసుతో, మాం = నన్ను, కింభాషయసి = ఏలపలికించెదవు? విట = విటుడా! డాంభికతయా = మోసముతో, కిం విడంబయసి = ఏలఅభినయించెదవు?, కాతరత్వేన = మనసులోని భయముతో, గాంభీర్య మావహసి = పైకి గాంభీర్యమును వహించుచున్నావు, తవ = నీ యొక్క, సంభోగ చాతుర్య = రతినేర్పునందలి, సాదరతయా = బులబాటముతో, కిం = ఏమి ప్రయోజనము.

కృపణ = దైన్యం కలవాడిలా, కిమితి = ఏమని, మాం = నన్ను, అనునయసి = బతిమాలెదవు! వేంకటశైలరమణ = వేంకటశైలవల్లభుడా! భవదభిమత = నీ కిష్టమైన, సురతం = రతిసుఖమును, అనుభవ

= అనుభవింపుము. మానహర = మానమును దోచుకొనువాడా!, ప్రమదేన = అధికమైన, మమతయా = మమకారముతో, మత్ప్రియం = నాపై ప్రేమను, ప్రచురయసి = తెలుపుచున్నావు. త్వం = నీవు, మదననిర్మాతా, కిం = కాముని సృష్టించెడు వాడవు కావా ఏమి?

**తాత్పర్యం :** నీ సరసలీలను అనేకరకములైన కపటనాటకప్రియత్వమును నేను ఎఱుగుదును.

మాయలు తెలిసినవాడా! నిన్నేమి చేయుదును? పరకాంత చేసిన నఖాంకు రక్షతమును కూడ నాకు ప్రదర్శించుచున్నావు. ఎటువంటి బెదురు లేక నా పయట చెఱగును పట్టి లాగుచున్నావు నీకిది ఆటా? ఇప్పుడు కారణమేమి?

నీ అమాయకపు నటనతో నన్నేల మభ్యపెట్టెదవు. నీ వేడుకకై మోసముతో ఏల నటించెదవు? లోపల బెదురుతో పైకి గాంభీర్యము అభినయిస్తున్నావు! రతిక్రీడలో నీనేరుపు వలన ప్రయోజనము ఏమి?

ఓ దీనుడా! నన్ను బ్రతిమాలుకొనుట దేనికి? ఓ వేంకటశైలరమణుడా! మానచోరుడా! నీకభిమతమైన శృంగారాన్ని అనుభవింపుము. ప్రేమతో నాలో కామాన్ని ప్రేరణ చేయుచున్నావు. నీవు మన్మధుని పుట్టించినవాడవుకదా!

## 24. వరాళిరాగం

డోలాయాంచల డోలాయాం
హరేడోలాయాం ॥పల్లవి॥

మీనకూర్మ వరాహా! మృగపతి అవతారా!
దానవారే! గుణశౌరే! ధరణిధర! మరుజనక! ॥డోలా॥

వామన రామ రామ వరకృష్ణ అవతారా!
శ్యామలాంగా! రంగరంగా! సామజవరద! మురహరణ! ॥డోలా॥

దారుణ బుద్ధ కలికి దశవిధ అవతారా
శీరపాణే! గోసమానే శ్రీగిరికూటనిలయ ॥డోలా॥ (సం.-2-కీ.-374)

**అర్థము** :- డోలాయాం = ఉయ్యాలయందు, చల = ఊగుము, డోలాయాం = ఉయ్యాలయందు, హరే = శ్రీహరీ!, డోలాయాం = ఉయ్యాలలో

మీన, కూర్మ, వరాహ, మృగపతి అవతారా! = మత్స్య-కూర్మ-వరాహ- నరసింహావతారములను ధరించినవాడా, దానవారే = రాక్షస సంహారకుడా, గుణశౌరే = గుణవంతుడవైన శౌరీ!, ధరణిధర = భూమిని ధరించినవాడా, మరు జనక = మన్మథునికన్న తండ్రీ!, డోలాయాంచల = ఉయ్యాల ఊగుము.

వామన = వామనమూర్తీ, రామ = పరశురాముడా, రామా = దశరథ రాముడా, వర = శ్రేష్ఠమైన, కృష్ణావతారా = కృష్ణావతారుడా, శ్యామలాంగా = శ్యామల శరీరా, రంగరంగా = రంగనాయకా, సామజవరద = గజేంద్రవరదా, మురహరణ = మురాసురునిజంపినవాడా!

దారణబుద్ధ = రాక్షస స్త్రీలకు నాస్తిక్యమును బోధించు కఠినమైన హృదయంగల బుద్ధావతారమును ధరించినవాడా, కలికి = కల్క్యవతారమును దాల్చినవాడా!, దశవిధ అవతారా = పది విధములయిన అవతారములను ధరించినవాడా!, సీరపాణే = బలరామావతారా, గోసమానే = గోవు వంటి అర్చారూపాన్ని దాల్చినవాడా! శ్రీవేంకటగిరికూట నిలయ = శ్రీవేంకటాచలంలో కొలువై ఉన్నవాడా!

**తాత్పర్యము :** మత్స్య-కూర్మ-వరాహ-నరసింహావతారములను ధరించినవాడా!, రాక్షస సంహారీ, గుణవంతుడైన విష్ణుమూర్తీ, భూమిని ధరించినవాడా, మన్మథునికి తండ్రీ, ఉయ్యాల ఊగుము. వామనుడా! పరశురాముడా! శ్రీరాముడా! శ్రేష్ఠుడైన కృష్ణావతారా! శ్యామలశరీరా! రంగనాయకా! గజేంద్ర వరదుడా! మురహరణుడా! బుద్ధస్వరూపుడా! కల్క్యవతారముదాల్చిన వాడా, పది అవతారములకూ మూలుడా, ఓ బలరామావతారా! 'గోవు' వంటివాడా! శ్రీవేంకటాద్రిపై కొలువై ఉన్నావు. ఓ శ్రీహరీ! ఉయ్యాలలో ఊగుము.

మత్స్యః కూర్మో వరాహశ్చ నారసింహశ్చవామనః ।
రామో రామశ్చరామశ్చ బుద్ధః కల్కిరేవచ ॥

**వివరణము:** శ్రీకృష్ణావతారము పరిపూర్ణావతారము. అందుకే వరకృష్ణ = అని సంభోధించినాడు. జయదేవుడుకూడా దశాకృతికృతే, కృష్ణాయ తుభ్యం నమః" అని పేర్కొన్నాడు. కనుక దశావతారములలోనిది కాదు. బలరామావతారము మాత్రమే దశావతారములలోనిది. అందుకనే చివరి చరణంలో "సీరపాణే!" అని సంబోధనము. లేనిచో 11 అవతారములు వచ్చును. అంతేగాక అర్చాస్వరూపి శ్రీ వేంకటేశ్వరుడు 'గో' సమానుడన్న ఆగమ విషయాన్ని తెలియజేశాడు అన్నమయ్య ఈ సంకీర్తనలో-

గవాం సర్వాంగజంక్షీరం స్రవేత్ స్తనముఖాద్యధా ।
తథాసర్వగతో దేవః ప్రతిమాదిషు రాజతే ॥

కులార్ణవతంత్రం - ఆవుయందున్న క్షీరధాతువులన్నీ పొదుగు నుండి బయటకు వస్తున్నట్లుగా, అణువునుండి అజాండమంతా వ్యాపించిన విష్ణుతత్త్వం అర్చామూర్తిగా శోభిల్లుతున్న, శ్రీ వేంకటేశ్వరస్వామి దివ్యమంగళ విగ్రహంనుండి విభూతిగా వెడలి లోకాన్ని అనుగ్రహిస్తున్నది.

## 25. సామంతం

తత్తా తిగుడి దింధింతక దింధిం
తిత్తి తిత్తితి తితి తితి తితి ॥పల్లవి॥

దానవవదనవితానదాన సం
ధాన రుధిరనిజపానమిదం
నానాభూతగణానాం గానం
దీనజనానాం తిత్తితి తితి. ॥తత్తా॥


KUCHI

విమతదనుజమత విభవపరిభవిత
సమధికం తవ శౌర్యమిదం
ప్రమదాభవ్యం ప్రమదాభరణం
తిమిరనిరసనం తిత్తితి తితి. ॥తత్తా॥

తిరువేంకటగిరి దేవవిధానం
పరమామృతరసభాగ్య మిదం
కరుణావరణం కమలాఘటనం
తిరో తిరో తిత్తితి తితి తితి. ॥తత్తా॥

(సం.-4-కీ.-46)

ఇక్కడ మృదంగ ధ్వనులను పల్లవిగా తీసుకొన్న కీర్తన ఇది. ఇది నృసింహము యొక్క ప్రతాపాన్ని ఆవిష్కరించే సంకీర్తన, దానవ వదన వితాన దాన సంధాన రుధిర నిజపానమిదం = రాక్షసుడైన హిరణ్యకశిపుని చీల్చుట చేత వెలువడిన రక్తాన్న ఆస్వాదించినవాడా!

దీన జనానాం = దీనులైన ప్రజలకు, నానాభూతగణానాం = ఇతర దేవతా గణాలకు, తత్ = ఆ లీలను, తిత్తితిత్తిరి గానం = తిత్తితిత్తిరి గానముగా పాడుతున్నాను, విమతదనుజ మత విభవ పరిభవ సమధికం = వేదవిముఖమైన దానవుల నాస్తిక మత వైభవాన్ని తిరస్కరించడం చేత, ఇదం = ఈ, తవ = నీయొక్క, శౌర్యం = శూరత, ప్రమదాభవ్యం = సంతోషాన్ని మంగళాన్ని కలిగిస్తూ, ప్రమదాభరణం = లక్ష్మీ దేవి మొదలగువారికి శోభను కలిగిస్తూ, తిమిర నిరసనం = అజ్ఞానాంధకారాన్ని తొలగిస్తున్నదైన, తత్ = ఆ శౌర్యాన్ని, తిత్తితి తితి = తిత్తితి అనే లయాత్మకంగా పాడుతున్నాను.

తిరువేంకటగిరి దేవ నిధానం శ్రీ వేంకటగిరిని దేవతా నిలయంగా చేస్తున్న, పరమామృత రసభాగ్యం= అమృత రసమనేభాగ్యం ఇది, కరుణా వరణం = దయతో కూడినదై, కమలాఘటనం = శ్రీ నిలయమగునట్లుగా, తిరోతిత్తిలి తితి తితి = ఈ లీలను తిరో తిరో తిత్తితి అని కీర్తిస్తున్నాను.

**తాత్పర్యం :** మృదంగ ధ్వనులను పల్లవిగా తీసుకొన్న ఈ కీర్తన, శ్రీ నృసింహస్వామి ప్రతాపాన్ని ఆవిష్కరిస్తున్నది. క్రూర రాక్షసుడైన హిరణ్యకశిపుని చీల్చుటచేత వెలువడిన రక్తాన్ని అస్వాదించిన స్వామీ! ఆ దివ్యసన్నివేశాన్ని దీనులైన ప్రజలకు, ఇతర దేవతాగణాలకు తిత్తిత్తితి అని మంగళగానంగా పాడుతున్నాను. వేదంపై ద్వేషంకల దానవుల యొక్క నాస్తిక మతవైభవాన్ని తిరస్కరించడం చేత, నీయొక్క శూరత సంతోషాన్ని కలిగిస్తున్నది. మంగళదేవత లక్ష్మీమాత మొదలగువారికి శోభను కలిగించునట్టి, అజ్ఞానాంధకారాన్ని తొలగిస్తున్నదైన ఆ శౌరాన్ని తిత్తిత్తితితి అని లయాత్మకంగా పాడుతున్నాను. శ్రీ వేంకటగిరి దేవతా నివాసంగా చేసుకొన్న స్వామీ! ఆ శ్రీనిలయం అమృతరసమనే దయతో కూడినదై ఉండాలని తిత్తిత్తితి అని నీ లీలను కీర్తిస్తున్నాను.

**విశేషాంశం :** శ్రీ వేంకటాచలపతి యొక్క ఉత్సవాలలో ఊరేగింపులో తిరువీధి నృత్యాలను అన్నమయ్య అభివర్ణిస్తున్నాడు. "తత్తా తగుడి దిధిం" అన్న ఈ శబ్దాలకు అర్థంలేకపోయినా సొగసైన మృదంగ ధ్వనులను

గుర్తుచేస్తున్నది. ఈ ధ్వనులు నాట్యరసస్ఫూర్తిని మరింతగా ప్రేరేపించడానికి వినియోగిస్తారు. ఒక లయాత్మక నాదమాధుర్యాన్ని ఇచ్చే ఇటువంటి కీర్తనలు తెలుగులో విరివిగా ఉన్నాయి-

ఉదా :- తిరొ తిరో జవరాల తిత్తి తిత్త యీ
తరలమైన నీతార హారమధురే
ధిమి ధిమ్కితోంగతోంగదిధి మిక్కి ఆరే
మమారే పాత్రరావు మజ్జా మజ్జా
.......................................................
ఝుక జక్క జం ఝుం ఝుణ ణకిణాని

(సంపుటం-6-కీర్తన-47)

ఈ రీతిలో చేసే శబ్ద ప్రయోగాన్ని దేశ్య ప్రబంధ బేధాల్లో 'పాట'గా పేర్కొన బడుతున్నది. 'చతుర్దండి ప్రకాశిక'లోని ప్రబంధ ప్రకరణంలో - (28, 29 శ్లోకాలు) వేంకటమఖి ఇలా తెలియజేశాడు -

రుద్రవీణా సముద్భూతాః, పాటాస్తక తనాదయః ।
శంఖాది ముఖ వాద్యోత్థాః, పాటాస్థుల యుగాదయః ।
ఉరో వాద్యభావాః పాటాః, ధిం తథిం తకిణాదయః ।
ఏవ మన్యే పి విజ్ఞేయాః, పాటాః లక్ష్యానుసారతః ॥

రుద్రనివీణ వల్ల ప్రభవించిన ధ్వనులు 'పాట'గా వ్యవహారంలోకి వచ్చాయి. శంఖాది ముఖవాద్యాల వల్ల వచ్చేవికూడా అవ్యక్తమధురానుభూతినిస్తూ పాటలవు తున్నాయి. శ్రేష్ఠమైన వాద్యభావాలు ధిం తథిం తకిణాదులు కూడా పాటలుగా ఉన్నాయి. ఈ లక్ష్యానుగుణమైన ఇతర ధ్వనులనుకూడా పాటలుగా పరిగణించవచ్చని పై గ్రంథం వివరిస్తున్నది. అన్నమయ్య - ఈ నృసింహ సంస్కృత కీర్తనలో రాక్షస సంహారం ఎంతటి ఆనందాతిశయాన్ని ప్రాణికోటికి కలిగించిందో, తెలియజేయడానికి 'పాట' అనే ఈ సంప్రదాయాన్ని ఎన్నుకోవడం గమనార్హం.

## 26) లలిత

తథా కురుష్వ ముదా మామద్యేవ
అధోక్షజ స్తే అనుదాసోహం ॥ ॥తథా॥

తవాస్మి శరణం దహ రాహుం
భవదురితాని భంజ మమ
భువికృతంచ యాపురా ప్రతిజ్ఞాం
జవన! దదామి సర్వేభ్య ఇతి। ॥తథా॥

వ్రజామి శరణం వరద! తవాహం
త్యజితానుబంధ ధర్మమమ

భుజకృతాం పురా ప్రతిజ్ఞాం
వృజినైర్మోక్షయిష్యామీతి ॥తథా॥

చింతితం మయా శ్రీవేంకటేశ
కింతు త్వం మయి కృపాంకురు
త్వంతు హి పురాకృతాం ప్రతిజ్ఞాం
అంత గతింనయా మీతిహి ॥తథా॥

(సంపుటం-4-కీర్తన-424)

**అర్థం** : అథోక్షజ = అధోక్షజుడా!, ముదా = ప్రీతితో, అద్యైవ = ఇప్పుడే, మాం = నన్ను, తథా = ఆవిధముగా, కురుష్వ = చేయుము!, తే = నీకు!, అహం = నేను, అనుదాసః = దాసానుదాసుడను.

తవ = నీకు, శరణం = శరణాగతుడను, అస్మి = అయితిని, రాహుం = తమస్సును, (అజ్ఞానమును) దహ = దహింపుము!, మమ = నా యొక్క, భవదురితాని = సంసార దురితములను, భంజ = భంజింపుము!, జవన = ఓ వేగశాలీ! భువి = భూమియందు, సర్వేభ్యః = ఎల్లరకును, దదామితి = అభయమిచ్చెదనని, యాప్రతిజ్ఞా = ఏ ప్రతిజ్ఞ, కృతా = విభీషణునికై నీచేత చేయఁబడినదో.

హే వరద = ఓ వరదుఁడా, అహం = నేను, తవ = నీ యొక్క, శరణం వ్రజామి = శరణమును పొందుచున్నాను, త్యజితానుబంధ ధర్మః = విడువబడిన అనుబంధములు సర్వధర్మములు కలవాడనై (శరణు పొందుచున్నాను) వృజినైః = పాపములతో (పాపములనుండి), మోక్షయిష్యామితి = విడిపింపగలననెడి, పురా = పూర్వము అర్జునుని కొరకై చేసిన, ప్రతిజ్ఞాం = ప్రతిజ్ఞను, భజ = నిలబెట్టుకొనుము.

శ్రీవేంకటేశ = శ్రీవేంకటేశ్వరా! మయా = నాచేత, చింతితం = ధ్యానింపబడినది, కింతు = మఱియేమనగా, త్వం = నీవు, మయి = నాయందు, కృపాంకురు = కృప చేయుము. త్వంతు= నీవైతే, పురా = పూర్వమందలి, "అంతగతింనయామీతి" = పరమగతిని ప్రసాదిస్తానని, కృతం ప్రతిజ్ఞాం = చేసిన ప్రతిజ్ఞను, స్మర = స్మరింపుము.

**తాత్పర్యము** : ఓ అధోక్షజుడా! ఇప్పుడే నన్ను ప్రీతితో కృతార్థుడిగా చేయి. నేను నీదాసులకు దాసుడను.

నీకు శరణాగతి చేశాను. నా అజ్ఞాన తమస్సును దహింపుము. నా సంసార పాపములను తొలగించుము. ఓ వేగశాలీ! నీవు పూర్వము ప్రతిజ్ఞ చేశావు.

**సకృదేవ ప్రపన్నాయ తవాస్మీతి చ యాచతే।**
**అభయం సర్వభూతేభ్యో దదామ్యేతద్ వ్రతం మమ॥ (శ్రీరామచరమ శ్లోకం)**

అను శ్రీమద్రామాయణ శ్లోకము నిచ్చట స్మరింపవలయును.

సర్వానుబంధములను, సర్వధర్మములను, వదలి నేను నీకు శరణం పొందుచున్నాను. ఓ వరదుడా! నీవు పూర్వము అర్జుననికై ఇచ్చిన మాటను పాటించుము!

**"సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ!**
**అహంత్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మాశుచః॥"**

**(శ్రీకృష్ణచరమ శ్లోకం - భగవద్గీత 18-66)**

అన్న భగవద్గీతా వచనాన్ని గుర్తుచేసుకోవాలి.

ఓ వేంకటేశ్వరా! నాచేత ధ్యానింపబడినవాడా! నీవు నాయందు కృప చేయుము. నీవు పూర్వము పరమపదానికి చేరుస్తానని చప్పిన ప్రతిజ్ఞను గుర్తు చేసుకో!

**స్థితే మనసి సుస్వస్థే శరీరే సతి యో నరః ।**
**ధాతుసామ్యే స్థితే స్మర్తా, విశ్వరూపం చ మామజమ్ ॥**
**తతస్తంమ్రియమాణం తు, కాష్ఠ పాషాణ సన్నిభమ్।**
**అహం స్మరామి మద్భక్తం నయామి పరమాం గతిమ్ ॥ (వరాహచరమశ్లోకం)**

నా భక్తుడు ఆరోగ్యం ఉన్నవేళ నన్ను స్మరిస్తూ ఉండి, ప్రాణప్రయాణ సమయంలో అశక్తతవల్ల నా స్మరణ చేయలేకపోయినా, నా భక్తుని నేను స్మరించి పరమ పదాన్ని ప్రసాదిస్తానన్న భగవంతుని ప్రతిజ్ఞను ఇక్కడ అనుసంధానం చేసుకోవలయును.

**విశేషాంశం** : పల్లవిలో 'అధోక్షజ!' అన్న పదాన్ని అన్నమయ్య చాలా అర్థవంతంగా ప్రయోగించాడు. ఇంద్రియజన్య జ్ఞానాతీతుడు, అని జితేంద్రియులకు గోచరించు వాడని పేర్కొనవచ్చును. అందరిచేత సదా అనుభవించబడుతున్నా - సుధాసముద్రంలా క్షయాన్ని చెందనివాడు - శ్రీనివాసస్వామి.

ఈ సంకీర్తనలోని తొలిచరణంలో 'జవన!' అని ప్రయోగించి రామాయణ చరమ శ్లోకంలోని 'సకృదేవ' అన్న వాల్మీకి పదాన్ని గుర్తుచేశాడు. అహం అన్న వ్యాసభగవానుని గీతాసుధను, రెండవ చరణంలో యధాతధంగాను, మూడవ చరణంలో వరాహచరమ శ్లోకంలోని 'పరమాంగతిమ్' అన్న ప్రయోగాన్ని 'అంతగతిం నయామీతి' అని విశ్లేషించి - అన్నమయ్య శ్రీ వైష్ణవ సంప్రదాయ రహస్యాన్ని ఈ కీర్తనలో చక్కగా వివరించాడు.

## 27) కాంబోది - రచ్చతాళం

తవమాం ద్రష్టుం దయాస్తివా
త్రివిధైర్ఘనాని తే నామాని ॥తవమాం॥

కరరమణీ కంకణైర్ఘనకుచ
గిరౌ స్థాపిత కిన్నరీయం
సరసం మ్లేచ్ఛరచనాని త్వయి
స్థిరా నదయతి తే నామాని ॥తవమాం॥

కలరవ కంపిత కంఠవిలసనం
కిలకిలమేళన కిన్నరీయం

లలనా కావా లంఘితవాద్యం
తిలకయతి తదా తే నామాని ॥తవమాం॥

నిరతమూర్ఛనా నిబిడతాళరవ
గిరాయోజిత కిన్నరీయం
తరుణీరణయతి తదా సమీపే
తిరువేంకటవర తే నామాని ॥తవమాం॥

(సం.-5-కీ.-114)

**అర్థం :** తవ = నీకు, మాంద్రష్టుం = నన్నుజూచుటకు, దయా = దయ, అస్తివా = కలదా? తేనామాని = నీ పేర్లు, త్రివిధైః = మూడు విధములుగా, ఘనాని = గొప్పవి.

కరరమణీకంకణైః = చేతులకున్న మణికంకణములతో, ఘనకుచగిరౌ = స్తనపర్వతమునందు, స్థాపిత = హత్తబడిన, కిన్నరీ = కిన్నెరవీణకలదియై, త్వయి = నీయందు, సరసం = సరసముగా, మ్లేచ్ఛరచనాని= అస్పష్టరచనగల, తే = నీ యొక్క, నామాని = నామములను, నదయతి = పలికిస్తున్నది. స్థిర = బిగించుకొని ఉన్నవాడా! ఇయం లలనా = ఈ అతివ, కావా = ఎవరై ఉంటారు.

కలరవ = పావురములా, కంపిత = వణుకుతున్న, కంఠ = కంఠనాద, విలసనం = ధ్వనితో, కిలకిల మేళన కిన్నరీ = కిలకిల ధ్వనితో మేళవింపు కల, కిన్నరీ = కిన్నర వీణ గలది, లంఘిత వాద్యం = అతిక్రమింపబడిన వాద్య ధ్వని కలుగునట్లుగా, తేనామాని = నీ పేర్లను, సదా = ఎల్లప్పుడును, తిలకయతి= దర్శించేట్టుగా చేస్తున్నది. ఇయంలలనా = ఈ మగువ, కావా = ఎవరై ఉంటారు.

నిరతమూర్ఛనా = ఎల్లప్పుడూ స్వరమూర్ఛనగల, నిబిడ = దట్టమైన, తాళరవ= తాళధ్వనిగల, గిరా= వాక్కుతో, యోజిత = సంయోజింపబడిన, కిన్నరీ = కిన్నర వీణగలదియై, ఇయం తరుణీ = ఈ అతివ, తవసమీపే = నీ సమీపమునందు, తిరువేంకటపతే = ఓ తిరువేంకటపతీ! తే = నీ, నామాని = పేర్లను, రణయతి = మ్రోగించుచున్న, ఇయం తరుణీ = ఈ తరుణి, కావా = ఎవరై ఉంటారు.

**తాత్పర్యము :** నీకు నన్నుజూచుటకు దయ ఉన్నదా? మూడు విధములుగా నీ పేర్లు గొప్పవి.

చేతులకున్న మణికంకణములతో పాలిండ్లపై కిన్నరవీణను హత్తుకొని, నీ గురించిన సరసమైన అస్పష్ట రచనలు గల నీరును పలికిస్తున్నది. ఈమె ఎవ్వరై ఉంటారు.

పావురము కంఠస్వరములా వణకుతున్న కంఠస్వరంతో మేళవింపుగల కిలకిల నాదంతో వాద్యధ్వనిని మించి ఎల్లప్పుడూ నీ పేర్లను చూసేట్లుగా చేస్తున్నది. ఈ అలివేణి ఎవ్వరై ఉంటారు.

ఎల్లపుడూ స్వరమూర్ఛనతో నిండిన తాళధ్వనిగల కంకణరవమును కిన్నెర వీణతో మేళవించి నీ సమీపంలో నీ పేర్లను మ్రోగిస్తున్న యీ అతివ ఎవ్వరు?

**విశేషాంశం :** ఈ సంకీర్తన మధుర భక్తి సారస్వతంలో మహార్ఘరత్నం వంటిది. ఇంతటి భగవద్గుణానుభవం ఆళ్వారులకు సొంతమై ఉన్నది. ఇక భాషలోని మాధుర్యం జయదేవుని గీతగోవింద పంక్తులను గుర్తుచేస్తున్నది-

పశ్యతి దిశి దిశి రహసి భవన్తం ।
తద ధర మధుర మధూనిపిబంతమ్ ॥ (6-12-1)

అన్నమయ్య ఈ కీర్తనలో నదయతి, తిలకయతి, రమయతి అన్న క్రియా పదాలను చాలా అన్వర్థంగా ప్రయోగించాడు.

## 28. మంగళకౌశిక

తే శరణమహం తే శరణమహం
శైశవకృష్ణ! తే శరణం గతోఽస్మి ॥పల్లవి॥

దశవిధావతార! ధర్మరక్షకమూర్తి!
దశమస్తకాసుర దళన
దశదిశాపరిపూర్ణ! తపనీయ స్వరూప!
దశావరణ లోకతత్వాతీత! ॥తే శరణం॥

సహస్రలోచన సంతతవినుత!
సహస్రముఖ! శేషశయనా!
సహస్రకరకోటి సంపూర్ణతేజా!
సహస్రారదివ్యచక్రాయుధా! ॥తే శరణం॥

అనంతచరణ! సర్వాధారాధేయ!
అనంతకర దివ్యాయుధా!
అనంతనిజకల్యాణ గుణార్ణవ!
అనంత! శ్రీవేంకటాద్రి నివాసా! ॥తే శరణం॥

**తాత్పర్యము:** హే శైశవకృష్ణ = ఓ! బాలకృష్ణా!, తే = నీకు, అహం = నేను, శరణం = శరణార్థిని, తే = నీకు, అహం = నేను, శరణం = శరణార్థిని, తే = నీకు, శరణంగతోస్మి = శరణమును పొందిఉన్నాను.

ధర్మరక్షకమూర్తి = ధర్మరక్షకమైన మూర్తులుకలవాడా, దశవిధ అవతార! = పది విధములైన అవతారములెత్తినవాడా!, దశమస్తకదళన = పదితలలుగల రావణాసురుని సంహరించినవాడా!, దశదిశాపరిపూర్ణ = పది దిక్కులయందు నిండియున్నవాడా!, తపనీయస్వరూపా = సూర్యాత్మ స్వరూపా!, దశావరణలోక = పది ఆవరణములు గల లోకస్వరూపుడా!, తత్వాతీత = ఇరువది నాలుగు తత్త్వములకు అతీతుడా!, సహస్రలోచన = వేయి కన్నులు కల యింద్రునిచేత, సంతత = ఎల్లప్పుడును, వినుతా! = స్తుతింపబడిన వాడా, సహస్రముఖ = వేయిముఖములు గల, శేష, శయనా = శేషుని శయ్యగాకలవాడా!, సహస్రకరకోటి =

కోటి సూర్యులయొక్క, సంపూర్ణ = సంపూర్ణమైన, తేజా = తేజముకలవాడా!, సహస్రార = వేయియంచులుగల, దివ్య = ప్రకాశమానమైన, చక్ర = సుదర్శనము, ఆయుధ = ఆయుధముగాకలవాడా!, తే శరణంగతోస్మి = నీకు శరణు పొందితిని.

అనంత చరణ = సహస్రపాదుడా!, సర్వాధారాధేయ = సర్వమునకు ఆధార-ఆధేయ-స్వరూపములు రెండును అయినవాడా!, అనంతకర = సహస్రకరముల యందు, దివ్యాయుధ = దివ్య ఆయుధములను ధరించినవాడా, అనంత = అంతములేని, నిజ = స్వీయములైన, కల్యాణగుణ = కళ్యాణ గుణములకు, అర్ణవా = సముద్రమయినవాడా!, అనంత = అనంతుడా, శ్రీవేంకటాద్రివాసా! = శ్రీవేంకటాద్రియందు నివసించియుండువాడా, తే = నీకు, శరణంగతోస్మి = శరణు పొందుతున్నాను.

**తాత్పర్యము** : హే బాలకృష్ణా! నేను నీకు శరణార్థిని. పది అవతారాలను దాల్చి ధర్మమును సంరక్షించిన స్వామీ! దశకంఠుడైన రావణుని శిరస్సులను ఛేదించిన వాడా! పదిదిక్కులయందు పరిపూర్ణుడవైయున్నవాడా! హిరణ్మయ పురుషా! పది ఆవరణములతో లోకస్వరూపుడిగా ఉన్నవాడా! ఇరువది నాలుగు తత్త్వములకు ఆవలనున్న వాడా! నిన్ను శరణు పొందితిని. సహస్రలోచనసంతత వినుతుడా! వేయిపడగలు కల శేషుని శయ్యగాకలవాడా! కోటిసూర్యుల సంపూర్ణ తేజోవిరాజమానుడా! వేయిఅంచులుకల దివ్యసుదర్శనమును ఆయుధముగా ధరించినవాడా! నిన్ను శరణు కోరుతున్నాను.

స్వామీ! నీవు అనంత చరణుడవు. సర్వమునకు ఆధారమైయున్నవాడు ఆధేయము కూడ నీవే! అనంతకరములయందు దివ్యాయుధములను ధరించిఉన్నావు. అనంత కళ్యాణగుణములకు సముద్రానివి! అనంతుడవు! శ్రీవేంకటాద్రి నివాసుడవు! నిన్ను శరణుకోరుతున్నాను.

**విశేషాంశం** : యశోదామాతకు నోటిలో బ్రహ్మాండాన్ని చూపిన బాలకృష్ణుడే 'వేంకట'మనే కొండపైనున్న శ్రీనివాసుడు. ఈ కీర్తనలో మొదటిచరణంలో దశదిశా పరిపూర్ణ, 'తపనీయస్వరూప', 'ధర్మరక్షక మూర్తి!', 'దశావరణలోక తత్త్వాతీత" అనే విశేషాలు శ్రీపతికున్న స్వరూప - రూప - నామ - గుణాదుల వైభవాన్ని ఆవిష్కరిస్తున్నాయి. అన్నమయ్య చేసిన ఈ ప్రయోగం ఎత్తుగడ ఆశ్చర్యకరమైనది.

దశావరణాలు ఏవి? అన్న ప్రశ్నకు భగవద్గీత (7-4) స్పష్టమైన సమాధానమిస్తున్నది.

భూమి రాపోఽనలో వాయుః, ఖం మనోబుద్ధిరేవచ ।
అహంకార ఇతీయం మే భిన్నా, ప్రకృతిరష్ట ధా ॥

భూమి-నీరు-అగ్ని- వాయువు - ఆకాశము - మనస్సు - బుద్ధి - అహంకారము, ఈ ఎనిమిది ఆవరణలతో తొమ్మిదవ ఆవరణ జీవుడు, పదవ ఆవరణ పరమాత్మగా గ్రహించాలి. ఇక సహస్రలోచన - సహస్రముఖ - సహస్రకర కోటిసంపూర్ణతేజ - వంటి విశేషణాలు పురుషసూక్తాన్ని గుర్తుచేస్తున్నాయి. పరమాత్మ విశ్వరూపాన్ని కళ్ళారా చూసిన, అన్నమయ్యకు మాత్రమే సాధ్యమైన అపూర్వ శ్రీవేంకటేశ్వరస్వామి స్వరూపవర్ణన ఈ కీర్తన.



డా॥ ఆకెళ్ళ విభీషణశర్మ

## 29. శ్రీరాగం

త్వమేవశరణం త్వమేవశరణం
కమలోదర! శ్రీజగన్నాథ! ॥పల్లవి॥

వాసుదేవ! కృష్ణ! వామన! నరసింహ!
శ్రీసతీశ! సరసిజనేత్ర!
భూసురవల్లభ! పురుషోత్తమ! పీత
కౌశేయవసన! జగన్నాథ! ॥త్వమేవ॥

బలభద్రానుజ! పరమపురుష! దుగ్ధ
జలధి విహార! కుంజరవరద!
సులభ! సుభద్రా సుముఖ! సురేశ్వర!
కలిదోషహరణ! జగన్నాథా! ॥త్వమేవ॥

వటపత్రశయన! భువనపాలన! జంతు
ఘటకారకరుణ! శృంగారాధిప!
పటుతర! నిత్యవైభవరాయ! తిరువేం
కటగిరి నిలయ! జగన్నాథ! ॥త్వమేవ॥

(సం.-1-కీ.-323)

**అర్థము :** త్వమేవశరణం = నీవే శరణము! త్వమేవశరణం = నీవే శరణము! కమలోదర= పద్మము నాభినందు కలవాడా!, శ్రీ జగన్నాథ = శ్రీజగన్నాథస్వామీ!

వాసుదేవ = వసుదేవుని పుత్రుడా! కృష్ణ = శ్రీకృష్ణుడా! శ్రీసతీశ = లక్ష్మీపతీ!, సరసిజ = కమలనేత్రా!, భూసురవల్లభ = బ్రాహ్మణులకు నాథుడా!, పీతకౌశేయ= పీతాంబరా!, జగన్నాథా = శ్రీజగన్నాథస్వామీ!

బలభద్రానుజ = బలరాముని తమ్ముడా!, పరమపురుష = మోక్షస్వరూపుడా, దుగ్ధ జలధి విహారా = పాలసముద్రములో విహరించువాడా! కుంజరవరద = గజేంద్ర రక్షకా!, సులభ = సులభుడా!, సుభద్రాసుముఖ= సుభద్రాదేవికి ప్రసన్నుడా!, సురేశ్వర = దేవతలకు నాయకుడా! కలిదోషహరణ = కలిదోషము లను హరించువాడా! జగన్నాథ = శ్రీజగన్నాథస్వామీ! నీకే శరణము.

వటపత్రశయన = వటపత్రమునందు శయనించినవాడా!, భువనపాలన = లోకపాలన! జంతుఘటకార= శరీర ధారులనే కుండలను నిర్మించు కుమ్మరీ!, కరుణ = జాలిగలవాడా!, శృంగారాధిప = శృంగారరసాధి దేవత!, పటుతర = మిక్కిలిసమర్థుడా!, నిత్యవైభవరాయ = నిత్యవైభవములతో శోభిల్లుతున్న వాడా! తిరు వేంకటగిరి నిలయ = తిరువేంకటాచలము నిలయముగాగలవాడా!, త్వమేవశరణం త్వమేవ శరణం = నీవే శరణము నీవే శరణము.



**తాత్పర్యము :** కమలము ఉదరమునందు కలవాడా! శ్రీజగన్నాథా! నీవే శరణం నీవే శరణం.

వసుదేవుని పుత్రుడా! శ్రీకృష్ణా! లక్ష్మీపతీ! కమలనేత్రా! భూసురవల్లభా! పీతాంబరా! శ్రీజగన్నాథా నీవే శరణము.

బలరాముని తమ్ముడా! మోక్షస్వరూపుడా! పాలసముద్రమునందు విహరించువాడా! గజేంద్ర వరదా! సులభుఁడా! సుభద్రాదేవికి ప్రసన్నుడా! దేవతలకు నాయకుడా! కలిదోషములను హరించువాడా! శ్రీజగన్నాథస్వామీ నీవే శరణము.

వటపత్రమునందు శయనించినవాడా! లోకపాలన! శరీరధారులనే కుండలను నిర్మించువాడా! జాలికలవాడా! శృంగారాధిప! మిక్కిలి సమర్థుడా! నిత్యవైభవరాయ! తిరువేంకటాచలం నిలయముగా కలవాడా! నీవే శరణము.

(ఇది పూరీ క్షేత్రములోని సుభద్రాబల భద్రులతో కూడిన శ్రీజగన్నాథ స్వామి మీద సంకీర్తన.)

## 30. కన్నడగౌళ

త్వమేవ శరణం త్వామేవ మే
భ్రమణం ప్రసరతి ఫణీంద్రశయన ॥పల్లవి॥

కదావా తవ కరుణా మే
సదా దైన్యం సంభవతి
చిదానందం శిథిలయతి
మదాచరణం మధుమథన ॥త్వమే॥

మయా వా తవ మధురగతి (?)
భయాదిహ విభ్రాంతోఽహం
తయా విమలం దాతవ్యా
దయా సతతం ధరణీరమణ ॥త్వమే॥

ఘనం వా మమ కలుషమిదం
అనంతమహిమాయతస్యతే
జనార్దన ఇతి సంచరసి
ఘనార్చన వేంకటగిరి రమణ ॥త్వమే॥ (సంపుటం-4-కీర్తన-42)

ఫణీంద్రశయన = ఓ! శేషశాయీ!, త్వమేవ శరణం = నీవే, మే = నాకు, శరణం = శరణు, మే = నా యొక్క, భ్రమణం = భ్రమణము, త్వామేవ= నిన్నే, ప్రసరతి = అనుసరిస్తున్నది. మధుమథన = మధుసూదనుడా! కదావా = ఎప్పుడు, తవ = నీయొక్క, కరుణా = దయ కలుగుతుందా!, సదా =

ఎల్లప్పుడూ, మే = నాకు, దైన్యం = దీన భావన, సంభవతి = కలుగుతోంది, చిదానందం = చైతన్యం యొక్క ఆనందమును, మదాచారణం = నాయొక్క ఆచరణ, శిథిలయతి = దూరం చేస్తున్నది.

ధరణీ రమణ = భూ దేవతను పాలించువాడా!, తవ = నీయొక్క, మధురగతి భయాదిహ = సంగమాన్ని ప్రాప్తించునో లేదే అన్న భయం వల్ల, విభ్రాంతోహం = సందేహిస్తున్నాను. తయా విమలందాతవ్యా = నీ మధుర సమాగమము చక్కగా ఇవ్వవలెను. వేంకటగిరి రమణ = వేంకటాచలంపై రమించువాడా! ఘనార్చన = ఎల్లప్పుడూ ఆరాధించబడువాడా, మమ = నా యొక్క, ఘనం = గొప్పదైన, ఇదం కలుషం = ఈ పాపాన్ని పోగొట్టుము, ఆయతస్య = విస్తృతమైన, తే = నీయొక్క, అనంతమహిమ = గొప్పదైన మహిమ కలిగి ఉడటంచేత, జనార్ధన ఇతి = జనులను లయం చేసుకోనే వాడుగా, సంచరసి = సంచరిస్తున్నావు.

**తాత్పర్యము :** ఓ శేషశాయి! నాకు నీవే శరణు. నామార్గం నిన్నే అనుసరిస్తున్నది. ఓ! మధుసూదనా! ఎప్పుడు నీదయ కలుగుతుందా! అని ఎల్లప్పుడు దైన్యభావనతో ఉంటున్నాను. నా ఆచారములు శాశ్వత ఆనందాన్ని శిథిలం చేస్తున్నాయి. భూదేవతారమణ! నీ సాంగత్యం కలుగదేమోనని విభ్రాంతుడనవు తున్నాను. నీ మధురసమాగమాన్ని అనుగ్రహించు. నీ అపారమహిమతో జనులను వశం చేసుకొనే వేంకటాచలరమణ! ఎల్లవేళలా ఘనమైన అర్చనలందుకొను స్వామీ! నా పాపాలను పోగొట్టి అనుగ్రహించు.

## 31. రామక్రియ

దంతచ్ఛదముద్రా మదనాస్త్రల
తాంతశాంతికృతిరహో భవతి ॥పల్లవి॥

వనితాకుచ యోర్వరనఖరేఖా
ర్జన శశిచిహ్నం సఫలమిదం
ఘనకరుణాం మయి ఘటయ చంద్ర ఇ
త్యనునయకారణమహో భవతి ॥దంత॥

సతీమణీ విలసత్కరమూలే
చతురలాంఛనం సఫలమిదం
వ్రతతిభయహృతే వరదాస్య కలన
మతిఘాతాకృతిరహో భవతి ॥దంత॥

తరుణీ తనుగంధ విలేపన వి
స్తర సౌభాగ్యం సఫలమిదం
పరిరంభసుఖే తిరువేంకటగిరి
హరేః పూజనమహో భవతి ॥దంత॥

(సం.5-కీ-318)

**అర్థము :** దంతచ్ఛదముద్రా = నాయికమోముపై శ్రీవారి దంతక్షతముద్ర, మదనాస్త్ర = మన్మథబాణాలైన, లతాంత = లతాంతములలో, శాంతికృతిః = శాంతిరచన, భవతి = అవుతున్నది. అహో = ఆశ్చర్యము.

వనితాకుచయోః = నాయిక స్తనములపై, నఖరేఖ = శ్రీహరి నఖరేఖలు, నఖరేఖార్జన = నఖాంకముల సంపాదన ఫలమైన, ఇదం = ఈ, శశిచిహ్నం = నెలవంక గుర్తును, సఫలం = ఫలవంతము, హే చంద్ర = ఓ చందురుడా, మయి = నాపై, ఘనకరుణాం = గొప్ప కరుణను, ఘటయ = ఏర్పడజేయి, ఇతి = అనెడి, అనునయ = బుజ్జగించుటకు, కారణం భవతి = కారణమగుచున్నది . అహో = ఆశ్చర్యము.

సతీమణి = వనితామణి యొక్క, విలసత్ = మెఱయుచున్న, కరమూలే = బాహుమూలమునందు, ఇదం = ఈ, చతురలాంఛనం = నిపుణుడైన శ్రీవారు చేసిన, చతుర లాంఛనము = నఖలాంఛనము, సఫలం = ఫలవంతము, వ్రతతి = విరహవేళలో తీగలవలన, భయహృతే = భయాన్ని మాన్పుట కొఱకు, వర = వరుడైన శ్రీహరి యొక్క, దాస్యకలనం = దాస్యస్వీకారమై, అతిఘాతాకృతి = మిక్కిలినొక్కుట వంటిదై, భవతి = అవుతున్నది. అహో = ఆశ్చర్యము.

ఇదం = ఈ, తరుణీతను = నాయికశరీరముపై, గంధవిలేపనం = శ్రీహరి చేసిన శ్రీ గంధచర్చ యొక్క, విస్తర = ఎక్కువ చేత కలిగిన, సౌభాగ్యం = భాగ్య లక్షణము, సఫలం భవతి = ఫలవంతమగు చున్నది. పరిరంభసుఖే = ఆలింగనం వల్ల కలిగిన సుఖమునందు, తిరువేంకటగిరి హరేః = తిరువేంకటాద్రిపై నెలకొన్న శ్రీ హరికి , పూజనం భవతి = పూజనమవుతున్నది. అహో = ఆశ్చర్యము.

**తాత్పర్యము :** నాయిక పెదవులపై కల శ్రీవారి దంతక్షతములు మదనబాణము లైన పూవులకు శాంతికరణము అవుతున్నవి. నాయిక పయ్యెదలపై మాధవుని యీ గోటి గుర్తులు సఫలమవుతున్నాయి. విరహసమయంలో "ఓ చంద్రుడా! నాపై కరుణను చూపించుము" అని అనునయ ప్రార్థనకు కారణమవుతున్నాయి. నాయిక బాహుమూలాలలో, శ్రీహరి చేసిన యీ చతురనఖక్షతము "విరహవేళలలో తీగలవలన భయాన్ని మాన్పుటకై తన దాస్య స్వీకారము సూచిస్తూ మిక్కిలి శ్రేష్ఠముగా సఫలమవుతున్నది. ఆశ్చర్యము! నాయిక శరీరంపై శ్రీవారు చేసిన యీ శ్రీ గంధ చర్చాలేపనం ఫలవంత మవుతున్నది. పరిరంభ సుఖసమయములో శ్రీ తిరువేంకటనాథుడైన శ్రీ వారికి, ఇది గంధపుపూత అనే పూజ అవుతున్నది.

## 32. కేదారగౌళ

దశవిధాచరణం తన్నభవతి
దశవిధావస్థార్థం తే తత్ర ॥పల్లవి॥

స్థాపయిష్యామి వేదానితి వ్యాజేన
దీపితోయం మత్స్య దేహః పురా
వ్యాపారోయమేవం నచ తరుణ్యా
రూపజలధౌ కేళిరుచయే తత్ర ॥దశ॥

ధారయిష్యామి మందరమితి వ్యాజేన
చారుకచ్ఛపవిధాచరణం పురా
నీరసేయం తవ మనీషా ప్రియవధూ-
భారకుచమందరౌ భర్తుం తత్ర ॥దశ॥

భువముద్ధరిష్యామి పునరితి వ్యాజేన
ధవళకటివైభవం ధత్సే పురా
వ్యవహృతిరియం నచ మహామహీకుచతటే
తవ దంతక్షతం దాతుం తత్ర ॥దశ॥

దనుజం హరిష్యామి తమితి వ్యాజేన
ఘన నారసింహవిక్రమణం పురా
దనుజహర తవ మహత్త్వం తన్నచ నఖా
ర్జనమిందిరాయాం ప్రసర్తుం తత్ర ॥దశ॥

అపహరిష్యామి బలిమహమితి వ్యాజేన
కపటవామనరూపకలనం పురా
నిపుణ ఏవం నఖలు నియతిస్స్త్రీషు తే
కపటాచరణం ఘటయితుం తత్ర ॥దశ॥

సంహరిష్యామి నృపజనమితి వ్యాజేన
బహ్వారుణతోయే ప్రాప్తిః పురా
సింహవిక్రమణతే స్థితిరియం నచ సతీ-
'విహ్వలత్వం తదా వేత్తుం తత్ర ॥దశ॥

రావణం జేష్యామి రణ ఇతి వ్యాజేన
భూవరత్వే తే భోగః పురా
ఏవం నభవతి మహీనుతా విరహం
సావధానేన ప్రహర్తుం తత్ర ॥దశ॥

కంసం హనిష్యామి ఖలమితి వ్యాజేన
సంసారోయమాచరితః పురా
హింసాదూర నచ హితమిదం వ్రజవధూ-
సంసరణలీలాం ప్రసక్తుం తత్ర ॥దశ॥

పాత యిష్యే ప్రలంబమితి వ్యాజేన
జాతరోషస్య తే జననం పురా

భూతరక్షక తే ప్రభుత్వం తన్నఖలు
భూతలే రేవతీం భోక్తుం తత్ర ॥దశ॥

బుద్ధో భవిష్యామి పురహ్వాతివ్యాజేన
బద్ధరోష ఇతి తే ప్రాప్తిః పురా
తద్ధితం నహిఖలు తదా వధూహస్త -
సిద్ధప్రసారేణ సేవితుం తత్ర

మారయిష్యామి కలిమతమితి వ్యాజేన
క్రూర కల్క్యవతారకోపః పురా
ధీర వేంకటనగాధీశ ఏవం నఖలు
భీరుమూర్వీం సంప్రీణయితుమత్ర ॥దశ॥

(సంపుటం-5-కీ-374)

దశవిధా చరణం = పది అవతారములు ధరించుట, తత్ర = అక్కడ (భూలోకంలో), తే = నీయొక్క, దశవిధావస్థార్థం = పదిరకాలైన అవస్థల కొఱకు, తన్నభవతి = అదికాదు.

పురా = ముందు, వేదాన్ = వేదములను, స్థాపయిష్యాతి = ప్రతిష్ఠించ గలను, ఇతి = అని, అయం మత్స్య దేహ = ఈ మత్స్యశరీరము, వ్యాజేన = మిషచేత, దీపిత = ప్రకాశింపబడినది, ఏవం = ఈ విధముగా, తత్ర = అక్కడ, అయం = ఈ, వ్యాపారః = మత్స్యావతార లీల అందుకోసంకాదు, తరుణ్యా = లక్ష్మీదేవి యొక్క, రూప జలధే = సౌందర్య సముద్రమందు, కేళిరుచయే = క్రీడాభిలాష కొరకే,

పురా = ముందు, మథరం = క్షీరమథనం కోసం మంధర పర్వతాన్ని, ధారయిష్యామి = ధరిస్తాను, ఇతి = అని, వ్యాజేన = మిషచేత, చారు కచ్ఛపవిధానం = సుందరమైన తాబేటి రూపాన్ని ధరించుట, తవ = నీయొక్క మనీషా = కల్పన, ఇయం = ఇది, నీరస = బలములేనిది, తవ = అక్కడ, ప్రియవధూభారకుచ మందరౌ - లక్ష్మీదేవి యొక్క భారవంతమైన పాలిండ్లనే మంథర పర్వతమును, ధర్తుం = ధరించుటకే,

పురా = ముందు, భువం = భూ మండలాన్ని, ఉద్ధరిష్యామి = ఎత్తగలను, ఇతి = అని, వ్యాజేన = మిషచేత, ధవళకిటివైభవం = తెల్లని వరాహ రూపాన్ని, ధత్సే = ధరిస్తున్నావు, ఇయం = ఈ, వ్యవహృతిః = వ్యవహారము, న = దాని కొరకై కాదు, మహా మహీకుచతటే = నీపత్నియైన భూదేవి పాలిండ్ల యందు, తవ = నీయొక్క, దంతక్షతం = పంటి గాట్లను, దాతుం = చేయుటకొరకే

దనుజం = హిరణ్య కశిపుని, హనిష్యామి = సంహరిస్తాననే, వ్యాజేన = మిషచేత, పురా = ముందు, ఘననారసింహ విక్రమణం, గొప్పదైన నృసంహ పరాక్రమాన్ని చూపించుట, దనుజహర = రాక్షసులను సంహరించువాడా! తవ = నీయొక్క, మాహాత్యం = గొప్పదనం, తం నచ = అది కానేకాదు, ఇందిరాయాం నీ ఇల్లాలైన లక్ష్మీదేవియందు నఖార్జనం = నఖక్షతాలను, ప్రసర్తుం = ప్రసరింప జేయుటకే, తత్ర = అక్కడి ఉద్దేశ్యము.

అహం = నేను, బలిం = బలిచక్రవర్తిని, అపహరిష్యాతి = అపహరిస్తానని, పురా = ముందు, వ్యాజేన= మిషచేత, కపట వామనరూపకలనం = కపటమైన వామనరూపాన్ని దాల్చుట, హే! నిపుణ! = ఓ నేర్పరీ!, ఏవం = ఈ విధంగా, నియతి = విధానం యొక్క ఉద్దేశ్యము, నఖలు = కాదు కదా!, తత్ర = అక్కడ, తే = నీయొక్క, సతీషు = భార్యలయందు, కపటాచరణం = లీలా విలాసములను ప్రదర్శించుటకై చేయు మిషము, ఘటయింతు = చేయుటకే.

నృపజనం = క్షత్రియులను, సంహరిష్యామి = చంపగలను = ఇతి = అనే, వ్యాజేన = మిషచేత, బహ్వారుణతోయే = రక్తసిక్తమైన నీటియందు, ప్రాప్తిః = ఉండుట, పురా =ముందు, సింహ విక్రముడా = సింహము వంటి పరాక్రమము కలవాడా, తే = నీయొక్క, స్థితి = దశ, తత్ర = ఆ విషయములో, నచ= అదికాదు, సతీవిఫలత్వం = లక్ష్మీదేవి యొక్క విరహ వేదనను, తదా = అప్పుడు, వేత్తుం = తెలుపుట కొరకే.

పురా = ముందు, రణే = యుద్ధభూమిలో, రావణం = రావణాసురుని, జయిష్యామి = జయించగలను, ఇతి = అనే, వ్యాజేన = మిషచేత, భూవరత్వే = భూపతిగా, తే = నీయొక్క, భోగ = భోగము, ఏవం నభవతి= అలాకోరుకునీ, మహీనుతా = భూదేవి యొక్క, ప్రశంసలందుకొన్న సీతాదేవి యొక్క, విరహ = విరహాన్ని, సావధానేన = ఎంతో తత్పరతతో, ప్రహర్తుం = తొలగించుటకొరకే.

పురా = ముందు, కంసం = కంసుని, ఖలమితి = దుష్టుడని, హనిష్యామి = చంపగలను, ఇతి = అని, వ్యాజేవ = మిషచేత, సంసారోయమాచరిత = కృష్ణావతారాన్నిపొంది సంసారాన్ని ఆచరించావు, హింసాదూర= హింసలకు దూరముగా ఉండువాడా! హితమిదం = ఆ హితము కొరకుకాదు, వ్రజవధూ సంసరణ లీలాం= గోపాంగనలను అనుసరించు లీలను, ప్రసర్తుం = చేయుటకొఱకే!

ప్రలంభం = ప్రలంబాసురుని, పాతయిష్యే = పడగొట్టగలను, ఇతి = అని, వ్యాజేవ = మిషచేత, తే= నీ యొక్క, జాతరోషస్య = పుట్టినప్పుడే రోషముగల, జననం = బలరామునిగా జన్మించుట, భూత రక్షక = సమస్త ప్రాణులను రక్షించువాడా! తే = నీయొక్క, ప్రభుత్వం = ప్రభుత, తన్నఖలు = అదికాదు కదా!, భూతలే = భూతలమందు, రేవతీం భోక్తాం = రేవతీ దేవితో సంభోగించుట కొరకే

బుద్ధో భవిష్యామి = బుద్ధుడిగా కాగలను, ఇతి = అని, వ్యాజేన = మిషచేత, బద్ధరోష ఇతి తే ప్రాప్తిః= రోషమును జయించినవాడుగా నీయొక్క బుద్ధావతారమును అనుకొంటారు, తద్దితం నహి = అందుకొఱకు కాదు, తదా = అప్పుడు, వధూహస్త సిద్ధప్రసారేణ = త్రిపుర యువతులకు సిద్ధిని కలిగించుటకు అనే వ్యాజం చేత, సేవితుం = సేవించుటకొరకే!

పురా = ముందు, క్రూరకల్క్యావతరకోపః = క్రూరమైన కల్కి అవతారమును ధరించిన కోపము కలిగి ఉండుట, కలిమతం = కలి ప్రభావాన్ని మారయిష్యామి = తొలగిస్తాను, ఇతి = అని, వ్యాజేన = మిషచేత, హే! ధీర వేంకటన గాధీశ = ఓ! ధీరుడైన వేంకటాచలపతీ! ఏవం నఖలు అలకాదుకదా! భీరుం = భయపడిన, ఉర్వీం = భూమిని, సంప్రీణయితుమత్ర = ఇక్కడ సంతోష పెట్టుట కొరకు.

**తాత్పర్యము** : ఈ కీర్తనలో ఖండితనాయిక వేంకట నాయకుని దశావతారమూర్తిగా దర్శించి, అధిక్షేపిస్తున్నది. నీవు దశావతారాలను ధరించినది, ధర్మరక్షణకోసం కాదు ఆమిషతో పదివిధములైన నీశృంగార అవస్థలను పొందుటకోసమే.

పూర్వం వేదాలను ప్రతిష్ఠిస్తానని మత్స్యావతారాన్ని ధరించి, సముద్రంలో సాగరతనయ లక్ష్మీదేవితో జలక్రీడలు నెఱపావు. మంధరపర్వతాన్ని ఎత్తడానికని చెప్పి తాబేలు రూపాన్ని దాల్చి - లక్ష్మీదేవి భారమైన పాలిండ్లను ఎత్తావు. భూమండలాన్ని అపార జలరాశినుండి ఎత్తుతానని పలికి, శ్వేతవరాహరూపాన్ని దాల్చి భూదేవి పాలిండ్ల మధ్య నీ దంతపుగాట్లు చేశావు. ప్రహ్లాదుని తండ్రి హిరణ్యా కశిపుని సంహరిస్తానని చెప్పి, అవలీలగా సంహరించి, లక్ష్మీదేవిని నీ గోళ్ళతో పరవశింపజేశావు. నేను బలిని అపహరిస్తానని పలికి, వామనరూపాన్ని దాల్చి అక్కడున్న స్త్రీలముందు నీ లీలావిలాసాలను ప్రదర్శించావు. క్షత్రియులను సంహరిస్తానని పలికి, సింహపరాక్రముడవై తిరిగి లక్ష్మీదేవిని విరహవేదనలో మరగించావు. రావణాసురుడు లోకకంటకుడు, రణభూమిలో సంహరిస్తానని చెప్పి, సీతాదేవి విరహాన్ని పోగొట్టావు. కంసుని సంహారంచేస్తానని చెప్పి బాల్యంలోనే చంపి, గోపాంగనల వెంటబడ్డావు. ప్రలంబాసురుని మట్టుబెడతానని చెప్పి బలరాముడవై, రోషానికి మారురూపుగా ప్రసిద్ధుడై, రేవతీదేవితో సరసాలాడావు. త్రిపురాసుర సంహారమని చెప్పి బుద్ధుడవై, త్రిపురస్త్రీలకు సిద్ధిని కలిగించావు. కోపముతో క్రూరమైన కల్క్యవతారమును ధరించి, కలిదోషాలను తొలగిస్తానని చెప్పడం - భయపడుతున్న భూమాతను ప్రేమించుటకే. ఓ! వేంకటాచలపతీ - ఇలా నాయిక చమత్కారంగా నిందాస్తుతి చేస్తున్నది. శ్రీవారి అవతారాలన్నీ, శృంగార ప్రయోజనాలకేనని, యుక్తిగా కోపగించిన వేంకటగిరినాధుని ప్రియురాలు అలమేలుమంగ సంకీర్తనం చేస్తున్నది.

## 33. ధన్నాసి

దేవదేవం భజే దివ్యప్రభావం
రావణాసురవైరి రఘుపుంగవం ॥ పల్లవి ॥

రాజవరశేఖరం రవికుల సుధాకరం
ఆజానుబాహు నీలాభ్రకాయం
రాజారి కోదండ రాజదీక్షాగురుం
రాజీవలోచనం రామచంద్రం ॥ దేవ ॥

నీలజీమూత సన్నిభశరీరం ఘనవి
శాలవక్షం విమలజలజనాభం
తాలాహినగహరం ధర్మసంస్థాపకం
భూలలనాధిపం భోగిశయనం ॥ దేవ ॥

పంకజాసనవినుత పరమనారాయణం
శంకరార్జిత జనక చాపదళనం
లంకావిశోషణం లాలితవిభీషణం
వేంకటేశం సాధు విబుధ వినుతం ॥ దేవ ॥

(సంపు.-1-సం.314)

**అర్థము :** దివ్యప్రభావం = దివ్యప్రభావుడయిన, దేవదేవం = దేవతలకు దేవుడయిన, రావణాసురవైరి = రావణుని జంపిన, రఘుపుంగవం = రఘుశ్రేష్ఠుని, భజే = సేవింతును.

రాజవరశేఖరం = రాజశ్రేష్ఠులకు శిరోభూషణమైనవానిని, రవికుల = సూర్య వంశానికి, సుధాకరం = చంద్రుడైనవానిని, ఆజానుబాహు = మోకాళ్ళవఱకు బాహువులున్న, నీలాభ్ర = నీలమేఘమువంటి, కాయం= శరీరము గలవానిని, రాజారి = క్షత్రశత్రువైన పరశురాముని యొక్క, కోదండ రాజ = కోదండ శ్రేష్ఠమునకు, (విష్ణుధనుస్సునకు) దీక్షాగురుం = దీక్షాగురువైనవానిని, రాజీవలోచనం = పద్మనయనుడైన, రామచంద్రం= రామచంద్రుని, భజే = సేవించుచున్నాను.

నీలజీమూత సన్నిభశరీరం = నల్లమబ్బుతో సమానమైన శరీరాలు గలవానిని, ఘనవిశాల వక్షం = ఎత్తైన విశాల వక్షం, విమల = స్వచ్ఛమైన, జలజనాభం = తామరపువ్వును నాభియందుగలవానిని, తాలాహినగహరం = పాములా మెలికలు తిరిగిన కొండంత ఎత్తైన ఏడు తాటిచెట్లను ఛేదించినవానిని, ధర్మ సంస్థాపకం= సకలధర్మములను భూమిపై స్థాపించిన వానిని, భూలలనాధిపం = సీతావల్లభుని, భోగిశయనం= శేషశయనుని, భజే = సేవింతును.

పంకజాసన వినుత = బ్రహ్మచేత వినుతింపబడిన, పరమనారాయణం = పరముడైన శ్రీమన్నారాయణుని, శంకరార్జిత = శంకరుని నుండి సంపాదింపబడిన, జనక = మిథిలరాజుల యింటిలో పూజింపబడుచున్న, చాప = శివధనుస్సును, దళనం = విఱిచినవానిని, లంకావిశోషణం = లంకానగరములో రాక్షసులను ఎండగట్టిన వానిని, లాలిత విభీషణం = ఆదరించబడిన విభీషణుడు గలవానిని, సాధు = సజ్జనులచేత, విబుధ = దేవతలచేత, వినుతం = వినుతింపబడిన, దేవదేవం వేంకటేశంభజే = దేవదేవుడైన వేంకటేశ్వరునికి సేవింతును.

**తాత్పర్యం :** రాముడు శివధనుస్సును విరిచెనని విని పరశురాముడు అతని విష్ణ్వవతారమును పరీక్షించుటకై తమ యింటిలో తరతరముల నుండీ పూజలందుకొంటున్న విష్ణుధనుస్సును తెచ్చి-దీనిని "నీవెక్కుపెట్టగలిగినచో నీతోద్వంద్వయుద్ధము చేయుదు"ననెను. రాముడు పరశురాముడు తెచ్చిన ఆ వైష్ణవధనుస్సునెక్కుపెట్టి ఆతని కోరికననుసరించి, ఆతని తపోలోకములను హరించెను. "రాజారికోదండ రాజదీక్షాగురుం" అన్న విశేషణములో అన్నమా చార్యులు రామాయణములోని యీ విషయమును సూచించిరి. ఇక సుగ్రీవునకు తన పరాక్రమము పట్ల నమ్మకము కలిగించుటకు శ్రీరాముడు ఒక్క బాణముతో పాములా మెలికలు తిరిగి వరుసగాలేని ఏడుతాడిచెట్లను ఛేదించెనన్న రామాయణకథ నిచ్చట స్మరించుకొనవలెను.

బ్రహ్మచేత వినుతింపబడిన, పరముడైన శ్రీమన్నారాయణుడే రాముడు. శంకరుని నుండి సంపాదింపబడి, మిథిలరాజుల యింటిలో పూజింపబడుచున్న శివధనుస్సును విరిచిన వానికి, లంకానగరాన్ని శోషింపచేసి, సాధుసజ్జనులచేత, దేవతలచే వినుతింపబడిన వేంకటాద్రి శ్రీరాముని సేవింతును. (ఈ కీర్తనలో శ్రీరామునకు శ్రీవేంకటేశ్వరస్వామికి అభేదత్వాన్ని పాటిస్తూ నుతించడం జరిగినది.)

## 34. పాడి

దేవదేవోత్తమ తే నమో నమో
రావణదమన శ్రీ రఘురామా! ॥పల్లవి॥

రవికులాంబుధిసోమ రామ లక్ష్మణాగ్రజ
భువి భరత శత్రుఘ్నపూర్వజ
సవనపాలక కౌసల్యానంద వర్ధన
ధవళాబ్జనయన సీతారమణా ॥దేవ॥

దనుజసంహారక దశరథనందన
జనకభూపాలకజామాత
వినమితసుగ్రీవ విభీషణసమేత
మునిజనవినుత సుముఖ సుచరిత్రా ॥దేవ॥

అనిలజవరద యహల్యాశాపమోచన
సనకాదిసేవితచరణాంబుజ
ఘనతర శ్రీవేంకటగిరినివాస
అనుపమోదార విహార గంభీరా ॥దేవ॥ (సంపుటం-4-కీ-491)

సర్వపోషక = సమస్త జీవులను పోషిస్తున్నవాడా!, దేవ = ఓ! పరమాత్మా!, కరుణా నిలయ = కరుణకు నిలయమైనవాడా!, రామ = ఓ! శ్రీరామభద్రా!, కౌసల్యానందన = కౌసల్యకు తనయుడైనవాడా!, శరణు శరణు= శరణువేడు చున్నాను.

వారిధి బంధన = సముద్రానికి సేతువును కట్టినవాడా!, రావణ శిరశ్ఛేదక = రావణుని శిరస్సును ఖండించినవాడా!, మారీచసుబాహు బలమర్దన = మారీచ సుబాహువుల బలాన్ని భేదించినవాడా, దారుణ కుంభకర్ణ దనుజసంహారక = దారుణమైన కుంభకర్ణుడనే రాక్షసుని చంపినవాడా! వీరప్రతాపరామ = వీరప్రతాపాలు కలిగినవాడా!, విజయాభిరామ = విజయాన్ని పొందిన శ్రీరామా!

సవన రక్షక! = విశ్వామిత్రుని యాగాన్ని పరిరక్షించినవాడా!, మునిజనకుల నిర్వాహక = మునిజనులను నిర్వహించినవాడా! వివిధ సప్తతాళ విధ్వంసన చతుర = వరుసగా లేని ఏడు తాడి చెట్లను ఒక్కబాణంతో కూల్చిన నైపుణ్యం కలవాడా!, భువనేశ!= లోకాలకు రక్షకుడా! సాకేత పురవాస = అయోధ్యాపురంలో నివసించినవాడా! రామ = ఓ! శ్రీరామా!

హరచాప హర! = శివుని విల్లు విరిచినవాడా!, అహల్యా శాప విమోచక = అహల్యాశాపాన్ని పోగొట్టినవాడా!, ఖరశరవాలి నిగ్రహ బిరుద! = ఖరుడిని, శరుడిని, వాలిని నిగ్రహించిన వాడా!, (వాడియైన ప్రయోజనములతో వాలిని నిగ్రహించిన బిరుదము కలవాడా) నిరతి శ్రీవేంకటేశ = ఘనుడైన శ్రీవేంకటేశ్వరుడా!, నిజభక్తరక్షక =

ఆశ్రిత భక్తులను రక్షించువాడా!, ధరణిజా సమేత! = సీతాసమేతుడైన శ్రీరామా!, దశరథ రామా = దశరథ పుత్రుడవైన శ్రీరామా!

**తాత్పర్యం :** సమస్తజీవులను పోషిస్తున్న ఓ! శ్రీరామా! కరుణకు గనివంటివాడా! శ్రీరామచంద్రా! కౌసల్యకుమారుడా! శరణువేడుతున్నాను. సముద్రానికి సేతువు కట్టినవాడా! రావణుని శిరస్సును ఖండించినవాడా! మారీచ సుబాహువుల బలాన్ని భేదించినవాడా! క్రూరుడైన కుంభకర్ణుడనే రాక్షసుని చంపినవాడా! వీరప్రతాపాలు కలిగినవాడా! విజయానికి మారుపేరుగా నిలిచిన శ్రీరామా! విశ్వామిత్రుని యాగాన్ని పరిరక్షించినవాడా! మునిజనులను నిర్వహించినవాడా! వివిధ తాళవృక్షాలను కూల్చిన నైపుణ్యశాలీ! లోకరక్షకుడా! సాకేత పురవాసుడా! శ్రీరామా! శివధనుస్సు విరిచినవాడా! అహల్యాశాపాన్ని పోగొట్టినవాడా! ఖరుడు, శరుడు, వాలి వంటి దుష్టులను నిగ్రహించినవాడా! ఘనుడైన శ్రీవేంకటేశ్వరా! ఆశ్రిత రక్షక! సీతాసమేత శ్రీరామా! దశరథపుత్రుడా! నమస్కారము.

## 35. మాళవిరాగం

దేవ! నమో దేవా!
పావనగుణగణభావా! ॥పల్లవి॥

జగదాకార! చతుర్భుజ!
గగననీల! మేఘశ్యామ!
నిగమపాదయుగ! నీరజనాభ!
అగణిత లావణ్యాననా! ॥దేవ॥

ఘన! వేదాంతైక గణన! ఉదార!
కనక శంఖ చక్రకరాంకా!
దినమణి శశాంక దివ్యవిలోచన!
అనుపమరవిబింబాధరా! ॥దేవ॥

భావజకంజభవజనక!
శ్రీవనితా హృదయేశ!
శ్రీవేంకటగిరిశిఖర విహార!
పావనగుణగణభావా! ॥దేవ॥

**అర్థము :** దేవ = ఆనంద స్వరూపుడా!, నమః = నమస్కారము, దేవ = తేజః స్వరూపుడా!, నమః = నమస్కారము, పావన = పవిత్రమైన, గుణగణ = గుణస్తోమములకు, భావా = జన్మస్థానమా!, నమః = నమస్కారము.

జగదాకార = చరాచర సకల విశ్వరూపుడా!, చతుర్భుజ = చతుర్విధ పురుషార్థప్రదములయిన నాలుగు భుజములు గలవాడా!, నమః = నమస్కారము, గగననీల = అనంత గగనమువలె నీలవర్ణముకలవాడా!,

మేఘశ్యామ = నీలమేఘ శ్యామలుడా, నమః = నమస్కారము, నిగమపాదయుగ = జగత్ప్రవర్తకములైన వేదములే పాదయుగముగాగలవాడా!, నీరజనాభా = విశ్వస్వరూపమైన పద్మము నాభిలోకలవాడా!, అగణిత = గణింపశక్యముకాని, లావణ్య = సుందరమైన, ఆననా= ముఖముకలవాడా!, నమః = నమస్కారము, ఘన = గొప్పవాడా!, వేదాంతైకగణన = ఉపనిషత్తులు మాత్రమే లెక్కించుటకు శక్యమైనవాడా!, ఉదార = ఉదార స్వభావముగలవాడా!, కనక = బంగారు మయమైన, శంఖ-చక్ర-కరాంకా! = శంఖచక్రములే హస్తచిహ్నములుగా గలవాడా!, దినమణిశశాంక దివ్యవిలోచన = సూర్యచంద్రులనే తేజోమయములైన నేత్రములు కలవాడా!, అనుపమ = సాటిలేని, రవిబింబాధర = సూర్యబింబమువంటి అధరసంపుటము కలవాడా!, నమః = నమస్కారము.

భావజ-కంజభవ = మన్మథునకు-బ్రహ్మకు, జనక= జన్మ కారణమైనవాడా!, శ్రీవనితా హృదయేశ = లక్ష్మీదేవి హృదయేశ్వరుడా!, శ్రీవేంకటగిరి విహారా! = శ్రీ వేంకటాచలమునందు విహారము కలవాడా!, పావనగుణగణ = భువన పావనములయిన గుణస్తోమములకు, భావా = ఉత్పత్తిస్తానమా!, నమోనమః = నమస్కారము, నమస్కారము.

**తాత్పర్యము** :- మన్మథునకు- బ్రహ్మదేవునకు జన్మకారణమైనవాడా! లక్ష్మీదేవి హృదయేశ్వరుడా! వేంకటగిరి నిలయుడా! పావన గుణములకు ఉత్పత్తిస్థానమైన నీకు నమస్కారము. ఆనంద స్వరూపుడైన ఓ! దేవా! జగత్తును పునీతంచేసే కల్యాణగణములకు ఉత్పత్తి స్థానమా నమస్కారము. చరాచరసకల విశ్వరూపుడా! చతుర్విధ పురుషార్థములను ఇచ్చే భుజములు గలవాడవు, నీలమేఘవర్ణుడవు, వేదములే పాదములుగా గలవాడవు, పద్మనాభుడవు, అందమైన మోముకల స్వామీ! నీకు నమస్కారము. ఘన! ఉపనిషత్తుచే తెలియబడువాడా! ఉదారుడా! బంగారు శంఖచక్రాలను చిహ్నములుగా కలవాడా! సూర్యచంద్రదివ్యవిలోచనుడా! సాటిలేని సూర్యునివంటి ఎఱ్ఱని కాంతిగల పెదవులు కలవాడా! నమస్కారము.

## 36. బౌళి (జక్కిణి)

దేవ వాసుదేవ
భావయ తాం పాలయ ॥పల్లవి॥

నరహరే అహో నారాయణ
మురహర నగధర ముకుంద
తరుణీయం తు తవ విరహేణ
భరిత విచిత్రప్రతిమా జాతా ॥దేవ॥

దివిజవందిత దేవోత్తమ అహో
నవనీతప్రియ నందసుత
తవ సంగమసంతతకామనయా
యువతి ర్జాతా యోగినీవ ॥దేవ॥

జితదానవ అహో శ్రీ వేంకటపతే
సతత మాధవ కృష్ణ సర్వేశ
రతిసంగమేన రమణీ యం తు
బత తే విహితాభరణా జాతా ॥దేవ॥

(సంపుటం-19-కీ-332)

దేవ = ఓ ప్రకాశించువాడా! వాసుదేవ = సకలప్రాణులందూ నివసించువాడా!, తాం = ఆనాయికను, భావయ = స్మరించు, పాలయ = పరిరక్షించు, నరహరే = ఓ! నరహరీ!, నారాయణ = జ్ఞానముచేత తెలియదగువాడా!, మురహర = మురాసురుని సంహరించిన వాడా!, నగధర = గోవర్ధనపర్వతాన్ని ఎత్తినవాడా!, ముకుంద = మోక్షము నిచ్చువాడా!, ఇయం = ఈ, తరుణీ = యువతి, తవ = నీయొక్క, విరహేణ = విరహముచేత, భరిత విచిత్ర ప్రతిమ = విలక్షణమైన ఉదాసీనతతో చిత్రముగా నుండు దానిగా!, జాత = అయినది, ఆహో = ఎంతకష్టము.

దివిజనందిత = దేవపూజితుడా!, దేవోత్తమ = దేవతలలో ఉత్తముడా!, నవనీతప్రియ= వెన్నపట్ల ప్రీతి కలవాడా, నందనందన = నందుని కుమారుడా! తవ = నీతో, సంగత సంగమ కామనయా = కలియుట కొఱకు ఎల్లవేళల కోరుకొన్న దగుచూ, యోగినీవ = యోగినిలా, యువతి = ఆ నాయిక, జాత = అయినది, అహో = ఎంతకష్టము, జితదానవ= రాక్షసులను సంహరించినవాడా! శ్రీ వేంకటపతే = శ్రీ వేంకటనాథుడా! సతత మాధవ! = ఎల్లప్పుడు లక్ష్మీతో నివసించువాడా!, కృష్ణ = లీలారసముచేత ఆనందింపజేయువాడా! సర్వేశ = సకల లోకాలకు అధి నాయకుడా!, ఇయం = ఈ, రమణీ = యువతి, రతిసంగమేన = నీతో రతిక్రీడ సల్పుట చేత, తే = నీకు, నిహితాభరణ = శోభను కలిగించునదై, జాత = అయినది.

**తాత్పర్యం :** క్రీడానంద స్వరూపుడా! సకలప్రాణులలో నివసించుస్వామీ! నీ విరహంతో పరితపిస్తున్న నాయికను పరిరక్షించు. నారాయణ! నగధర! మురహర! ముకుందా! నీ విరహం కారణంగా ఈ యువతిలో ఎంత ఔదాసీన్యమో, ఎంతకష్టము. దేవతలచే పూజలందుకొనేవాడా! దేవతా శ్రేష్ఠుడా! వెన్నపట్ల ప్రీతికలవాడా! యశోదానందనుడా! నీ సాంగత్యానికై ఈ నాయిక యోగినిగా మారినది, ఎంతకష్టము. రాక్షసులను జయించినవాడా! వేంకటాచలాధీశ! లక్ష్మీనాథుడా! సకలలోకాలను లీలారసముచే ఆనందంపజేయువాడా! ఈ యువతి నీతో రతి సౌఖ్యాన్ని అనుభవిస్తూ నీకు శోభను కలిగించునదైనది.

**విశేషాంశం :** ఈ కీర్తనలో శ్రీవారి విరహంలో ఒక నాయిక చిత్రమైన ఉదాసీనతను పొంది, క్రమంగా యోగినిగా మారింది. స్వామికటాక్షంతో సాంగత్యసుఖాన్ని పొంది స్వామివారికే శోభావహమైనది - అని వర్ణించడం జరిగింది. ఇది విశిష్టాద్వైత సంప్రదాయ దృష్టితో రచించిన అన్నమయ్య అమోఘ సంకీర్తన.

**37. భూపాళం**

నందకధర! నందగోపనందన!
కందర్పజనక! కరుణాత్మన్ ॥పల్లవి॥

ముకుంద! కేశవ! మురహర!
సకలాధిప! పరమేశ్వర! దేవేశ!
శుకవరద! సవితృసుధాంశులోచన!
ప్రకట విభవ! నమః పరమాత్మన్! ॥నందక॥

ధ్రువపాంచాలీ స్తుతి వత్సల! మా
ధవ! మధుసూదన! ధరణీధర!
భువనత్రయ పరిపోషణ తత్పర
నవనీత ప్రియ! నాదాత్మన్! ॥నందక॥

శ్రీమన్! వేంకటశిఖరనివాస! మ
హామహిమన్! నిఖిలాండపతే!
కామిత ఫలభోగప్రద! తే నమో
స్వామిన్! భూమన్! సర్వాత్మన్! ॥నందక॥

(సం.4-కీ.66-అనుబంధం)

**అర్థము :** నందకధర = నందకమను పేరుకలిగిన ఖడ్గాన్ని దాల్చినవాడా! నందగోపనందన = నందగోపుని కుమారుడా! కందర్పజనక = మన్మథుని తండ్రీ!, కరుణాత్మన్ = కరుణాంతరంగుడా!

ముకుంద = మోక్షమిచ్చువాడా, కేశవ = కేశవా, మురహర = మురాసురుని చంపినవాడా! సకలాధిప= సమస్త జగత్తుకు అధినాథుడా!, పరమేశ్వర = సృష్టికర్తా! దేవేశ = దేవతలకు రక్షకుడా! శుకవరద = శుకునకు వరము నిచ్చినవాడా! సవితృ = సూర్యుడు!, సుధాంశు = చంద్రుడు! లోచన = కన్నులుగా గలవాడా!, ప్రకటవిభవ = ప్రసిద్ధమైన వైభవము కలవాడా! పరమాత్మన్ = పరమాత్ముడా!, నమః = నమస్కారము.

ధ్రువ = ధ్రువునియొక్క, పాంచాలీ = ద్రౌపదియొక్క, స్తుతి = స్తోత్రములందు, వత్సల = ప్రీతికలవాడా!, మాధవ = లక్ష్మీపతీ!, మధుసూదన = మధువనెడి రాక్షసుని సంహరించినవాడా!, ధరణీధర= భూమిని మోసినవాడా!, భువనత్రయ = మూడులోకములయొక్క, పరిపోషణ = సంరక్షణయందు, తత్పర= తదేకాసక్తి గలవాడా!, నవనీతప్రియ = వెన్నయందు ప్రీతి కలవాడా!, నాదాత్మన్ = నాదస్వరూపుడా!

శ్రీమన్ = శ్రీమంతుడా!, వేంకటశిఖర నివాస = శ్రీవేంకటాద్రిశిఖరము నివాసముగా గలవాడా!, మహామహిమన్ = మహామహిమకలవాడా!, నిఖిలాండపతే = సమస్తసృష్టికీ జనకుడా!, కామితఫల = కోరిన ఫలాలిచ్చేవాడా!, భోగ = అనుభవమును!, ప్రద = ప్రసాదించునట్టివాడా!, స్వామిన్ = స్వామీ!, భూమన్ = ఐశ్వర్యస్వరూపమా!, సర్వాత్మన్ = సర్వాత్మకుడా!

**తాత్పర్యము:** నందక ఖడ్గాన్ని ధరించినవాడా! నందగోపుని కుమారా! మన్మథునికి తండ్రీ! కరుణకు ప్రతిరూపమా! ముకుందా! కేశవా! మురాసురుని చంపినవాడా! ఈ చరాచర ప్రపంచానికి నాయకుడా!

పరమేశ్వరా! దేవతాసార్వభౌమ! శుకవరదా! సూర్యచంద్రులను కన్నులుగా కలవాడా! అత్యంత వైభవము కలవాడా! పరమాత్ముడా! నమస్కారము.

ధ్రువుడు, ద్రౌపది, చేసిన ప్రార్థనల వల్ల వాత్సల్యము కలవాడా! లక్ష్మీపతీ! మధుసూదనా! ధరణీధరా! మూడులోకములను పరిపోషించుటలో శ్రద్ధ కలవాడా! నవనీత ప్రియుడా! నాద స్వరూపుడా!

శ్రీమంతుడా! వేంకటగిరి శిఖరనివాసుడా! మహామహిమ కలవాడా! నిఖిలాండపతీ! కోరిన కోర్కెల ప్రసాదించునట్టివాడా! స్వామీ! ఐశ్వర్యస్వరూపుడా! సర్వాత్మకుడా! నమస్కారము.

## 38. ధన్నాసి

నందనందన! వేణునాద వినోద! ము
కుంద! కుందదంతహాస! గోవర్ధనధరా! ॥పల్లవి॥

రామరామ! గోవింద! రవిచంద్రలోచన!
కామ కామకలుష వికారవిదూర!
ధామ ధామ! విభవత్ప్రతాపరూప! దనుజని
ర్ధామధామకరణ చతుర! భవభంజన ॥నంద॥

కమల! కమలవాస! కమలారమణ! దేవో
త్తమ! తమోగుణ సతతవిదూర
ప్రమదత్ప్రమదానుభవ భావకరణ
సుముఖ! సుధానంద! శుభరంజనా! ॥నంద॥

పరమ పరాత్పర! పరమేశ్వరా!
వరద! వరదామల! వాసుదేవ!
చిరచిర ఘననగ శ్రీవేంకటేశ్వర!
నరహరినామ! పన్నగశయన! ॥నంద॥

(సం.-1-కీ.-312)

**అర్థము** : నందనందన = నందకుమారుడా!, వేణుగానవినోద = వేణునాదమే వినోదముగా కలవాడా! ముకుంద = మోక్షప్రదుడా!, కుందదంత = మొల్లపూలలా- తెల్లని, హాస = నవ్వుకలవాడా!, గోవర్ధనధరా = గోవర్ధన గిరిని ధరించినవాడా!

రామ = శ్రీరామా; రామ = బలరాముడా; గోవింద = గోవిందుడా!, రవిచంద్ర లోచన = సూర్యచంద్రులు కన్నులుగా కలవాడా!, కలుషవికార = పాప వికారములుగల వారికి, విదూర = దూరముగానుండువాడా!, ధామధామ = తేజస్సులకు నిలయమా! విభవత్ = విశేషముగా ప్రకాశిస్తున్న! ప్రతాపరూప = ప్రతాపము యొక్క రూపములు గలవాడా!, దనుజ నిర్ధామధామకరణచతుర = రాక్షసుల

నివాసములను పొగరాజని యిళ్ళుగా, కరణ = చేయుటలో, నిపుణ = నేర్పరీ!, భవభంజనా = సంసారదుఃఖాన్ని తొలగించువాడా!

కమల = పద్మభరితములైన, కమలవాస = జలాధివాసముగల, కమలారమణ = లక్ష్మీరమణుడా!, దేవోత్తమ = దేవతలలో ఉత్తముడా!, తమోగుణ సతతవిదూర = తమోగుణముగలవారికెల్లప్పుడును మిక్కిలి దూరముగా నుండువాడా!, ప్రమదత్ = మిక్కిలి ఆనందాన్ని పొందుచున్న, ప్రమదా = మహిళలకు, అనుభవభావకరణ = అనుభవరూపమైన ఆత్మానందాన్నిచ్చువాడా!, సుముఖ = ప్రసన్నమైన ముఖశోభకలవాడా!, సుధానంద = అమృతరూపమైన ఆనందముకలవాడా!, శుభరంజనా = శుభములను విలసిల్లునట్లు జేయువాడా!

పరమ = మోక్షస్వరూపుడా!, పరాత్పర = పరాత్పరుడా!, పరమేశ్వరుడా = పరమేశ్వరుడా!, వరద = కోరిన వరమునిచ్చువాడా!, వరదామల = వరములనిచ్చు, నిర్మలుడా!, వాసుదేవ = వాసుదేవుడా!, చిరచిర = మిక్కిలి ప్రాచీనమైన, ఘననగ = పెద్దకొండయందలి, శ్రీవేంకటేశ్వర = శ్రీవేంకటేశ్వరస్వామీ!, నరహరినామ = నరసింహనామము కలవాడా!, పన్నగశయన = శేషశయనుడా!

**తాత్పర్యము** : నందకుమారుడా! వేణుగానవినోదుడా! మోక్షప్రదుడా! మల్లెలవంటి పలువరుసతో కూడిన నవ్వుకలవాడా! గోవర్థన గిరిని ధరించినవాడా! నమస్కారము

శ్రీరామా! బలరాముడా! గోవిందుడా! సూర్యచంద్రులు కన్నులుగా గలవాడా! మోక్షప్రదుడా! పాపవికారములు కలవారికి దూరముగా నుండువాడా! తేజస్సులకు నిలయమా! విశేషముగా పుట్టుచున్న ప్రతాపముల రూపములు కలవాడా! రాక్షసుల నివాసములయందు పొగపెట్టుటలో నేర్పరీ! సంసార బాధలు తొలగించువాడా! పద్మములతోకూడిన జలములు నివాసముగా కల లక్ష్మికి రమణుడా! దేవోత్తమా! తమోగుణము కలవారికెల్లప్పుడును మిక్కిలిదూరముగా నుండువాడా! ఆనందము కల స్త్రీలకు అనుభవరూపమైన భావమును చేయువాడా! సుముఖుడా! అమృతరూపమైన ఆనందముకలవాడా! శుభములను విలసిల్లునట్లు చేయువాడా!

పరమపరాత్పరా! పరమేశ్వరుడా! వరదుడా! వరములిచ్చు నిర్మలుడా! వాసుదేవుడా! మిక్కిలి ప్రాచీనమైన పెద్దకొండయందలి శ్రీవేంకటేశ్వరస్వామీ! నరహరినామము గలిగిన శేషశయనుడా! నమస్కారము.

## 39. సామంతం

నగధర నందగోప నరసింహ వో
నగజవరద శ్రీ నారసింహ ॥పల్లవి॥

నరసింహ పరంజోతి నరసింహ్ వీర -
నరసింహ లక్ష్మీనారసింహ్
నరసఖ బహుముఖ నారసింహ్ వో-
నరకాంతక జేజే నారసింహ్ ॥నగ॥

నమో నమో పుండరీకనారసింహ వో-
నమితసురాసురనారసింహా
నమకచమకహిత నారసింహా వో -
నముచిసూదనవంద్య నారసింహా ॥నగ॥

నవరసాలంకార నారసింహా వో -
నవనీత చోర శ్రీనారసింహ
నవగుణి వేంకటనారసింహా వో-
నవమూర్తి మండెమునారసింహా ॥నగ॥

(సంపుటం-1-కీ-259)

నగధర = గోవర్ధనపర్వతాన్ని చేతితో ఎత్తినవాడా!, నందగోప = నందుని ఇంట గోప బాలుడా!, నరసింహా= నరసింహస్వామీ!, వో! నగజ వరద = గజేంద్రుని రక్షించినవాడా!, (మతంగ జోగజోనాగః! అను నిఘంటువులోని 'నాగ' శబ్ద వ్యుత్పత్త్యర్థముగా 'నగజ' శబ్ద ప్రయోగము), శ్రీనారసింహ = లక్ష్మీనరసింహ స్వామీ! (నమస్కారము).

నరసింహ = నరసింహస్వామి!, పరంజ్యోతి = పరమపద దీపమా!, నరసింహ = నరసింహస్వామీ!, వీర నరసింహ = వీరుడైన నరసింహస్వామి!, లక్ష్మీనరసింహా = లక్ష్మీ సమేత నరసింహ స్వామీ! వో నరకాంతక = నరకాన్ని పోగొట్టువాడా!, జేజే నరసింహా! = నరసింహ స్వామీ! జయము జయము.

పుండరీక నారసింహ = తామర పూవువంటి కన్నులుగల నరసింహా! వోనమిత సురాసుర నారసింహా = దేవదానవులచే నమస్కరించబడిన ఓ! నరసింహ స్వామీ!, నమకచమక హిత = నమకము, చమకము చేత ప్రతిపాద్యమైన వాడా!, నారసింహా = నరసింహస్వామీ!, వోనముచిసూదన వంద్య = 'నముచి' అనే రాక్షసుని చంపిన ఇంద్రుని చేత నమస్కరింప బడినవాడా! నారసింహా = నరసింహస్వామీ! నమో నమః = నమస్కారము.

నవరసాలంకార = నవరసభరితమైన అలంకారములను దాల్చినవాడా! నరసింహా = నరసింహస్వామీ! వో నవనీతచోర = వెన్నదొంగ, శ్రీ నరసింహ = ఓ! నరసింహస్వామీ!, నవగుణివేంకట నారసింహా = నవగుణివేంకట నరసింహుడా!, వో నవమూర్తి = తొమ్మిది మూర్తులుగా భాసిల్లుతున్నవాడా! మండెము నవసింహా = మండెములో నున్న నరసింహ స్వామీ (నమస్కారము).

**తాత్పర్యం** : గోవర్ధన పర్వతాన్ని చేతితో ఎత్తినవాడా! నందుని ఇంటనున్న గోపబాలుడా! నరసింహస్వామీ! గజేంద్రుని రక్షించినవాడా! లక్ష్మీదేవితో కూడిన నృసింహస్వామీ నమస్కారము. పరమపదదీపమా, నరకాన్ని తొలగించువాడవు, తామరపూలవంటి కన్నులవాడవు, దేవతలచే దానవులచేత కూడా నమస్కారాలను అందుకొనేవాడవు! నమక చమక హితుడవు, 'నముచి' అనే రాక్షసుని చంపిన ఇంద్రునిచేత నమస్కరించబడు నరసింహస్వామీ! నమస్కారము. నవనీత చోరుడా! నవరసభరితుడా! నవగుణినరసింహుడా, నవమూర్తులుగా భాసిల్లెడువాడా! మండెము నరసింహస్వామీ! నమస్కారము.

## 40. రామక్రియ

నతు మమ తావన్మానస్త్వదీయ
నితాంతహితసరణిం నమామి. ॥పల్లవి॥

న వదతు భవాన్ జనార్దన ఘనరతి
వివాదవచనం వృథా వృథా
తవ మృదువేదసుధామయవచనై
ర్వివిధావశపదవీం వహామి. ॥నతు॥

న భజతు మాం కరుణానిధే భవ
ద్విభవవినయశ్చ వృథా వృథా
త్రిభవనసుఖకర దివ్యరూప తే
ప్రభుతయా పరాభవం భజామి ॥నతు

న చలతు వేంకటనాథ మాం వినా
విచరణమపి తే వృథా వృథా
సుచరిత్రస్త్వం సుభగస్త్వం త్వాం
కుచయోః పులకాంకురైః ధరామి. ॥నతు॥

(సంపుటం-6-కీర్తన-85)

**అర్థం :** మమతావత్ = నాకైతే, మానసః = మనసులో పుట్టిన కోపము, నతు = లేదు, త్వదీయ నితాంతర్హిత సరణిం = నీయొక్క హితాన్ని కలిగించే మార్గాన్ని, నమామి = నమస్కరిస్తున్నాను.

హేజనార్దన = ఓ! లక్ష్మీపతీ!, భవాన్= నీవు, ఘనరతి వివాదవచనం = ఘనమైన రతికేళిలో కలహవచనాలను, నవదతు = చెప్పవద్దు, వృథా = అలా చెబితే ప్రయోజనము శూన్యము, తవ = నీయొక్క, మృదవేదసుధామయవచనైః = మృదువైన వేదామృతవచనాలచేత, వివిధావశ పదవీం = అనేక రకాలుగా నీవశమందు ఉండేటు వంటి మార్గాన్ని, వహామి = అవలంబిస్తున్నాను.

కరుణానిధే = కరుణకు గనిలాంటివాడా! మాం = నన్ను, నభజతు = సమీపించ వద్దు (అని ఖండిత నాయక వ్యంగ్యంగా చెబుతున్నది), భవద్విభవ వినయశ్చ = నీయొక్క వైభవం, వినయముకాగా, వృథా వృథా = వ్యర్థమే.

త్రిభువన సుఖకర = ముల్లోకాలకు సుఖాలు కలిగించే వాడా!, దివ్యరూప = దివ్యమైన స్వరూపం కలవాడా!, తే = నీయొక్క, ప్రభుతయా = రాచకార్యాలతో, పరాభవం= నిన్ను కలుసుకోవాలని విరహపరాభవాన్ని, భవామి = పొందుతున్నాను, వేంకటనాథ = వేంకటాచలపతీ!, మాం వినా = నేను లేకుండా.

నచలతు = ఎక్కడకు వెళ్లకు, త్వం = నీవు, సుచరిత = మంచి చరిత్ర కలవాడవు, సుభగ = మాహాత్మ్యం కలవాడవు, త్వాం = నిన్ను, కుచయోః = పాల్లిండ్ల యందు, పులకాంకురైః = పులకాంకురాలనే నెపంతో, ధరామి = ధరించుచున్నాను.

**తాత్పర్యం** : చిరవిరహిణిగా ఉన్న ఖండిత నాయిక - వేంకట నాథుడితో పలుకుతున్న నర్మోక్తులు ఇవి - ఓ! వేంకటనాథా! నామనస్సులో పుట్టిన రోషము ప్రస్తుతం లేదు, నీకు హితాన్ని కలిగించే మార్గమును ఆదరిస్తాన్నాను. ఓ! జనార్దనా! నీవు రతికేళిలో ప్రయోజనం లేని కలహవచనాలను చెప్పవద్దు. వేదామృతవచనాల వల్ల అనేకరకాలుగా నీవశమందు ఉండే మార్గాన్నే అనుసరిస్తున్నాను. కరుణానిధీ! నన్ను సమీపించవద్దు, నీ వైభవం వ్యర్థమే. త్రిలోకాలలో సుఖాన్నిచ్చేవాడా! దివ్యస్వరూపం కలవాడా! నీ రాచకార్యాలవల్ల నిన్ను కలుసుకోవాలని వచ్చి పరాభవాన్ని పొందుతున్నాను. నేను లేకుండా ఎక్కడకు వెళ్ళకు సచ్చరితుడా! గొప్పవాడా! నిన్ను వక్షఃస్థలంపై ధరిస్తాను.

## 41) సాళంగనాట

నమామ్యహం మానవసింహం
ప్రమదాంక మహోబల నరసింహం ॥పల్లవి॥

దానవదైత్యవిదారణ సింహం
నానాయుధకర నరసింహం
భూ న భోంత రాపూరిత సింహం
ఆనన వహ్నిలయాంతక సింహం ॥నమామ్యహం॥

ప్రళయ నృసింహం బహుముఖసింహం
సలలిత గరుడాచల సింహం
కులిశ నఖర ముఖ ఘోషిత సింహం
తిలకిత బహురవి దీపితసింహం ॥నమామ్యహం॥

శాంతనృసింహం శౌర్యనృసింహం
సంతత కరుణా జయ సింహం
కాంత శ్రీవేంకటగిరి సింహం
చింతితఘన సంసిద్ధి నృసింహం ॥నమామ్యహం॥

(సంపుటం-15, సంకీర్తన-160)

**అర్థము:** అహం = నేను, మానవసింహం = నరసింహుని, నమామి = నమస్కరించు చున్నాను. ప్రమదా = లక్ష్మీదేవి, అంకం = ఒడియందుగల, అహోబలనరసింహం = అహోబిలక్షేత్రము నందు వెలసిన నరసింహస్వామిని, నమామి = నమస్కరించుచున్నాను.

దానవదైత్యవిదారణ = రాక్షసులను దేవతలను చీల్చుట యందు సింహము వంటి వానిని, నానాయుధకర = పలువిధములయిన ఆయుధములు చేతులలో ధరించిన, నరసింహం = నరసింహస్వామిని, నమస్కరించుచున్నాను. భూనభోంతర= భూమికి-ఆకాశమునకు నడుమ, ఆపూరిత = నిండిన, సింహం = సింహమును, ఆనన వహ్ని = ముఖమునందలి అగ్నిచేత, లయాంతక = ప్రళయాంతకునివలెనున్న, సింహం= సింహమును నమస్కరిస్తున్నాను.

ప్రళయనృసింహం = ప్రళయనృసింహుని, బహుముఖసింహం = అనేక ముఖములుగల సింహమును, సలలిత గరుడాచలసింహం = లలితమైన గరుడాచలమందు వేం చేసియున్న సింహమును, కులిశనఖర = వజ్రాయుధము వంటి గోళ్ళుకల, ముఖఘోషిత = ముఖమునందు సింహఘోషగల, తిలకిత = తిలకముగాజేయబడిన, బహురవి = అనేక సూర్యబింబములచేత, దీపిత = ప్రకాశింపజేయబడిన, సింహం= సింహమును, నమామి = నమస్కరించుచున్నాను.

శాంతనృసింహం = శాంతనృసింహుని, శౌరనృసింహం = శౌర్యనృసింహుని, సంతత = సంతతమైన, కరుణా = కరుణతోనిండిన, జయసింహం = జయసింహుని, కాంత = సుందరమైన, శ్రీవేంకటగిరి సింహం= శ్రీవేంకటగిరిపైనున్న సింహమును, చింతిత= కోరబడిన ఘనసంసిద్ధి నృసింహం = గొప్ప సంసిద్ధులను ప్రసాదించునట్టి సింహమును - శ్రీ అహోబల నరసింహుని నమస్కరించుచున్నాను.

**తాత్పర్యము:** లక్ష్మీదేవిని ఒడియందు కలిగిన మానవసింహాకృతియైన, అహోబల క్షేత్రము నందు వెలసిన శ్రీనరసింహస్వామిని నేను నమస్కరించుచున్నాను. దైత్యదానవులను చీల్చుటలో సింహము వంటి వానిని, అనేక ఆయుధములను చేతులయందు ధరించిన సింహము వంటి వానిని, భూమ్యాకాశముల నడిమి భాగమంతయు నిండిన సింహము వంటి వానిని, ముఖాగ్నిచేత ప్రళయాంతకుని వలె నున్న సింహమును శ్రీఅహోబల నరసింహస్వామిని నమస్కరించుచున్నాను. ప్రళయ నృసింహుని, బహుముఖసింహుని, శ్రీగరుడాచలం పై వేంచేసియున్న లలితసింహుని, వజ్రములవంటి గోళ్ళతో సింహనాదముఖరిత ముఖముగల సింహమును, బొట్టుగా ధరింపబడిన అనేక సూర్యబింబములతో దీపిత సింహమును నమస్కరించుచున్నాను. శాంత నృసింహుని, శౌర్యనృసింహుని, సంతతా కరునైన జయసింహుని, సుందరమైన శ్రీవేంకటగిరి శిఖరముపై నెలకొన్న సింహమును, కోరుకొన్న కోరికలను ప్రసాదించునట్టి నృసింహమును నమస్కరించుచున్నాను.

## 42. శంకరాభరణం

నమితదేవం భజే నారసింహం
సుముఖకరుణే క్షణం సులభనరసింహం ॥పల్లవి॥

విజయనరసింహం వీరనరసింహం
భుజబలపరాక్రమ స్ఫుటనృసింహం
రజనీచరవిదళన విరాజిత నృసింహం
సుజనరక్షక మహాశూరనరసింహం ॥నమిత॥

దారుణ నృసింహం ప్రతాప నరసింహం
చారుకల్యాణ నిశ్చల నృసింహం
ధీరచిత్తావాస దివ్యనరసింహం
సారయోగానంద చతుర నరసింహం ॥నమిత॥

విమలనరసింహం విక్రమనృసింహం
కమనీయ గుణాగుణాకర నృసింహం
అమితసుశ్రీవేంకటాద్రి నరసింహం
రమణీయ భూషాభిరామ నరసింహం ॥నమిత॥

(సం.-3-కీర్తన-514)

**అర్థము :** నమిత = వినమ్రులైన, దేవం = బ్రహ్మాదిదేవతలుగల, నారసింహం = నరసింహస్వామిని, భజే = సేవింతును, సుముఖ = ప్రసన్నమైన, కరుణా = కరుణతో నిండిన, ఈక్షణం = చూపులు గలవానిని, సులభ = భక్తసులభుడయిన, నృసింహం = నరసింహస్వామిని, భజే = సేవింతును.

విజయ నరసింహం = విజయ స్వరూపుడైన, నరసింహం = నరసింహుని, వీర నరసింహం = వీర నరసింహుని, భుజబల = బాహుబలము చేత, పరాక్రమ = పరాక్రమముచేత, స్ఫుట = ప్రసిద్ధరూపముగల, నృసింహం = నరసింహుని, భజే = సేవింతును, రజనీచర = రాక్షసుడైన హిరణ్యకశిపుని, విదళన = చీల్చుట చేత, విరాజిత = ప్రకాశించిన, నృసింహు =నరసింహస్వామిని, సుజనరక్షక = సుజనులైన ప్రహ్లాదాదులకు సంరక్షకుడును, మహాశూర = మహాశూరుడైన, నరసింహం = నరసింహస్వామిని, భజే = సేవింతురు.

దారుణ = భయానక రసమూర్తియైన, నృసింహం = నృసింహుని, ప్రతాప = ప్రతాపమునకు మూర్తియైన, నృసింహం = నరసింహస్వామిని, చారు = సుందరములైన, కల్యాణ = మంగళములను ప్రసాదించుటలో, నిశ్చల = సుస్థిరుడైన, నృసింహం = నృసింహుని, ధీరచిత్త = నిశ్చల చిత్తము, ఆవాస = నివాసముగాగల, దివ్యనరసింహం = తేజోమయాకారుడైన నరసింహుని, సార = సారభూతమైన, యోగానంద= యోగజనితమైన ఆనందమును కటాక్షించుట యందు, చతుర = నిపుణుడైన, నరసింహం = నరసింహుని, భజే = భజింతును.

విమల నరసింహం = నిర్మలుడైన నరసింహస్వామిని, విక్రమ = విక్రమశీలుడైన, నృసింహం = నరసింహుని, కమనీయ = సుందరములైన, గుణగణ = గుణగణములకు, ఆకర = గనియైన, నృసింహం = నరసింహుని, అమిత = మితములేని, సుశ్రీ = శోభా వైభవముగల, శ్రీవేంకటాద్రి = శ్రీవేంకటాచల నిలయుడైన, నరసింహం = నరసింహుని, రమణీయ భూషా = రమణీయ భూషణములతో, అభిరామ = సుందరుడయిన, నరసింహం = నరసింహస్వామిని, భజే = సేవింతురు.

**తాత్పర్యము:** సర్వదేవతల నమస్కారములను అందుకొనే కరుణాపూర్ణ కటాక్షవీక్షణుడైన నరసింహస్వామిని సేవిస్తాను. ఆయన విజయ నరసింహుడు, వీరనరసింహుడు, భుజబల పరాక్రమములతో

విస్ఫుటమూర్తిమత్త్వముతో కల నరసింహుడు, హిరణ్యకశిపుని చీల్చి విజయోల్లాసియైన నరసింహుడు, సుజనరక్షకుడు, మహాశూరుడు, ఎంత భయంకరుడో, ఎంత ప్రతాప దుర్నిరీక్ష్యుడో, అంతటి కల్యాణగుణనిశ్చలుడు, ధీర చిత్తములే తనకు నివాసముగా కలవాడు. యోగానందమును ఇచ్చుటలో చతురడయిన యోగానంద నరసింహుడు. విమల నరసింహుడు, విక్రమ నరసింహుడు, కమనీయ గుణాకరుడు. అమిత శోభగల శ్రీవేంకటాద్రిపై నెలకొన్న నరసింహుడు. అనేక ఆభరణములతో శోభిల్లుతున్న ఆ నరసింహుని భజింతును.

## 43. లలిత

నమో నమో జగదేకనాథ తవ సర్వేశ
విమల విశ్రుత అసద్విఖ్యాతకీర్తే ॥పల్లవి॥

రామ రఘువర సితరాజీవలోచన
భూమిజారమణ త్రిభువనవిజయ
కోమలాంగ శ్యామ కోవిద రణరంగ
భీమ విక్రమ సత్యబిరుదప్రవీణ ॥నమో॥

దళితదైతేయ కోదండ దీక్షాదక్ష
జలజాప్తకుల విభీషణరక్షక
కలితదశరథతనయ కౌసల్యానంద
సులభ వానరముఖ్య సుగ్రీవవరద ॥నమో॥

చారులక్ష్మణ భరత శత్రుఘ్నపూర్వజ
తారక బ్రహ్మ నిత్యస్వరూప
ధీర శ్రీ వేంకటాధిప భక్తవత్సల
భూరిగుణ సాకేతపురనివాసా ॥నమో॥

(సంపుటం-4కీ-494)

**అర్థము** : జగదేకనాథ = జగత్తు కంతా భర్తయైనవాడా!, నవ = నిత్యనూతనమైన, సర్వేశ= సర్వప్రాణులకు ఈశ్వరుడా!, విమల విశ్రుతలసద్విఖ్యాత కీర్తే = మాలిన్యం లేక అంతటా వ్యాపించినట్టి - ప్రసిద్ధనామంగల శ్రీరామా!, నమో నమః = నమస్కారము.

రామ! = శ్రీరామా!, రఘువర = రఘువంశంలో కెల్లా శ్రేష్ఠుడా!, సితరాజీవలోచన= తెల్లని కలువల వంటి కన్నులు గలవాడా!, భూమిజా రమణ = సీతాపతీ!, త్రిభువన విజయ = ముల్లోకాల లోను విజయాలను సంపాదించినట్టివాడా!, కోమలాంగ శ్యామ = కోమలమైనట్టి నల్లనైనటువంటి అవయవాలను కలిగినవాడా! కోవిద రణరంగ = రణభూమిలో ప్రవీణుడా!, భీమవిక్రమ = ఘనమైన పరాక్రమం గలవాడా!, సత్య బిరుద ప్రవీణ = వాస్తవమైన ప్రశంసలనందుకొనుటలో సమర్థుడా! (నమస్కారము)

దలితదైతేయ కోదండ దీక్షాదక్ష = రాక్షసులను చీల్చునట్టి విలువిద్యలో నేర్పరీ! జలజాప్తకుల = కమలాలకు ఆప్తుడవైన సూర్యుని కులానికి చెందినవాడా!, విభీషణ రక్షక = విభీషణుని రక్షించినవాడా!, కలిత దశరథ తనయ = దశరథ మహారాజు కుమారుడా!, కౌసల్యానంద = కౌసల్యకు సంతోషాన్ని కల్గించేవాడా!, సులభవానర ముఖ్య = ఆశ్రిత వానరులకు సులభుడైనవాడా!, సుగ్రీవ వరద = సుగ్రీవునికి కాపాడినట్టి వాడా! (నమస్కారము).

చారులక్ష్మణ భరత శత్రుఘ్న పూర్వజ = అందమైన లక్ష్మణ భరత శత్రుఘ్నులకు అన్నయైనవాడా!, తారక నిత్యబ్రహ్మ స్వరూప = తారకమైన, నిత్యమైన బ్రహ్మస్వరూపుడా! ధీర! శ్రీవేంకటాధిప = ధీరుడైనవాడా! వేంకటాచలాధీశుడా! భక్తవత్సల = భక్తులపట్ల వాత్సల్యం కలిగినవాడా!, భూరి సాకేతపురనివాసా = గొప్పదైన గుణశోభితమైన అయోధ్యాపురంలో నివసించిన వాడా, నమో = నమస్కారము.

**తాత్పర్యం** : జగత్తునకు నాథుడా! నిత్యనూతనుడై సమస్తప్రాణులను రక్షించువాడా! విమలుడవై అన్నిచోట్ల వ్యాపించినవాడా! ఓ! శ్రీరామా! నమస్కారము. రఘువంశంలో కెల్లా శ్రేష్ఠుడా! తెల్లని రాజీవముల వంటి కన్నులవాడా! సీతాపతీ! ముల్లోకాలను జయించినవాడా! కోమలాంగ! ధనుర్విద్యా విశారదుడా! పరాక్రమశాలీ! నమస్కారము. రాక్షసులను చీల్చునట్టి బాణవిద్య కలవాడా! సూర్యకుల తిలకుడా! విభీషణుని రక్షించినవాడా! కౌసల్య కుమారుడా! సుగ్రీవ వరద! నమస్కారము. అందమైన భరతలక్ష్మణాదులకు సోదరుడా! ధీరుడా! తారక బ్రహ్మస్వరూపుడా! భక్తవత్సలుడా! వేంకటాచలాధీశుడా! సాకేతపుర నాయకుడా! నమస్కారము.

## 44. బౌళి

నమో నమో దశరథనందన రామ
కమనియ్యయాగభాగకర్త రామ ॥పల్లవి॥

కాకుత్థ్సకుల రామ కౌసల్యాసుత రామ
శ్రీకరగుణోన్నత శ్రీరామ
కాకాసురవైరి రామ కౌశికవత్సల రామ
భీకరతాటకాంతకబిరుద రామ ॥నమో॥

వారిధిబంధన రామ వాలిహరణ రామ
చారుహరకోదండభంజన రామ
ధారుణీజపతి రామ దశకంఠహర రామ
సారవిభీషణాభీషేచన రామ ॥నమో॥

అమరపాలిత రామ అయోధ్యాపతి రామ
సమరకోవిద రామ సర్వజ్ఞ రామ
విమల రామ శ్రీవేంకటగిరి రామ
రమణ శరణాగతరక్షక రామ ॥నమో॥

(సంపుటం-4-కీ.144)

**అర్థం** : దశరథనందన రామ! = దశరథుని కుమారుడైన రామా!, కనునియ్యు యాగ భాగకర్తరామ! = కమనీయ యజ్ఞభాగ కర్తవైన రామా!, నమో నమః = నమస్కారము.

కాకుత్థ్సకులరామ! = కకుత్థ్సకులంలో ప్రభవించినరామా!, కౌసల్యాసుత రామ! = కౌసల్యాకుమారుడైన రామా!, శ్రీకర! గుణోన్నత! = శ్రీకరుణా! ఉన్నత గుణములతో శోభిల్లుతున్నవాడా!, శ్రీరామ! = శ్రీరాముడా!, కాకాసురవైరి రామ! = కాకాసురునికి శత్రువైన రామా!, కౌశిక వత్సలరామ! = విశ్వామిత్రుని యందు వాత్సల్యమున్నవాడా! (కౌశికుని వాత్సల్యమును కూడా చూరగొన్న రామా) శ్రీరామా!, భీకర తాటకాంతక!= భయంకరమైన తాటకిని సంహరించినవాడా! బిరుద రామ = గొప్పదనం గలరామా!

వారధి బంధనరామ! = సేతువునిర్మించినరామా!, వాలి హరణరామ! = వాలిని సంహరించినరామా!, చారుహర కోదండ భంజనరామ! = అందమైన హరుని విల్లుని విరిచిన రామా! ధారుణీజపతిరామ! = భూదేవికి జన్మించిన సీతా దేవికి నాధుణి, దశకంఠ హర! = పదితలలు గల రావణాసురుని చంపినవాడా! సార విభీషణాధి షేచనరామ! = సారభూతుడైన విభీషణునికి రాజ్యాభిషేకం చేసిన రామా!

అమరపాలితరామ! = దేవతలను పాలించినవాడా!, అయోధ్యాపతిరామ! = అయోధ్యానగరానికి అధిపతియైన రామా!, సమరకోవిదరామ! = యుద్ధ విద్యా పండితుడనవై శ్రీరామా!, సర్వజ్ఞ = అన్ని తెలిసినవాడా!, రామ! = శ్రీరామా!, విమలరామ! = మాలిన్యం లేని రామా!, శ్రీ వేంకటగిరి రామ = శ్రీవేంకటాచలం పైనున్న ఓ!రామా! రమణ = రమణుడా! శరణాగతరక్షక! రామ! = శరణన్న వారిని రక్షించే శ్రీరామ! నమస్కారము-

**తాత్పర్యం** : దశరథనందనుడైన ఓ! శ్రీరామా! మహార్హమైన యజ్ఞభాగకర్తవైన ఓ! శ్రీరామా! నమస్కారము. కకుత్థ్సకులంలో జన్మించినవాడా! కౌసల్య కుమారుడా! శ్రీకరా! ఉన్నతగుణాలతో శోభిల్లుతున్నవాడా! దుష్టుడైన కాకాసురుని శత్రువైనవాడా! భయంకరమైన తాటకిని సంహరించినవాడా! ఘనుడవైన శ్రీరామా! నమస్కారము. సేతువును నిర్మించిన రామా! వాలిని సంహరించిన రామా! అందమైన హరుని విల్లును విరిచిన రామా! సీతాపతీ! రావణ సంహారకా! విభీషణుని చక్రవర్తి చేసినవాడా! దేవతలను పాలించినవాడా! అయోధ్యాధిపతీ! రణకోవిదా! వేంకటాచలనివాసీ! శరణాగత రక్షకా! శ్రీరామా! నమస్కారము.

**విశేషాంశం** : శ్రీ రాముని విభిన్న నామాలు తెలిపిన ఈ కీర్తనలో శరణాగతులను రక్షించే వైభవం ఆవిష్కరింపబడుతున్నది.

## 45. బౌళి

నమో నమో రఘుకులనాయక దివజవంద్య
నమో నమో శంకరనగజా నుతా ॥పల్లవి॥

విహితధర్మపాలక వీరదశరథరామ
గహనవాసినీ తాటకామర్దన

అహల్యా శాపమోచన అసురకులభంజన
సహజ విశ్వామిత్రసవనరక్షకా ॥నమో॥

హరకోదండహర సీతాంగనావల్లభ
ఖరదూషణారి వాలిగర్వాపహా
తరణితనూజాది తరుచరపాలక
శరధిలంఘనకృత సౌమిత్రిసమేతా ॥నమో॥

బిరుద రావణశిరోభేదక విభీషణ -
వరద సాకేతపురవాస రాఘవ
నిరుపమ శ్రీవేంకటనిలయ విజనగర
పురవరవిహార పుండరీకాక్షా ॥నమో॥

(సంపుటం-4-కీ.471)

**అర్థం** : రఘుకులనాయక = రఘువంశానికి నాయకుడా!, దివిజవంద్య = దేవతలచే నమస్కరించ బడునట్టి వాడా!, నమో నమో = నమస్కారము, శంకరనగజానుత = ఈశ్వరునిచే, పార్వతీ దేవిచే నమస్కరింపబడినవాడా!, నమో నమః = నమస్కారము.

హరకోదండ హర! = శివుని విల్లు విఱిచినవాడా!, సీతాంగనా వల్లభ = సీతాభామా పతీ!, ఖర దూషణారి = ఖరుడు, దూషణుడు అనే రాక్షసులకు శత్రువైనవాడా!, వాలిగర్వాపహా = వాలిగర్వాన్ని అణిచినవాడా!, తరణి తనూజాది తరుచర పాలక = సూర్యవరప్రభావం వల్ల జన్మించిన సుగ్రీవాది వానరులను పాలించినవాడా!, శరధిలంఘనకృత్య సౌమిత్రసమేత = లక్ష్మణునితో కూడి సముద్రాన్ని దాటినట్టి వాడా!.

విహిత ధర్మపాలక = ధర్మపాలనకై అవతరించినవాడా, వీర దరశరథరామ! = వీరుడైన దశరథరాముడా, గహన వాసినీ తాటకామర్దనా = దట్టమైన అరణ్యంలో నివసించే తాటకిని - చంపినవాడా!, అహల్యా శాప మోచన = అహల్యాశాపాన్ని పోగొట్టినవాడా!, అసుర కులభంజన! = రాక్షసకులాన్ని నాశనమొనరించినవాడా!, సహజ = సహజ స్వరూపుడా! విశ్వామిత్ర సవన రక్షకా! = విశ్వామిత్రుని యజ్ఞాన్ని పరిరక్షించినవాడా!

బిరుద రావణ శిరోభేదక! = గొప్పదైన రావణాసురుని తలను తెగనరికినవాడా!, విభీషణ వరద! = విభీషణుని కాపాడినవాడా!, సాకేతపురవాస రాఘవ = సాకేతపుర నివాసముగల రఘువంశజాతుడా!, విజనగర పురనరవిహార = విజనగరపురంలో విహరించు వాడా! నిరుపమ శ్రీవేంకటగిరి నిలయ = సాటిలేని శ్రీ వేంకటాచలాన్ని నివాసం చేసుకొన్న వాడా!, పుండరీకాక్ష = పద్మాలవంటి కన్నులు గలవాడా!, నమస్కారము.

**తాత్పర్యం** : రఘువంశానికి నాయకుడా! దేవతాకోటిచే నమస్కరింపబడువాడా! ఈశ్వరునిచేత, పార్వతిచేత కొనియాడబడువాడా! నీకు నమస్కారము. ధర్మపాలనకై అవతరించినవాడా! వీరుడైన దశరథరాముడా! దట్టమైన అడవిలో నివసించే తాటకిని చంపినవాడా! అహల్యాదేవి శాపాన్ని పోగొట్టినవాడా! రాక్షసకులాన్ని నాశనం చేసినవాడా! సహజ స్వరూపుడా! విశ్వామిత్రుని యాగాన్ని పరిరక్షించినవాడా! శివధనుస్సును

విరిచినవాడా! సూర్య వరపుత్రుడైన సుగ్రీవుని చెట్లపైనతిరుగాడే ఇతరవానరులనురక్షించినవాడా! లక్ష్మణ సమేతుడైనవాడా! పెద్దదైన రావణుని తలను భేదించిన వాడా! విభీషణ వరదుడా! అసమానమైన శ్రీ వేంకట నిలయము వాడా! విజనగరపురంలో విహరించువాడా! పద్మనేత్రుడా! నమస్కారము.

**విశేషాంశం :** సంబోధనలతో రామాయణ సారమంతా క్రమంగా స్మృతిపథంలో మెలిగేటట్లుగా సమకూర్చిన చక్కని సంకీర్తన ఇది. తాటక వధనుండి రావణ సంహారం వరకు తెలిపే ఈకీర్తన, విజయనగర రాముని వైభవాన్ని ఆవిష్కరిస్తున్నది.

## 46. బౌళిరామక్రియ

నమో నమో లక్ష్మీనరసింహా!
నమో నమో సుగ్రీవ నరసింహా! ॥పల్లవి॥

వరద! సులభ! భక్తవత్సల! నరసింహా!
నరమృగవేష! శ్రీనరసింహా!
పరమ పురుష! సర్వపరిపూర్ణ! నరసింహా!
గిరిగుహావాస! సుగ్రీవ నరసింహా! ॥నమో॥

భయహర ప్రహ్లాదపాలన! నరసింహా!
నయనత్రయారవింద! నరసింహా!
జయజయసురముని సంస్తుత నరసింహా!
క్రియాకలాప! సుగ్రీవ నరసింహా ! ॥నమో॥

అతికృపానిలయ! మోహనరూప! నరసింహా!
నతపితామహముఖ్య! నరసింహా!
సతత శ్రీవేంకటేశ్వర! దివ్యనరసింహా!
కితవారి భంజన! సుగ్రీవ నరసింహా! ॥నమో॥ (సం.2-కీ.348)

**అర్థము :-** లక్ష్మీ నరసింహా! = లక్ష్మీసమేతుడైన శ్రీనరసింహస్వామీ!, సుగ్రీవ నరసింహా = సుందరమైన కంఠము కల నరసింహస్వామీ!, నమో నమః = నమస్కారము.

వరద = వరములనిచ్చువాడా, భక్తవత్సల = భక్తుల యందు వాత్సల్యము కలవాడా, నరసింహా = నరసింహస్వామీ, నరమృగవేష = నరమృగసమ్మేళనమైన వేషము కలవాడా, శ్రీనరసింహా = నరసింహస్వామీ, పరమపురుష = పరమ పురుషుడా!, సర్వపరిపూర్ణ = సర్వవ్యాపకుడా!, గిరిగుహావాస = పర్వతగుహాలో నివసించువాడా!, సుగ్రీవ నరసింహా = సుందరమైన కంఠముకల నరసింహా!, నమో నమః = నమస్కారము.

భయహర = భయములనుతొలగించువాడా!, ప్రహ్లాదపాలన = ప్రహ్లాదుని పాలించినవాడా!, నరసింహా= నరసింహస్వామీ, సురమునిసంస్తుత = సురలచేత, మునులచేత స్తుతింపబడినవాడా!, నరసింహ =

నరసింహస్వామీ, క్రియాకలాప = భక్తరక్షణక్రియా కలాపముకలవాడా!, సుగ్రీవనరసింహా = చక్కని కంఠంగల నరసింహుడా!, నమో నమః = నమస్కారము.

అతికృపానిలయ = దయకు నిలయమైనవాడా!, మోహనరూప = సమ్మోహనమైన రూపముగలవాడా!, నత = వినమ్రులైన, పితామహముఖ్య = బ్రహ్మాదిదేవతలు కలవాడా!, సతత = శాశ్వతుడా, శ్రీవేంకటేశ్వర = శ్రీవేంకటేశ్వర స్వరూపుడవైన, దివ్యనరసింహా = తేజోమయుడైన నరసింహా!, కితవారి భంజన = చెడ్డవారైన శత్రువులను నశింపజేయు వాడా!, నమో నమః = నమస్కారము.

**తాత్పర్యము :-** భక్తులయందు వాత్సల్యం కలిగి వరములు గుప్పించు నరమృగ సమ్మేళన రూపుడైన పరమ పురుషుడు, సర్వవ్యాపకుడు, గిరిగుహలో నివసించు వాడైన, సుందరమైన కంఠముగల నరసింహస్వామీ! నమస్కారము. భయమును తొలగించి ప్రహ్లాదునిపాలించినవాడు, సురలచేత, మునులచేత స్తుతింపబడిన వాడు, భక్తరక్షణ క్రియాకలాపము కలవాడు, అందమైన కంఠభాగంతో వెలుగొందుతున్న నరసింహునికి నమస్కారము. చెప్పరానంత దయా నిలయుడు, సమ్మోహన స్వరూపుడు, వినమ్రులైన బ్రహ్మాదిదేవతలచే నమస్కరింప బడుతున్నవాడు, శాశ్వతుడు, శ్రీవేంకటేశ్వర స్వరూపుడైన, తేజోమయుడైన నరసింహుడు. ధూర్తులైన శత్రువులను నశింపజేయువాడా, ఓ! లక్ష్మీసమేతుడైన శ్రీనరసింహస్వామీ! సుందరమైన కంఠప్రదేశముగల నరసింహస్వామీ! నమస్కారము.

## 47. శ్రీరాగం

నమో నారాయణాయ నమః
సమధికానందాయ సర్వేశ్వరాయ ॥పల్లవి॥

ధరణీసతీఘనస్తనశైలపరిరంభ
పరిమళశ్రమజలప్రమదాయ
సరసిజనివాసినీసరసప్రణామ యుత
చరణాయ తే నమో సకలాత్మకాయ ॥నమో॥

సత్యభామాముఖాంచనపత్రవల్లికా-
నిత్యరచనక్రియానిపుణాయ
కాత్యాయనీస్తోత్రకామాయ తే నమో
ప్రత్యక్షనిజపరబ్రహ్మరూపాయ ॥నమో॥

దేవతాధిపమకుటదివ్యరత్నాంశుసం
భావితామలపాదపంకజాయ
కైవల్యకామినీకాంతాయ తే నమో
శ్రీవేంకటాచలశ్రీనివాసాయ ॥నమో॥

(సం.1-కీ.245)

**అర్థము** : నమోనారాయణాయ = నారాయణునికి నమస్కారము, సమధికానందాయ = బ్రహ్మానందము మొదలైన ఆనందములకంటే ఘనమైన ఆనంద స్వరూపునికి, సర్వేశ్వరాయ = సర్వేశ్వరునకు, నమః = నమస్కారము, ధరణీసతీ = భూదేవి యొక్క, స్తన = పాలిండ్లరూపములైన, ఘనశైల = మహాపర్వతముల యొక్క, పరిరంభ = కౌగిలింతలోని, పరిమళ = సౌరభముతో కూడిన, శ్రమజల = స్వేదముతో, ప్రచురాయ= విరాజిల్లుతున్న వానికొఱకు, సరసిజ నివాసిని = పద్మవాసినియైన లక్ష్మీదేవి యొక్క, సరసప్రణామ = శృంగారకేళితో, యుత = కూడిన, చరణాయ = చరణములు కల, సకలాత్మకాయ = సకలమునకు ఆత్మభూతుడైన, తే = నీకు, నమ = నమస్కారము, సత్యభామా ముఖ = సత్యభామాదేవి యొక్క ముఖమును, అంచన = ఆనందింపజేయు, పత్రవల్లికా = ఆకులతో కూడిన లతల యొక్క, నిత్యరచనా క్రియా = రచనాశిల్పమునందు, నిపుణాయ = నేర్పరి కొరకు, నమః = నమస్కారము, కాత్యాయనీ = గౌరీదేవియొక్క, స్తోత్రము కామాయ = స్తోత్రము నందు ప్రీతికల వానికొరకు, ప్రత్యక్ష = కనులకు కనిపించే, నిజ = స్వీయమైన, పరబ్రహ్మరూపాయ = పరబ్రహ్మ రూపము కల, తే = నీకొరకు, నమః = నమస్కారము, దేవతాధిప = ఇంద్రుని యొక్క, మకుట = కిరీటములోని, దివ్యరత్న = దివ్యమణుల యొక్క, అంశు = కిరణములచేత, సంభావిత = పూజింపబడిన, అమల = నిర్మలములైన, పాదపంకజాయ = పాదపద్మములు కలవానికొరకు, కైవల్యకామినీ = మోక్షలక్ష్మికి, కాంతాయ = భర్తయైన, శ్రీవేంకటాచల శ్రీనివాసాయ = శ్రీవేంకటాచలమందు నెలకొన్న శ్రీనివాసుడవైన, తే= నీకు, నమః = నమస్కారము,

**తాత్పర్యము** : నారాయణునికి నమస్కారము, బ్రహ్మానందము మొదలైన ఆనందములకంటే ఘనమైన ఆనంద స్వరూపునికి, సర్వేశ్వరునకు, నమస్కారము. భూదేవి యొక్క, పాలిండ్లరూపములైన మహాపర్వతముల యొక్క, కౌగిలింతలోని సౌరభముతో కూడిన స్వేదముతో విరాజిల్లుతున్న వానికొఱకు, పద్మవాసినియైన లక్ష్మీదేవి యొక్క, శృంగారకేళితో కూడిన చరణములు కల, సకలమునకు ఆత్మభూతుడైన, నీకు నమస్కారము. సత్యభామాదేవి యొక్క ముఖమును, ఆనందింపజేయు ఆకులతో కూడిన లతల యొక్క రచనాశిల్పమునందు, నేర్పరి కొరకు నమస్కారము. గౌరీదేవియొక్క స్తోత్రము నందు ప్రీతికల వానికొరకు, కనులకు కనిపించే స్వీయమైన పరబ్రహ్మ రూపము కల నీకొరకు, నమస్కారము. ఇంద్రుని యొక్క కిరీటములోని, దివ్యమణుల యొక్క కిరణములచేత పూజింపబడిన నిర్మలములైన పాదపద్మములు కలవానికొరకు, మోక్షలక్ష్మికి భర్తయైన శ్రీవేంకటాచలమందు నెలకొన్న శ్రీనివాసుడవైన నీకు నమస్కారము.

## 48. నాట

నవనారసింహా నమో నమో
భవనాశితీర యహో బలనారసింహా ॥పల్లవి॥

సతతప్రతాపరౌద్రజ్వాలానారసింహా
వితతవీరసింహవిదారణా
అతిశయకరుణ యోగానందనరసింహా
మతి శాంతపుకానుగుమాని నారసింహా ॥నవ॥

మరలి భీభత్సప్త మట్టిమళ్ళ నరసింహ
నరహరి భార్గోటి నారసింహ
పరిపూర్ణ శృంగార ప్రహ్లాద నరసింహ
సిరుల నద్భుతపులక్ష్మీనారసింహ

వదనభయానకపువరాహ నరసింహ
చెదరనివైభవాల శ్రీ నరసింహా
అదన శ్రీ వేంకటేశ అందు నిందు నిరవైతి
పదివేలురూపముల బహునారసింహ ॥నవ॥

(సంపుటం-1-కీ-453)

నవనారసింహా = నవమూర్తులైన నరసింహస్వామీ!, భవనాశితీర = భవనాశి నదీతీరానున్న వాడా!, అహోబలనారసింహా = అహోబలక్షేత్ర నరసింహస్వామీ!, నమో నమః = నమస్కారము.

సతత = ఎల్లప్పుడూ, ప్రతాప రౌద్రజ్వాలా నరసింహా = ప్రతాపము, రౌద్రముకల జ్వాలానరసింహుడా!, వితత వీరసింహ = వ్యాప్తమైన వీరసింహమా!, విదారణా = చీల్చుసమర్థుడా!, అతిశయకరుణ = మిక్కుటమైన దయగలవాడా! యోగానంద నరసింహ = యోగానంద నరసింహుడా!, అతిశాంతపు కానుగుమాని నారసింహ= అతిశాంతుడైన కానుగుమాని నరసింహుడా!

మరలి భీభత్సపు మట్టిమల్లనరసింహ = అత్యంత భయానక మట్టెమళ్ళ నరసింహుడా! నరహరి భార్గోటి నారసింహ = నరహరియైన భార్గోటి నారసింహుడా! పరిపూర్ణ శృంగార ప్రహ్లాద నారసింహ = విస్తారమైన శృంగారమూర్తియైన ప్రహ్లాద నరసింహుడా! సిరుల నద్భుతపు లక్ష్మీనారసింహ = ఐశ్వర్య యుతుడైన అద్భుతమైన లక్ష్మీ నారసింహుడా!

వదన భయానకపు వరాహ నరసింహ = భయానకమైన వదనాన్ని కల వరాహ నరసింహ, చెదరనివైభవాల శ్రీనరసింహ = స్థిరమైన వైభవములుకల శ్రీనరసింహుడా! అదనశ్రీ వేంకటేశ అందునిందునిరవైతి = కలియుగదైవమైన శ్రీనివాసా! సకల వ్యాపకుడా!, పదివేలు రూపముల బహు నారసింహ = అనేక రూపములు కల బహునరసింహుడా! నమస్కారము.

**తాత్పర్యము** : నవమూర్తులైన నరసింహస్వామీ! భవనాశి నదీతీరాన వెలసినవాడా! అహోబలనరసింహుడా! నమస్కారము. ఎల్లప్పుడూ ప్రతాపము, రౌద్రము కల జ్వాలా నరసింహుడా! వ్యాప్తమైన వీరనరసింహుడా! రాక్షసులనువిదారణ చేయు దేవా! మహాకరుణామూర్తీ! యోగానంద నరసింహుడా! అతిశాంతపు కానుగమాని నరసింహుడా! అతి భయానక మట్టె మళ్ళ నరసింహుడా! నరహరి భార్గోటి నరసింహుడా! పరిపూర్ణ శృంగారమూర్తియైన ప్రహ్లాద లక్ష్మీనరసింహుడా! భయానక వదనంకల వరాహ నరసింహ, స్థిరవైభవంకల నరసింహుడా! కలియుగములో శ్రీవేంకటేశుడై, ఇహపరములలో ఉండే వివిధరూపములలో నుండు నరసింహస్వామీ! నమస్కారము.

**విశేషాంశం** : దశావతారాలలో నాలుగవదియైన కృతయుగ నరసింహస్వామి అన్నమయ్యకు అహోబిలనరసింహస్వామిగా ఆరాధ్యుడైనవాడు. అహోబిలం అన్నమయ్యకు విశిష్టాద్వైత వేదాంత విద్యాభ్యాస క్షేత్రం. అందుకే ఎన్నో కీర్తనలలో నవనారసింహులను సంకీర్తించాడు.

జ్వాలాఽహోబల మాలోల క్రోడ కారంజ భార్గవాః!
యోగానంద ఛత్రవట, పావనా నవమూర్తయః ॥

శ్రీ వేంకటేశ్వరస్వామితో నరసింహస్వామిని అభేదాధ్యవసాయం చేసి అన్నమయ్య సంకీర్తన గానమాచరించాడు.

## 49. భవుళిరాగం

నవనీతచోర నమో నమో
నవమహిమార్ణవ నమో నమో ॥పల్లవి॥

హరి నారాయణ కేశవాచ్యుత శ్రీకృష్ణ
నరసింహవామన నమో నమో
మురహర పద్మనాభ ముకుంద గోవింద
నరనారాయణరూప నమో నమో ॥నవ॥

నిగమగోచర విష్ణు నీరజాక్ష వాసుదేవ
నగధర నందగోప నమో నమో
త్రిగుణాతీత దేవత్రివిక్రమ ద్వారక
నగరాధినాయక నమో నమో ॥నవ॥

వైకుంఠ రుక్మిణీ వల్లభ చక్రధర
నాకేశవందిత నమో నమో
శ్రీకర గుణనిధి శ్రీవేంకటేశ్వర
నాకుజననుత నమో నమో ॥నవ॥

(సం.-3-కీ-24)

**అర్థము:-** నవనీతచోర = వెన్నలను దొంగలించువాడా!, నమో నమః = నమస్కారము, నవ = నిత్యనూతనములైన, మహిమార్ణవ = మహిమలకు సముద్రమైనవాడా!, నమో నమః = నమస్కారము, నమస్కారము.

హరి = శ్రీహరీ!, నారాయణ = నారాయణా!, కేశవ = కేశవా!, అచ్యుత = నాశరహితుడా!, శ్రీకృష్ణ = శ్రీకృష్ణా!, నరసింహ = నరసింహ స్వరూపుడా!, వామనా = వామనావతారుడా!, నమో నమః = నమస్కారము, మురహర = మురఅను రాక్షసుని సంహరించినవాడా, పద్మనాభ = బ్రహ్మోత్పత్తి స్థానమైన నాభికలవాడా!,

ముకుంద = మోక్షప్రదా!, గోవింద = గోవిందుడా!, నరనారాయణరూప = నరనారాయణుల స్వరూపమైనవాడా!, నమో నమః = నమస్కారము.

నిగమగోచర = వేదములలో గోచరించువాడా!, విష్ణు = సర్వవ్యాపకుడా!, నీరజాక్ష = నీరజాక్షుడా!, వాసుదేవ = వాసుదేవుడా!, నగధర = నగధారీ!, నందగోప = నందుని రక్షించినవాడా!, నమో నమః = నమస్కారము, త్రిగుణాతీత = సత్త్వరజస్తమోమయమైన ప్రకృతికి అతీతుడా!, దేవ = తేజఃస్వరూపుడా!, త్రివిక్రమ = త్రివిక్రముడా!, ద్వారక నగరాధినాయక = ద్వారకా నగరాధీశ్వరా!, నమో నమః = నమస్కారము.

వైకుంఠ = వైకుంఠాధివాస!, రుక్మిణీ వల్లభ = రుక్మిణీ నాథుడా!, చక్రధర = చక్రధారీ!, నాకేశవందిత= ఇంద్రునిచేత నమస్కరింపబడినవాడా!, నమో నమః = నమస్కారము, శ్రీకర = లక్ష్మీప్రదుడా!, గుణనిధి = కళ్యాణగుణనిధీ!, శ్రీవేంకటేశ్వర = శ్రీవేంకటేశ్వరస్వామీ!, నాకు = పుట్ట, జనన = జన్మగాగల వాల్మీకిచేత, నుత = నుతింపబడినవాడా!, నమో నమః = నమస్కారము.

**తాత్పర్యము** : వెన్నలను దొంగిలించినవాడా!, నిత్యనూతనమైన మహిమా వైభవానికి సముద్రమువంటివాడా! నమస్కారము. శ్రీహరీ! నారాయణుడా! కేశవా! అచ్యుతుడా! శ్రీకృష్ణా! నరసింహుడా! వామనా! నమస్కారము. మురహరా! పద్మనాభ! ముకుంద! గోవింద! నరనారాయణరూప! నమస్కారము. వేదముల ద్వారా తెలియువాడా! సర్వవ్యాపకుడా! తామరల వంటి కన్నులు గలవాడా! వసుదేవపుత్రుడా! కొండను ఉద్ధరించినవాడా! నందుని రక్షించినవాడా! నమస్కారము. సత్వ-రజస్తమోగుణములకు అతీతుడా! తేజోమయుడా! త్రివిక్రముడా! ద్వారకా పట్టణమునకు నాథుడా! నమస్కారము. వైకుంఠాధివాసా! రుక్మిణీవిభుడా! చక్రాయుధాన్ని ధరించినవాడా! ఇంద్రునిచేత నమస్కరింప బడినవాడా! నమస్కారము. లక్ష్మీప్రదుడా! కళ్యాణగుణనిధీ! శ్రీవేంకటేశ్వరస్వామీ! పుట్టనుండి పుట్టిన వాల్మీకి మహర్షిచేత కీర్తించబడినవాడా నమస్కారము.

## 50. పాడి

నారాయణ! తే నమో నమో
నారదసన్నుత నమో నమో ॥పల్లవి॥

మురహర! భవహర! ముకుంద! మాధవ!
గరుడగమన! పంకజనాభ!
పరమపురుష! భవబంధవిమోచన!
నరమృగశరీర! నమో నమో! ॥నారాయణ॥

జలధిశయన రవిచంద్రవిలోచన!
జలరుహ భవనుత చరణయుగ!
బలిబంధన గోపవధూవల్లభ!
నలినోదరతే నమోనమో! ॥నారాయణ॥


'KUCHI'

ఆదిదేవ సకలాగమపూజిత!
యాదవకుల! మోహనరూప!
వేదోద్ధర శ్రీవేంకటనాయక!
నాదప్రియ! తే నమో నమో! ॥నారాయణ॥ (సం.-4-కీ.32-అనుబంధం)

**అర్థము** : నారాయణ! = నారాః = నీళ్ళు, అయనం = ఆశ్రయముగా కలవాడు, సాగరశయనుడా! తే = నీకు, నమో = నమస్కారము! నారద సన్నుత = నారదమునిచేత స్తుతింపబడినవాడా! నమో నమః = నమస్కారము.

మురహర = మురాసురుని చంపినవాడా!, భవహర = సంసారహరుడా!, ముకుంద = మోక్షమిచ్చువాడా!, మాధవ = లక్ష్మీపతీ!, గరుడగమన = గరుడవాహనా!, పంకజనాభ = పద్మనాభా!, పరమపురుష = పరమపురుషుడా!, భవబంధవిమోచన = సంసార బంధములను తొలగించువాడా! నరమృగశరీర = నరసింహ శరీరమును ధరించినవాడా!, నమో నమః = నమస్కారము.

జలధిశయన = సముద్రముపై శయనించువాడా! రవిచంద్రవిలోచన = సూర్య చంద్రులు కన్నులుగా కలవాడా! జలరుహభవనుత = తామర నుండి జన్మనొందిన బ్రహ్మచేత ప్రార్థించబడినవాడా! చరణయుగ= పాదయుగళము గలవాడా!, బలిబంధన = బలిచక్రవర్తిని వరుణ పాశముతో బంధించినవాడా!, గోపవధూవల్లభ= గోపికాజనవల్లభుడా!, నలినోదర = పద్మనాభుడా!, తే = నీకు!, నమో నమః = నమస్కారము.

ఆదిదేవ = చిరంతన దైవమా!, సకలాగమపూజిత = సకల వేదములచేత పూజింపబడినవాడా!, యాదవకుల = యదువంశమునందు జన్మించినవాడా!, మోహనరూప = త్రిభువన సమ్మోహనమైన రూపము గలవాడా!, వేదోద్ధర = వేదములను ఉద్ధరించినవాడా!, శ్రీవేంకటనాయక = శ్రీవేంకటగిరినాయకుడా!, నాదప్రియ = నాదప్రియుడా!, తే = నీకు!, నమో నమః = నమస్కారము!

**తాత్పర్యము:** సాగరశయనా! నీకు నమస్కారము! నారదమునిచేత గానము చేయబడుచుండువాడా! నమస్కారము! మురవైరీ! సంసారదుఃఖాలను తొలగించువాడా! మోక్షప్రదాత! లక్ష్మీనాథుడా! గరుడవాహనా! పద్మనాభా! పరమపురుషా! సంసారబంధవిమోచనా! నరమృగశరీరా! నమస్కారము!

సముద్రముపై శయనించువాడా! సూర్యచంద్రులను కన్నులుగా కలవాడా! బలిచక్రవర్తిని బంధించినవాడా! గోపవధూనాథుడా! నలినోదరుడా! నీకు నమస్కారము! చిరంతన దైవమా! వేదమ సంపూజితుడా! గోకులంలో పుట్టినవాడా! త్రిజగన్మోహనాకారా! వేదోద్ధారకా! శ్రీవేంకటగిరినాయకా! నాదప్రియుడా! నీకు నమస్కారము!

## 51. రీతిగౌళ

నాలం వా తవ నయవచనం
చేలం త్యజ తే చేటీ భవామి. ॥పల్లవి॥

చల చల మమ సంసద్ఘటనే కిం
కులిశహృదయ బహుగుణవిభవ
పులకిత తనుసంభృత వేదనయా
మలినం వహామి మదం త్యజామి ॥నాలం॥

భజ భజ తే ప్రియాభామాం సతతం
సుజన స్త్వం నిజసుఖనిలయం
భుజ రేఖా రతి భోగిభవసికిం
విజయీభవ మద్విధిం వదామి ॥నాలం॥

నయ నయ మా మనునయనవిధం తే
ప్రియాకాంతా యాం ప్రేమభవమ్
భయహర వేంకటపతే త్వం మ
త్ప్రియో భవసి శోభితా భవామి ॥నాలం॥

(సంపుటం-6-కీ-157)

**అర్థం :-** తవ = నీ యొక్క, నయవచనం = ప్రీతి వచనాలు, నాలం వా = చాలవా? తే= నీయొక్క, చేలం= వస్త్రాన్ని, త్యజ = విడువుము, చేటీ = నీ సేవికగా, భవామి = ఉన్నాను.

మమ = నాయొక్క, సంసద్ఘటనే = సాన్నిధ్యంలో, కిం = ఏమి, చలచల = కదులుము! కులిశ హృదయ = కఠినమగు వజ్రాయుధం వంటి మనస్సు కలవాడా", బహుగుణ విభవ = అనేక గుణసంపదలు కలవాడా, పులకిత తను సంభృతవేదనయా = పులకరించిన శరీరంతో వేదన చేత, మలినం = మాలిన్యాన్ని, వహామి = వహిస్తున్నాను, మదం త్యజామి = గర్వాన్ని విడిచి పెడుతున్నాను.

సతతం = ఎల్లప్పుడూ, తే = నీ, ప్రియా భామాం = ప్రియురాలైన నన్ను, భజ భజ = ఆదరించుము, నిజసుఖ నిలయ = ఆత్మసుఖానికి మూలమైనవాడా!, త్వం = నీవు, సుజనః = సజ్జనుడవు, భుజరేఖారతి భోగి = ఆలింగనము చేత భుజ ముద్రలను ఇచ్చువాడివిగా, కింభవసి = అగుచున్నావు కదా!, విజయ = జయశీలుడవు, భవ = అగుదువుగాక, మద్విధం= నా భక్తిసాధనా విధానమును, వదామి = చెప్పుతున్నాను.

అనునయన విధం = ఓదార్పు విధానంచే, మాం = నన్ను నయనయ = తీసుకొనిపొమ్ము, ప్రియకాంతాయాం = ప్రియురాలైన అతివయందు, ప్రేమ భరం = ప్రేమ కలుగునట్లుగా, నయ = కాపాడుము, భయహర = భయాన్ని తొలగించువాడా! శ్రీ వేంకట పతే = శ్రీ వేంకటేశ్వరుడా, త్వం =నీవు, మత్ప్రియః= నాకు ప్రియుడుగా, భవసి= అగుచున్నావు, శోభితా = నీ ప్రేమ చేత శోభించు దానినై, భవామి = అగుచున్నాను.

**తాత్పర్యం :** ఈ కీర్తనలో నాయిక ఖండిత, నాయకుడైన శ్రీ వేంకటేశ్వరుడు ఇతర కాంతాసక్తుడు అవడంవల్ల నాయిక నీ నయవచనాలు చాలించుమని హెచ్చరిస్తున్నది. తనకు చేరువ చేసుకోవడానికి నాయిక యొక్క వస్త్రాన్ని పట్టుకొన్నాడు స్వామి, వెంటనే వదలమని విదిలించింది. కఠోర హృదయుడా! అనేక గుణాలతో



విరాజిల్లేవాడివిగా ఉండు! నేను పులకరించిన శరీరంతో వేదన పొందుతున్నాను, శరీరం శోభను వీడుతున్నది. నాలోని గర్వం తొలగుతున్నది. నీకు ప్రేయసినైన నాచెంత సంచరించు. ఆత్మసుఖానికి మూలమైనవాడా! నీవు సజ్జనుడవు! ఆలింగనం చేత భుజముద్రల నిచ్చేవాడివికమ్ము, జయశీలుడవు అగుదువుగాక! నాయొక్క భక్తి సాధన విధి నివేదిస్తున్నాను. ఎల్లప్పుడూ నీయొక్క ప్రియురాలిగా నన్ను ఆదరించు. భయాన్ని తొలగించువాడా! శ్రీవేంకటేశ్వరుడా! అనునయ విధితో నన్ను కాపాడు. ప్రియురాలైన నా యందు ప్రేమను లక్షింపజేసి, నా ప్రియుడవుకమ్ము. నేను ప్రేమాతి శయంచేత శోభితురాలనవుతున్నాను.

**విశేషాంశం** : తొలి చరణంలో అన్యకాంతాసక్తుడైన శ్రీవారిని కఠోర హృదయు డని నాయక సంబోధించింది. రెండో చరణంలో నీ ప్రియురాల నైతే ఆత్మసుఖాన్ని పొందు తానని నివేదించుకున్నది. మూడవచరణంలో 'భయహర' అని సంబోధిస్తూ తనను అనన్య ప్రీతితో ఆదరించమని ఆశ్రయిస్తున్నది. ఈ కీర్తనలో మధుర భక్తి సంప్రదాయం కంఠదఘ్నంగా నిక్షిప్తమై ఉన్నది.

## 52. శ్రీరాగం

నిత్యానంద ధరణీధర ధరారమణ
కాత్యాయనీస్తోత్రకామ కమలాక్ష ॥పల్లవి॥

అరవిందనాభ జగదాధార భవధూర
పురుషోత్తమ నమో భువనేశ
కరుణాసమగ్ర రాక్షసలోకసంహార-
కరణ కమలాధీశ కరిరాజవరద ॥నిత్యా॥

భోగీంద్రశయన పరిపూర్ణ పూర్ణానంద
సాగరనిజావాస సకలాధిప
నాగారిగమన నానావర్ణనిజదేహ
భాగీరథీజనక పరమ పరమాత్మ ॥నిత్యా॥

పావన పరాత్పర శుభప్రద పరాతీత
కైవల్యకాంత శృంగార రమణ
శ్రీవేంకటేశ దాక్షిణ్యగుణనిధి నమో
దేవతారాధ్య సుస్థిరకృపాభరణ! ॥నిత్యా॥

(సంపుటం-1-కీ.25)

నిత్యానంద = ఎల్లప్పుడూ ఆనన్దమయుడైనవాడా!, ధరణీధర = భూదేవిని ఉద్ధరించిన వాడా!, ధరారమణ= భూదేవికి ప్రియమైన వాడా!, (కాత్యాయనీ స్తోత్ర = పార్వతీదేవిచే కీర్తించబడినవాడా!, కామ = కోరదగినవాడా!), కమలాక్ష = పద్మాలవంటి కన్నులు కలవాడా!

అరవిందనాభ = పద్మనాభుడా! జగదాధార = జగత్తుకు ఆధారమైనవాడా!, భవదూర = సంసారమును తొలగించువాడా!, పురుషోత్తమా = సర్వోత్తముడా!, భువనేశ = భువనములకు నాధుడా! కరుణాసమగ్ర = సమస్త కరుణ స్వరూపుడా! రాక్షసలోక సంహార కరణ = రాక్షస సమూహమును నాశనము చేయువాడా!, కమలాధీశ = లక్ష్మీనాథుడా! కరిరాజవరద = గజేంద్ర రక్షకుడా!, నమో = నమస్కారము.

భోగీంద్ర శయన = శేషశయనా! పరిపూర్ణ = వ్యాపకుడా! పూర్ణానంద = బ్రహ్మానందుడా!, సాగర నిజావాస = సముద్ర నిలయుడా! సకలాధిప = సమస్తానికి అధిపతియైన వాడా!, నాగారిగమన = గరుత్మంతుని వాహనంగా కలవాడా!, నానావర్ణ నిజదేహ = అనేక వర్ణదేహములకలవాడా! భాగీరథీజనక = గంగాజనకుడా! పరమ = మోక్షస్వరూపుడా! పరమాత్మ = పరమాత్మ స్వరూపుడా! నమస్కారము.

పావన = పవిత్రమైన వాడా!, పరాత్పర = పరాత్పరుపుడా! శుభప్రద = మంగళ స్వరూపుడా!, పరాతీత = మోక్షాతీతుడా!, కైవల్యకాంత = కైవల్యానికి నాధుడ!, శృంగార రమణ = శృంగార మనోహరుడా!, శ్రీవేంకటేశ = శ్రీవేంకటేశ్వర స్వామీ! దాక్షిణ్య గుణనిధి = దయకు గనివంటివాడా! దేవతారాధ్య = దేవతలకు పూజనీయుడా! సుస్థిర కృపాభరణ= చలించని కరుణయే ఆభరణముగా కలవాడా! నమో = నమస్కారము.

**తాత్పర్యము :** శాశ్వత ఆనందస్వరూపుడా! భూదేవిని ఉద్ధరించినవాడా! భూకాంతా ప్రియుడా! పార్వతీమాతచే కీర్తించబడినవాడా! కోరదగిన స్వరూపమా! పద్మాల వంటి కన్నులు కలవాడా! పద్మనాభుడా! జగత్తుకు ఆధారమైనవాడా! సంసారమును తొలగించువాడా! సర్వోత్తముడా! భువనములకు నాథుడా! కరుణాస్వరూపుడా! రాక్షసలోక సంహారమును చేయువాడా! లక్ష్మీనాథుడా! గజేంద్ర రక్షకుడా! నమస్కారము.

శేషశయనుడా! వ్యాపకుడా! బ్రహ్మానందుడా! సముద్ర నిలయుడా! సమస్తానికి అధిపతియైనవాడా! గరుత్మంతుని వాహనంగాకలవాడా! అనేకవర్ణ దేహము కలవాడా! గంగాజనకుడా! మోక్షస్వరూపుడా! పరమాత్మ స్వరూపుడా! నమస్కారము.

పరమ పవిత్రమైన దేవా! మోక్షరూపమా! మంగళస్వరూపుడా! మోక్షాతీతుడా! కైవల్యానికి నాధుడా! శృంగారమనోహరుడా! శ్రీవేంకటేశ్వరస్వామీ! దయకు గనివంటి వాడా! దేవతలకు పూజనీయుడా! సుస్థిరమైన కరుణకు ఆభరణము వంటివాడా! నమస్కారము.

## 53. భౌళి

పరమపురుష నిరుపమాన శరణు శరణు రేయేయేయే ఇందిరా-
నిజమందిరా ॥పల్లవి॥
కమలనాభ కమలనయన కమలచరణ రే
అమితసురమునినాథయూథపనాయకా వరదాయకా ॥పర॥
చతురమూరితి చతురబాహు శంఖచక్రధరా
అతిశయ శ్రీవేంకటాధిప అంజనాకృతిరంజనా ॥పర॥

(సంపుటం-2-367-కీ)


KUCHI

పరమ పురుష = పరమ పురుషా!, నిరుపమాన = అసమానుడా!, యే ఇందిరా నిజమందిరా = ఓ! లక్ష్మీదేవికి నిలయమైనవాడా!, శరణు శరణు = శరణు వేడుతున్నాను.

కమలనాభ = పద్మనాభుడా!, కమలనయన = పద్మనేత్రుడా!, కమలచరణ = పద్మము వంటి పాదము కలవాడా! అమితసుర మునినాథ యూథ నాయకా= = గొప్ప సురులకు మునీశ్వరుల సమూహాలకు నాయకుడా!

చతుర మూరితి = చాతుర్యములవాడా!, చతుర బాహుశంఖ చక్రధరా = అందమైన కరాలతో శంఖ చక్రాలనుదాల్చినవాడా!, అతిశయ శ్రీవేంకటాధిప = ఉన్నతమైన వేంకటాచల నాయకా! అంజనాకృతిరంజనా = అంజనాదేవికి పుత్రుడైన హనుమంతునికి ఆనంద కారకుడా! నమస్కారము.

తాత్పర్యం : మోక్షస్వరూపుడా! అసమానదైవమా! లక్ష్మీదేవికి నాథుడా! శరణు వేడుతున్నాను. పద్మనాభుడా! పద్మనేత్రుడా! పద్మములవంటి పాదములు కలవాడా! మునీశ్వరుల సమూహాలకు నాయకుడా! కోరిన వరములను ఇచ్చువాడా! చాతుర్యముకలవాడా! అందమైన శంఖచక్రాలను దాల్చినవాడా! మహోన్నత వేంకట నాయకుడా! అంజనాదేవి పుత్రునికి ఆనందకారకుడా! నమస్కారము.

## 54. మలహరి

పరమపురుష హరి పరమ పరాత్పర
పరరిపుభంజన పరిపూర్ణ నమో. ॥పల్లవి॥

కమలాపతి కమలనాథ కమలాసనవంద్య
కమలహితానంతకోటి ఘనసముదయ తేజా
కమలామలపత్రనేత్ర కమలవైరివర్ణగాత్ర
కమలషట్కయోగీశ్వరహృదయం తే హం నమోనమో ॥పర॥

జలనిధిమథన జలనిధిబంధన జలధిమధ్యశయనా
జలధియంతరవిహార మచ్ఛకచ్ఛపయవతారా
జలనిధిజామాత జలనిధిశోషణ జలనిధిసప్తక గమన
జలనిధికారుణ్యా నమో తేహం జలనిధిగంభీర నమో నమో ॥పర॥

నగధర నగరిపునందిత నగరచరయూథపనాథా
నగపారిజాతహర సారసపన్నగపతిరాజశయన
నగకులవిజయ శ్రీవేంకటనగనాయక భక్తవిధేయా
నగధీరా హం తే సర్వేశ్వర నారాయణ నమో నమో ॥పర॥

(సంపుటం-2-కీర్తన-453)

**అర్థం** :- పరమ పురుష = ఓ! పురుషోత్తమా!, హరీ! = ఓ! శ్రీహరీ!, పరమ = కైవల్యస్వరూపుడా!, పరాత్పర = అత్యున్నతమైన మోక్షసుఖముకన్న గొప్పవాడా! పరరిపుభంజన = గొప్ప శత్రువులను

సంహరించువాడా!, పరిపూర్ణ = పరిపూర్ణ స్వరూపుడా, నమః = నమస్కారము, కమలాపతి = లక్ష్మీపతి, కమలనాథ = పద్మనాభుడా!, కమలాసనవంద్య = కమలమును ఆసనంగా గల బ్రహ్మచేత నమస్కరింపబడిన వాడా!, కమలహితానంత కోటి ఘనసముదయ తేజా! = అనంతకోటి జీవ హృదయకమలాలను వికసింపజేయు తేజస్సుకలవాడా! కమలామల పత్రనేత్ర = విశాలమైన తామర రేకుల వంటి నేత్రములు కలవాడా! కమల వైరివర్ణగాత్ర = చంద్రునివంటి స్వచ్ఛమైన శరీరము గలవాడా!, తే = నీయొక్క, కమల షట్క యోగీశ్వర హృదయం = యోగ విద్యచేత తెలుసుకోబడిన ఆరు చక్రాలతో కూడిన హృదయమందు నివసించే యోగీశ్వరుడా! నమోనమః= నీకు నమస్కారము, జలనిధి మథన = కూర్మరూపంతో సముద్రాన్ని మథించినవాడా కూర్మావతారుడా! జలనిధి బంధన = సేతువును బంధించిన రామావతారుడా! జలధి మధ్య శయన = క్షీరసముద్రం మధ్యలో శయనించు మహా విష్ణుమూర్తీ, జలనిధి అంతర విహారా! = సముద్రమందు విహరించువాడా! మత్స్యావతారా!, మత్స్యకచ్ఛప అవతారా = మత్స్యకూర్మావతారాలను ధరించిన వాడా!, జలనిధిజామాత= సముద్రానికి అల్లుడా!, జలనిధి శోషణా = సంసార సముద్రాన్ని ఎండగట్టువాడా!, జలనిధి సప్తక గమనా= ఏడు సముద్రాలలో విహరించువాడా! జలనిధి కారుణ్యా = సముద్రమువంటి దయ కలిగిన వాడా!, జలనిధి గంభీర = సముద్రమువలె లోతైన వాడా! నీకు నమస్కారము. నగధర = గోవర్ధనగిరి నెత్తినవాడా!, నగరిపువందిత = ఇంద్రునిచే నమస్కారము పొందువాడా! నగచర యూథపనాథా = గజేంద్రుని రక్షించువాడా!, నగపారిజాతహర = స్వర్గంలో నాక పృష్ఠమనే కొండ యందున్న పారిజాతాన్ని అపహరించిన వాడా!, సారస = ఆనంద రస స్వరూపుడా! (ఆసమంతాత్ రసః ఆరసః, ఆరసేన సహితః సారసః), పన్నగపతిరాజశయన = శేషునియందు శయనించువాడా! నగకుల విజయ = పర్వతములకు అధిపతియైనవాడా! (విష్ణుః పర్వతానామధిపతిః), శ్రీ వేంకటనగనాయకా = వేంకటాచల నాయకుడా, భక్త విధేయా = భక్తులకు విధేయుడా, నగధీరా = పర్వతంలా సమున్నతమైన ధైర్యము కలవాడా, సర్వేశ్వరా = సర్వేశ్వరుడా!, నారాయణా అహం = స్వామీ! నారాయణా! నేను, తే = నీకు, నమో నమః = నమస్కారము చేస్తున్నాను.

**తాత్పర్యం :-** పరమపురుషా! శ్రీహరీ! కైవల్య స్వరూపుడా! మోక్షసుఖాన్ని అనుగ్రహించే దేవాధిదేవా నమస్కారము. గొప్ప శత్రువులను సంహరించువాడా! పరిపూర్ణ స్వరూపుడా! నమస్కారము. రమారమణా! పద్మనాభుడా! బ్రహ్మవందితుడా! జీవుల హృదయాలను వికసింపజేయు విజ్ఞాన స్వరూపమా! స్వచ్ఛమైన కమలముల వంటి కన్నులుకలవాడా! చల్లని చంద్రకాంతులీనే శరీరుడా! యోగీశ్వరులచేత తెలుసుకొనబడువాడా! నమస్కారము సముద్రాన్ని మథించిన కూర్మరూపుడా! వారధి నిర్మించిన శ్రీరామా! సముద్రశయనుడైన మహావిష్ణు మూర్తీ! సముద్రరాజుకు అల్లుడా! సంసారసాగరాన్ని ఎండగొట్టువాడా! సముద్రము వంటి దయకు గనివంటివాడా! సముద్ర గంభీరుడా! నమస్కారము. గోవర్ధనగిరి నెత్తిన వాడా! దేవేంద్ర వందితుడా! గజేంద్ర రక్షకుడా! పారిజాతాన్ని ఇలకు తెచ్చినవాడా! ఆనంద నిలయుడా! శేషశయనుడా! పర్వతాధిపతీ! వేంకటాచలనాయకా! భక్తులకు విజయమిచ్చువాడా! నగధీరుడా! సర్వేశ్వరుడా! శ్రీమన్నారాయణా! నీకు నమస్కారము.

## 55) నాట

పరిపూర్ణగరుడాద్రి పంచాననం
పరమం సేవే పంచాననం ॥పల్లవి॥

క్రూర దంష్ట్రాగ్ని కణఘోర పంచాననం
పారీణ చక్రధర పంచాననం
వీర పంచాననం విజయపంచాననం
భార భూభార హరపంచాననం ॥పరిపూర్ణ॥

దివిజ పంచాననం తీవ్రనఖకాననం
భవనాశినీతీర పంచాననం
కువలయాకాశ సంఘోషపంచాననం
పవిశబ్ద దంతరవ పంచాననం ॥పరిపూర్ణ॥

శ్రీవేంకటాఖ్య ఘనశిఖరి పంచాననం
పావనం పంచముఖ పంచాననం
సేవిత ప్రహ్లాద సిద్ధి పంచాననం
భావితం శ్రీయుక్త పంచాననం ॥పరిపూర్ణ॥

(సం.-1-కీ.-428)

**అర్థము** : పరిపూర్ణ గరుడాద్రి = పరిపూర్ణమైన గరుడాద్రి యందు నెలకొనియున్న, పంచాననం = సింహమును, పరమం = పరముడైన, పంచాననం = నరసింహుని, సేవే = సేవింతును.

క్రూరదంష్ట్రాగ్ని = క్రూరమైన కోఱల నిప్పుగలవాడును, రణఘోర = యుద్ధము నందు భయంకరుడనయిన, పంచాననం = సింహమును, పారీణ = తన కృత్యముల యందు పారంగతమయిన, చక్ర = చక్రాయుధమును, ధర = ధరించగ, పంచాననం = సింహమును, వీరపంచాననం = వీరసింహమును, విజయపంచాననం = విజయశీలమైన సింహమును, భార = భారభూతమైన, భూభారహర = భూభారమును హరించెడి సింహమును, పంచాననం = సింహమును, సేవే = సేవింతును.

దివిజ పంచాననం = దేవతలలో సింహము వంటివానిని, తీవ్రనఖాననం = తీవ్రములైన గోళ్ళకొనలుగల వానిని, భవనాశినీతీర పంచాననం = భవనాశినీ నదీతీరము నందున్న సింహాన్ని, కువలయ = భూవలయము, ఆకాశ = ఆకాశము నిండిన, ఘోష = సింహనాదముగల, పంచాననం = సింహాన్ని, పవిశబ్ద = పిడుగుల ధ్వని వంటి, దంతరవ = దంతముల యొక్క, పటపటాత్కారము గల, పంచాననం = పంచాననుని, సేవే = సేవింతును.

శ్రీవేంకటాఖ్య = శ్రీవేంకటమనుపేరుగల, ఘనశిఖరి = పెద్దకొండపై నెలకొనియున్న, పంచాననం = సింహాన్ని, పావనం = లోకపావనుని, పంచముఖ = ఐదుముఖములుగల, పంచాననం = నరసింహుని,

సేవిత= సేవించిన, ప్రహ్లాద = ప్రహ్లాదునకు, సిద్ధి = సిద్ధిప్రదుడైన, పంచాననం = సింహాన్ని, భావితం = భావింపబడినవానిని, శ్రీయుక్త = లక్ష్మీసహితుడయిన, పంచాననం = సింహమును, సేవే = సేవింతును.

**తాత్పర్యము:** పరిపూర్ణమైన గరుడాద్రి యందు నివసించు సింహమును పరమ పురుషుడైన సింహ స్వరూపుని సేవింతును. క్రూరములైన కోరలనుండి వెలువడుచున్న అగ్ని కలవానిని, యుద్ధములయందు ఘోర స్వరూపుని, కార్యపారంగతమైన చక్రాయుధమును దాల్చినవానిని, వీర పంచాననుని, విజయపంచాననుని, భూభారమును హరించెడి పంచాననుని సేవింతును. దేవతలలో సింహమువంటివాడు, వాడియైన గోళ్ళ కొనలుగలవాడు, భవనాశినీ నదీ తీరమునందు నివసించు పంచాననుని భూమ్యాకాశములు నిండిన ఘోషముగల సింహాన్ని, పిడుగుల ధ్వని వంటి దంతముల యొక్క పటపటాత్కారము గల, సింహాన్ని సేవింతును. శ్రీవేంకటమను కొండపై వెలసిన సింహాన్ని, భువనపావనుని, పంచముఖములు గల నరసింహస్వామిని సేవించిన ప్రహ్లాదునకు వరప్రదాయి అయిన సింహాన్ని భావింతును. భావింపతగినవాడైన శ్రీలక్ష్మీసహిత నరసింహస్వామిని సేవింతును.

## 56. శుద్ధవసంతం - రచ్చెతాళం

ప్రలపనవచనైః ఫలమిహకిం
చల చల కుడ్యక్షాళనయా కిం ॥పల్లవి॥

ఇతర వధూమోహితం త్వాం ప్రతి
హితవచనై రీహితు మిహ కిం
సతతం తవానుసరణ మిదం మమ
గతజల సేతూకరణ, మిదానీం ॥ప్రలప॥

వికలవినయ దుర్విటం త్వాం ప్రతి
సుకుమారార్ద్రస్తుత్యా కిం
ప్రకటబహుల కోపనం మమ తే
సకల చర్విత చర్వణమేవ ॥ప్రలప॥

శిరసా నతసుస్థిరం త్వాం ప్రతి
విరసాలాపన విధినా కిం
తిరువేంకటగిరి దేవ త్వదీయ-
విరహావిలపనం వృథాచరణం ॥ప్రలప॥

(సంపుటం-5-కీర్తన-39)

**అర్థం :** ప్రలపన వచనైః = పసలేనిమాటలచేత, ఇహ = ఇక్కడ, ఫలంకిమ్ = ఏమి ప్రయోజనము, కుడ్యక్షాలనయా = రాళ్ళతో కట్టిన గోడను శుభ్రంచేయడం వల్ల, ఫలంకిమ్= ఏమి ప్రయోజనం, చలచల = నడు నడు.

ఇతర వధూమోహితం = మరో స్త్రీయందు కోరికకల, త్వాం ప్రతి = నిన్ను ఉద్దేశించి, హితవచనైః = బ్రతిమాలుటచేత, ఇహ = ఇక్కడ, ఈహితుం = కోరుటకు, కిం = ఫలమేమీ లేదు, సతతం = ఎల్లప్పుడూ, మమ = నాకు, తవ = నిన్ను, అనుసరణం = అనుసరించే, ఇదం = ఈ ప్రయత్నము, ఇదా నీం = ఇప్పుడు, గత జల సేతుకరణం = జనప్రవాహానంతరం ఆనకట్టను నిర్మించటమే.

వికల వినయదుర్విటం = కపట వినయాలనుకల విటుడవైన, త్వాం ప్రతి = నిన్ను, మమ = నాయొక్క, సుకుమార్త్రస్తుత్యా = మృదువుగా బ్రతిమాలుకోవడాలు చేత, కిం = ఏమి ప్రయోజనము, తే = నీయందు,

ప్రకటబహుళకోపనం = ఎక్కువగా కోపగించుట, సకలం చర్విత చర్వణమేవ = అంతా నెమరువేయుట లాంటిదే, శిరసా = శిరస్సుచేత, నతసుస్థిరం = ఎంతకాలము నమస్కరించినా, త్వాంప్రతి = నీగురించి, విరసాలాపన విధినా = విరసమైన మాటలచేత, కిం = ఫలమేమి, తిరువేంకటగిరిదేవ = వేంకటగిరి వాసము చేయువాడా! త్వదీయ విరహ పయనం = నీ విరహముతో రోదించుట, వృధా చరణం = వ్యర్థప్రయత్నమే అగుచున్నది.

**తాత్పర్యం :** స్వామీ! నీ ముఖప్రీతిమాటలతో ఏమిఫలం? రాతిగోడను శుభ్రం చేయడం వల్ల ఏమి ప్రయోజనం? చాల్లే ఈ చోటు వదలివెళ్ళు. ఇతర స్త్రీలను మరిగిన నీకు మంచిమాటలు ఏం మార్పుతెస్తాయి. నేను ఎల్లవేళల నిన్ను అనుసరించి ఉండటం నీరు వెళ్ళాక కట్టిన వంతెనలా అర్థరహితమవుతున్నది. వినయం నటించే విటుడవైన నిన్ను మంచిమాటలతో మచ్చిక చేసుకోవడం ఎందుకు' పైగా నా యీ కోపం నీకు అలవాటైపోయి అలుసుగా మారింది. ఓ! శ్రీ వేంకటాచల దేవా! నీయొక్క విరహంతో వేదన పొందటం వ్యర్థ ప్రయత్నమే అవుతున్నది.

**విశేషాంశం :** ఖండిత నాయిక - శృంగారనాయకుడైన శ్రీవారిని తనను అనన్యంగా ఆదరించమని వేడుకొంటున్న ఈ కీర్తన అపూర్వమైనది. ఈర్ష్యావిప్రలంభ శృంగార ప్రధానమైనది. కీర్తన చివరలో నాయిక సాదరంగా తిరువేంకటగిరి దేవా! అని సంబోధిస్తూ స్వామి, సాన్నిధ్యలబ్ధిని వ్యంగ్యంగా ప్రస్తుతిస్తున్నది. ప్రణిపాత ప్రీతికారః సంరంభోహి మహాత్మనామ్" అని కాళిదాసోక్తి (రఘువంశం 4-64) కనుక సన్నుతించడం చేత మహాత్ములు ప్రసన్నులవుతారని నాయిక విశ్వసిస్తున్నది.

## 57) పాడి

పృథుల హేమ కౌపీన ధరః
ప్రథిత వటుర్మే బలం పాతు ॥పల్లవి॥

సూపాసక్తః శుచిస్సులభః
కోపవిదూరః కులాధికః
పాపభంజనః పరాత్పరోయం
గోపాలోమే గుణం పాతు ॥పృథుల॥

తరుణః ఛత్రీ దండకమండలు
ధరః పవిత్రీ దయాపరః
సురాణాం సంస్తుతి మనోహరః
స్థిరః సుధీర్మే ధృతిం పాతు ॥పృథుల॥

త్రివిక్రమః శ్రీతిరువేంకటగిరి
నివాసోయం నిరంతరం
ప్రవిమల మసృణ కబళ ప్రియోమే
దివా నిశాయాం ధియం పాతు ॥పృథుల॥

(సంపుటం-4-కీ.72)

**అర్థము** : పృథుల = విశాలమైన, హేమ = బంగారుకాంతులీనే, కౌపీనధరః = గోచీని ధరించినవాడు, ప్రథితవటుః = ప్రసిద్ధుడయిన బ్రహ్మచారి, మే = నా, బలాయ=బలమును, పాతు = రక్షించునుగాక!

సూపాసక్తః = పప్పు అన్న ప్రియుడును, శుచిః = పవిత్రుడును, సులభః = సౌలభ్యమే స్వభావముగా కలవాడును, కోపవిదూరః = కోపములేనివాడును, కులాధిక = బ్రహ్మకులముచేతనధికుడును, పాప భంజనః = పాపములను నశింపజేయువాడును, పరాత్పరః = పరాత్పరుడునయిన, అయం = ఈ, గోపాలః = ఇంద్రియములను పాలించువాడు, మే = నా యొక్క, గుణం = సత్వ గుణమును, పాతు = కాపాడునుగాక, తరుణః = పిన్న వయస్సువాడు, ఛత్రీ = గొడుగును దాల్చినవాడు, దండకమండలుధరః= దండకమండలములను ధరించినవాడును, పవిత్రీ = దర్భలను ధరించినవాడును, దయా పరః = దయావరుడును, సురాణాం = దేవతల యొక్క, సంస్తుతి మనోహరః = పొగడ్తలతో మనస్సునాకర్షించుచున్నవాడును, స్థిరః = స్థిరస్వభావుడును, సుధీః = సాధుబుద్ధిగల వాడును లేక పండితుడునగునితడు, మే = నా యొక్క, ధృతిం = మనోనిశ్చలతను, పాతు = కాపాడునుగాక.

త్రివిక్రమః = మూడు అడుగులతో మూడులోకములను కొలిచినవాడు. శ్రీవేంకట గిరినివాసః = శ్రీవేంకటగిరి నివాసుడును, నిరంతరం = ఎల్లప్పుడును, ప్రవిమల = సునిర్మలము, మసృణ = మిసిమిగల, కబళ = అన్నకబళమునకు, ప్రియః = ఇష్టపడెడి వాడు, అయం = ఈతడు, మే ధియం = నా బుద్ధిని, దివా= పగటియందును, నిశాయాం = రాత్రియందును, పాతు = కాపాడునుగాక!

**తాత్పర్యము** : ఇది శ్రీవామనావతార సంకీర్తన.

విశాలమైన బంగారువన్నియ కౌపీనమును ధరించిన ఆ భువన ప్రసిద్ధవటువు నా బుద్ధిని కాపాడునుగాక! పప్పు అన్నప్రియుడు, సులభ స్వభావుడు, పవిత్రుడు, కోపములేనివాడు, విప్రకుల సంభవుడు, పాప విభంజనుడు పరాత్పరుడునయిన, ఈ ఇంద్రియ పాలకుడు నా సత్త్వగుణమును కాపాడుగాక! పిన్నవాడు, గొడుగునుదాల్చినవాడు దండకమండలధారి, దేవతల పొగడ్తలతో ముచ్చట గొలుపుచున్నవాడు, స్థిరస్వభావుడు, పండితుడైన - వామనస్వామి నా మనోనిశ్చలతను కాపాడునుగాక! మూడడుగులవాడు నిరంతరము



శ్రీవేంకటగిరి యందు నివసించువాడు, వండిన కబళప్రియుడు అయిన వామనుడు రేయింబవలును నా బుద్ధిని కాపాడునుగాక.

## 58) సామంతం

బ్రువంతి బౌద్ధా బుద్ధ ఇతి
స్తువంతి భక్తా సులభ ఇతి ॥పల్లవి॥

గదంతికిల సాంఖ్యాస్త్వాం పురుషం
పదవాక్య జాః పదమితి చ
విదంతి త్వా వేదాంతిన
స్సదా బ్రహ్మలసత్పదమితి చ ॥బ్రువంతి॥

జపంతి మీమాంసకా స్త్వాం చ
విపుల కర్మణో విభవ ఇతి
లపంతి నయసకలా స్సతతం
కృపాళుకర్తా కేవలమితిచ ॥బ్రువంతి॥

భణంతి వేంకటపతే మునయో
హ్యణిమాదిప్రద మతులమితి
గుణవంతం నిర్గుణం పునరితి
గృణంతి సర్వే కేవల మితి చ ॥బ్రువంతి॥

సం.1-కీర్తన-164

**అర్థము :** త్వాం = నిన్ను, బౌద్ధాః = బుద్ధమతానుయాయులు, బుద్ధ ఇతి = బుద్ధుడవని, బ్రువంతి = పలుకుదురు, భక్తాః = భక్తిమార్గానుయాములు, సులభ ఇతి = సులభుడవని, బ్రువంతి = పలుకుతున్నారు, స్తువంతి = స్తోత్రం చేయుచున్నారు.

పదవాక్యజ్ఞాః = పదవాక్యవేత్తలు, పదమితి చ = శబ్దబ్రహ్మవని పలుతున్నారు, త్వాం = నిన్ను, వేదాంతినః = వేదాంతవిదులు, సదా = ఎప్పుడును, లసత్పదం = ప్రకాశమాన స్థానమవైన, బ్రహ్మేతి = బ్రహ్మము అని, విదంతి = తెలియుచున్నారు. సాంఖ్యాః = సాంఖ్యులు, త్వాం = నిన్ను, పురుష ఇతి = పురుషుడవని, గదంతికిల = చెప్పుచున్నారు కదా!

మీమంసకాః = మీమాంసాశాస్త్రవేత్తలు, త్వాం = నిన్ను, విపులకర్మణః = కర్మయొక్క, విభవ ఇతి = వైభవమని, జపంతి = జపిస్తున్నారు, నయసకలాః = నైయాయికులు, కేవలం = కేవలము, కృపాలుకర్తా కేవలమితిచ = కృపాళుడవైన కర్తవని, సతతం = ఎప్పుడును, లపంతి = పలుకుతున్నారు.

మునయః = మునులు, అణిమాదిసిద్ధులను ప్రసాదించునట్టి, అతులం = సాటిలేని, వేంకటపతి ఇతి= వేంకటపతివని, భణంతి = పలుకుతున్నారు. గుణవంతం = సుగుణుడవని, పునః = మఱల, నిర్గుణమికిచ = నిర్గుణుడవని, కేవలమితి చ = కేవలుడవనియును, సర్వజనులును పలుకుతున్నారు.

**విశేషాంశం** : శ్రీవేంకటపతి సకల శాస్త్రప్రతిపాద్యుడు. -ఆ శ్రీవేంకటేశ్వరుని బుద్ధమతాను యాయులు బుద్ధుడని, భక్తమార్గానుసారులు -భక్తసులభుడవని, పదవాక్యవేత్తలు శబ్ద బ్రహ్మమని, వేదాంతవిదులు నిత్యప్రకాశమానమైన బ్రహ్మస్వరూపమని, సాంఖ్యులు పురుష స్వరూపమని, మీమాంస శాస్త్రకోవిదులు కర్మస్వరూపుడవని, నైయాయికులు - దయాస్వరూపుడయిన కర్తవని ఎప్పుడూ స్తోత్రం చేస్తున్నారు. సంస్కృతంలోని ప్రసిద్ధమైన ఈక్రింది శ్లోకము పై కీర్తనభావాన్ని చక్కగా విశ్లేషిస్తున్నది.

యం శైవాస్సముపాసతే శివ ఇతి బ్రహ్మేతి వేదాంతినః
బౌద్ధా బుద్ధ ఇతి ప్రమాణ పటవ కర్తేతి నైయ్యాయికాః ।
అర్హన్ ఇత్యధజైనశాసనరతాః కర్మేతి మీమాంసకాః ।
సోయం వోవిదధాతు వాంఛితఫలం త్రైలోక్య నాధోహరిః ॥

## 59) శ్రీరాగం

ఫాలనేత్రానల ప్రబల విద్యుల్లతా
కేళీ విహార! లక్ష్మీనారసింహా! ॥పల్లవి॥

ప్రళయమారుతఘోర భస్త్రికా ఫూత్కార
లలిత నిశ్వాస డోలా రచనయా
కులశైల కుంభినీ కుముదహిత రవిగగన
చలన విధి నిపుణ! నిశ్చల నారసింహా! ॥ఫాలనేత్రానల॥

వివరఘనవదన దుర్విదహసన నిష్ఠ్యూత
లవ దివ్య పరుష లాలాఘటనయా
వివిధ జంతువ్రాత భువన మగ్నీకరణ
నవనవ ప్రియ గుణార్ణవ ! నారసింహా !! ॥ఫాలనేత్రానల॥

దారుణోజ్జ్వల ధగద్ధగిత దంష్ట్రానలవి
కారస్ఫులింగ సంగక్రీడయా
వైరిదానవ ఘోరవంశ భస్మీకరణ
కారణ ప్రకట వేంకటనారసింహా ॥ఫాలనేత్రానల॥ (సం.-1-కీ-281)

**అర్థము** : ఫాలనేత్ర = ఫాలనేత్రమునకు సంబంధించిన, అనల = అగ్నికి సంబంధించిన, విద్యుల్లతా = మెఱుపు తీగల యొక్క, కేళీవిహార = క్రీడావిహారములుగల, లక్ష్మీనారసింహా= లక్ష్మీనరసింహస్వామీ

ప్రళయమారుత = ప్రళయమారుతముతో నిండిన, ఘోర = భయంకరమైన, భస్త్రికా = కొలిమి తిత్తియొక్క, ఫూత్కార = ఫూత్కారము వంటి, లలిత నిశ్వాస = సుందరమైన నిట్టూర్పులనే, డోలారచనయా= ఉయ్యాల ఊపుచేత, కులశైల = సప్తకులపర్వతములను, కుంభినీ = భూమిని, కుముదహిత = చంద్రుని, రవి = సూర్యుని, గగన = ఆకాశమును, చలనవిధి = ఊగించుటనే కార్యమందు, నిపుణ = నేర్పరివై, నిశ్చల= నీవు మాత్రము కదలకయున్న, నారసింహ = నరసింహస్వామీ!

వివరఘన = గుహల పెద్దదైన, వదన = ముఖమునందలి, దుర్విధిహసన = వెక్కసమైన నవ్వునుండి, నిష్ఠ్యూత = ఉమిసిన తుంపర యొక్క, లవ = లేశమునకు సంబంధించిన, దివ్య = దివ్యము, పరుష = పరుషమునయిన, లాలా = ఉమ్మియొక్క, ఘటనయా = ఘటనామాత్రముచేతనే వివిధ జంతు వ్రాత = పలు తెగల ప్రాణి సమూహములతో నిండిన, భువన = లోకమును, మగ్నీకరణ = ముంచుచున్నవాడా! నవనవ = నిత్యనూతనుడా!, ప్రియగుణ = ప్రియగుణములకు, అర్ణవ = సముద్రమువంటివాడా!, నారసింహ= నరసింహ స్వామీ!

దారుణ = భయంకరము, ఉజ్జ్వల = ఉజ్జ్వలములైన, దగద్ధగిత = ధగధగలుగల, దంష్ట్రానలవికార= దంష్ట్రాగ్ని యొక్క వికారమైన, స్ఫులింగ సంగక్రీడయా = నిప్పురవ్వ చిందిపడుట చేత, వైరి = శత్రువులైన, దానవ = దానవులయొక్క, ఘోర = భయంకరములయిన, వంశ = వంశమేయనెడి వెదుళ్ళకు, భస్మీకరణ కారణ = బూడిదగా జేయుటకు కారణమైనవాడా, ప్రకట = ప్రసిద్ధుడవైన, వేంకట నారసింహ = శ్రీవేంకటేశ్వరస్వరూపములో నున్న నరసింహస్వామీ!

**తాత్పర్యము :** నొసటికంటినుండి లేచిన నిప్పులనుండి ఎగసిపడిన మెఱుపుతీగల యొక్క నాట్యకేళీ విహారములు గల లక్ష్మీనరసింహస్వామీ!

ప్రళయ మారుతముతో నిండిన భయంకరమైన కొలిమితిత్తి యొక్క ఫూత్కారమువంటిదియైన, నీ లలితమైన నిశ్వాసపవనమనే - ఉయ్యాలలో కులపర్వతములను, భూమిని, సూర్యచంద్రులను ఆకాశమును ఊగించుట అనే క్రీడయందు నిపుణుడైనా నీవు మాత్రము నిశ్చలుడవై ఉన్నావు.

గుహలా విశాలమైన నోటిలో వెక్కసపు నవ్వునుండి ఎగిరిపడిన దివ్యము, పరుషమైన తుంపరకు సంబంధించిన లాలాఘటన మాత్రము చేతనే వివిధ ప్రాణులతోనిండిన సమస్త భువనమును ముంచుతున్నవాడా! నిత్యనూతనుడా! ప్రియగుణములకు సముద్రమువంటివాడా! శ్రీలక్ష్మీ నారసింహుడా!

ఘోరము మహాప్రకాశవంతమైన "ధగధగలాడుతున్న దంష్ట్రాగ్ని వికారమై చిందిపడిన నిప్పురవ్వ అంటుకొనుట వల్ల దానవవంశములనే వెదుళ్ళను బూడిదచేయుటకు కారణ భూతుడవైనవాడా! ప్రసిద్ధుడైన శ్రీవేంకటేశ్వరుని స్వరూపములోనున్న లక్ష్మీ నరసింహస్వామీ! నమస్కారము.

## 60) ధన్నాసి

భావయామి గోపాలబాలం మన
స్సేవితం తత్పదం చింతయేహం సదా ॥పల్లవి॥

కటిఘటిత మేఖలా ఖచిత మణి ఘంటికా
పటలనినదేన విభ్రాజమానం
కుటిల పద ఘటిత సంకుల శింజితేనతం
చటుల నటనా సముజ్జ్వల విలాసం ॥భావయామి॥

నిరతకర కలిత నవనీతం బ్రహ్మాది
సురనికరభావనా శోభితపదం
తిరువేంకటాచల స్థిత మనుపమం హరిం
పరమపురుషం గోపాలబాలం. ॥భావయామి॥

(సంపుటం-1, కీర్తన-137)

**అర్థము:** గోపాలబాలం = గోపాలబాలుని, భావయామి = భావించెదను. మనః = మనస్సుచేత, సేవితం = సేవింపబడిన, తత్ = ఆతనియొక్క, పదం = పాదమును, సదా = ఎల్లప్పుడును, చింతయేహం = ధ్యానించెదను.

కటిఘటిత = మొలలో అమర్చబడిన, మేఖలా = మేఖలయందు, ఖచిత = పొదుగబడిన, మణి ఘంటికాపటల = మణిగర్భములైన చిరుగంటల మొత్తము యొక్క, నినదేన = ధ్వనిచేత, విభ్రాజమానం = ప్రకాశించుచున్న, కుటిలపద = సంచరణ శీలములైన పాదములయందు, ఘటిత = కట్టిన అందెల యొక్క, శింజితేన = శింజితధ్వనిచే, చటుల = నిలకడలేని, నటన = నాట్యముచేత, సముజ్జ్వల విలాసం = మిక్కిలి యుజ్జ్వలమైన విలాసము గలవానిని గోపాలబాలుని భావించుచున్నాను.

నిరత = ఎప్పుడును, కరకలిత నవనీతం = చేతనమర్చబడిన వెన్నముద్ద కలవానిని, బ్రహ్మాది = బ్రహ్మమొదలుగా గల, సురనికర = దేవతా బృందము యొక్క, భావనా = భావముచేత, శోభితపదం = శోభిల్లుచున్న పాదముగలవానిని, తిరువేంకటాచలస్థితం = తిరువేంకటాద్రిపై నెలకొన్నవానిని, పరమపురుషం = పరమపురుషుని, గోపాలబాలం = బాలగోపాలస్వరూపములోనున్నవాని, భావయామి = భావింతును.

**తాత్పర్యము :** గోపాలబాలుని భావించుచున్నాను. ఎల్లప్పుడును మనస్సేవితమైన శ్రీకృష్ణ పాదమును ధ్యానిస్తాను.

మొలకుకట్టిన మేఖలకు వ్రేలాడదీయబడిన, మణిగర్భితములైన చిఱుగంటల రవళిచేత ప్రకాశిస్తున్నవాడిని, చలన శీలములైన చిన్ని యడుగులకు- అలంకరింపబడిన కింకిణుల, సంకులశింజితముతో మిక్కిలి కదలిక కల నాట్యముతో, ఉజ్జ్వలమైన విలాసముకల ఆ గోపాలబాలుని భావిస్తాను. మనస్సులో ఆ చిన్నారి అడుగులను చింతిస్తాను.


'KUCHI'

ఎల్లవేళలలో చేతిలో వెన్నముద్ద విడువని వాడిని, బ్రహ్మాది దేవతల భావనలతో శోభిల్లుచున్న పాదపద్మముకల వాడిని, సాటిలేనివాడిని, తిరువేంకటాద్రిపై నెలకొన్న శ్రీహరిని, పరమపురుషుని భావిస్తాను.

## 61. కురంజి-అటతాళం

మంధరధర మధుసూదన
నందగోపనందనా ॥పల్లవి॥

నరసింహ గోవింద నవనీతానంద
హరిముకుంద నయనారవింద
కరివరద గరుడగమనరూప
గురుచాపా యదుకులదీపా ॥మంద॥

భవదూర భయహర పరిపూర్ణామృత
భవనపాలన సురపాలన
భువనభూషణ పరపురుష పురాతన
నవభోగా కరుణాయోగా ॥మంద॥

పంకజాసననుత భవ్యనిర్మలపాద-
పంకజ పరమ పరాత్పర
వేంకటశైలనివేశ శు-
భంకరా క్షేమంకరా! ॥మంద॥

(సంపుటం-1-కీ-267)

మందరధర = కూర్మరూపంతో మంథర పర్వతాన్ని దాల్చినవాడా! మధు సూదన = మధువనే రాక్షసుని చంపినవాడా! నందగోపనందనా = నందునికుమార రత్నమా!, నరసింహా = నరసింహుడా!, గోవింద = గోవిందుడా! నవనీతానంద = వెన్నతినుటచేత ఆనందము పొందువాడా!, హరి! ముకుంద = పాపమును తొలగించి మోక్షమునిచ్చువాడా!, నయనారవింద = కమలనయనా! కరివరద = గజేంద్రుని రక్షించిన వాడా!, గరుడగమనరూపా= గరుత్మంతుని మీద, అధిరోహించిన రూపం కలవాడా!, గురుచాపా = పెద్దకోదండం కలవాడా! యదుకుల దీపా = గొల్లవారిండ్లలో దీపమైన వాడా!

భవదూర = దుఃఖముకల సంసారమును తొలగించువాడా!, భయహర = భయాన్ని పోగొట్టువాడా!, పరిపూర్ణామృత = పరిపూర్ణమైన అమృతాన్ని ద్రవింప జేయువాడా!, భువన పాలన = లోకమును రక్షించువాడా!, సురపాలన! =దేవతలను పాలించువాడా!, భువన భూషణ = లోకమును అలంకారము వంటివాడా!, పరపురుషా= పరమ పురుషా!, పురాతన= అనాదిగా ఉండేవాడా! నవభోగ = ఎల్లప్పుడు కొత్తవైన భోగాలను అనుభవించు వాడా! కరుణా యోగా = దయాసముద్రా! పంకజాసననుత = బ్రహ్మచేత ప్రస్తుతింపబడువాడా! భవ్య నిర్మలపాద పంకజ = మంగళాన్ని కలిగించు స్వచ్ఛమైన పాద పద్మములుకలవాడా! పరమ = గొప్పవాడా! పరాత్పర =

మోక్షమును ప్రసాదించువాడా!, వేంకటశైల నివేశ = తిరుమల గిరులలో నివసించువాడా!, శుభంకర = శుభములను కలిగించువాడా! క్షేమంకర!= యోగక్షేమములు చేయువాడా! నమస్కారము.

**తాత్పర్యము :** కూర్మావతారాన్ని ధరించి మంథర పర్వతాన్ని వీపున దాల్చినవాడా! మధుసూదనా! నందనందనా! నరసింహస్వామీ! గోవింద! వెన్నతినుటలో ఆనందాన్ని పొందువాడా! హరి! ముకుందుడా! కమలనయనా! గజేంద్రుని రక్షించినవాడా! గరుడ గమన! పెద్ద ధనువును దాల్చిన శ్రీరామా! యదుకులదీపమా! సంసార తాపాన్ని తొలగించువాడా! భయాన్ని పోగొట్టువాడా! అమృతాన్ని ఇచ్చువాడా! లోకరక్షకా! దేవతారక్షక! దయాసముద్రా! బ్రహ్మాదులకు ఆదరణీయుడా! మంగళప్రదమైన పాదములు కలవాడా! పరమస్వరూపుడా! మోక్షమిచ్చువాడా! వేంకటశైలనివాసుడా! శుభములను కలిగించువాడా! క్షేమంకరుడా! నీకు నమస్కారము.

## 62. నాటరాగం

మర్ద మర్ద మమబంధాని
దుర్దాంత మహాదురితాని ॥పల్లవి॥

చక్రాయుధ రవిశత తేజోంచిత
సక్రోధ సహస్ర ప్రముఖా!
విక్రమక్రమా విస్ఫులింగకణ
నక్రహరణ! హరినవ్యకరాంకా! ॥మర్ద మర్ద॥

కలితసుదర్శన! కఠిన విదారణ
కులిశ కోటిభవఘోషణా!
ప్రళయానల సంభ్రమ విభ్రమకర
రళితదైత్యగళరక్తవికీరణా! ॥మర్ద మర్ద॥

హితకర శ్రీవేంకటేశ ప్రయుక్త!
సతతపరాక్రమ! జయంకర!
చతురోహంతే శరణం గతోస్మి
ఇతరాన్ విభజ్య ఇహ మాంరక్ష! ॥మర్ద మర్ద॥

(సం.2-కీ.81)

**అర్థము :** మమ = నా యొక్క, బంధనాని = సంకెళ్ళను, మర్ద మర్ద = నుగ్గు నుగ్గు చేయుము, దుర్దాంత= జయించుటకు సాధ్యముకాని, మహా దురితాని = మహాపాపములను, మర్ద = పిండిచేయుము-

రవిశత = వందమంది సూర్యుల యొక్క, తేజః = కాంతి వంటి తేజస్సుతో, అంచిత = కూడినదానా!, సక్రోధ = క్రోధముతో కూడిన, సహస్ర = వేయిసంఖ్యగల, ప్రముఖా = వాడియైన అంచులనే ముఖములు కలదానా!, విక్రమ = పరాక్రమముతో కూడిన, క్రమ = సంచారము నుండి, ఆవిః = ఆవిర్భవించుచున్న,


KUCHI


'KUCHI'

స్ఫులింగకణ = నిప్పురవ్వలు కలదానా!, నక్రహరణ = మొసలిని సంహరించినదానా!, హరి = శ్రీహరి యొక్క, నవ్య = సుందరమైన, కర = హస్తమునకు, అంక = చిహ్నమైనదానా!

కలిత = సుందరమైన, సుదర్శన = సుదర్శనమను పేరుకల చక్రాయుధమా!, కఠిన = కఠినమైన హృదయముగలవారిని, విదారణ = చీల్చునట్టిదానా!, కులిశకోటి = కోటి పిడుగుల నుండి, భవ = పుట్టెడు, ఘోషణ = ధ్వని వంటి ఘోషణము కలదానా!, ప్రళయానల= ప్రళయకాలాగ్ని యొక్క, సంభ్రమ = వేగముకల, విభ్రమకర = విభ్రాంతిని కలిగించుదానా!, రళిత = మ్రోగుతున్న, దైత్య = రాక్షసుల యొక్క, గళరక్త = కుత్తుక నెత్తురును, వికీరణా = వెదజల్లుదానా!

హితకర = లోకహితమును చేయునట్టి, శ్రీవేంకటేశ = శ్రీవేంకటేశ్వరస్వామి చేత, ప్రయుక్త = ప్రయోగింపబడినదానా!, సతత = ఎల్లప్పుడు, పరాక్రమ = శత్రువులను ఆక్రమించుదానా!, జయంకర = జయమును కలిగించుదానా!, చతురోహం = నేర్పరినైన నేను (నీ శరణమును పొందుటనే శరణాగతి తప్ప వేరేమార్గము లేనందున దానిని తెలుసుకొనుట నా నేర్పు), తే = నీకు, శరణం గతోస్మి = శరణు పొందితిని, ఇతరాన్ = శత్రువులను లేదా శరణు పొందనివారిని, విభజ్య = ఛేదించి, ఇహ = ఈలోకంలోకూడా, మాం = నన్ను, రక్ష = రక్షింపుము!

**తాత్పర్యము** : ఇది చక్రాయుధస్తుతి. (మర్ద మర్ద (వీప్స) - ద్విరుక్తి - అతిశయార్థమున).

నా బంధనములను, నా మహా పాపములను నుగ్గిచేయుము. రవిశత తేజోవిరాజమానమైన ఓ! చక్రాయుధమా! సక్రోధ సహస్రముఖమా! చెదిరి పడుతున్న నిప్పురవ్వలు కలదానా! నక్రమును ఖండించినదానా! శ్రీహరి కరాంకమా! చక్రమా!- కఠినులనుచీల్చునట్టిదానా! సుదర్శనాభిధానమా! కోటి పిడుగుల ధ్వనివంటి ధ్వని కలదానా! ప్రళయాగ్నియా! అనెడి విభ్రాంతిని గలిగించుదానా! రాక్షసుల కంఠరక్తములను వెదజల్లుదానా! లోకహితకరుడైన శ్రీవేంకటేశ్వరునిచేత ప్రయోగింపబడుదానా! ఎల్లప్పుడూ శత్రువులను జయించుదానా! జయకరమా! చతురుడునైన నేను నీ శరణు పొందితిని. నా శత్రువులను శిక్షించి నన్ను రక్షించుము.

## 63. సామంతం

మాజహిహి దుష్టమనాయితి
యోజయ తవపదయుగామృతేన ॥పల్లవి॥

పరమాత్మన్ మమపామరచిత్తం
చిరం పాపం చికీర్షతి
కరుణానిధే ర్యకారణబంధో
గురుతరాం కృపాం కురు మయి దేవ ॥మాజ॥

అంతర్యామి హరే మదాశా
సంతాపఏవ సమేధతే

దాంతికరానంత గుణానిధే
భ్రాంతిం వారయ పావనచరిత ॥మాజ॥

నలినోదర మాం నానా మోహా
విలసత్కృతీవ విమోహయ
కలిత శ్రీవేంకటనాథ త్వం
సలలితం ప్రసాదయ స్వామిన్ ॥మాజ॥

(సంపుటం-10-కీ.-7)

**అర్థం** : మా = నన్ను, దుష్టమనాయితి = దూషితమైనదని, మాజహిహి = విడువవద్దు, తవ = నీయొక్క, పదయుగామృతేన= పాదయుగళము నుండి ప్రవిస్తున్న మకరందముచేత, యోజయ = ముంచెత్తుము.

పరమాత్మన్ = ఓ! పరమాత్మా!, మమ = నాయొక్క, పామర చిత్తం = అజ్ఞానము చేత కూడిన నా చిత్తమును, చిరం = ఎల్లప్పుడు, పాపం = పాపమునే, చికీర్షతి = చేస్తుంటుంది, కరుణ నిధేః = దయకునిధి వంటివాడా, అకారణబంధో = అవ్యాజమైన బాంధవ్యము కలవాడా!, గురుతర = గొప్పదైన, కృపాం = దయను, దేవా = ఓ! శ్రీనివాసా! మయి = నాయందు, కురు = చేయుము.

అంతర్యామిన్ = సమస్త జీవులలోని చైతన్య స్వరూపుడా!, హరే! = ఓ! శ్రీహరీ! మదాశా = నాయొక్క ఆశనే, సంతాపం ఏవ = సంతాపమే, సమేధతే = వృద్ధినొందు తున్నది, దాంతికర అనంతగుణనిధే = బహిరింద్రియ నిగ్రహాన్ని కలిగించే అనంత గుణాలకు నిధివంటివాడా!, పావనచరితా = పవిత్రమైన చరిత్రను కలవాడా!, భ్రాంతి = భ్రమను, వారయ = తొలగించుము.

నలినోదర = పద్మనాభుడా!, మాం = నన్ను, నానా మోహావిలస త్కృతీవ = అనేక మోహాలను తొలగించుటలో కృతార్థుణ్ని చేయుము, స్వామిన్ = ఓ! ప్రభూ! కలిత శ్రీ వేంకటనాథ = వేంకటాచలాన్ని పరిరక్షిస్తున్న శ్రీనివాసా!, త్వం = నీవు, సలలితం = దివ్య లీలను అనుభవించినట్లుగా, ప్రసాదయ = అనుగ్రహించుము.

**తాత్పర్యం** : నన్ను నింద్యమైనదానిగా భావించి, దూరంచేయవద్దు నీపాదామృత సేచనంతో ముంచెత్తుస్వామీ! ఓ! దేవా! అజ్ఞానంతో నిండిన నా చిత్తానికి పాపమందే ఆసక్తి. కరుణానిధీ! ప్రేమకలవాడా! నామీద దయపెట్టుము. సకలజీవచైతన్య రూపమా! శ్రీహరీ! నా ఆశయే సంతాపాన్ని వృద్ధి నొందిస్తున్నది. పవిత్ర చరిత్రుడా నా భ్రమలను తొలగించు. పద్మనాభుడా! నాకు మోహంచ్ఛేదనం చేసి పరిరక్షించు వేంకటనాథా! నీ దివ్యలీలను నాకు అనుభవైక వేద్యం చేయి.

## 64. ముఖారి

మాదృశానాం భవామయ దేహినాం
ఈదృశం జ్ఞానమితి యేపి నవదంతి ॥పల్లవి॥

వాచామగోచరం వాంఛా సర్వత్ర
నీచకృత్యైరేవ నిబిడీకృతా
కేచిదపివా విష్ణుసంకీర్తనం ప్రీత్యా
సూచయంతోవా శ్రోతుం న సంతి ॥మాదృశ॥

కుటిలదుర్బోధనం కూహకం సర్వత్ర
విట విడంబనమేవ వేద్మ్యధీతం
పటు విమల మార్గ సంభావనం పరసుఖం
ఘటయితుం కష్ట కలికాలే న సంతి ॥మాదృశ॥

దురితమిదమేవ జంతూనాం సర్వత్ర
విరసకృత్యైరేవ విశదీకృతం
పరమాత్మానం భవ్యవేంకటనామ
గిరివరం భజయితుం కేవా నసంతి ॥మాదృశ॥

(సం-1-కీ-325).

**అర్థము** : మాదృశానాం =మావంటి, భవామయదేహినాం = సంసారరోగముగల శరీరధారులకు, జ్ఞానం = జ్ఞానము, ఈదృశమితి = ఇట్టిదియని, యేపి = ఎవ్వరును, న వదంతి = చెప్పరు.

సర్వత్ర = అన్నిచోట్ల, నీచకృత్యైరేవ = నీచకృత్యములచేతనే, వాంఛా = దురాశ, వాచామగోచరం = మాటలకు అందనిదిగా, నిబిడీ కృతా = దట్టమైనదిగా జేయబడినది, విష్ణుకీర్తనం = విష్ణుకీర్తనమును, ప్రీత్యా= ప్రీతితో, సూచయితుం వా = సూచించుటకు గాని, శ్రోతుం వా = వినుటకు గాని, కేచిదపివా = కొందరయినా, న సంతి= లేరు. సర్వత్ర = అన్నిచోట్ల, కుటిల = కుటిల స్వభావులయొక్క, దుర్బోధనం = దుర్బోధ, కుహకం = మోసం, విటవిడంబనమేవ = విటులయొక్క అనుకరణమే, అధీతం = విద్యవలే అధ్యయనము చేయబడినది అని, వేద్మి = తెలిసికొనుచున్నాను, పటు = సమర్థమైన, విమలమార్గ = మంచిదారుల యొక్క, సంభావనం = మన్నించుటను, పరసుఖం = పరమ సుఖమును, ఘటయితుం= ఒనగూర్చుటకు ఎవ్వరును, కష్టకలికాలే= దుష్టమైన కలికాలమునందు, నసంతి = లేరు. సర్వత్ర = అన్నిచోట్లను, జంతూనాం = జీవులయొక్క, విరసకృత్యైరేవ = వెగటు కలిగించు పనులచేతనే, ఇదం దురితం = ఈ పాపము, విశదీకృతమేవ = వెల్లడిచేయ బడినది, పరమాత్మానం = పరమాత్మయైన, భవ్య = శ్రేయఃప్రదమైన, వేంకటనామ= వేంకటమనుపేరుగల, గిరివరం = కొండలపై నెలకొన్న శ్రీవేంకటేశ్వరుని, భజయితుం = సేవింప జేయుటకు, కేవా = ఎవ్వరును, న సంతి = లేరు.

**తాత్పర్యము** : సంసారరోగపీడితులమైన మావంటివారికి "జ్ఞాన" మిట్టిదని ఎవ్వరును చెప్పరు. అన్నిచోట్లలో మానవుల దురాశ నీచకృత్యములచేతనే మాటలకందరానిదిగా కేంద్రీకృతమై ఉన్నది. విష్ణుకీర్తనమును సూచించుటకుగాని, వినుటకుగాని, ఎవ్వరూ లేరు.

అన్ని చోట్లయందు కుటిల దుర్బోధయే, మోసమే, విటుల మాయవంటి మాయయే- ఒక విద్యగా అధ్యయనము చేయబడినది. ఈ దుష్టమైన కలికాలములో విమలమైన మంచి త్రోవలను చూపుటకుకాని, పరమ సుఖములను అందించడానికి ఎవ్వరూ లేరు. అన్నిచోట్ల ఈ పాపమే. శరీరధారులచే వెగటు గొలుపు చెడ్డపనులను చేయిస్తున్నది. పరమాత్మయైన శ్రీవేంకటేశ్వరుని భజింపజేయువారెవ్వరును లేరు.

విశేషాంశం : విశేషతః క్రూరకలౌ నరాణాం! పాపాకరాణాం పరపీడితానామ్ ।
భూగోళ మధ్యే ద్రవిడే చ పుణ్యే! శ్రీవేంకటాద్రిః గతిరేవనాన్యః ॥

(భవిష్యపురాణం-80-అధ్యాయం-15శ్లో)

ఈ భయంకరమైన కలియుగంలో పాపాత్ములకు, పాపకర్ములచే పీడింపబడుతున్న వారికి, ఈ ప్రపంచంలో పవిత్ర దక్షిణదేశంలో శ్రీవేంకటాచలమే శరణము. అదిగాక మరి దిక్కులేదు. ఈ సత్యాన్ని వేంకటాచలమాహాత్మ్యం ప్రబోధిస్తున్నది. ఈ సందేశాన్ని లోకానికి చాటే తత్పరత ఈ అన్నమయ్య కీర్తనలో స్ఫురిస్తున్నది.

## 65) లలిత

మాధవ! కేశవ! మధుసూదన! విష్ణు
శ్రీధర! పదనఖం చింతయామి యూయం ॥పల్లవి॥

వామన! గోవింద! వాసుదేవ! ప్రద్యుమ్న!
రామరామ! కృష్ణ! నారాయణాచ్యుత!
దామోదరానిరుద్ధ దైవ పుండరీకాక్ష!
నామత్రయాధీశ! నమోనమో! ॥మాధవ॥

పురుషోత్తమా! పుండరీకాక్ష! దివ్య

హరి! సంకర్షణ! అధోక్షజ!
నరసింహా! హృషీకేశ! నగధర! త్రివిక్రమ!
శరణాగతరక్ష! జయ జయ సేవే! ॥మాధవ॥

మహిత! జనార్దన! మత్స్య! కూర్మ! వరాహ!
సహజ భార్గవ బుద్ధ జయ తురగ కల్కి
విహిత విజ్ఞాన! శ్రీవేంకటేశ! శుభకరం
అహమిహ తవ పదదాశ్యమనిశం భజామి ॥మాధవ॥

(సం.-4-కీ.-330)

అర్థం : మాధవ! = లక్ష్మీపతి, కేశవ! = శ్రీహరీ, మధుసూదన! = మధువనెడి రాక్షసుని సంహరించినవాడా! విష్ణు = వ్యాపించినవాడా!, శ్రీధర = లక్ష్మీదేవిని వక్షస్థలంలో ధరించినవాడా!, పదనఖం = నీ కాలిగోటిని, చింతయామి = చింతిస్తున్నాను, యూయం = మీరుకూడా ధ్యానించండి. పురుషోత్తమ! = క్షరాక్షరములకు

అతీతుడా! పుండరీకాక్ష! = పద్మాలవంటి కన్నులు కలవాడా!, దివ్య = దివ్యమైనవాడా! హరి = శ్రీహరి, సంకర్షణ = సంకర్షణుడా, అధోక్షయా = అధోక్షజుడా, నరసింహ = నరుడిముఖంతోకూడిన సింహరూపాన్ని దాల్చినవాడా!, హృషీకేశ = హృషీకేశుడా!, నగధరా = గోవర్ధన పర్వతాన్ని ఎత్తిన వాడా!, త్రివిక్రమ = వామనమూర్తీ, శరణాగత రక్షా! = ఆశ్రితులను రక్షించువాడా! సేవే = సేవించెదను, జయ = సర్వోత్కర్షతో వర్ధిల్లుము.

మహిత = పూజనీయుడా, జనార్దనా = జనార్దనుడా, మత్స్య = చేపరూపాన్ని దాల్చినవాడా, కూర్మ = తాబేలు రూపాన్ని దాల్చినవాడా! వరాహ = సూకర రూపాన్ని ధరించినవాడా! సహజ = నిర్మలుడా!, భార్గవ = భార్గవుడా, బుద్ధ = బుద్ధావతారుడా, తురగ కల్కి = గుర్రాన్ని ఎక్కిన కల్కిస్వరూపుడా!, విహిత విజ్ఞాన = విధింపబడిన జ్ఞానము కలవాడా!, శ్రీవేంకటేశ = శ్రీ వేంకటమనే పర్వతానికి అధీశుడా!, శుభకరం = కల్యాణకరమైన, తవ = నీయొక్క, వరదాశ్యం= వరప్రదమైన దాసవృత్తిని, అనిశం = ఎల్లప్పుడూ, భజామి = ఆశ్రయిస్తాను.

తాత్పర్యం : లక్ష్మీపతి! శ్రీహరి! మధుసూదన! విష్ణు స్వరూపమా! శ్రీధర! నీ కాలి గోటిని చింతించెదను. ఓ భక్తులారా! మీరుకూడా ధ్యానించండి. వామన! గోవిందా! వాసుదేవుని పుత్రుడా, ప్రద్యుమ్నుడా, శ్రీరామ, బలరామ అవతారాలని దాల్చినవాడా! కృష్ణా, నారాయణా, అచ్యుతా, దామోదర, అనిరుద్ధా, పుండరీకాక్షా, విష్ణు, నారాయణ, వాసుదేవులనే (బ్రహ్మ విష్ణు మహేశ్వరులనే) పేర్లు కలవాడా! నమస్కారము. పూజితుడా!, జనార్దనుడా!, మత్స్య, కూర్మ, వరాహ, భార్గవ, బుద్ధ, కల్కి మొదలైన అవతారాలను దాల్చినవాడా! శ్రీవేంకటేశ! కల్యాణకరమైన నీయొక్క దాస్యవృత్తిని ఎల్లప్పుడు ఆశ్రయిస్తాను.

## 66) సాళంగం

మాధవ! భూధవ! మదనజనక!
సాధురక్షణచతుర! శరణు శరణు!! ॥పల్లవి॥

నారాయణాచ్యుతానంత! గోవింద! శ్రీ
నారసింహ! కృష్ణ! నాగశయన!
వారాహ! వామన! వాసుదేవ! మురారి!
శౌరీ! జయజయ!శరణు శరణు !! ॥మాధవ॥

పుండరీకేక్షణ! భువనపూర్ణగుణ!
అండజగమన! నిత్య! హరి! ముకుంద!
పండరి రమణ! రామ! బలరామ! పరమపురుష!
చండభార్గవరామ! శరణు! శరణు! ॥మాధవ॥

దేవదేవోత్తమ! దివ్యావతార నిజ
భావ! భావనాతీత! పద్మనాభ!

శ్రీవేంకటాచల శృంగారమూర్తి! నవ
సావయవ సారూప్య! శరణు శరణు!! ॥మాధవ॥ (సం-4-కీ-321)

**అర్థం** : మాధవ = లక్ష్మీదేవికి వరుడా!, భూధవ = భూదేవికి నాధుడైనవాడా! మదన జనక = మన్మథుని తండ్రీ!, సాధు రక్షణ చతుర = సజ్జన రక్షణమునందు నేర్పరీ, శరణు శరణు.

నారాయణ = నారాయణుడా!, అచ్యుత = అచ్యుతుడా!, అనంతుడా, గోవిందుడా, శ్రీనారసింహుడా, శ్రీకృష్ణా, నాగశయన = శేషశయనుడా, వారాహ = వరాహావతారమునెత్తినవాడా! వామన = వామనావతారమును ధరించినవాడా, వాసుదేవ = శ్రీవాసుదేవుడా, మురారి = మురాసురుని సంహరించినవాడా, శౌరీ = శూరసేనవంశమునందు పుట్టినవాడా, జయజయ

పుండరీకేక్షణ = తెల్లదామరలవంటి కన్నులుగలవాడా, భువన = లోకముల యందు, పూర్ణ = నిండిన, గుణ = గుణమయమైన నిజదైవీ మాయగలవాడా, అండజగమన = గరుడవాహనా! నిత్య = శాశ్వతుడా! హరి = శ్రీహరీ! ముకుంద = మోక్షప్రదుడా, పండరిరమణ = శ్రీపండరి క్షేత్రము నందు రమించువాడా!, రామ = శ్రీరామ, బలరామ = బలరాముడా!, పరమపురుష = పరమపురుషుడా, చండభార్గవరామ = తీవ్ర స్వభావుడైన పరశురాముడా! శరణు శరణు.

దేవదేవ = దేవాధిదేవులయందు, ఉత్తమ = ఉత్తముడా, దివ్యావతార = దివ్యములైన అవతారములు కలవాడా, నిజభావ = స్వరూపము చేత, భావనాతీత = భావించుటకు అతీతుడా, పద్మనాభ = పద్మము నాభియందు కలవాడా, శ్రీవేంకటా చల శృంగారమూర్తి = శ్రీవేంకటాచలమునందు నెలకొన్న శృంగారరసమూర్తీ! నవ = సుందరమైన, సావయువ = అవయువ సహితమైన, సారూప్య = శ్రీమన్నారాయణునికి సారూప్యముగలవాడా, శరణు శరణు.

**తాత్పర్యం** : శ్రీదేవికి-భూదేవికి-వల్లభుడా! మన్మథజనకా! సజ్జన రక్షణమునందు చతురుడా! శరణు శరణు. నారాయణా! అచ్యుతా! అనంతా! గోవిందా! శ్రీనారసింహా! శ్రీకృష్ణా! నాగశయనా! వరాహావతారుడా! వామన! వాసుదేవ! మురారీ! శౌరీ! సర్వోత్కర్ష చేత వర్థిల్లుము. పుండరీకేక్షణుడా! భువనములలో నిండిన నిజమాయాగుణము కలవాడా! గరుడవాహనుడా, శాశ్వతుడా, శ్రీహరీ!, ముకుందా, పండరీక్షేత్రరమణుడా! శ్రీరామ! బలరామా! పరమపురుషా! తీవ్ర స్వభావముకల పరశురామా! శరణు శరణు.

దేవాధిదేవులలో నుత్తముడా! దివ్యావతారములు కలవాడా! స్వరూపస్థితిచేత భావించుటకు నలవికాని వాడా! భువనపద్మము నాభియందు గలవాడా! శ్రీవేంకటాచలమునందు నెలకొన్న శృంగారరసమూర్తీ! సుందరము, అవయవ సహితములైన శ్రీమహావిష్ణువు యొక్క సారూప్యము గలవాడా, శరణు శరణు.

## 67) శ్రీరాగం

మామనునేతు మాగతవానసి
కాముకవిద్యాకళ చలరే ॥పల్లవి॥

భిల్లవధూకుచపీడన కుతుకో
త్ఫుల్లకరాంబుజ భూషణ
పల్లవ గోపక పరివృత శఠజన
వల్లభ రతిపరవశ చలరే ॥మామ॥

గోపీజన కుచకుంకుమ పంక వి
లేపన మిళిత లలితదేహ
తాపకరణ సంతత బహు వినయా
లాప రూపమేళన చలరే ॥మామ॥

పరవనితామణి పరతంత్రత్వా
త్పరుష నఖాంకిత పతిరసికిమ్
కురువకభూరుహ కుంజగృహం తే
తిరువేంకటనగాధిప చలరే ॥మామ॥

(సంపుటం-5-కీ-52)

**అర్థం** : మాం = నన్ను, అనునేతుం అసి = బ్రతిమాలుకొనేవాడివై, ఆగతవాన్ రే = వచ్చావురా!, కాముక విద్యాకల = కామ విద్యాకళని తెలిసినవాడా! చల = వెళ్ళు ఇక్కడినుంచి.

భిల్లవధూ = కోయజాతిపడుచుల, కుచపీడన = పాలిండ్లమర్దనము నందు, కుతుక = ఆసక్తిచేత, ఉత్ఫుల్ల = విచ్చిన, కరాంబుజ = కరపద్మమే, భూషణ = భూషణముగా కలవాడా, పల్లవగోపక = గొల్లపిల్లలచేత, పరివృత = పరివేష్టింపబడిన వాడా, శఠజన వల్లభ = తుంటరిపనులు జేయువారికి, నాయకుడా!, రతిపరవశ= రతిపరవశుడా, చలరే = ఇటనుండి కదలుమురా.

గోపీజన = గోపికలయొక్క, కుచ = పాలిండ్ల యందలి, కుంకుమ కర్దమము యొక్క, విలేపన = పైపూతతో, మిళిత = మేళవించిన, లలితదేహ = అందమైన శరీరము గలవాడా, తాపకరణ = సంతాపమును గలిగించుచున్నవాడా!, సంతత= ఎప్పుడు, బహు = పలువిధములైన, వినయాలాప = వినయాపు మాటలు పలుకువాడా, రూపమేళన = రూపములను మార్చువాడా!, చలరే = కదలుమురా!

పరవనితామణి = ఇతరస్త్రీలకు, పరతంత్రత్వాత్ = దాసుడవు కనుక, పరుష = వాడియైన, నఖ = వారియొక్క నఖక్షతముల చేత, అంకిత = ముద్రితుడా!, పతిరసికిం = నీవు పతివా?, కురవక భూరుహ = గోరింట చెట్లయొక్క, కుంజగృహంతే = పొదరింటియందు, తిరువేంకటనగాధిప = శ్రీవేంకటేశ్వరా!, చలరే= కదలుమురా.

**తాత్పర్యము** : నన్ను బ్రతిమాలుకొనుటకు వచ్చావు! ఓ! కామశాస్త్ర పారంగతుడా! ఇక్కడనుండి వెళ్ళిపో! కోయజాతి ఆడవారి పాలిండ్లను ఒత్తుతూ విచ్చికొన్న కరపద్మములే అలంకారంగా కలవాడా! గొల్ల పిల్లలచేత పరివేష్టింపబడినవాడా! తుంటరి పనులు చేయువారిలో మొనగాడా! రతి సుఖాన్ని తెలిసినవాడా! వెళ్ళిపో!

గోపికల పాలిండ్లమీది కుంకుమను శరీరమంతా పూసుకొన్నవాడా! ఆ కారణము చేతనే నాకు దుఃఖాన్ని కలిగిస్తున్నవాడా! ఎప్పుడు సరసపు మాటలు అనేకం పలికేవాడా! వేషములు మార్చువాడా వెళ్ళిపో!

నీవు పరస్త్రీ పరాధీనుడవు. పరమదవతినఖ బాధితుడవు. నీవు నాకు భర్తవా! ఈ గోరింట పొదరింటిలో నా వద్దకు చేరిన శ్రీతిరు వేంకటనగాధిపా! వెళ్ళు!

**విశేషాంశం :** ఈ కీర్తన శృంగారఛాయ కలది. ఖండితనాయిక - నాయకుడైన స్వామివారితో ఈర్ష్యతో రోషంతో మాట్లాడినట్లుగా కనిపిస్తున్నది. కానీ శ్రీవారి నృసింహ, కృష్ణ అవతారాల శృంగార నిరతిని కూడా గుర్తుచేస్తున్నది. తొలిచరణంలో చెంచులక్ష్మితో నరసింహదేవుని శృంగారాన్ని విశ్లేషిస్తూ భిల్లవధువులతో క్రీడిస్తున్నావని, ఆమెయందు ఆసక్తికలవాడవని, "నీ అంగములు ఆమెతో శృంగారానికి అనుగుణంగా శోభిల్లుతున్నాయి - అని స్వామి కరాంబుజాన్ని అన్నమయ్య వర్ణించాడు. గోపీ జనులతో శ్రీకృష్ణస్వామికున్న శృంగారకేళిని భక్తకవులెందరో గానంచేశారు.

పద్మాపయోధరతటే పరిరంభ లగ్నకాశ్మీర ముద్రితమురో మధుసూదనస్య।
వ్యక్తానురాగమివ ఖేలద నంగఖేదస్వేదాంబుపూర మనుపూరయతు ప్రియంవః॥

అని గీతగోవిందకర్త తన దివ్యానుభూతిని చాటిచెప్పాడు. అదేవిధంగా అన్నమయ్య శ్రీకృష్ణస్వామిని శృంగారరసాధిదేవుడిగా రెండవచరణంలో అభివర్ణించాడు.

మూడవ చరణంలో నాయిక యుగయుగాల శ్రీవారి వైభవాన్ని తెలిపే దివ్యమహిషిగా గోచరిస్తున్నది. ఈ శృంగార సంకీర్తన యతిప్రాససౌందర్యంతో అపూర్వంగా శోభిల్లుతున్నది.

## 68. భవుళి

యోగి భోగి నటనం కురు వుల్లాసాననమోహన
సాగరోద్భవకన్యకాపతి సారస వెంకట గిరియోగి ॥పల్లవి

లీలానక్షత్రజాలాధికరండ
మాలా త్రైవిక్రమాకార యోగి
హాలాహలకర కోలాహలకర
శూలా యుధవంద్య పరిపూర్ణయోగి ॥యోగి భోగి॥

కాళీవినుత ప్రహేళిచరితాహి
మౌళిఘనసారవిన్యస్తయోగి
గరుడపక్షివాహగమనవిహారి
గరునాగశైలేశ గోరక్కు రే ॥యోగి భోగి॥

మురళీనాదశృంగ మోహనమురారి రే
కరుణానందసాగరశాయి రే


'KUCHI'

పరమ శ్రీవేంకటపతియవతార
నరరూపగోపికానాథ గోరక్కు రే ॥యోగి భోగి॥

(సంపుటం-11-588)

ఫుల్లసానన మోహన = వికసించినటువంటి మోముచేత రంజింప చేయువాడా! సారస= తామరపూవువంటి, సాగరోద్భవ కన్యకాపతి = లక్ష్మీ దేవికి పతియైన వాడా!, శ్రీ వేంకట గిరి యోగీ = వేంకటగిరిపై నున్న యోగీశ్వరుడా!

లీలా నక్షత్ర జాలాది కరండమాలా విక్రమాకారయోగి = విలాసముగా - నక్షత్ర మండలాన్ని మాలగా ధరించిన త్రివిక్రమావతారాన్ని దాల్చిన యోగీ, హాలాహలకర కోలాహలకర = హాలా హలాన్ని పట్టి దేవతలకు ఉత్సాహాన్ని కలిగించిన, శూలాయుధవంద్య = శూలాయుధమును ధరించిన శివునిచేత నమస్కరించబడినవాడా! పరిపూర్ణ యోగీ = పరిపూర్ణమైన యోగాచార్యుడా!

కాళీవినుత= పార్వతీ దేవి చేత నమస్కరించబడిన వాడా! ప్రహేళ చరితాహిమౌళిఘనాసార విన్యస్తయోగీ = నాగాభరణములను శిరస్సున ధరించిన వాడా! కర్పూరము వలె శాంతిని కలిగించువాడా!, గరుడ పక్షి వాహగమన విహారీ = గరుడ వాహనముపై విహరిస్తున్నవాడా!, గరునాగశైలేశ= పెద్దదైన శేషాచలమునకు అధీశుడా!, గోరక్కురే = ఇంద్రియాలను రంజింపజేయు వాడా!

రే! మురళీనాద శృంగమోహన మురారీ = మురళీ నాదమనే శిఖరంపై విహరిస్తున్న మురారీ, రేకరుణానంద సాగర శాయి = దయ అనెడి సముద్రంలో శయనించువాడా? పరమశ్రీ వేంకటపతి అవతారా! = సర్వోత్కృష్టుడైన శ్రీ వేంకటపర్వతాధీశుడా! అర్చావ తారుడా!, నరరూపగోపికా నాథా = గోపికాభక్తితో వస్తున్న భక్తులకు నాథుడా!, గోరక్కురే = గోవిందుడా! యోగి భోగి నటనం కురు = యోగీశ్వరులకు భోగీశ్వరులకు ఆనందాన్నిచ్చే నాట్యాన్ని చేయి.

**తాత్పర్యం** : తామర పూవు వంటి లక్ష్మీదేవికి పతియైనవాడా! వికసించినటువంటి మోముచేత రంజింపజేయువాడా! వేంకటాచలంపై నున్న యోగీశ్వరుడా! విలాసముగా నక్షత్ర మండలాన్ని మాలగా దాల్చిన త్రివిక్రమ యోగి! హాలాహలాన్ని చేతదాల్చి దేవతాకోటికి ఉత్సాహాన్ని కలిగించిన, శూలాయుధుడైన శివునిచేత నమస్కరించబడినవాడా! కర్పూరము వలె శాంతిని కలిగించువాడా! గరుడుని వాహనం చేసుకొని విహరించువాడా! ఉన్నతమైన శేషాచలంపై ఇంద్రియాలను రంజింపజేసి పాలించువాడా! మురళీనాదాన్ని పరిశీలిస్తున్న వాడా! కరుణా సముద్రంలో శయనించువాడా! సర్వోత్కృష్టుడా! వేంకటేశ్వర స్వామీ! గోపికా భక్తితో వస్తున్న భక్తులను ఆదరించు గోవిందుడా! యోగులకు భోగులకు ఆనందాన్నిచ్చే నాట్యాన్ని చేయి.

**విశేషాంశం** : తన నృత్యంతో యోగులకు, భోగులకు ఆనందాన్ని కలిగించే శ్రీవేంకటేశ్వరుడు, యోగ యోగీశ్వరుడిగా ఈ కీర్తనలో సాక్షాత్కరిస్తున్నాడు. పతి! అవతారా! వంటి పదాలతో మణిప్రవాళశైలిలో రచింపబడిన సంకీర్తన ఇది.



డా॥ ఆకెళ్ళ విభీషణశర్మ

## 69. భౌళి

రాజీవనేత్రాయ రాఘవాయ నమో
సౌజన్యనిలయాయ జానకీశాయ ॥పల్లవి॥

దశరథతనూజాయ తాటకదమనాయ
కుశికసంభవయజ్ఞ గోపనాయ
పశుపతి మహాధనుర్భంజనాయ నమో
విశదభార్గవరామవిజయకరణాయ ॥రాజీ॥

భరితధర్మాయ శూర్పణఖాంగహరణాయ
ఖరదూషణాదిరిపుఖండనాయ
తరణిసంభవసైన్యరక్షకాయ నమో
నిరుపమ మహావారినిధిబంధనాయ ॥రాజీ॥

హతరావణాయ సంయమినాథవరదాయ
అతులితాయోధ్యాపురాధిపాయ
హితకర శ్రీవేంకటేశ్వర నమో
వితతవావిలిపాటి వీరరామాయ ॥రాజీ॥ (సం.-2-కీ.-273)

**అర్థం :** రాజీవ నేత్రాయ = నల్లకలువల వంటి కన్నులు కలవానికి, రాఘవాయ = రఘువంశములో జన్మించినవానికి, నమో = నమస్కారము, సౌజన్య నిలయాయ = మంచి తనానికి నిలయమైనవాడు, జానకీశాయ = సీతాదేవికి భర్తయైన రామునికి నమస్కారము, దశరథ తనూజాయ = దశరథునికి పుత్రుడైన వానికి, తాటక దమనాయ = రాక్షసస్త్రీ అయిన తాటకిని చంపిన వానికి, కుశిక సంభవ = కుశికుడనే వానికి జన్మించిన విశ్వామిత్రుని యొక్క, యజ్ఞగోపనాయ = యజ్ఞమును రక్షించిన వానికి పశుపతి = శివునియొక్క, మహాధనుర్భంజనాయ = గొప్ప ధనుస్సు విరిచిన వానికి, నమో = నమస్కారము, విశద భార్గవరామ = పరిశుద్ధుడైన భార్గవరాముని, విజయ కరణాయ = జయించిన వానికి. భరిత ధర్మాయ = పరిపూర్ణ ధర్మ స్వరూపునికి, శూర్పణఖాంగ హరణాయ = శూర్పణఖ యొక్క అంగములను ఖండించినవానికి, ఖరదూషణాదిరిపు ఖండనాయ = ఖరుడు, దూషణుడు మొదలైన శత్రువులను చంపినవానికి, తరణి సంభవ సైన్యరక్షాయ = సూర్యవంశమునకు చెందిన సైన్యరక్షకునికి, నమో = నమస్కారము, నిరుపమ = సాటిలేని, మహావారి బంధనాయ = మహాసముద్రానికి ఆనకట్ట కట్టిన వానికి. హతరావణాయ = రావణాసురుని చంపిన వానికి, సంయమినాధ వరదాయ = మునీశ్వరులకు వరములనిచ్చువాడికి, అతులిత = సాటిలేనిదైన, అయోధ్యాపురాధిపాయ= అయోధ్యాపురి నాయకునికి, వితత హితకర = అనేక విధాలుగా జగత్తుని పాలించు వానికి, వావిలి పాటి వీరరామాయ = వావిలిపాటి (వాయల్పాడు) లోని రామభద్రుడై భాసిల్లే, శ్రీ వేంకటేశ్వరాయ= శ్రీ వేంకటేశ్వర స్వామివారికి, నమో = నమస్కారము.

**భావం :** నల్లకలువల వంటి కన్నులు కలవాడు. రఘుకులంలో జన్మించినవాడు, మంచితనానికి నిలయమైనవాడు, సీతాదేవికి భర్తయైన స్వామికి నమస్కారము. దశరథుని కుమారుడు, తాటక అనే రాక్షస స్త్రీని సంహరించిన వాడు, 'కుశికుడ నే వాని కుమారుడైన విశ్వామిత్రుని యాగాన్ని పరిరక్షించినవాడు మహాశివ ధనస్సును విరచినవాడు, పరిశుద్ధుడైన భార్గవరాముని జయించిన వాడు అయిన స్వామికి నమస్కారము. పరిపూర్ణధర్మస్వరూపుడు, 'శూర్పణఖ' అనే రక్కసి ముక్కుచెవులు కోసినవాడు, ఖరదూషణాది శత్రువులును ఖండించినవాడు, సూర్యవంశపు సైన్యానికి నాయకుడు, అపారమైన సముద్రానికి సేతువు నిర్మించినవాడైన స్వామికి నమస్కారము. రావణాసురుని సంహరించినవాడు, మునీశ్వరులకు వరదుడు, సాటిలేని అయోధ్యాపురికి అధిపతియైన వాడు. అనేక విధాలుగా జగత్తుని పాలించు వాడైన వావిలిపాటి (వాయల్పాడు) వీరరాముడైన శ్రీ వేంకటేశ్వరునికి నమస్కారము.

## 70) రీతిగౌళ

రాధామాధవరతిచరితమతి
బోధావహం శ్రుతిభూషణం ॥ పల్లవి ॥

గహనే ద్వావపిగత్వా గత్వా
రహసి రతిం ప్రేరయతి సతి
విహరతస్తదా విలసంతౌ
విహత గృహాశౌ వివశౌతౌ ॥ రాధా ॥

లజ్జాశబల విలాసలీలయా
కజ్జలనయన వికారేణ
హ్యాజ్ఞావ్యవహృత హృదయా రతి
స్సజ్జా సంభ్రమ చపలా జాతా ॥ రాధా ॥

పురతో యాంతం పురుషం వకుళైః
కురంటకైర్వా కుటజైర్వా
పరమం ప్రహరతి పశ్చాల్లగ్నా
గిరం వినాపి వికిరతి ముదం ॥ రాధా ॥

హరిసురభూరుహ మారోహతీవస్వ
చరణేన కటిం సంవేష్ట్య
పరిరంభణ సంపాదిత పులకై
స్సురుచిర్జాతా సుమలతికేవ ॥ రాధా ॥

విధుముఖదర్శన విగళితలజ్జా
త్వధర బింబఫలమాస్వాద్య

మధురోపాయన మార్గేణ కుచౌ
నిధివద్దత్వా నిత్యసుఖమితా ॥ రాధా ॥

సురుచిరకేతక సుమదళ నఖరై
ర్వరచిబుకం సా పరివర్త్య
తరుణిమసింధౌ తదీయదృగ్జల
చరయుగళం సంసక్తం చకార ॥ రాధా ॥

వచన విలాసైర్వశీకృత్య తం
నిచులకుంజ మానితదేశే
ప్రచురసైకతే పల్లవ శయనే
రచితరతికళారాగేణాస ॥ రాధా ॥

అభినవ కల్యాణాంచితరూపా
వభినివేశ సంయుత చిత్తౌ
బభూవతుస్తత్పరౌ వేంకట
విభునాసా తద్విధినా సతయా ॥ రాధా ॥

సచలజ్జావీక్షణో భవతి తం
కచభర గంధం ఘ్రాపయతి
నచలతి చేన్మానవతీ తథాపి
కుచసంగా దనుకూలయతి ॥ రాధా ॥

అవనత శిరసాప్యతి సుభగం
వివిధాలాపైర్వివశయతి
ప్రవిమల కరరుహ రచన విలాసై
ర్భువనపతిం తం భూషయతి ॥ రాధా ॥

లతాగృహమేళనం నవాసై
కత వైభవ సౌఖ్యం దృష్ట్వా
తతస్తతశ్చరసౌ కేలీ
వ్రతచర్యాం తాం వాంఛం తౌ ॥ రాధా ॥

వనకుసుమ విశదవరవాసనయా
ఘనసారరజోగంధైశ్చ
జనయతి పవనే సపది వికారం
వనితా పురుషౌ జనితాశౌ ॥ రాధా ॥

ఏవం విచరన్ హేలా విముఖ
శ్రీ వేంకటగిరి దేవోయం
పావనరాధాపరిరంభసుఖ
శ్రీవైభవసుస్థిరో భవతి ॥ రాధా ॥

(సం.-5-కీ.-166)

రాధా మాధవ = రాధా మాధవుల యొక్క, రతి చరితం = శృంగార చరిత్రము, అతిబోధావహం = మిక్కుటమైన జ్ఞానమిచ్చునది, శ్రుతిభూషణం = వీనులకు విందువంటిది.

రహసి = ఏకాంతముగా, రతిం = శృంగారభావము, ప్రేరయతి సతి = ప్రేరణ చేయుచుండగా, ద్వావపి = ఇద్దరును, గహనే = అడవిలోకి, గత్వాగత్వా = బాగావెళ్ళి, విహత గృహాశౌ = ఇంటిధ్యాసలేనివారై, వివశౌ = పరవశులై, తదా = ఆ సమయములో, తౌ = ఆరాధామాధవులు, విహరతః = విహరించుచున్నారు.

లజ్జాశబల = అధికమైన సిగ్గుతో, విలాస = విలాసములయొక్క, లీలయా = లీలతో, కజ్జల నయన= కాటుక కంటి యొక్క, వికారేణ = క్రొత్తదనముతో, హృజ్జ = హృదయభవుడైన మన్మథునితో, అవ్యవహిత= ఎడములేని, హృదయా = హృదయము కలదిగా, రతిసజ్జా = రతికి సన్నాహము కలదియై, సంభ్రమ = బెదురుతో, చపలా = చాంచల్యము కలదిగా, జాతా = అయినది.

పురతోయాంతం = ముందు వెడుతున్న, పరమపురుషం = శ్రీకృష్ణుని, పశ్చాల్లగ్నా = వెన్నంటి అనుసరిస్తూ, వకుళైః = పొగడపువ్వులతో, కుదుటకైః = గోరింట పువ్వులతో, కుటజైర్వా = కొండమల్లె పువ్వులతోగాని, ప్రహరతి = కొడుతున్నది, గిరాం వినాపి = మాటలు లేకుండానే, ముదం = అనురాగాన్ని, విహిరతి = తెలుపుతున్నది.

హరిసురభూరుహం = కృష్ణుడనే కల్పవృక్షాన్ని, ఆరోహతీవ = ఎగబ్రాకుతున్న దానిలా, స్వ చరణేన= తన పాదముతో, కటిం సంవేష్ట్య = ఆ శ్రీహరి యొక్క నడుమును పెనవేసుకొని, పరిరంభణ = కౌగిలింత వలన, సంపాదిత = పొందిన, పులకైః = గగుర్పాటుతో, సుమలతి కేవ = పూలతీగలా, సురభిః = పరిమళించునదిగా - జాతా = అయినది.

విధు = చంద్రబింబమువంటి, ముఖదర్శన = శ్రీకృష్ణ ముఖదర్శనముచేత, విగళిత = జారిన, లజ్జా= సిగ్గు కలదిగా, తత్ = కృష్ణుని యొక్క, అధరబింబఫలం = పెదవి అనే దొండపండును, ఆస్వాద్య = జుర్రుకొని, మధుర = తీయనైన, ఉపాయనమార్గేణ = కానుకనిచ్చుచున్న దానిగా, కుచౌ = స్తనములను, నిధివత్ = రెండు నిధుల వలె, దత్వా = ఇచ్చి, నిత్యసుఖం = శాశ్వతసుఖమును, ఇతా = పొందుతున్నది.

సా = ఆరాధ, సు రుచిర = చాలా అందమైన, కేతక సుమ = మొగలి పూవు యొక్క, దళ = రేకులముండ్లవంటి, నఖరైః = గోరులతో, వరచిబుకం = వరుని గడ్డమును, పరివర్త్య = వెనుకకు త్రిప్పి, తరుణిమసింధౌ = తన యొక్క యౌవనమనే నదిలో, తదీయ = ఆమాధవునిదైన, దృక్ = కన్నులనెడి, జలచరయుగళం = రెండుచేపలను, సంసక్తం = బాగా ఆకట్టుకొన్న దానిగా, చకార = చేసింది.

తం = ఆ మాధవుడిని, వచనవిలాసైః = అందమైన మాటలతో, వశీకృత్య = తనకు వశునిగాచేసికొని, నిచులకుంజమానితదేశే = ఎఱ్ఱ గన్నేరు చెట్ల పొదతో కూడిన ప్రదేశములో, ప్రచురసైకతే = విశాలమైన యిసుక తిన్నెయందు, పల్లవశయనే = చిగురుసెజ్జయందు, రాగేణ = అనురాగముతో కూడిన, రచితరతికళా= శృంగారకేళిలో గొప్పదిగా, ఆస = అయినది.

వేంకటవిభునా = శ్రీవేంకటవిభునితో, సా = ఆరాధ, తద్విధినా = ఆరతి విధానముతో, తయా = ఆమెతో, సచ = శ్రీవేంకటవిభుడును, అభినవకల్యాణ = నవ పరిణయముతో, అంచిత రూపౌ = మునిగితేలిన రూపంతో, అభినివేశ సంయుత చిత్తౌ = పట్టుదలచే నిగ్రహించుకొంటు చిత్తమును, తత్పరౌచ = తదేకాసక్తులు, బభూవతుః = అయ్యారు.

సచ = ఆ శ్రీవారు, లజ్జా వీక్షణః = సిగ్గుతో కూడిన  చూపులు గలవాడు, భవతి = అవుతున్నాడు, తం = ఆతనిని, సా = ఆ రాధ, కచభర = శిరోజాల యొక్క, గంధం = సౌరభమును, ఘ్రాపయతి = అందజేయుచున్నది, తథాపి = అయినా, న చలతిచేత్ = కదలకున్నచో, మానవతీ = ఇంచుక - అలిగినదియై, కుచసంగాత్ = పాలిండ్లపైకి, అనుకూలయతి = అనుకూలునిగా చేస్తున్నది.

అవనతశిరసాపి = వంచిన తలకలవాడైనా, అతిసుభగం = వెనుకటి కంటే ఇష్టుడై, వివిధాలాపైః = పలువిధములైన మాటలతో, వివశయతి = పరవశింప చేయుచున్నది, ప్రవిమల = మిక్కిలి నిర్మలములైన, కరరుహరచన విలాసైః = నఖక్షతవిలాసములతో, తం భువన పతిం = ఆ భువననాథుని, భూషయతి = అలంకరించుచున్నది.

లతాగృహమేళనం = పొదరింటిలోని తమ కలయికను, నవసైకత వైభవ సౌఖ్యం = అందమైన యిసుక తిన్నెమీది తమ సౌఖ్యవైభవమును, దృష్ట్వా = చూచి, తాం = ఆ, కేళీవ్రతచర్యాం = శృంగార కేళీవ్రత చర్యలా, వాంఛంతౌ = కోరుచున్నవారై, తౌ = రాధామాధవులు, తతస్తతః = అటుఇటు, చరతః = చరించుచున్నారు.

వనకుసుమ = అడవిపూల, వరవాసనయా = చక్కని సువాసనల చేత, ఘనసారరజః = పచ్చకప్పురము రేణువుల యొక్క, గంధైశ్చ = సౌరభములచేత, సపది = అప్పుడు, పవనే = అడవిగాలి, వికారం = మనోవికారమును, జనయతిసతి = కలిగిస్తుండగా, వనితా పురుషౌ = స్త్రీపురుషులు, జనితాశౌ = ప్రేమలో మునిగి తేలుతున్నారు.

ఏవం = ఈవిధంగా, విచరన్ = తిరుగుతూ, అయం = ఈ, శ్రీ వేంకటగిరిదేవః = శ్రీవేంకటగిరినాథుడు, హేలావిముఖః = ఇతర విలాసాలకు విముఖుడై, పావన = పావనమైన, రాధాపరిరంభ = రాధాదేవి యొక్క ఆలింగన, సుఖశ్రీవైభవ = సుఖలక్ష్మీవైభవముతో, సుస్థిరః = మిక్కిలి నిలకడకలవాఁడు, భవతి = అవుతున్నాడు.

**తాత్పర్యం** : రాధామాధవుల శృంగార చరిత్ర సుజ్ఞానదాయకం. వీనులకు విందువంటిది. ఏకాంతవేళ శృంగార భావము ప్రేరణచేస్తుండగా వారిద్దరూ అడవిలోకి వెళ్ళి, పరవశులై ఇంటిధ్యాసను వదలి విహరిస్తున్నారు. రాధాదేవి సిగ్గులను విలాసముల లీలతో, కాటుక కంటియొక్క కొత్తదనంతో చంచలమైన చూపులను ప్రదర్శిస్తూ

మన్మథుడు పీడిస్తుండగా, ముందువెడుతున్న పరమ పురుషుని అనుసరిస్తున్నది. పొగడపూవులతో, గోరింట పువ్వులతో కొండమల్లె పూవులతో, స్వామిని పరవశింపజేస్తూ మాటల నిమిత్తం లేకనే తన అనురాగాన్ని తెలుపు తున్నది. శ్రీకృష్ణుడనే కల్పవృక్షంపై ఎగబ్రాకుతున్నదానిలా, తనపాదంతో ఆ కృష్ణుని యొక్క నడుమును పెనవేసుకొని కౌగలింతవలన, పొందిన పులకాంకురాలతో, పూలతీగలా పరిమళిస్తున్నది రాధ. చంద్రబింబంలాంటి శ్రీకృష్ణస్వామి ముఖాన్ని చూడటం వల్ల తొలగిన సిగ్గుకలదై, ఆయన ఎఱ్ఱనిపెదవులను ఆస్వాదించి, ఇందుకు ప్రతిగా తీయని కానుకగా రెండునిధుల వంటి తన స్తనములను ఇచ్చి శాశ్వతసుఖాన్ని అందుకొంటున్నది. ఆ రాధాదేవి చాలా అందమైన మొగలి రేకుల వంటి గోళ్ళతో స్వామిని తనకు వశుడిగా చేసుకొన్నది. ఎఱ్ఱగన్నేరు చెట్ల పొదలో ఉన్న, విశాలమైన ఇసుక తిన్నెపైన వేంకటవిభుడు - రాధ నవపరిణయంతో శృంగారకేళిలో మునిగితేలుతున్నారు. పరస్పరం ఆ స్థితిని కోల్పోకుండా చిత్తాన్ని పదిలపరుచు కొంటున్నారు. శ్రీవారు సిగ్గుపడుతున్నాడు. రాధ తనకురులలో నున్న సౌరభాన్ని అందిస్తున్న కదలని స్వామి పై అలిగిన రాధ తన పైయ్యెదపైకి లాగుతున్నది. తపన ఉన్నా తలవంచిన స్వామిని, ప్రీతితో కూడిన పలుకులతో పరవశింపజేసి, నిర్మలమైన నఖక్షతములతో ఆ జగన్నాయకుని అలంకరిస్తున్నది. పొదరింటిలోని తమ కలయికను ఇసుకతిన్నెపై పొందిన సౌఖ్యాన్ని శృంగారకేళీ వ్రతంలా చూసి, రాధామాధవులు అటు ఇటూ సంచరిస్తున్నారు. అడవిపూల పరిమళాలు, పచ్చకర్పూరపు రేణువుల సువాసనలచే అడవిగాలి పారవశ్యాన్ని మరింతగా కలిగిస్తున్న వేళ ఆ ప్రేమమూర్తులు సుఖలీలలో మునిగితేలుతున్నారు. ఇలా సంచరిస్తూ శ్రీవేంకట నాయకుడు ఇతర విలాసాలకు విముఖుడై, పావనమైన రాధాదేవి ఆలింగనంలోనే సుఖలక్ష్మీవైభవంలో మిక్కిలి నిలకడకల వాడైనాడు.

## 71) బౌళి

రామమిందీవర శ్యామం పరాత్పర
ధామం సురసార్వభౌమం భజే । ॥పల్లవి॥

సీతావనితా సమేతం!
స్ఫీతవానరబలవ్రాతం
పూత కౌసల్యాసంజాతం
వీతభీతమౌనివిద్యోతం ॥రామ॥

వీరం రణరంగధీరం ।
సాధర్మకులోద్ధారం
క్రూరదానవ సంహారం ।
శూరాధారాచారం సుగుణోదారం ॥రామ॥

పావనం భక్తసంసేవనం ।
దైవిక విహగవధావనం

రావణానుజ సంజీవనం ।
శ్రీవేంకట పరిచిత భావనం ॥ ॥రామ॥

**(సం.-4-కీ.-452)**

ఇందీవరశ్యామం = నల్లకలువ వలె నీలవర్ణముగలవానిని, పరాత్పర ధామం = పరాత్పరమైన నిలయముగలవానిని, సురసార్వభౌమం = దేవతాసార్వభౌముడైన, రామం = శ్రీరాముని, భజే = సేవింతును.

సీతావనితాసమేతం = సీతావనితతో కూడినవానిని, స్ఫీత = విస్తారమైన, వానర బలవ్రాతం = వానరసేనా సమూహము కలవానిని, పూత = పవిత్రురా లయిన, కౌసల్యాసంజాతం = కౌసల్యాదేవికి జన్మించినవానిని, వీతభీత = తొలిగిన భీతిగల, మౌని = దండకారుణ్యమునుల నడుమ, విద్యోతం = మిక్కిలి ప్రకాశించువానిని,

వీరం = ధర్మవీరుని, రణరంగధీరం = రణరంగమునందు నిశ్చలుని, సార = శ్రేష్ఠమయిన, ధర్మ = ధర్మమును, కుల = నిజవంశమును, ఉద్ధారం = ఉద్ధరించినవానిని, క్రూరదానవసంహారం = క్రూరులైన దానవులను సంహరించినవానిని, శూరాధార = శూరులకు ఆధారమయిన, ఆచారం = ప్రవర్తనముగలవానిని, సుగుణోదారం = సుగుణములచేత ఉదారుని, భజే = సేవింతును.

పావనం = లోకపావనుని, భక్తసంసేవనం = భక్తుల సంసేవనము కలవానిని, దైవికవిహగప = దేవాంశగల విహగాధి పుడు (గరుత్మంతుడు) ధావనం = వాహనముగా గలవానిని, రావణానుజ సంజీవనం = రావణుని తమ్ముడయిన విభీషణుని సంజీవింప జేసిన వానిని, శ్రీవేంకట = శ్రీవేంకటాద్రియందు, పరిచిత = ప్రసిద్ధమైన, భవనం = నివాసము గలవానిని, భజే = సేవింతును.

**తాత్పర్యము :** నల్లకలువవలె శ్యామలవర్ణుడును, పరాత్పరమైననిలయము కలవాడును, సురసార్వభౌముడునైన రాముని సేవింతును. సీతాసమేతుని, గొప్పవానరసేనా సమూహములతో కూడినవానిని, కౌసల్యానందనుని, నిర్భయులైన దండకారణ్యముల మధ్య ప్రకాశించుచున్నవానిని సేవింతును. వీరుని, రణరంగ ధీరుని, శ్రేష్ఠమయిన ధర్మవంశమును ఉద్ధరించినవానిని, క్రూరులైన దానవులను సంహరించినవానిని, శూరులకు ఆధారమైన ఆచారాలుగలవానిని, సుగుణోదారుని సేవింతును. లోకపావనుని, భక్తసంసేవని, వేదస్వరూపుడైన గరుడుని వాహనముగా కలవానిని, రావణుని తమ్ముడైన విభీషణుని లంకాధిపతిగా జేసి ఉద్ధరించినవానిని, శ్రీవేంకటాచలమునందు ప్రసిద్ధమైన నివాసముగలవానిని సేవింతును.

## 72. పాడి

రామా దశరథరామా నిజసత్య -
కామా నమో నమో కాకుత్థ్సరామ ॥పల్లవి॥

కరుణానిధి రామ కౌసల్యానందన రామ
పరమపురుష సీతాపతి రామ

శరధిబంధన రామ సవనరక్షక రామ
గురుతరరవివంశ కోదండరామ ॥రామా॥

దనుజహరణ రామ దశరథసుత రామ
వినుతామరస్తోత్ర విజయరామ
మనుజావతార రామ మహనియ్యగుణ రామ
అనిలజప్రియ రామ అయోధ్యారామ ॥రామా॥

సులలితయశ రామ సుగ్రీవవరద రామ
కలుషరావణభయంకర రామ
విలసితరఘురామ వేదగోచర రామ
కలితప్రతాప శ్రీవేంకటగిరిరామ ॥రామా॥

(సంపుటం-4-కీ-156)

**అర్థం** : రామా! = ఓశ్రీరామా!, దశరథరామా = దశరథ మహారాజు పుత్రుడవైన వాడా!, నిజసత్యకామ = సత్యమందు స్వభావసిద్ధముగా ప్రీతిగలవాడా!, కాకుత్స్థరామా = కకుత్స్థవంశానికి చెందినరామా!, నమో నమః = నమస్కారము.

కరుణానిధిరామ! = దయకు నిలయమైనవాడాశ్రీరామా!, కౌసల్యానందన రామ! = కౌసల్యకు సంతానమైన రామా!, పరమ పురుష! = ఓ పరబ్రహ్మమా!, సీతాపతిరామ! = సీతాదేవికి భర్తవైన రామా!, శరధి బంధన! = సేతువుని సముద్రంపై నిర్మించి బంధించిన వాడా!, రామా! = శ్రీరామా!, సవనరక్షకరామా!= విశ్వామిత్రుని మన్నించి యజ్ఞాన్ని రక్షించినవాడా!, గురుతర రవివంశ కోదండరామా! = గొప్పదైన సూర్యవంశంలో ప్రభవించిన రామా!

దనుజహరణ రామ! = రాక్షసులను సంహరించిన రామా!, దశరథ సుతరామా= దశరథుని కుమారుడైన రామా!, వినుతామరస్తోత్ర విజయరామా! = వినమ్రులైనదేవతలచే కీర్తించబడిన విజయరామా!, మనుజావతార రామ! = మానవావతారాన్నెత్తిన రామా!, మహనీయగుణ రామా! = గొప్పవైన గుణములు కలిగినరామా!, అనిలజప్రియరామ! = వాయుపుత్రుడైన హనుమంతునికి ప్రియమైన రామా!, అయోధ్యరామ = అయోధ్యా రాముడా!

సులలిత యశ! రామ! = సుందరమైన కీర్తిని కలిగినరామా!, సుగ్రీవ వరద రామ! = సుగ్రీవుని కాపాడిన రామా!, కలుషరావణ భయంకర! = కలుషితుడైన రావణాసురునికి భయాన్ని కలిగించిన, రామ!= ఓ శ్రీరామా!, విలసితరఘురామ! = ప్రకాశించే రఘురామా!, వేదగోచరరామ! = వేదాలచే తెలియబడుతున్నరామా!, కలిత ప్రతాప! = కలితప్రతాపముగలవాడా!, శ్రీవేంకటగిరిరామ! = శ్రీ వేంకటాచలరామ! నీకు నమస్కారము.

**తాత్పర్యం :** శ్రీరామా! దశరథ మహారాజ పుత్రుడా! సత్యప్రీతికలవాడా! కకుత్థ్సవంశ తిలకుడా! నమస్కారము. దయకు గని వంటివాడా! కౌసల్య కుమారుడైనవాడా! పరమ పురుష! సీతాభామాపతీ! సేతువు కట్టినవాడా! యజ్ఞరక్షకుడా! సూర్య కులంలో ప్రభవించిన శ్రీరామా! రాక్షసులను సంహరించిన రామా! దశరథుని కుమారుడైన శ్రీరామా! వినమ్రులైన దేవతలచే కీర్తించబడినవాడా! మానవావతారాన్ని దాల్చిన వాడా! మహనీయగుణాలు కలవాడా! వాయుపుత్రుడైన హనుమంతునికి ప్రియమైన రామా! అయోధ్యాపతీ! సుందరమైన కీర్తిని కలిగిన వాడా సుగ్రీవుని కాపాడినరామా! కలుషితుడైన రావణాసురునికి భయాన్ని కలిగించినవాడా! ప్రకాశించే శ్రీరామా! వేద వేద్యా! కలితప్రతాపా! వేంకటరమణా! నమస్కారము.

**విశేషాంశం :** ఈ సంకీర్తన అంతా సంబోధనప్రథమా విభక్తితో సాగింది. రామాయణంలోని దివ్యగాథలను, అంత్యప్రాసగా రామనామంతో రంగరించిన అద్భుతమైన సంకీర్తన ఇది.

## 73) శ్రీరాగం

వందేవాసుదేవం
బృందారకాధీశ వందితపదాబ్జం ॥పల్లవి॥

ఇందీవరశ్యామ మిందిరాకుచతటీ
చందనాం కితల సచ్చారుదేహం
మందారమాలికా మకుట సంశోభితం
కందర్పజనక మరవిందనాభం ॥వందే॥

ధగధగితకౌస్తుభాదరణ వక్షస్థలం
ఖగరాజవాహనం కమలనయనం
నిగమాదిసేవితం నిజరూపశేష ప
న్నగ రాజశాయినం ఘన నివాసం ॥వందే॥

కరిపురనాథ సంరక్షణే తత్పరం
కరిరాజవరద సంగత కరాబ్జం
సరసీరుహానసం చక్రవిభ్రాజితం
తిరువేంకటాచల దేవం భజే ॥వందే॥

సంపుటం-1, సంకీర్తన-53

**అర్థము :** బృందారకాధీశ = ఇంద్రునిచేత, వందిత = నమస్కరింపబడిన, పదాబ్జం = పాదపద్మములుగల, వాసుదేవం = శ్రీవాసుదేవుని, వందే = నమస్కరిస్తాను.

ఇందీవరశ్యామం = నల్లకలువలా శ్యామవర్ణము కలవానిని, ఇందిరా = లక్ష్మీదేవియొక్క, కుచతటీ = స్తనతటియందలి, చందన = శ్రీగంధముచేత, అంకిత = చిహ్నితమైన, లసత్ = ప్రకాశిస్తున్న, చారు =

సుందరమైన, దేహం = శరీరముకలవానిని, మందారమాలికా = మందారమాలామయమైన, మకుట = కిరీటముతో, సంశోభితం = ప్రకాశించినవానిని, కందర్ప జనకం = మన్మథజనకుని, అరవిందనాభం = పద్మనాభుని, వందే = నమస్కరించుచున్నాను.

ధగధగిత = ధగధగలాడుచున్న, కౌస్తుభాదరణ = కౌస్తుభరూపమైన ఆభరణమును ఆదరించిన వానిని, ఖగరాజవాహనం = గరుత్మంతుడు వాహనముగా గలవానిని, నిగమ = వేదములచేత, అధిసేవితం = అధికముగా సేవింపబడినవానిని, నిజరూప = తన రూపాంతరమేయైన, శేష = శేషుఁడనెడి, పన్నగరాజు = పన్నగరాజుపై, శాయినం = శయనించినవానిని, ఘననివాసం = గొప్ప నివాసముగలవానిని,

కరిపురనాథ = పరీక్షిత్తుయొక్క, సంరక్షణే = సంరక్షణమునందు, తత్పరం = తత్పరుడైన వానిని, కరిరాజ = గజేంద్రునకు, వరద = వరప్రదమై, సంగత కరాబ్జం = సంగతమైన కరమునందలి, అబ్జం = తామరపువ్వుగలవానిని, సరసీరుహాననం = పద్మమువంటి ముఖముగలవానిని, చక్ర = సుదర్శనా యుధముతో, విభ్రాజితం = విరాజమానుని, తిరువేంకటాచలదేవం = శ్రీవేంకటా చలము నందలి ప్రకాశస్వరూపుని, భజే = సేవిస్తున్నాను.

**తాత్పర్యము:** దేవేంద్రవందిత పదారవిందుడైన శ్రీవాసుదేవుని నమస్కరిస్తాను. నల్లకలువలాశ్యామవర్ణము కలవానిని, లక్ష్మీదేవి యొక్క హృదయములో చందనాంకితమై ప్రకాశిస్తున్న సుందరమైన దేహంకలవానిని, మందారమాలికా మకుటముతో సంశోభితుడైన వానిని, మన్మథజనకుని, పద్మనాభుని, నమస్కరిస్తు న్నాను. ధగధగలాడుచున్న కౌస్తుభాభరణం కలవానిని, గరుత్మంతుని వాహనముగా కలవానిని, వేదములచేత అధికంగా సేవింపబడినవానిని, శేషరాజు రూపాంతరమైన కొండ శయనించినవానిని, గొప్పవిలాసము కలవానిని నమస్కరిస్తున్నాను. కరిపురనాథుడైన పరీక్షిత్తు యొక్క సంరక్షణతో తత్పరుడైన వానిని, కరిరాజవరదుని, సంగతమైన కరమునందు తామరపువ్వుగలవానిని, పద్మమువంటి ముఖము కలవానిని, సుదర్శనాయుధముతో విరాజమానుని, శ్రీవేంకటాచలమునందు కొలువైన, ప్రకాశస్వరూపుని నమస్కరిస్తున్నాను.

## 74. బౌళి

వందేహం జగద్వల్లభం దుర్లభం
మందరధరం గురుం మాధవం భూధవం ॥పల్లవి॥

నరహరిం మురహరం నారాయణం పరం
హరి మచ్యుతం ఘనవిహంగవాహం
పురుషోత్తమం పరం పుండరీకేక్షణం
కరుణాభరణం కలయామి శరణం ॥వందే॥

నందనిజనందనం నందకగదాధరం
యిందిరానాథ మరవిందనాభం

యిందురవిలోచనం హితదాసవరదం, ము
కుందం యదుకులం గోపగోవిందం ॥వందే॥

రామనామం యజ్ఞరక్షణం లక్షణం
వామనం కామినం వాసుదేవం
శ్రీమదావాసినం శ్రీవేంకటేశ్వరం
శ్యామలం కోమలం శాంతమూర్తిం ॥వందే॥

(సంపుటం-15-కీ-235)

జగద్వల్లభం = జగన్నాథుడైన వానికి, దుర్లభం = కష్టసాధ్యుడైన వానికి, మంధరధరం = కూర్మావతాన్ని దాల్చి మంథర పర్వతాన్ని ఎత్తినవాడైన, గురుం = జగద్గురువైన వానికి, మాధవం = లక్ష్మీపతియైన వానికి, భూదేవం = భూదేవికి పతియైన వానికి, అహం = నేను, వందే = నమస్కరిస్తున్నాను.

నరహరిం = నృసింహ స్వరూపుని, మురహరం = మురాసురుని సంహరించిన వాడిని, నారాయణం = నారాయణుని, పరం = మోక్షస్వరూపుడైన వానిని, హరిం = శ్రీహరిని, అచ్యుతం = నాశములేనివానిని, ఘన విహంగవాహం = ఘనమైన గరుడవాహనం కలవానిని, పురుషోత్తమమం = సర్వోత్తముని, పరం = పరస్వరూపుడిని, పుండరీకేక్షణం= పద్మాలవంటికన్నులు కలవానిని, కరుణాభరణం = కరుణకు ఆభరణమైన వానిని, శరణం కలయామి = శరణు కోరుతున్నాను.

నంద నిజనందనం = నందుని కుమారుడైన వానిని, నందక, గదాధరం = నందకమనే ఖడ్గాన్ని, కౌమోదకీగదను ధరించినవానిని, ఇందిరానాథం = లక్ష్మీనాథుని, అరవిందనాభం = పద్మనాభుని, యిందు రవిలోచనం = సూర్యచంద్రులను కన్నులుగా కలవానిని, హితదాస వరదం = ఆశ్రిత భక్తులను రక్షించువానిని, ముకుందం = ముకుందుని, యదుకులం = యదుకులస్వరూపుడైన వానిని, గోపగోవిదం = గొల్లవాడైన గోవిందుని నమస్కరిస్తున్నాను.

రామనామం = త్రేతాయుగంలో రాముడనే పేరును కలవానిని, యజ్ఞరక్షణం = విశ్వామిత్రుని యజ్ఞాన్ని రక్షించినవానిని, లక్షణం = సర్వ లక్షణ సంపన్నుని, వామనం = వామనావతారస్వరూపుని, కామినం = కోర్కెలుకలవాడైన, వాసుదేవం = వసుదేవసుతుని, శ్రీమదావాసినం శ్రీవేంకటేశ్వరం = కస్తూరిని ధరించిన వేంకటేశ్వరస్వామిని, శ్యామలం = నల్లవానిని, కోమలం = సుకుమారుని, శాంతమూర్తిం = శాంతస్వరూపుని నమస్కరిస్తున్నాను.

**తాత్పర్యం** : జగన్నాథుడైన వానికి, కష్టసాధ్యుడైన వానికి, మంధర పర్వతాన్ని కూర్మరూపంతో ఎత్తినవానికి, జగద్గురువైన వానికి, లక్ష్మీపతియైన వానికి, భూదేవికి పతియైన వానికి నేను నమస్కరిస్తున్నాను. నరసింహరూపుని, మురాసురుని చంపిన వానిని, నారాయణుని, మోక్షస్వరూపుని, శ్రీహరిని, నాశములేని వానిని, ఘనమైన గరుడవాహనం కలవానిని, సర్వోత్తముని, పద్మాలవంటి కన్నులు కలవానిని, కరుణాభరుణుడిని నమస్కరిస్తున్నాను. నందుని కుమారుడైన వానిని, నందకమనే 'ఖడ్గాన్ని' కౌమోదకమనే 'గద'ను ధరించినవానిని, లక్ష్మీనాథుని, సూర్యచంద్రులను కన్నులుగా కలవానిని, ఆశ్రితభక్తులను రక్షించువానిని,

గొల్లవాడైన గోవిందుడిని నమస్కరిస్తున్నాను. త్రేతాయుగంలో రాముడనే పేరుకలవానిని, విశ్వామిత్రుని యజ్ఞాన్ని రక్షించినవానిని, సర్వరక్షణ సంపన్నుని, వామనావతార స్వరూపుని, కోర్కెలుకలవాడైన వసుదేవుసుతుని, కస్తూరి అలముకొన్న శ్రీవేంకటేశ్వరుని, నల్లనివానిని, సుకుమారుని, శాంతమూర్తిని నమస్కరిస్తున్నాను.

## 75. కన్నడగౌళ

శరణు శరణు, దేవ సర్వపోషక
కరుణానిలయ రామ కౌసల్యనందన ॥పల్లవి॥
వారిధిబంధన రావణ శిరశ్ఛేదక
మారీచసుబాహుబలమర్దన
దారుణ కుంభకర్ణ దనుజసంహారక
వీరప్రతాక రామ విజయాభిరామ ॥శర॥

సవనరక్షక మునిజనకుల నిర్వాహక
దివిజవంధ్య కపిసేనానాయక
వివిధసప్తతాలవిధ్వంసనచతుర
భువనేశ సాకేతపురవాస రామ ॥శర॥

హరచాపహర అహల్యాశాపవిమోచక
ఖరశరవాలినిగ్రహబిరుద
నిరతి శ్రీవేంకటేశ నిజభక్తరక్షక
ధరణిజాసమేత దశరథరామా ॥శర॥ (సం.4-కీ.170)

దేవ = దేవతాసార్వభౌముడా!, సర్వపోషక = సమస్తానికి పోషకుడా!, కరుణానిలయ = కరుణకు గనివంటివాడా! రామ! = శ్రీరామా! కౌసల్యానందన = కౌసల్యాదేవి కుమారుడా!, శరణు శరణు = శరణు కోరుతున్నాను.

వారధిబంధన = సముద్రానికి సేతువు కట్టినవాడా! రావణ శిరచ్ఛేదక = రావణాసురుని శిరస్సు ఛేదించినవాడా!, మారీచసుబాహు బలమర్దన = మారీచుడు, సుబాహువు అనే రాక్షసుల బలాన్ని అణగద్రొక్కినవాడా! దారుణ కుంభకర్ణ దనుజ సంహారక = మహాదుష్టుడైన కుంభకర్ణుడనే రాక్షసుని సంహరించినవాడా!, వీరప్రతాప = శౌర్యము ప్రతాపము కలిగినవాడా! రామ = శ్రీరామా!, విజయాభిరామ = విజయాన్ని పొందు రామచంద్రా!, సవనరక్షక = విశ్వామిత్రుని యజ్ఞాన్ని రక్షించిన వాడా, మునిజనకుల నిర్వాహక = మునీశ్వరుల సమూహాన్ని పరిరక్షించినవాడా, దివిజ వంద్య = దేవతారక్షక, కపిసేనానాయక = వానరసైన్యానికి అధినాయకుడా, వివిధ సప్తతాల విధ్వంసన చతర = విషమముగా ఉన్న ఏడుతాటిచెట్లను పడగొట్టిన చతురడా! భువనేశ = జగన్నాథా!, సాకేతపురవాసా = అయోధ్యా నగరాధిపతీ!, రామ = శ్రీరామా!

హరచాపహర = శ్రీరాముని విల్లు విరిచినవాడా! అహల్యా శాపవిమోచక = అహల్యాదేవి శాపాన్ని తొలగించినవాడా!, ఖర శర వాలి నిగ్రహ బిరుద = ఖరుడు, శరుడు, వాలి వంటి వీరులను నిగ్రహించిన పరాక్రమశాలీ, నిరతి = నిరంతరము, శ్రీవేంకటేశ = శ్రీవేంకటాచలపతీ, నిజభక్తరక్షకా = ఆశ్రితభక్తరక్షకుడా!, ధరణిజా సమేత = సీతాసమేతుడా, దశరథ రామ = దశరథ తనయుడైన శ్రీరామచంద్రా నమస్కారము.

తాత్పర్యము : దేవతాసార్వభౌముడా!, సమస్తానికి పోషకుడా!, కరుణకు గనివంటివాడా! శ్రీరామా! కౌసల్యాదేవి కుమారుడా!, శరణు కోరుతున్నాను. సముద్రానికి సేతువు కట్టినవాడా! రావణాసురుని శిరస్సు ఛేదించినవాడా!, మారీచుడు, సుబాహువు అనే రాక్షసుల బలాన్ని అణగద్రొక్కినవాడా! మహాదుష్టుడైన కుంభకర్ణుడనే రాక్షసుని సంహరించినవాడా!, శౌర్యము ప్రతాపము కలిగినవాడా! శ్రీరామా!, విజయాన్ని పొందు రామచంద్రా!, విశ్వామిత్రుని యజ్ఞాన్ని రక్షించిన వాడా, మునీశ్వరుల సమూహాన్ని పరిరక్షించినవాడా, దేవతారక్షక, వానరసైన్యానికి అధినాయకుడా, విషమముగా ఉన్న ఏడుతాటిచెట్లను పడగొట్టిన చతురడా! జగన్నాథా!, అయోధ్యా నగరాధిపతీ!, శ్రీరామా! శివుని విల్లు విరిచినవాడా! అహల్యాదేవి శాపాన్ని తొలగించినవాడా!, ఖరుడు, శరుడు, వాలి వంటి వీరులను నిగ్రహించిన పరాక్రమశాలీ, నిరంతరము, శ్రీవేంకటాచలపతీ, ఆశ్రితభక్తరక్షకుడా!, సీతాసమేతుడా, దశరథ తనయుడైన శ్రీరామచంద్రా నమస్కారము.

## 76. సాళంగనాటరాగం

శరణు శరణు విభీషణవరదా!
శరధిబంధన రామ సర్వ గుణస్తోమ! ॥పల్లవి॥

మారీచ సుబాహు మదమర్దన తాటకాహర!
క్రూరేంద్ర జిత్తుల గుండుగండా!
దారుణ కుంభకర్ణ దనుజ శిరశ్ఛేదక!
వీర ప్రతాపరామ! విజయాభిరామ! ॥శర॥

వాలినిగ్రహ సుగ్రీవరాజ్యస్థాపక!
లాలితవానరబల లంకాపహర!
పాలితసవనాహల్య పాపవిమోచక!
పౌలస్త్యహరణ రామ బహుదివ్యనామ! ॥శర॥

శంకరచాప భంజక! జానకీమనోహర!
పంకజాక్ష సాకేతపట్టణాధీశ!
అంకితబిరుద శ్రీవేంకటాద్రి నివాస!
ఓంకారరూప! రామ! పురుసత్యకామ! ॥శర॥

**అర్థము:** విభీషణ వరదా! విభీషణునికి శరణ మొసంగినవాడా! శరధి బంధనా!= వారధికట్టినవాడా! సర్వగుణసోమ = సర్వగుణములకు నిలయుడా! రామ = ఓ! శ్రీరామా! మారీచ సుబాహు = మారీచ

సుబాహులయొక్క, మదమర్దన = మదమును అణచినవాడా!, తాటకాహర = తాటకను వధించినవాడా, క్రూర = క్రూరుడైన, ఇంద్రజిత్తుల = ఇంద్రుని జయించిన రాక్షసుల యొక్క, తలగుండు = శిరస్సులనే శిలలను, గండా = పగులగొట్టినవాడా!, శరణు = శరణు, కోరుతున్నాను. దారుణ కుంభకర్ణ = భయంకర కుంభకర్ణుడనెడి, దనుజ = రాక్షసుడి యొక్క, శిరచ్ఛేదక = తలను నఱికినవాడా!, శరణు = శరణు, వీరప్రతాప = వీరులు హర్షించు ప్రతాపము గలవాడా!, విజయాభిరామా = విజయములచేత, మిక్కిలి శోభిల్లుతున్నవాడా!, రామా = ఓ రామా!, శరణు = శరణు.

వాలి నిగ్రహ! = వాలిని ఓడించినవాడా!, సుగ్రీవరాజ్య స్థాపక! = సుగ్రీవుని రాజ్యమునందు నిలిపినవాడా!, లాలిత = మిక్కిలి ప్రేమతో ఆదరించిన, వానరబల! = వానర సైన్యము గలవాడా!, లంకాపహార = లంకానగరమును జయించినవాడా!, పాలిత సవన! = విశ్వామిత్రుని యాగమును సంరక్షించినవాడా!, అహల్యాపాప విమోచన = అహల్యను పాపమునుండి విడిపించినవాడా!, పౌలస్త్యహరణ = రావణుని సంహరించినవాడా!, బహుదివ్యనామ! = అనేక మహిమలు కల పేర్లు గలవాడా!

శంకర చాప భంజక! = శివుని విల్లు విరిచినవాడా!, జానకీమనోహర! = సీతాదేవి మనస్సును హరించినవాడా!, పంకజాక్ష = తామర పువ్వులవంటి కన్నులు కలవాడా!, సాకేత పట్టణాధీశ = అయోధ్యా నగరమునకు నాయకుడా!, అంకిత = చెక్కబడిన, బిరుద = బిరుదములుగలవాడా!, శ్రీవేంకటాద్రి నివాస = శ్రీవేంకటాచలము నివాసముగా గలవాడా!, ఓంకారరూప! = ప్రణవ స్వరూపుడా!, ఉరు సత్యకామ! = గొప్ప సత్యకామముఁగలవాడా!

**తాత్పర్యము** : విభీషణునికి ప్రసన్నుడైనవాడా! సేతువు నిర్మించినవాడా! సర్వగుణములకు నిలయుడా ఓ! శ్రీరామా! శరణు శరణు.

మారీచ సుబాహుల మదమణచినవాడా! 'తాటక' అనే రాక్షసిని సంహరించినవాడా! క్రూరులైన ఇంద్రుని జయించిన రాక్షసుల శిరస్సులను పగులగొట్టినవాడా! శరణు కోరుతున్నాను. భయంకరుడైన కుంభకర్ణుడనే నిశాచరుడి తల నరకినవాడా! శరణు కోరుతున్నాను. వీరప్రతాపుడా! విజయాభిరాముడా! శరణు కోరుతున్నాను. వాలిని పడగొట్టి సుగ్రీవుని రాజ్యాభిషక్తుని చేసి వానరబలాన్ని ఆదరించినవాడా! లంకను కొల్లగొట్టినవాడా! విశ్వామిత్రుని యాగాన్ని రక్షించినవాడా! అహల్య పాపమును తొలగించినవాడా! రావణాసురుని సంహరించినవాడా! అనేక దివ్యనామములు కలవాడా! శివుని విల్లువిరిచి, సీతమనసుదోచినవాడా! తామరలవంటి కన్నులు కలవాడా! అయోధ్యాపతీ! చెక్కబడిన బిరుదములు కలవాడా! వేంకటాచల నిలయుడా! ప్రణవస్వరూపుడా! సత్యరక్షణ చేయువాడా! నిన్ను శరణు కోరుతున్నాను.

## 77. సాళంగనాట

శరణు శరణు వేదశాస్త్రనిపుణ నీకు
అరుదైన రామకార్యధురంధరా ॥పల్లవి॥

హనుమంతరాయ అంజనాతనయా
ఘనవాయుసుత దివ్యకామరూప

అనుపమలంకాదహన వార్ధిలంఘన
జనసురనుత కలశాపురనివాస ॥శర॥

రవితనయసచివ రావణవనాపహార
పవనవేగబలాఢ్య భక్తసులభ
భువనపూర్ణదేహ బుద్ధివిశారద
జవసత్త్వవేగ కలశాపురనివాస ॥శర॥

సీతాశోకనాశన సంజీవశైలాకర్షణ
ఆతతప్రతాపశౌర్య అసురాంతక
కౌతుక శ్రీవేంకటేశు కరుణా సమేత
శాతకుంభవర్ణ కలశాపురనివాస ॥శర॥

(సం.-2-కీ.-347)

**అర్థము :** వేదశాస్త్రనిపుణ = వేదశాస్త్రములందు పారంగతుడా!, అరుదైన రామకార్య ధురంధరా = అరుదైన రామకార్యములందు నేర్పరీ!, హనుమంతరాయ = అందమైన దవడలు కలవాడా!, అంజనాతనయా = అంజనాదేవికి పుత్రుడా, ఘనవాయుసుత = వాయుదేవుని వరము వల్ల పుట్టినవాడా, దివ్యకామరూప = దివ్యమైన కామరూప సంచారము కలవాడా!, అనుమప = మహా తేజోవంతమైన, లంకాదహన = లంకానగరానికి నిప్పుపెట్టినవాడా!, వార్ధి లంఘన = సముద్రాన్ని దాటిన వాడా!, జన సుర నుత = మానవులు దేవతలచే ప్రశంసలందుకొన్నవాడా!, కలశాపురనివాస = కలశాపురమునందు ప్రీతితో నివసించువాడా! రవి తనయ సచివ = సూర్య పుత్రుడైన సుగ్రీవునికి మంత్రియైన వాడా!, రావణ వనాపహారా =రావణాసురుని అశోకవనాన్ని ధ్వంసంచేసినవాడా! పవన వేగ బలాఢ్య = వాయువేగముతో వెళ్ళగల బలవంతుడా!, భక్తసులభ= భక్తులకు ప్రసన్నుడా, భువనపూర్ణ దేహ = ప్రపంచమంతా నిండినవాడా!, బుద్ధివిశారద = అతులమతి మంతుడా, జవసత్త్వ వేగ = అత్యంత వేగము కలవాడా!, కలశాపురనివాస = కలశాపురంనందు నివసించువాడా! సీతా శోకనాశన = సీతాదేవి దుఃఖాన్ని తొలగించిన వాడా! సంజీవశైలాకర్షణ = సంజీవని పర్వతాన్ని పెకలించినవాడా!, ఆతతప్రతాప శౌర్య = అమోఘమైన ప్రతాప శౌర్యములు కలవాడా!, అసురాంతక = రాక్షసులను అంతమొందించువాడా!, కౌతుక = కౌతుకుడా! శ్రీ వేంకటేశ కరుణాసమేత =శ్రీవేంకటేశ్వరుని కరుణకు పాత్రుడా!, శాత కుంభ వర్ణ కలశాపుర నివాస = ఘనమైన కలశాపురం నందు నివసించువాడా!, నీకు శరణు శరణు! = నీ శరణు కోరుతున్నాను.

**తాత్పర్యము :** వేదశాస్త్రములందు పారంగతుడా!, అరుదైన రామకార్యములందు నేర్పరీ!, అందమైన దవడలు కలవాడా!, అంజనాదేవికి పుత్రుడా, వాయుదేవుని వరము వల్ల పుట్టినవాడా, దివ్యమైన కామరూప సంచారము కలవాడా!, మహా తేజోవంతమైన, లంకానగరానికి నిప్పుపెట్టినవాడా!, సముద్రాన్ని దాటిన వాడా!, మానవులు దేవతలచే ప్రశంసలందుకొన్నవాడా!, కలశాపురమునందు ప్రీతితో నివసించువాడా! సూర్య పుత్రుడైన సుగ్రీవునికి మంత్రియైన వాడా!, రావణాసురుని అశోకవనాన్ని ధ్వంసంచేసినవాడా! వాయువేగముతో వెళ్ళగల బలవంతుడా!,

భక్తులకు ప్రసన్నుడా, ప్రపంచమంతా నిండినవాడా!, అతులమతి మంతుడా, అత్యంత వేగము కలవాడా!, కలశాపురనందు నివసించువాడా! సీతాదేవి దుఃఖాన్ని తొలగించిన వాడా! సంజీవని పర్వతాన్ని పెకలించినవాడా!, అమోఘమైన ప్రతాప శౌర్యములు కలవాడా!, రాక్షసులను అంతమొందించువాడా!, కౌతుకుడా! శ్రీవేంకటేశ్వరుని కరుణకు పాత్రుడా!, ఘనమైన కలశాపురం నందు నివసించువాడా!, నీ శరణు కోరుతున్నాను.

## 78. మాళవిగౌళ

శ్రీపతి పురనాయకా!
జయచింతతాభీష్టదాయకా! ॥పల్లవి॥

వున్నతోన్నతవిగ్రహా దాసోపరిస్థానుగ్రహా
సన్నుతామరసుగ్రహా సామవేదపరిగ్రహా ॥శ్రీపతి॥

జానకీప్రియకారకా శివసాధితాఖిలతారకా
మానుషాహితమారకా మామకాఘనివారకా ॥శ్రీపతి॥

శ్రీవేంకటనాథరూపకా సంచితరఘుకులదీపకా
భావసంతోషప్రాపకా ఆభంగమంజులచాపకా ॥శ్రీపతి॥

(సం.10-కీ.51)

**అర్థము :** శ్రీపతి పురనాయకా = శ్రీపతి నగరానికి అధినాయకుడా! జయ = జయశీలుడా! చింతతాభీష్టదాయకా!= కోరిన కోరికలను ప్రసాదించువాడా!, ఉన్నతోన్నత విగ్రహా = సమున్నత విగ్రహ స్వరూపమా!, దాసోపరిస్థానుగ్రహా= దాసదాసానుజనులపై అనుగ్రహం కలవాడా!, సన్నుత = స్తోత్రంచేయుచున్న, అమర సుగ్రహా = అమరులకు కామితాలనిచ్చువాడా!, సామవేద పరిగ్రహ = సామవేదమును ప్రీతితో ఆలకించువాడా!, జానకీ ప్రియకారకా= సీతాదేవికి ప్రియమైన వాడా!, శివసాధితాఖిల తారకా = శివునిచే సాధించబడిన తారక మంత్రమునకు మూలమైనవాడా!, మానుషాహితమారక = మానవుల కష్టాలను తొలగించువాడా!, మామకఅఘనివారకా = నా పాపాలను నిర్మూలించువాడా!, శ్రీ వెంకటనాథరూపకా = శ్రీ వేంకటపతిరూపంలో శోభిల్లుతున్నదేవా!, సంచిత రఘుకుల దీపకా = రఘుకులంలో జన్మించిన కుల తిలకుడా!, భావ సంతోషప్రాపకా = ఆత్మానందాన్ని ప్రసాదించేవాడా!, అభంగ మంజుల చాపకా = అజేయమైన అందమైన ధనస్సు కలవాడా! నమస్కారము.

**తాత్పర్యము :** శ్రీపతి నగరానికి అధినాయకుడా! జయశీలుడా! కోరిన కోరికలను ప్రసాదించువాడా!, సమున్నత విగ్రహ స్వరూపమా!, దాసదాసానుజనులపై అనుగ్రహం కలవాడా!, స్తోత్రంచేయుచున్న, అమరులకు కామితాలనిచ్చువాడా!, సామవేదమును ప్రీతితో ఆలకించువాడా!, సీతాదేవికి ప్రియమైన వాడా!, శివునిచే సాధించబడిన తారక మంత్రమునకు మూలమైనవాడా!, మానవుల కష్టాలను తొలగించువాడా!, నా పాపాలను నిర్మూలించువాడా!, శ్రీ వేంకటపతిరూపంలో శోభిల్లుతున్నదేవా!, రఘుకులంలో జన్మించిన కుల తిలకుడా!, ఆత్మానందాన్ని ప్రసాదించేవాడా!, అజేయమైన అందమైన ధనస్సు కలవాడా! నమస్కారము.

## 79. మాళవి

శ్రీమన్నారాయణ శ్రీ మన్నారాయణ
శ్రీమన్నారాయణ నీ శ్రీపాదమే శరణు ॥పల్లవి॥

కమలాసతీముఖకమలకమలహిత
కమలప్రియ కమలేక్షణా
కమలాసనహిత గరుడగమన శ్రీ-
కమలనాభ నీపదకమలమే శరణు ॥శ్రీమ॥

పరమయోగిజనభాగధేయ శ్రీ-
పరమపూరుషా పరాత్పరా
పరమాతుమ పరమాణురూప శ్రీ-
తిరువేంకటగిరిదేవ శరణు ॥శ్రీమ॥

(సంపుటం-1-కీ-155)

శ్రీమన్నారాయణ = ఓ! శ్రీనివాసుడా!, నీ శ్రీపాదము శరణు = నీయొక్క లక్ష్మీకరమైన పాదమే శరణు.

కమలాసతీముఖ కమలహిత = లక్ష్మీదేవి మోమునకు ప్రియమైన వాడా!, కమలప్రియ = పద్మమందు ప్రీతికలవాడా!, కమలేక్షణా = పద్మమువంటి కన్నులు కలవాడా! కమలాసన హిత = పద్మాసన ప్రియుడా!, గరుడగమన = గరుడునిపై విహరించువాడా!, శ్రీకమలనాధ = పద్మనాభుడా!, నీపదకమలమే శరణు = నీపద పద్మమును శరణు వేడుతున్నాను.

పరమ యోగిజన భాగధేయ = పరమయోగులకు భాగ్యమైన వాడా!, పరమ పురుషా = పరమ స్వరూపుడా!, పరాత్పరా = మోక్షస్వరూపుడా!, పరమాతుమా = పరమాత్మ స్వరూపుడా!, పరమాణురూపు = సూక్ష్మస్వరూపుడా!, శ్రీ తిరువేంకట గిరిదేవ శరణు = ఓ! శ్రీవేంకటాచలపతీ శరణువేడుతున్నాను.

**తాత్పర్యం :** ఓ! శ్రీమన్నారాయణా! నీ లక్ష్మీకరమైన దివ్య పాదమును శరణని ఆశ్రయిస్తున్నాను. లక్ష్మీదేవియందు ప్రీతికలవాడా! పద్మమును ప్రీతితో ధరించువాడా! పద్మాలవంటి కన్నులు కలవాడా! పద్మాసనప్రియుడా! గరుడ గమనుడా! పద్మనాభుడా! నీపాదపద్మాన్ని ఆశ్రయిస్తున్నాను. పరమయోగులకు భాగ్యమైన వాడా! పరమస్వరూపుడా! మోక్షస్వరూపుడా! పరమాత్మ స్వరూపుడా! సూక్ష్మస్వరూపుడా! ఓ! శ్రీవేంకటాచలపతీ! శరణువేడుతున్నాను.

## 80. ముఖారి

శ్రీశోయం సుస్థిరోయం
కౌశికమఖరక్షకోయం ॥పల్లవి॥

నిగమనిధినిర్మలోయం
జగన్మోహనసతీపతిం-

విగతభయోయం విజయసఖోయం
భృగుమునినా సంప్రీతోయం ॥శ్రీశో॥

సకలపతి శ్శాశ్వతోయం
శుకముఖమునిజనసులభోయం
ప్రకటబహుళశోభనాధికోయం
వికచరుక్మిణీవీక్షణోయం ॥శ్రీశో॥

సరసోయం పరిసరప్రియోయం
తిరువేంకటాధిపోయం
చిరంతనో యం చిదాత్మకో యం
శరణాగతవత్సలో యం ॥శ్రీశో॥

(సంపుటం-1-కీ-264)

శ్రీ శోయం = లక్ష్మీయుతుడైన వాడు, సుస్థిరోయం = శాశ్వతుడు, కౌశిక మఖ రక్షకోయం = విశ్వామిత్రుని యాగాన్ని రక్షించినవాడు.

నిగమనిధి నిర్మలోయం = వేదములకు మూలమైన వాడు, నిర్మలుడు జగన్మోహన సతీపతిం= సౌందర్యవతియైన లక్ష్మీదేవికి పతియైనవాడు, విగత భయోయం = సంసార భయానికి దూరమైన వాడు, విజయసఖోయం = అర్జునిడికి మిత్రుడైనవాడు, భృగుమునినా సంప్రీతోయం= భృగుమునికి ప్రసన్నుడైన వాడు.

సకలపతి = సకలమైన ప్రపంచానికి నాథుడు, శాశ్వతోయం = శాశ్వతమైన వాడు, శుకముఖ ముని జనసులభోయం = శుకాది మునిజనులకు సులభుడు, ప్రకట బహుళ శోభనాధికోయం = సృష్టిలోని అందాల సుందరుడు, వికచ రుక్మిణీ వీక్షణోయం = రుక్మిణి దేవి కన్నులకు కాంతియైనవాడు.

సరసోయం = సరసమైనవాడు, పరిసరప్రియోయం = విహారాసక్తుడు, తిరువేంకటాధిపోయం= శ్రీ వేంకటాచలాధీశుడు, చిరంతనోయం = ఆదిమూలమైన వాడు, శరణాగతవత్సలోయం = ఆశ్రితులపట్ల వాత్సల్యం కలవాడు.

**తాత్పర్యం :** లక్ష్మీ సమేతుడు. శాశ్వతుడు, విశ్వామిత్రుని యాగాన్ని రక్షించిన వాడు, వేదములకు మూలమైనవాడు, నిర్మలుడు, సుందరమైన లక్ష్మీదేవికి నాథుడు, సంసార భయానికి అతీతుడు, అర్జునుడికి మిత్రుడైనవాడు, భృగుమునికి ప్రీతిపాత్రుడు, సకల ప్రపంచానికి నాథుడు, శాశ్వతమైనవాడు, శుకాది మునిజనులకు సన్నిహితుడు, సృష్టిలోని అందాల సుందరుడు, రుక్మిణిదేవి కన్నులకాంతి స్వరూపుడు, సరసుడు, విహారాసక్తుడు, శ్రీవేంకటాచలాధీశుడు, ఆదిమూలమైన వాడు, ఆశ్రితులపట్ల వాత్సల్యం కలవాడైన శ్రీవారికి నమస్కారము.

## 81. భైరవిరాగం

శ్రీహరి! నిత్య! శేషగిరీశ!
మోహనాకార! ముకుంద! నమో శ్రీహరి ॥పల్లవి॥

దేవకీసుత దేవ వామన
గోవిందా! గోపగోపీనాథా! శ్రీహరి
గోవర్ధనధర! గోకులపాలక!
దేవేశాధిక! తే నమో నమో ॥శ్రీహరి॥

సామజావన! శార్ఙ్గపాణి!
వామనా! కృష్ణ! వాసుదేవా! శ్రీహరి!
రామనామ! నారాయణ! విష్ణో!
దామోదర శ్రీధర నమో నమో ॥శ్రీహరి॥

పురుషోత్తమ పుండరీకాక్ష
గరుడధ్వజ కరుణానిధి, శ్రీహరి
చిరంతనాచ్యుత శ్రీవేంకటేశ
నరమృగ తే నమో నమో ॥శ్రీహరి॥

సం.-3-కీ.-527

**అర్థము:** శ్రీహరి! = శ్రీహరీ!, నిత్య! = శాశ్వతుడా!, శేషగిరీశ = శేషాద్రిపై వెలసిన స్వామీ!, మోహనాకార! = మోహనమైన ఆకారముగలవాడా, ముకుంద = ముకుందుడా, నమః = నమస్కారములు. దేవకీసుత = దేవకీనందనా!, దేవ = తేజస్స్వరూపుడా!, వామన = వామనావతారుడా!, గోవింద = గోవిందుడా!, గోపగోపీనాథ = గోప గోపీజనవల్లభుడా!, గోవర్ధనధర = గోవర్ధనధారీ!, గోకులపాలక = గోకులమును పాలించువాడా!, దేవేశ = దేవాధిదేవా!, అధిక = సర్వాధికుడా!, తే = నీకు, నమో నమో = నమస్కారము నమస్కారము. సామజావన = గజేంద్రుని కాపాడినవాడా!, శార్ఙ్గపాణి = శార్ఙ్గమనుపేరు గల ధనుస్సును చేతదాల్చినవాడా!, వామన = వామనుడా!, కృష్ణ = శ్రీకృష్ణా!, వాసుదేవ = వాసుదేవుడా!, శ్రీహరి = శ్రీహరీ!, రామనామ = రాముడను నామము గలవాడా!, నారాయణ = నారాయణుడా!, విష్ణో = విష్ణుమూర్తీ!, దామోదర = దామోదరుడా!, శ్రీధర= శ్రీధరుడా!, నమో నమో = నమస్కారము నమస్కారము.

పురుషోత్తమ = క్షరాక్షరాతీతుడా!, పుండరీకాక్ష = తెల్లదామరలవంటి కన్నులు కలవాడా!, గరుడధ్వజ = గరుడకేతనుడా!, కరుణానిధీ = కరుణ కలనిధియైన వాడా!, శ్రీహరీ = శ్రీహరీ!, చిరంతన = చిరంతనుడా!, అచ్యుత = అచ్యుతుడా!, శ్రీవేంకటేశ = శ్రీవేంకటేశ్వరుడా!, నరమృగ = నరసింహాకృతి!, తే = నీకు, నమో నమో = నమస్కారము నమస్కారము.

**తాత్పర్యము** : శాశ్వతశేషగిరీశ్వరుడైన శ్రీహరీ! మోహనాకారముగలవాడా! ముకుందుడా! నీకు నమస్కారము. దేవకీనందనుడవై జన్మించినవాడా! తేజఃస్వరూపుడా! వామనావతారుడా! గోవిందుడా! గోపగోపీనాథుడా! గోవర్ధనమును ధరించి గోకులమును పాలించినవాడా! దేవాధిదేవా! సర్వాధికా! నీకు నమస్కారము. గజేంద్ర వరదుడా! శార్ఙ్గధరుడా! వామదేవా! శ్రీహరీ! రామనామముగలవాడా! నారాయణుడా! విష్ణూ! దామోదరా! శ్రీధరా! నమస్కారము. పురుషోత్తమా! తెల్లదామరలవంటి కన్నులు కలవాడా! గరుడ కేతనుడా! కరుణానిధీ! చిరంతనుడా! అచ్యుతుడా! శ్రీవేంకటేశ్వరుడా! నరసింహాకృతి కలిగిన శ్రీహరీ నీకు నమస్కారము.

## 82) నాదరామక్రియ

సకలం హేసఖి జానామి తత్
ప్రకటవిలాసం పరమం ధత్సే ॥పల్లవి॥

అలిక మృగమదమయ మషీకలనో
జ్జ్వలతాం హేసఖి జానామి
లలితం తవ పల్లవిత మనసి ని
శ్చలతర మేఘశ్యామం ధత్సే ॥సకలం॥

చారుకపోల స్థల కరాంచిత వి
చారం హేసఖి జానామి
నారాయణ మహినాయకశయనం
శ్రీరమణం తవచిత్తే ధత్సే ॥సకలం॥

ఘనకుచశైలాగ్రస్థిత విధుమణి
జననం హేసఖి జానామి
కనదురసా వేంకటగిరి పతే
ర్వినుత భోగసుఖ విభవం ధత్సే ॥సకలం॥

సంపుట-5-కీ.-22

**అర్థము** : హేసఖి = ఓనెచ్చెలీ!, సకలం = అంతయు, జానామి = ఎఱుగుదును, పరమం = పరమమయిన, తత్ = స్వామి యొక్క, ప్రకట = వెల్లడియైన, విలాసం = విలాసమును, ధత్సే = ధరించుచున్నావు.

హేసఖి = ఓ నెచ్చెలీ!, అళీకమృగమదమయ మషీకలనోజ్జ్వలతాం, అళీక = అసత్యమైన, మృగమదమయ = కస్తూరీమయమైన, మషీకలన = మసిని అలది కొనుట చేత గలిగిన, ఉజ్జ్వలతాం = మిలమిలలాడుటను, జానామి = ఎఱుగుదును, తవ = నీయొక్క, పల్లవితమనసి = చిగురించిన మనస్సునందు, లలితం = సుందరమైన, నిశ్చలతర = ఎంత మాత్రము కదలకయున్న, మేఘశ్యామలం = మేఘశ్యామలవర్ణుని, ధత్సే = ధరించుచున్నావు.

హేసఖి = ఓ నెచ్చెలీ!, తే = నీ యొక్క, చారుకపోలస్థల కరాంచిత విచారం = అరచేతిని చెక్కిట జేర్చుకొని నీవు చేయుచున్న తలపోతలు, జానామి = నేనెఱుగుదును. అహినాయక శయనం = శేషశయనుడును, శ్రీరమణం = శ్రీరమణుడైన, నారాయణం = నారాయణుని, తవ చిత్తే = నీ మనస్సునందే, ధత్సే = ధరించుచున్నావు.

ఘనకుచశైలాగ్రస్థితి = ఉన్నతమైన చనుగట్టుపైనున్న, చంద్రకాంతమణి (చంద్రుని ఆకారములోనున్న నఖక్షతము) యొక్క, జననం = పుట్టుపూర్వోత్తర మును, హేసఖి = ఓ నెచ్చెలీ, జానామి = నేనెఱుగుదును. కనదురసా = మెఱయుచున్న హృదయస్థలముతో, వేంకటగిరిపతేః = శ్రీవేంకటగిరి నాథునియొక్క, వినుత భోగసుఖ విభవం = సంభోగసుఖవైభవమును, ధత్సే = ధరిస్తున్నాను.

**తాత్పర్యము** : ఓ నెచ్చెలీ! నీవేమీ చెప్పకు, నాకు అంతా తెలుసును. ఆ స్వామి చేతలు, ఆ చేతలకు నీవు స్పందించిన తీరు అన్నీ నిన్ను చూడగానే నాకు అవగతమయిందిలే.

ఓ నెచ్చెలీ! నీవు కస్తూరి పూసుకొని మిలమిలలాడుతున్నట్లు పైకి కనిపిస్తున్నావు! నీరహస్యమంతయు నేనెఱుగుదును! చిగిర్చిన నీ మనస్సునుండి ఎంత మాత్రము కదలని పరతత్త్వమైన ఆ మేఘశ్యామలుని ధరించియున్నావు.

చెక్కిట చేతిని ఉంచుకొని నీవు చేయుచున్న నీ తలపోతలన్నియు నాకు తెలుసు. శేషశయనుడును, శ్రీరమణుడునైన శ్రీమన్నారాయణుని నీ చిత్తమునందు ధరించుచున్నావు.

నీ పయ్యెదపై నెలకొన్న హరినీలమణి యొక్క పుట్టుపూర్వోత్తరము నాకు తెలుసు. మెఱయుచున్న హృదయముతో శ్రీవేంకటగిరినాథుని యొక్క సంభోగ సుఖవైభవమును ధరిస్తున్నావు.

## 83. సామంతం

సతతం శ్రీశం
హితం పరాత్పర మీడే ॥పల్లవి॥

గదాధరం మేఘగంభీర ని-
నదం పరమోనుతశుభదం
మృదుతరగమనం మేదినీధరం
హృదయనిలయ మహ మీడే ॥సత॥

నందకధరం జనార్దనం గో-
విందం చారుముకుందం
నందగోపవరనందనకందం
యిందురవినయన మీడే ॥సత॥


KUCHi

గరుడగమన మురగశయన మధికం
పరమపదేశం పావనం
తిరువేంకటగిరిదేవ మతులం మ-
హిరమణం స్థిర మీడే ॥సత॥

సంపుటం-1-కీ-165

సతతం = ఎల్లప్పుడూ, శ్రీశం = లక్ష్మీనాధుడైనవానిని, హితం = రక్షకుడైన వానిని, పరాత్పరం = పరాత్పరుని, ఈడే = ప్రార్థిస్తున్నాను.

గదాధరం = కౌమోదకీగదాధరుని, మేఘ గంభీరనినదం = మేఘగర్జనలా గంభీరంగా పలుకువానిని, పరమోన్నత శుభదం = అత్యున్నతమైన శుభాలను ఇచ్చువానిని, మృదుతర గమనం = మృదువైన నడవడిక గలవానిని, మేదినీధరం = భూదేవి ధరించిన వానిని, హృదయ నిలయ = హృదయమందు నివసించువానిని, అహం = నేను, ఈడే = ప్రార్థిస్తున్నాను.

నందకధరం = నందకమనే ఖడ్గాన్ని దాల్చినవానిని, జనార్దనం = జనార్దనుని, గోవిందం = ఇంద్రియాలను పాలించువానిని, చారుముకుందం = అందమైన ముకుందుని, నందగోప వరనందనకందం, నందగోపుని వరపుత్రుడైన మేఘవర్ణుని, ఇందురవినయన= సూర్యచంద్రులని కన్నులుగా కలవానిని, ఈడే = ప్రార్థిస్తున్నాను.

గరుడగమన = గరుడునిపై విహరించువానిని, ఉరగశయన = శేషుని పై శయనించువానిని, అధికం = ఉన్నతుని, పరమపదేశం = పరమమైన మోక్ష స్వరూపుడు, పావనం = పావన రూపుడు, తిరువేంకటగిరి దేవం= శ్రీవేంకటేశ్వరుని, అతులం = అత్యధికుని, మహీరమణం = భూ రమణుని, స్థిరం = స్థిరమైనవానిని, ఈడే = స్తోత్రం చేస్తున్నాను.

**తాత్పర్యం :** ఎల్లప్పుడూ లక్ష్మీనాథుడై, రక్షకుడై, మోక్ష స్వరూపుడైన స్వామిని ప్రార్థిస్తున్నాను. కౌమోదకీగదాధరుని, మేఘ గర్జనలా గంభీరంగా పలుకువాని, మహోన్నత శుభాలను ప్రసాదించువాని, మృదువైన నడకకలవానిని, భూమిని ధరించినవానిని, హృదయమందు నివసించువానిని - నేను ప్రార్థిస్తున్నాను. నందకమనే ఖడ్గాన్ని దాల్చినవానిని, జనార్దనుని, ఇంద్రియాలను పాలించువానిని, సుందరమైన గోవిందుని, యశోద వరపుత్రుడైన అందమైన మేఘవర్ణుని, సూర్యచంద్రులని కన్నులుగా కలవానిని ప్రార్థిస్తున్నాను. గరుడినిపై విహరించు వానిని శేషునిపై శయనించువానిని, ఉన్నతమైన వానిని, పరమోక్షస్వరూపుని, పావన రూపుడైన వేంకటేశ్వరుని, భూదేవతా రమణుని, శాశ్వతుని ఆశ్రయిస్తున్నాను.

## 84. పాడి

సదయ మానససరోజాత మాదృశ వశం
వద ముదాహం త్వయా వంచనీయా కిమ్ ॥పల్లవి॥

జలధికన్యా పాంగ చారు విద్యుల్లతా
వలయ వాగురి కాంత వనకురంగ

లలితభవ దీక్షా విలాస మనసిజబాణ
కులిశపాతై రహం క్షోభణీయా కిమ్ ॥సదయ॥

ధరణీవధూ పయోధర కనకమేదినీ
ధరశిఖర కేలితత్పర మయూర
పరమ భవదీయ శోభనవదనచంద్రాంశు
తరణికిరణై రహం తాపనీయా కిమ్. ॥సదయ॥

చతురవేంకటనాథ సంభావయసి సం
ప్రతి యథా తత్ప్రకారం విహాయ
అతిచిర మనాగత్య హంత సంతాపకర
కితవకృత్యై రహం ఖేదనీయా కిమ్. ॥సదయ॥

(సం-6-కీ-162)

అర్థము : సదయ మానస సరోజాత మాదృశ వశం = దయాజలంతోకూడిన, మానసమనే సరోవరానికి పద్మం వంటివాడా, మాదృశవశం = నాలాంటి వారికి వశమగు నట్లుగా, ముదా = సంతోషముగా, వద = చెప్పుము, త్వయా = నీచేత, అహం = నేను, వంచనీయా కిం = మోసగించదగిన దానినా,

జలధికన్య = లక్ష్మీదేవి యొక్క, అపాంగ = క్రీగంటి చూపులనే, చారువిద్యుల్లతా = అందమైన మెరుపు తీగలయొక్క వలయాలు కలిగిన, వలయ వాగురికాంత వనకురంగ = వలలోపల ఉన్న అడవి లేడి వంటివాడా! లలిత = మనోజ్ఞమైన, భవత్ = నీయొక్క, ఈక్షా = చూపులే, విలాస = విలాసముగా కలిగినవాడా!

మనసిజ బాణ కులిశపాతై = మన్మథ బాణములనే వజ్రపాతముల యొక్క, అహం = నేను, క్షోభనీయాకిం= కలవరపెట్టదగిన దానినా ఏమి?, ధరణీ వధూపయోధర కనక మేదినీ ధర శిఖర కేలితత్పర మయూర! = భూకాంతామణి యొక్క పాలిండ్లకే బంగారు పర్వత శిఖరమందు క్రీడించుచున్న నెమలీ స్వరూపుడా!, పరమ= మోక్ష స్వరూపుడా!, భవదీయ శోభన చంద్రాంశు తరణికిరణైః = నీయొక్క అందమైన మోము అనే చంద్రుని యొక్క కిరణములనే సూర్యకిరణాలచేత, అహం = నేను, తాపనీయా కిం = తపించ చేయదగిన దానినా ఏమి? చతుర వేంకటనాథ = ఓ గడసరివాడవైన శ్రీనివాసా! సంప్రతి =ఇప్పుడు, మాధా = ఏ విధముగా తగినదో, తత్= ఆవిధంగా, విహాయ = విడిచి, అతిచిరం = ఆలస్యాన్ని, అనాగత్య = రాకుండా, సంభావయసి = నన్ను ఆదరించగలవు, హంత = ఎంతకష్టం. సంతాపకర = సంతాపమును కలిగించువాడా! కితవకృత్యైః = మోసపు పనులచే, అహం = నేను ఖేదానీయా కిం = బాధ పెట్టతగిన దానినా!

## 85. దేశాక్షి

సీతాశోక విఘాతకవో-
పాతాళలంకాపతి విభాళ! ॥పల్లవి॥


KUCHI

హనుమంతరాయ! అంజనీతనయ! ఓ
వనధిలంఘనగాత్ర! వాయుపుత్రా!
ఇనకులాధిపనిజహిత! జగన్నుత-
వనజోదరసేవక సత్త్వధనికా! ॥సీతా॥

ప్రళయాంతకరూప! బలదీప! రవిఫల-
గిళన ప్రతాప! సుగ్రీవప్రియా!
కుళక దానవసంకులవిదారణ !
భళిభళి! జగత్పతిబలుబంటా! ॥సీతా॥

పంకజాసను దివ్యపదవైభవ! వో
లంకిణీ ప్రాణవిలంఘున!
వేంకటేశ్వరసేవావీర! మహాధీర!
కింకరరాయ! సుఖీభవా! ॥సీతా॥

(సంపు.-1-కీ.-366)

**అర్థం** : సీతాశోకవిఘాతక = సీతాదేవియొక్క శోకమును నశింపజేసినవాడా!, పాతాళ లంకాపతి = మైరావణుని, విభాళ = సంహరించినవాడా.

హనమంతరాయ = హనుమంతరాయుడా, అంజనీతనయ = అంజనీకుమార!, వనధి లంఘన గాత్ర = సముద్రమును దాటిన శరీరప్రమాణము గలవాడా!, వాయుపుత్ర = వాయుపుత్రుడా!, ఇనకులాధిప నిజహిత = సూర్యకులాధిపుడైన శ్రీరామచంద్రునకు ఆత్మీయుడవైన హితుడా, జగన్నుత = లోక వినుతుడా, వనజోదరసేవక = శ్రీమన్నారాయణాంశమైన శ్రీరామచంద్రునకు సేవకుడా, సత్త్వధనిక = సత్త్వ సమృద్ధి యనెడి ధనసమృద్ధి గలవాడా!

ప్రళయాంతకరూప = ప్రళయకాలమునందలియముని స్వరూపము వంటి స్వరూపము గలిగినవాడా, బలదీప = బలప్రదీపుడా! రవిఫల = సూర్యుడేయనెడి పండును, గిళన = మ్రింగిన, ప్రతాప = ప్రతాపము గలవాడా!, సుగ్రీవప్రియ = సుగ్రీవునకు ప్రియుడా!, కుళక = గుంపులుగాయున్న, దానవసంకుల = రాక్షససం కులమును, విదారణ = చీల్చినవాడా!, భళిభళి = సాధు సాధు, జగత్పతి = సకల జగన్నాథుడైన శ్రీరామునియొక్క, బలుబంటా = మేలిమి బంటా.

పంకజాసన = బ్రహ్మయొక్క, దివ్యపద = దివ్యపదవి యొక్క, వైభవ = వైభవముగలవాడా, లంకిణీప్రాణ విలంఘున = లంకాధి దేవత యొక్క ప్రాణములను లంఘించినవాడా!, వేంకటేశ్వర సేవావీర = శ్రీవేంకటేశ్వర స్వామి యొక్క సేవయందు, వీరవ్రతము కలవాడా!, కింకరరాయ = స్వామి కింకరులలో మొనగాడా! సుఖీభవ = సుఖముగానుండుము.

**తాత్పర్యము:** సీతాదేవి యొక్కశోకమును నశింపజేసినవాడా!, మైరావణుని సంహరించినవాడా!,

హనుమంతుడా, అంజనీతనయుడా, సముద్ర లంఘనము చేసిన శరీర ప్రమాణము గలవాడా! వాయుపుత్రుడా, శ్రీరామచంద్రునకు హితుడా, లోక వినుతుడా! కమలోదరాంశమైన శ్రీరామచంద్రుని సేవకుడా! సత్త్వసంపన్నుడా!

ప్రళయాంతక స్వరూపుడా! బలప్రదీపా! సూర్యుని ఫలమని తలచి మ్రింగునంతటి ప్రతాపము కలవాడా, గుంపులుగుంపులుగానున్న రాక్షస సంకులమును నశింపజేయువాడా! జగత్పతియైన శ్రీరామచంద్రుని మేలిబంటా!

రానున్న బ్రహ్మపదవీ వైభవము గలవాడా! లంకిణీ ప్రాణములను లంకించు కొన్నవాడా! శ్రీవేంకటేశ్వర సేవయందు వీరావేశము కలవాడా! గొప్ప గుండె నిబ్బరముగలవాడా! స్వామి కింకరులలో విశిష్టమైనవాడా! సుఖముగా వర్ధిల్లుము.

## 86) లలిత

సుముఖ! మంగళం శుభమంగళం
శమదమగత! తే జయమంగళం ॥పల్లవి॥

గంభీరగుణ! కమలారమణా
శంభురాణినుత సకలలోకయుత!
మాం భజతే తే జయమంగళం
అంభోధిశయన! హరినయన! ॥సుముఖ॥

కనకాంబర! నిజఘన చరణాంబర
దనుజశరణ హతదైత్యగణా
అనుపమచరిత ! అనంతనిరత
సనకప్రియ! తే జయ మంగళం ॥సుముఖ॥

చతుర్భుజాంగా! సదయా పాంగా
గతనక్రాంబుజకర చక్ర!
శ్రిత శరణాగత శ్రీవేంకటపతి
చతుర! నమోతే జయమంగళం ॥సుముఖ॥ (సం.-16-కీ.-419)

**అర్థము** : సుముఖ = ప్రసన్నవదనుడా!, మంగళం = నీకు మంగళము!, శమదమగత = శమదమములచేత పొందబడినవాడా!, తే = నీకు, జయ మంగళం = జయ మంగళము.

గంభీరగుణ = లోతైన గుణములు గలవాడా! కమలారమణా = లక్ష్మీరమణా ! జయ మంగళం = జయ మంగళం, శంభురాణినుత = పార్వతీదేవి చేత నుతింపబడిన వాడా!, సకలలోకయుత =

సకలలోకములతో కూడినవాడా, అంబోధి శయన = సముద్రము నందు శయనించినవాడా!, హరినయనా = సూర్యనయనుడా!, మాం = లక్ష్మీదేవిని, భజతే = కూడియున్న, నీ కొఱకు, జయ మంగళం = జయ మంగళము.

చతుర్భుజాంగా = నాలుగు భుజములు గల శరీరము గలవాడా!, సదయాపాంగా = కరుణాపూర్ణములైన కటాక్షములు కలవాడా! గతనక్ర = గతించిన మొసలిగల, అంబుజకర = అంబుజమువంటి కరమునందలి, చక్రా = చక్రాయుధము గలవాడా!, శ్రిత శరణాగత = ఆశ్రయించిన శరణాగతులు కలవాడా!, శ్రీవేంకటపతి = శ్రీవేంకటపతీ!, చతుర = నేర్పరీ, తే = నీకు, నమః = నమస్కారము, జయ మంగళము = జయ మంగళము.

**తాత్పర్యము** : ప్రసన్నవదనుడా, శ్రమదమములచేత పొందబడినవాడా నీకు మంగళము జయ మంగళము.

గంభీరగుణములు గలవాడా!, లక్ష్మీరమణుడా, పార్వతీదేవి చేత కీర్తించబడిన వాడా! సకలలోకములతో గూడినవాడా! సముద్రము నందు శయనించినవాడా! సూర్యనయనుడా! లక్ష్మీదేవిని ఎనసియున్నవాడా! నీకు మంగళము జయ మంగళము.

నాలుగు భుజములు గల శరీరము గలవాఁడా! కరుణాపూర్ణములైన కటాక్షములుగలవాడా! అంబుజమువంటి కరమునందు చక్రాయుధము గలవాడా!, ఆశ్రయించిన శరణాగతులు గలవాడా!, శ్రీవేంకటపతీ ఓ నేర్పరీ! నమస్కారము, నీకు మంగళము జయ మంగళము.

## 87. సాళంగనాట

సేవే భావే శ్రీ బృందం
శ్రీవల్లభ చింతానందం ॥పల్లవి॥

పటుకుతర్కనగ భంజన దీక్షం
కుటిల దురితహరగుణ దక్షం
ఘటిత మహాఫల కల్పకవృక్షం
చటుల రామానుజ శమదమభిక్షం ॥సేవే॥

కృద్ధమృషామత కుంఠన కుంతం
బౌద్ధాంధకార భాస్వంతం
శుద్ధవేదమణి సుసరస్వంతం
సిద్ధాంతీకృత చిన్మయకాంతం ॥సేవే॥

చార్వాకగహన చండకుఠారం
సర్వాపశాస్త్ర శతధారం

నిర్వికారగుణ నిబిడ శ్రీవేంక
టోర్వీధర సంయోగ గభీరం ॥సేవే॥

(సం.15-కీ.175)

**అర్థము :** శ్రీవల్లభ = శ్రీకాంతుని, చింతానందం = చింతనను చేయుటలో ఆనందాన్ని, భావే = భావిస్తున్నాను. పటుకుతర్కనగ భంజనదీక్షం = కుత్సితమైన తర్కములనే కొండలను పగుల కొట్టుటయందు దీక్ష కలవారిని, కుటిల = వక్రగతి కలిగిన, దురిత హర = పాపములను తొలగించే, గుణదీక్ష = సద్గుణముల దీక్ష కలవారిని, ఘటిత మహాఫల కల్పకవృక్షం = కల్పవృక్షమువంటి మహాఫలాలను అనుగ్రహిస్తున్న, చటుల రామానుజ శమదమభిక్షం = విస్తారమైన రామానుజల శమదమగుణాదులను భిక్షగా అనుగ్రహిస్తున్న వారిని, కృద్ధమ్మృషామత కుంఠన కుంతం = ఆగ్రహించిన మాయావాదులకు కుఠారమైన వారిని, బౌద్ధాంధకార భాస్వంతం = బౌద్ధమనే అంధకారమును తొలగించే తేజోవంతమైన, శుద్ధ వేదమణి సుస్వరస్వంతం = శుద్ధమైన వేదమణి కాంతులీనే ఆధ్యాత్మిక తేజః పుంజానికి, చిన్మయకాంతం = చిన్మయత్వాన్ని ప్రకాశింపజేసినవారికి, చార్వాక గహన చండ కుఠారం = గహనమైన చార్వాకమనే నాస్తిక వాధానికి ప్రచండ కుఠారం వంటి వారికి, సర్వాపశాస్త్ర శతధారం = తప్పుడు శాస్త్రములకు ఎత్తిన కత్తివంటివారు, నిర్వికారగుణ నిబిడ = ఎటువంటి సంసార వికారములేని గుణములతో నిండిన వారు, శ్రీవేంకటోర్వీధర సంయోగ గభీరం= శ్రీ వేంకటనగ సంయోగంతో కూడిన గభీరములైన, శ్రీ బృందం = లక్ష్మీబృందాన్ని, సేవే = సేవిస్తున్నాను.

**తాత్పర్యం :** శ్రీకాంతుని చింతనను చేయుటలో ఆనందాన్ని భావిస్తున్నాను. కుత్సితమైన తర్కములనే కొండలను పగుల కొట్టుటయందు దీక్ష కలవారిని, వక్రగతి కలిగిన, పాపములను తొలగించే, సద్గుణముల దీక్ష కలవారిని, కల్పవృక్షమువంటి మహాఫలాలను అనుగ్రహిస్తున్న, విస్తారమైన రామానుజల శమదమగుణాదులను భిక్షగా అనుగ్రహిస్తున్న వారిని, ఆగ్రహించిన మాయావాదులకు కుఠారమైన వారిని, బౌద్ధమనే అంధకారమును తొలగించే తేజోవంతమైన, శుద్ధమైన వేదమణి కాంతులీనే ఆధ్యాత్మిక తేజః పుంజానికి, చిన్మయత్వాన్ని ప్రకాశింపజేసినవారికి, గహనమైన చార్వాకమనే నాస్తిక వాధానికి ప్రచండ కుఠారం వంటి వారికి, తప్పుడు శాస్త్రములకు ఎత్తిన కత్తివంటివారు, ఎటువంటి సంసార వికారములేని గుణములతో నిండిన వారు, శ్రీ వేంకటనగ సంయోగంతో కూడిన గభీరములైన, లక్ష్మీబృందాన్ని, సేవిస్తున్నాను.

## 88. కన్నడగౌళ :

హరి రసమవిహారి స తు
సరసోయం మమ శ్రమసంహారీ ॥పల్లవి॥

దయానివృతతనుధారీ సం
శయాతిశయసంచారీ
కయా ప్యజితవికారీ ॥హరి॥

క్రియావిముఖ కృపాణధారీ
సదా మిథ్యాజ్ఞానీ స తు
మదాలిమతాభిమానీ
తదాశ్రితసంధానీ స తు ॥హరి॥

తదా తదా చింతాశయనాని
పరామృతసంపాదీ
స్థిరానందాస్వాదీ
వరాలాపవివాదీ శ్రీ
తిరువేంకటగిరి దివ్యవినోదీ ॥హరి॥

సంపుటం-6-కీ-45

హరిః = శ్రీనివాస స్వామి, అసమ విహారి = సాటిలేని వేడుకగా తిరుగు వాడు. సతు అయం = ఆ ఈతడు, సరస = సరసమైన వాడు, మమ = నాయొక్క, శ్రమసంహారీ= శ్రమను పోగొట్టేవాడు.

దయానివృత తనుధారీ = దయచేతను నిండిన శరీరమును ధరించినవాడు, సంశయాతి శయ సంచారీ = సందేహములకు తావులేని గొప్ప సంచారము కలవాడు. (పదనృత్యంతో ఎక్కువ పదన్యాసాలు చేస్తున్నప్పుడు, ఇది ఈపదన్యాసమని గుర్తింపలేని సంచారము కలవాడు), కయాపి = ఏ గోపిక చేతనో, అజితవికారీ = జయింప లేని మార్పులు కలవాడు (నిర్వికారుడు), క్రియావిముఖ కృపాణధారీ = నృత్యం చేయు నప్పుడు తన నందక ఖడ్గాన్ని స్పృశించకుండా ధరించినవాడు.

సదా = ఎల్లప్పుడూ, మిథ్యా జ్ఞానీ = మాయను తెలుసుకొన్నవాడు, సతు = ఆయన, మదాలిమతాభిమాని = మదించినటువంటి సతులయొక్క మతమును ఇష్టపడు వాడు, తదాశ్రిత సంధానీ = ఆశ్రయించిన భక్తులకు తన రక్షణ ఇచ్చేవాడు, సతు = ఆశ్రీహరి, తదా తదా = ఆయా సమయాల్లో, చింతా శయనాని = విచారములను తొలగించు వాడు, పరామృతసంపాది = ఉన్నతమైన అమృతాన్ని ఇచ్చువాడు (ముక్తిని ప్రసాదించువాడు), స్థిరానందాస్వాది = బ్రహ్మానందమును ఆస్వాదించువాడు, వరాలాప వివాది = చక్కని సంభాషణలు చేయువాడు, శ్రీ తిరుపతి వేంకటగిరి దివ్య వినోది = తిరుపతి వేంకటగిరిపై విహరిస్తున్నవాడైన శ్రీ వేంకటేశ్వరస్వామి.

సాటిలేని వేడుకతో తిరుగువాడు, సరసమైన వాడు, నా శ్రమను తొలగించువాడు, దయచేత నిండిన శరీరము కలవాడు, సంశయములు లేని గొప్ప నాట్యము చేయువాడు, మాయను తెలుసుకొన్నవాడు, మదవతులను వారి అభిమతాలను ఆదరించు వాడు, విచారములలో నున్న ఆశ్రిత భక్తులను పరిరక్షించువాడు, ముక్తిని ప్రసాదించువాడు, బ్రహ్మానందాస్వాద రూపుడు, దివ్యసంభాషణలు చేయు నేర్పరి అయిన శ్రీ వేంకటేశ్వర స్వామి తిరుపతి వేంకటాచల దివ్య వినోదిగా శోభిల్లుతున్నాడు.

**విశేషాంశము :** దివ్య విశేషణాలతో కూడిన ఈ హరికీర్తన చరణాంత్య ప్రాసలతో విలక్షణంగా అలరారుతున్నది. శ్రీనివాసునియొక్క దివ్యలీలలు ఇక్కడ వర్ణించబడు తున్నాయి.



డా॥ ఆకెళ్ళ విభీషణశర్మ

## 89. మాళవిరాగం

హా! సమీచీన ముపహాసంతే
దాసై ప్రకాశితం దరదంతు లోకే ॥పల్లవి॥

ద్వారకా పట్టణే త్వం పురా చస్వయంక్షితశ్చ స్త్రియః
కేశముష్టిః కథం సారస కుర్వంతి సరసవేళాయాం ॥హా! సమీ॥

వరశిశోర్రక్షణే త్వం పురా చ అహం బ్రహ్మచారీ అథతడాచేత
గోపతరుణయః కిమితి వా తద్వసంతి త్వాం ॥హా! సమీ॥

బృందావనే త్వం పురా చశ్రియా వేంకటాద్రౌ ఇహ
నిర్విభాసి ఇదం చిత్తమిత్యమరాశ్చ సేవంతి సర్వే ॥హా! సమీ॥

**అర్థము :** హా! = ఆహా!, దాసైః = నీ దాసజనులచేత, తే = నీ యొక్క, ఉపహాసం= వేడుక, దరిదంతు = అల్పత్వాన్ని సూచించే గుణంగా, ప్రకాశితం = వెలుగులోకి తీసుకురాబడినది, తు = కానీ, సమీచీనం = యుక్తమైనది.

త్వం = నీవు, పురా = పూర్వము, ద్వారకాపట్టణే = ద్వారకా నగరంలో, స్వయం = స్వయముగా, దీక్షితశ్చ = అస్ఖలిత బ్రహ్మచర్య దీక్షకలవాడను అని ప్రతిజ్ఞచే, తు = కాని, సారస = ఓయి సరసుడా!, సరసవేళాయాం = రతి సమయమునందు, స్త్రియః = మగువలు, కేశముష్టిః = పిడికిళ్ళతో నీ కేశగ్రహణములను, కథం కుర్వంతి? = ఎట్లు చేయుచున్నారు?

చ = మఱియును, త్వం = నీవు, పురా = పూర్వము, వరశిశోః = ఉత్తరాగర్భములోని పరీక్షిత్తుయొక్క, రక్షణే = రక్షణము నందు, అహం = నేను, బ్రహ్మచారీతి = బ్రహ్మచారినని, ఊచేః = పలికితివి, అథతథాచేత్ = మఱి అట్లైతే, గోపతరుణ్యాః = గొల్ల యువతులు, త్వాం = నిన్ను గూర్చి, కిమితివా = ఎందుకోసమని, తత్ = ఆ బృందావనంలో, వసంతి = సాహచర్యం చేస్తున్నారు?

త్వంతు = నీవు, పురా = పూర్వము, తద్బృందావనే = ఆ బృందావనములో, ఇహ వేంకటాద్రౌ = ఈ వేంకటగిరిపై, శ్రియా = లక్ష్మితోను, నిర్విభాసి = మిక్కిలి ప్రకాశిస్తున్నావు, ఇదం = ఈ విషయమును, చిత్తమితి = దేవరచిత్తమని, అమరాః సర్వేచ = దేవతలందరూ కూడ, సేవంతి = సేవించుచున్నారు.

**తాత్పర్యము :** ఆహా! నీదాసులచేత నీ శృంగారవేడుక అల్పత్వాన్ని సూచించేదిగా ప్రకాశింపబడుతున్నది. కానీ యుక్తమైనదే.

పూర్వం ద్వాపరయుగంలో ఉత్తరాగర్భంలోని పరీక్షిత్తును పరిరక్షించేవేళ "నేను బ్రహ్మచారినైతే శిశువు బ్రతుకుతాడని" ప్రతిజ్ఞచేశావు. అతడు బ్రతికాడు. కానీ బృందావనంలో నీచుట్టూ గొల్లయువతులు ఎందుకు మూగినారు. నీవు ఆ జన్మ బ్రహ్మచర్యదీక్షితుడవైతే ద్వారకానగరంలో రతికేళిలో మగువలు తమ పిడికిళ్ళతో నీ కేశగ్రహణం ఎలాచేశారు.

పోనీ అది ఆయుగంలో లీల, అని సర్దుకుందామంటే ఈ యుగంలో నిత్యానపాయిని అయిన శ్రీదేవితో వేంకటాద్రిపై కలిసిఉన్నావు! ఇది దేవరచిత్తమని దేవతలందరూ నిన్ను సేవిస్తున్నారు.

## 90. శ్రీరాగం

నమో నారాయణాయ
నరాయణాయ సగుణబ్రహ్మణే సర్వ -
పారాయణాయ శోభనమూర్తయే నమో ॥పల్లవి॥

నిత్యాయ విబుధసంస్తుత్యాయ నిత్యాధి -
పత్యాయ మునిగణ ప్రత్యయాయ
సత్యాయ ప్రత్యక్షాయ సన్మానససాం
గత్యాయ జగదవనకృత్యాయ తే నమో ॥నమో॥

అక్రమోద్ధతబాహువిక్రమాతిక్రాంత-
శుక్రశిష్యోన్మూలనక్రమాయ
శక్రాదిగీర్వాణవక్రభయభంగని-
ర్వక్రాయ నిహతారిచక్రాయ తే నమో ॥నమో॥

అక్షరాయాతినిరపేక్షాయ పుండరీ
కాక్షాయ శ్రీవత్సలక్షణాయ
అక్షీణవిజ్ఞాన దక్షయోగీంద్రసం -
రక్షానుకంపాకటాక్షాయ తే నమో ॥నమో॥

కరిరాజవరదాయ కౌస్తుభాభరణాయ
మురవైరిణే జగన్మోహనాయ
తరుణేందుకోటిరతరుణీ మనస్స్తోత్ర-
పరితోషచిత్తాయ పరమాయ తే నమో ॥నమో॥

పాత్రదానోత్సవ ప్రథితవేంకటరాయ
ధాత్రీశకామితార్థ ప్రదాయ
గోత్ర భిన్మణిరుచిరగాత్రాయ రవిచంద్ర -
నేత్రాయ శేషాద్రినిలయాయ తే నమో ॥నమో॥

(సం-1-కీ-269)

**అర్థము:** నమో నారాయణాయ = జ్ఞానము మార్గముగా కలిగిన నటువంటివానికి, సగుణ బ్రహ్మణే= గుణములతో కూడిన బ్రహ్మస్వరూపునికి, సర్వ పారాయణాయ = అందరికీ పరిపూర్ణ మార్గాన్ని చూపువానికి, శోభన మూర్తయే = మంగళమూర్తియైనవానికి, నమః = నమస్కారము, నిత్యాయ = శాశ్వతమైన వానికి.

విబుధ సంస్తుత్యాయ = దేవతాదులచే ప్రశంసింప బడుతున్నవానికి, నిత్యాధి పత్యాదు = ఎల్లప్పుడు అధికారము కలవానికి, మునిగణ ప్రత్యయాయ = మునుల సముదాయానికి విశ్వాసమైన వానికి, సత్యాయ= సత్యస్వరూపునికి, ప్రత్యక్షాయ = అందరికీ కనిపించువానికి, సన్మాన సఫాంగత్యాయ = మంచివారి మనస్సుతో అనుబంధం కలవానికి, జగదవన కృత్యాయ =లోకాన్ని పాలించువాడైన, తే = నీకు, నమః = నమస్కారము.

అక్రమోద్ధత బాహువిక్రమాలిక్రాంత శుక్రశిష్యాన్మూలన క్రయాదు = అక్రమ = క్రమములేకుండా, ఉద్ధత = చంపబడిన, బాహుపరాక్రమ = భుజ పరాక్రమాన్ని అతిక్రాంత = అతిక్రమించబడిన, శుక్రశిష్య= రాక్షసులను, ఊన్మూలన క్రమాదు = నిర్మూలించు క్రమము కలవానికి.

శక్రాది గీర్వాణ వక్రభయ భంగ నిర్వక్రాయ = ఇంద్రుడు మొదలైన దేవతల అపజయాల వల్ల వచ్చిన భయాన్ని పోగొట్టుటలో విజయ స్వరూపుడైన వాడా!, విహతారి చక్రాయ = చంపబడిన, తే = నీకు, నమో = నమస్కారము.

అక్షరాయా = దేనియందు కోరికలేని, పుండరీకాక్షాయ = పద్మాల వంటి కన్నులుకల వానికి, శ్రీవత్సలక్షణాయ = శ్రీ వత్సమనే పుట్టు మచ్చకలవానికి, అక్షీణ విజ్ఞాన దక్షయోగీంద్ర సంరక్షాను కృపాకటాక్షాయ = నశించని విజ్ఞాన సామర్థ్యం కల యోగీంద్రులను పరిరక్షించుటలో దయాదృష్టి కలిగిన, తే= నీకు, నమః= నమస్కారము.

కరిరాజవరదాయ = గజేంద్రుని రక్షించిన వానికి, కౌస్తుభా భరణాయ = కౌస్తుభమనే ఆభరణాన్ని ధరించిన వానికి, మురవైరిణే = మురాసురుని సంహరించిన వానిని, జగన్మోహనాయ = జగత్తుని మోహింప జేసే వానిని, తరుణేందు కోటీర తరుణీ మనస్తోత్ర పరితోష చిత్తాయ = చంద్రశేఖరుని పత్నియైన పార్వతీ దేవియొక్క సోత్రములను సంతోషమును పొందినవాడా!, పరమాయ = గొప్పవాడైన, తే = నీకు, నమః = నమస్కారము.

పాత్ర దానోత్సవ ప్రథిత = యోగ్యమైనవారికి దానమిచ్చుటలో సమర్థుడా!, వేంకటరాయా = వేంకటపతీ!, ధాత్రీశకామితార్థప్రదాయ = రాజులకు ఇష్టమైన కోరికలను తీర్చువానికి, గోత్ర భిన్మణిరుచిర గాత్రాయ = ఇంద్రమాణిక్యములచేత, శోభించు శరీరము కలవాడా!, రవిచంద్ర నేత్రాయ = సూర్యచంద్రులను కన్నులు కలవానికి, శేషా చల విలమాయ = వేంకటాచల ఘందు నివసించువానికి, తే = నారాయణుడవైన నీకు, నమః = నమస్కారము.

**జయంతి తే సుకృతినః, రస సిద్ధాః కవీశ్వరాః ।**
**నాస్తితేషాం యశః కాయే, జరామరణజం భయమ్ ॥**

# శ్రీవారి ప్రథమసేవకునికి “అక్షరాంజలి”



మానవతావాదానికి మణిమకుటం అలంకరించిన మహామనీషి,

అభ్యుదయ కార్యాచరణకు ఆనవాలుగా నిలిచిన ఆదర్శవాది,

తిరుమల ఆలయపాలనలో సామాజిక చింతనకు అంకురార్పణం చేసిన దార్శనిక విశారదుడు,

సనాతన భారతీయ సంస్కృతి, సముద్ధరణకు ఉద్యమించిన తాత్త్విక శిరోమణి,

సాంఘిక అసమానతలకు తిలోదకాలిచ్చే 'దళితగోవింద' క్రతువుకు విధాత,

ఏడడుగుల సంబంధానికి క్రొత్త భాష్యం చెబుతూ 'కల్యాణమస్తు' రూపకల్పన చేసినకారణజన్ముడు.

ఆంధ్ర సంస్కృతి, భాషా, సాహిత్యాలకు స్ఫూర్తినిచ్చి, తిలకమద్దిన - 'తెలుగు వెలుగు',

పరమదైవమైన తిరుమలేశుని దివ్యదర్శనాలను ప్రజల దరిజేర్చిన ప్రగతిశీలి.

పరవళ్ళు తొక్కుతున్న ఆర్షచైతన్యానికి, కార్యదీక్షితుడైన భక్త్యుద్యమదీక్షానిధి,

వేదవిజ్ఞానాన్ని, సంగీత సౌరభాన్ని దశదిశలా ప్రసరింపజేస్తున్న విజ్ఞానరసఖని,

ఆత్మవిశ్వాసానికి, ఆచరణాత్మక నిర్ణయాలకు ఆలంబనగా నిలిచే అకళంక కార్యధుని,

తిరుపతి పుణ్యక్షేత్రావతంసంలో దళిత, గిరిజన, మత్స్య కుటుంబీకులకు అర్చక శిక్షణ నిప్పించి, హైందవధర్మాన్ని బలోపేతంచేస్తున్న - ధీశాలి.

ఖండ ఖండాంతరాలలో శ్రీవారి వైభవానికి, అన్నమయ్య ప్రాభవానికి అనితర కృషి సల్పిన అసమాన ప్రతిభా భాస్కరుడు.

600వ అన్నమయ్య జయంతి ఉత్సవవేళ, శ్రీవారి ఆదేశాలు అమలుచేసే ఉపకరణమై, తాళ్ళపాక వేడుకలకు ఘన సారథిగా నిలిచిన మహానేత - యుగపురుషుడు.

ప్రపంచపటంలో ధార్మిక క్షేత్రమైన తాళ్ళపాకకు - చరిత్రకు, సాంస్కృతిక, పర్యాటక గుర్తింపుతెస్తూ - 108 అడుగుల సమున్నత విగ్రహాన్ని నెలకొల్పడానికి మూలకారకుడైన -

**శ్రీ భూమన కరుణాకరరెడ్డిగారు.** ఈ “శ్రీనివాసవిలాసం” రచనకు 'స్ఫూర్తి ప్రదాత'గా మనసులో సంభావించుకుంటూ, సాదరంగా వారికి నా కృతజ్ఞతాక్షర నవమల్లికలు సమర్పిస్తున్నాను......

డా॥ ఆకెళ్ళ విభీషణశర్మ